# ఆరాధన క్రమము

*ప్రారంభమున పరిశుద్ధాత్మను వేడుకొను కీర్తనగాని,*

*అనుకూలమగు వేరొక కీర్తనగాని నిలువబడి పాడవలెను.*

*సభ నిలువబడియుండగ బోధకుడు చెప్పవలసినది:*

బో:– తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున.

(రా–నటభైరవి. తా–ఆది)

సభ:– ఆమేన్

బో:– నీ వెలుగును నీ సత్యమును బయలుదేర జేయుము; అవి నాకు త్రోవ చూపును.

అవి నీ పరిశుద్ధ పర్వతమునకును, నీ నివాస స్థలములకును నన్ను తోడుకొని వచ్చును.

అప్పుడు నేను దేవుని బలిపీఠము నొద్దకు నాకు ఆనంద సంతోషములు కలుగజేయు దేవుని యొద్దకు చేరుదును.

దేవా, నా దేవా, సితారా వాయించుచు నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెదను.

## పాపపు టొప్పుదల

బో:– ప్రభువునందు ప్రియులారా! యధార్థ హృదయముతో మన తండ్రియైన దేవుని సమీపించి, ఆయన యెదుట మన పాపముల నొప్పుకొని, మన ప్రభువైన యేసు క్రీస్తు పేరిట మనకు క్షమాపణ దయచేయుమని వేడుకొందము.

*అందరు మోకరించి లేక నిలువబడి ఉండవలెను.*

బో:– ప్రభువు నామమువలననే మనకు సాహాయ్యము కలుగు చున్నది.

(రా–ఆనందభైరవి. తా–త్రిపుట.)

సభ:– భూమి ఆకాశములను సృజించినవాడు ఆయనే.

బో:– ప్రభువు సన్నిధిని నా యతిక్రమములు నే నొప్పుకొందు ననుకొంటిని.

సభ:– నీవు నా పాపదోషము పరిహరించియున్నావు.

బో:– మా సృష్టికర్తవు విమోచకుడవునైన సర్వశక్తిగల దేవా! దీనులము, పాపులము అగు మేము స్వాభావికముగా పాపులమనియు, అపవిత్రులమనియు, తలంపువలన, మాట వలన, క్రియవలన నీకు విరోధముగా పాపము చేసితిమనియు నీ యెదుట ఒప్పుకొనుచున్నాము; కావున మేము మా ప్రభువైన యేసుక్రీస్తు నిమిత్తమున నీ కృపను వెదకుచు వేడుకొనుచు మితిలేని కనికరముగల నీ యొద్దకు ఆశ్రయమునకై వచ్చుచున్నాము.

*సభ బోధకునితో కలిసి ఇట్లు చెప్పవలెవను:*

మా కొరకు చనిపోవుటకై నీ జనితైక కుమారునిచ్చిన మిగుల కరుణగల దేవా! మమ్మును కనికరించి, ఆయన నిమిత్తమున మా సమస్త పాపములకు క్షమాపణ దయచేయుము. మేము నీ కృపచేత నిత్యజీవము పొందునట్లు, నిన్ను గూర్చియు నీ చిత్తమునుగూర్చియు సరియైన జ్ఞానమును, నీవాక్యమునకు తగిన విధేయతను మా యందు నీ పరిశుద్ధాత్మవలన వృద్ధి పొందింపుమని, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

బో:– మన పరలోకపు తండ్రియగు సర్వశక్తిగల దేవుడు మనలను కనికరించి, మన కొరకు చనిపోవుటకై తన యేక కుమారునిచ్చి, ఆయన మూలమున మన పాపములన్నిటిని క్షమించుచున్నాడు. ఆయన నామమందు విశ్వాసముంచు వారికి దేవుని కుమారులగుటకు అధికార మిచ్చుచు, వారికి తన పరిశుద్ధాత్మ నను గ్రహించును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును. ఓ ప్రభువా! ఈ రక్షణను మాయందరికి దయచేయుము.

(రా–నటభైరవి. తా–ఆది.)

సభ:– ఆమేన్

## ప్రారంభ గీతము

### త్రైకుని మహిమ

(రా–కాంభోజి. తా–త్రిపుట.)

తండ్రికిన్, కుమారునికిన్, పరిశుద్ధాత్మకును: ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగము లందుండునట్లు మహిమ కలుగును గాక, ఆమేన్.

### ప్రభుని కనికరము

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

(రా–తోడి. తా–త్రిపుట.)

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

## సర్వోన్నతుని మహిమ

బో:– సర్వోన్నతమైన వానిలో దేవుని మహిమ.

(రా–బిలహరి. తా–త్రిపుట.)

కలుగునుగాక – దేవునికి మహిమ – కలుగునుగాక = కలుగు నున్నతమైన – ఘన స్థలములందున – ఇలకు సమాధానం – నరుల కాయన దయ ॥

ప్రభువైన దేవా – పరమ రాజా – సర్వపరిపాలా = పరిపూర్ణ శక్తిగల – పరమ జనక నిన్ను – మహిని స్తుతించుచు = మరి పొగడుచున్నాము ॥

మహిమ పర్చుచు – ఆరాధించు – చున్నాము నిన్ను = మహిమాతిశయమును – మది దలంచియు నీకు – మహిని మా స్తుతి కృత = జ్ఞత నిచ్చుచున్నాము ॥

ఏక కుమారా – యేసు ప్రభువా –యెహోవా – తనయా = లోక పాపము మోయు – ఏక దేవుని గొఱ్ఱె – పిల్ల! మమ్మును కనిక – రించుము చల్లగ ॥

లోక పాపములు – మోసుకపోవు – యేసు రక్షకా వాసిగ జనకుని – కుడివైపున గూర్చుండు – యేసు! మా ప్రార్థనా – లించి కనికరించు ॥

పరిశుద్ధుడవు – ప్రభుడవు నీవు ప్రభువైన క్రీస్తు = పరిశుద్ధాత్మతో తండ్రి – యైన దేవునియందు – పరిపూర్ణ మహిమతో = ప్రబలుచున్నా వెపుడు ॥ఆమేన్॥

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

బో:– ప్రార్థింతము.

*ఆ దినమునకయిన సంగ్రహ ప్రార్థన చేయవలెను.*

## సంగ్రహ ప్రార్థన

(రా–నటభైరవి. తా–ఆది.)

సభ:– ఆమేన్.

పత్రికకు పూర్వము పరిశుద్ధ గ్రంథమునుండి పాతనిబంధన వాక్య భాగముగాని, ఇతర వాక్య భాగములుగాని చదువవచ్చును. కాని ఆ దినమునకు ఏర్పరుపబడిన పత్రికను, సువార్తను తప్పక చదువవలయును.

పాతనిబంధన వాక్యభాగము ముగియగానే పాడవలసినది:

సభ:– పరిశుద్ధుడవగు దేవా! పావనశక్తుడ దేవా!
పావన అమర్త్య దేవా! మమ్మును కనికరింపుము.

## పత్రిక

బో:– *(ఇచ్చట దినముయొక్క పేరు చెప్పవలెను)*................కు ఏర్పరుపబడిన పత్రిక వాక్యభాగము...........వ్రాసిన పత్రిక..............వ అధ్యాయము................వ వచనము మొదలుకొని వ్రాయబడియున్నది.

*చదివిన తరువాత*

బో:–  ఇంతటితో ఈ దినమునకైన పత్రిక ముగియుచున్నది.

హల్లెలూయ

(రా–బిలహరి.  తా–త్రిపుట.)

సభ:–  హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా.

*ప్రభుని శ్రమకాలము (లెంటు)లో ఈ వచనము పాడవలెను:*

(రా–ఆనందభైరవి.  తా–ఏక.)

సభ:–  నిందితుడై క్రీస్తు మరణ మొందునంతగా, శ్రమ నొందు నంతగా, సిల్వ నొందునంతగా, ఇంపొందుగా తగ్గించు కొనియె నొనర వినయుడై.

## సువార్త

బో:–................కు ఏర్పరుపబడిన పరిశుద్ధ సువార్త పరిశుద్ధుడైన ......................వ్రాసిన సువార్త..........వ అధ్యాయము ...........వ వచనము మొదలుకొని వ్రాయబడియున్నది.

*అంతట సభ నిలువబడి ఈ క్రింది వచనము పాడవలెను:*

(రా–శంకరాభరణము.  తా–ఆది.)

సభ:–  ఓ ప్రభువా! నీకు మహిమ కలుగునుగాక.

*సువార్త పాఠము చదివిన తరువాత*

బో:–  ఇంతటితో ఈ దినముకైన పరిశుద్ధ సువార్త ముగియు చున్నది.

*అంతట సభ ఈ క్రింది వచనము పాడవలెను:*

సభ:–  ఓ క్రీస్తూ! నీకు స్తోత్రము కలుగునుగాక.

*అంతట అందరూ విశ్వాస ప్రమాణము చెప్పవలెను లేదా పాడవలెను.*

*ఉత్సవ సమయములందును, పరిశుద్ధ ప్రభు రాత్రి భోజనసంస్కార సమయములందును 'నికేయ విశ్వాస ప్రమాణము' చెప్పవలెను.*

## అపోస్తలుల విశ్వాస ప్రమాణము

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రివైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏకకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమ పడి సిలువవేయబడి చనిపోయి సమాధి చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవ దినమునలేచి పరలోకమున కెక్కి సర్వ శక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును, తీర్పుచేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాము.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను, ఆమేన్.

## నికేయ విశ్వాస ప్రమాణము

భూమ్యాకాశములను దృశ్యాదృశ్యమగు సమస్తమును సృజించిన సర్వశక్తిగల తండ్రియగు ఏకదేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన జనితైక కుమారుడును అద్వితీయుడునగు ప్రభువైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన జగములన్నిటికి ముందు తండ్రినుండి కలిగినవాడును, దేవునినుండి దేవుడును, వెలుగునుండి వెలుగును, నిజమైన దేవునినుండి నిజమైన దేవుడును, సృజింపబడక జన్మించినవాడును, తండ్రితో ఏక తత్వము గలవాడును, సమస్తమును సలుగజేసిన వాడునైయున్నాడు. ఈయన మానవులమగు మన కొరకును మన రక్షణ కొరకును పరలోకమునుండి దిగి కన్యయగు మరియ నుండి పరిశుద్ధాత్మవలన అవతరించి పుట్టి మనుష్యుడాయె ననయు, పొంతి పిలాతు అధికారము క్రింద మనకొరకు సిలువ వేయబడి శ్రమనొంది సమాధి చేయబడెననియు, లేఖనముల ప్రకారము మూడవ దినమున తిరిగిలేచి పరలోకమునకెక్కి తండ్రి యొక్క కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవునకును మృతులకును తీర్పుచేయుటకు తిరిగి మహిమతో వచ్చుననియు, ఆయన రాజ్యమునకు అంతము లేదనియు నమ్ముచున్నాను.

తండ్రినుండియు, కుమారునినుండియు బయలువెడలుచు తండ్రితోను, కుమారునితోను ఏకముగా ఆరాధింపబడుచు, మహిమ పరుపబడుచు ప్రవక్తలద్వార మాట్లాడిన వాడవును, జీవమునకు దాతయు ప్రభువునగు పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. మరియు పరిశుద్ధమైన క్రైస్తవ అపోస్తలుల యేక సంఘమును నమ్ముచున్నాను. పాప పరిహారమునకైన ఒకే బాప్తిస్మము నొప్పుకొనుచు మృతుల పునరుత్థానము కొరకును రాబోవు లోక సంబంధమగు బ్రతుకుకొరకును నిరీక్షించు చున్నాను, ఆమేన్.

## కీర్తన

## ప్రసంగము

*ప్రసంగమునకు పూర్వము బోధకుడు ఈ దిగువ వాక్యము చెప్పవచ్చును.*

బో:- మన తండ్రియైన దేవునినుండియు, ప్రభువైన యేసుక్రీస్తు నుండియు, కృపా సమాధానములు మీకు కలుగునుగాక.

*ప్రసంగము ముగియగానే సభ నిలువబడియుండగా:*

బో:- సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండునుగాక.

## అర్పణ సంకీర్తనలు

I

(రా-ఆనందభైరవి. తా-ఆది.)

దేవా! నా యందు శుద్ధ హృదయము కలుగజేయుము = నా అంతరంగములో స్థిరమైన మనస్సు నూతనముగా పుట్టించుము ॥

నీ సన్నిధానములోనుండి నన్ను త్రోసివేయకుము = నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము ॥

నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము = సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము ॥

II

(రా–తోడి.　　తా–త్రిపుట.)

దహనబలి నీకు ననిష్టము, మరియు – దైవ బలులు విరిగిన ఆత్మయే = యెహోవ దేవా! విరిగి నలిగిన యట్టి – హృదయం బలక్ష్యంబు జేయవు ॥

నీ కటాక్షముతో సీయోనుకు నిపుడే – నెనరుతోడను మేలు సేయుము = ప్రాకటంబుగను యెరూషలేమునకు ప్రాకారములను గట్టింపుము ॥

అంతట నీతి యుక్తంబులౌ బలులు – యాగములు సర్వాంగ హోమము = లెంతో యిష్టంబౌ బలిపీఠముమీద నెన్నో కోడెల జను లర్పింతురు ॥

## అర్పణలు

*ప్రత్యేకార్పణలును, అర్పణలును సమకూర్చిన పిమ్మట బోధకుడు వాని నందుకొని వేదికవైపు తిరిగి యుండగా అందరు నిలిచి ఈ క్రింద వచనము పాడవలెను:*

(చాయ: యెహోవా సన్నిధిని)

నీ కిచ్చు అర్పణలు – నీవే మాకిచ్చితివి = మాకున్న సకలాస్తుల్ – మా ప్రభువా యని నీవికదా – నీకిచ్చు అర్పణలు – నీ విపుడు గైకొనుమా ॥

## ముఖ్య ప్రార్థన

బో:– ప్రార్థింతము:

*ఉత్సవ సమయములందును, ప్రభురాత్రిభోజన సంస్కార సమయము లందును ముఖ్య ప్రార్థన వాడవలయును.*

తక్కిన సమయములందు అనుకూలములైన ఇతర సార్వత్రిక ప్రార్థనలు వాడవచ్చును.

బో:– సర్వశక్తియు మిగుల కనికరముగల దేవా! మా ప్రభువైన యేసు క్రీస్తుయొక్క తండ్రీ! నీవు మాకు అనుగ్రహించుచున్న మేళ్లన్నిటి నిమిత్తమును మా యెడల నీకుగల కరుణావాత్సల్యము నిమిత్తమును నిన్ను స్తుతించుచున్నాము. ముఖ్యముగా నీ ప్రియ కుమారుని మా కొరకిచ్చినందుకును, నీ చిత్తమను కృపను మాకు బయలు పరచినందుకును నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. మేము యథార్థమైన మంచిహృదయములతో నీ వాక్యమును అంగీకరించి భద్రపరచుకొని సర్వదా మంచి ఫలములను ఫలించునట్లు దానిని మాలో నాటింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– రక్షణ కలిగించెడు నీ వాక్యమందలి పవిత్రమైన బోధయందు నీ సార్వత్రిక సంఘమును కాపాడి యేలుమనియు, అందువలన నీయందు మాకుగల విశ్వాసము బలపడి సకల జనులయెడల మాలో ప్రేమ వృద్ధి పొందునట్లనుగ్రహింపుమనియు, మిగుల మనః పూర్వకముగా నిన్ను వేడుకొనుచున్నాము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– నీ వెలుగును, నీ సత్యమును భూదిగంతములవరకు వ్యాపింపజేయుము. మాస్వజనులకును సకలజనాంగములకును నీ సువార్తను ప్రకటించుటకు నమ్మకమైన గురువులను బోధకులను ప్రతిష్టించి వారి పనులన్నిటియందును వారిని నడిపించి కాపాడి అభివృద్ధి కలుగజేయుము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– సంఘమునకు సంబంధించిన శాస్త్రపాఠశాలలను, వేద పాఠశాలలను, ఇతర పాఠశాలలను దీవించుము. వానినుండి వాక్య సేవయందును, రోగులకును, కష్టములలో నుండు వారికిని, బీదలకును పరిచర్య చేయుటయందును జీవనోపాయము లన్నిటియందును నిన్ను సేవించు స్త్రీ పురుషులు బయలు వెడలు నట్లను గ్రహింపుమని వినయముతో వేడుకొనుచున్నాము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– నీ వాక్యమను వెలుగు మాగృహముల యందు నిరంతరమును ప్రకాశింపనిమ్ము. పరిశుద్ధ బాప్తిస్మమునందు నీవు బిడ్డలతోచేసిన యొడింబడికను వారు నిలుపుకొనునట్లు సంఘపు బిడ్డలందరిని కాపాడుము. వారిని నీయందు విశ్వాసముగల వారినిగను, నీచిత్తము ననుసరించి నడుచుకొను వారినిగను పెంచునట్లు తల్లిదండ్రులందరికి నీ కృప ననుగ్రహింపుము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– ఓ దేవా! ఆయా విధములైన ఆపదలలోనున్న వారందరును, ముఖ్యముగా నీ నామము నిమిత్తమును, నీ సత్యము నిమిత్తమును శ్రమ పడుచున్నవారు తమ బాధలు తండ్రి భావముగల నీ చిత్తముననుసరించి కలిగినవేయని తెలిసికొని సహించుకొనునట్లు వారిని నీ పరిశుద్ధాత్మ చేత నాదరింపుము. మా శరీరాత్మలకు

కలుగు హానినుండియు, అపాయము నుండియు, తప్పుబోధనుండియు, చెప్పశక్యముగాని నీదయను కృపను కనికరముబట్టి మమ్మును కాపాడుము. కష్టకాల మందెల్లను సకల జనులకు ముఖ్యముగా నిన్ను నమ్మువారికి సహాయకుడవుగాను, రక్షకుడవుగాను కనబరచుకొనుమని నిన్ను వేడుకొనుచున్నాము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

బో:– యుక్తకాలమందు ఆవశ్యకమైన భూఫలములను మేమను భవించునట్లు వానిని వృద్ధిపొందింపుము. జీవనోపాధికవసర మైన న్యాయమైన వృత్తులను, పవిత్రమైన విద్యలను, ఉపయోగ కరమైన జ్ఞానమును వికసింప జేసి ఆశీర్వదింపుము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

(ఇచ్చట విశేష మనవులు చేయవచ్చును)

బో:– ఓ దేవా! ఈ మా మనవులను ఇంకను మేము నీ చిత్త ప్రకారము నిన్ను అడుగవలసినవాటిని నీతోను పరిశుద్ధాత్మతోను సదా యేక దేవుడై యుగయుగములు జీవించుచు పరి పాలించుచునుండు నీ అద్వితీయ కుమారుడువు మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క ఘోరశ్రమ మరణములను బట్టి మాకు దయచేయుమని నిన్ను వేడుకొనుచున్నాము.

సభ:– దయగల ప్రభువా! మా ప్రార్థనాలకింపుము.

## ప్రభువు ప్రార్థన

*ఈ దిగువ ప్రార్థన చెప్పవలెను. లేదా పాడవలెను.*

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

## కీర్తన

*ప్రభు రాత్రి భోజన సంస్కారము నాచరింపని యెడల బోధకుడు వేదిక యొద్ద నిలువబడి దీవెన చెప్పవలెను.*

## దీవెన

బో:- ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక;
ప్రభువు నీకు తన సన్నిధి ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక;
ప్రభువు నీ మీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి నీకు సమాధానము కలుగజేయుగాక.

(రా-శంకరాభరణము. తా-ఆది.)

సభ:- ఆ - మేన్, ఆ - మేన్, ఆ - మేన్.

# ప్రభు రాత్రి భోజన సంస్కారము

*ఈ పరిశుద్ధ సంస్కారము నాచరించు సమయమున కీర్తన పాడుచుండగా బోధకుడు వేదిక యొద్దకువెళ్లి నిశ్శబ్దముగ ప్రార్థన చేసికొని పాత్రలపై వస్త్రముతీసి పరిశుద్ధ సంస్కారము జరుపుటకు భక్తిపూర్వకముగ సిద్ధపడవలెను*

*సభ లేచి "దేవుని గొఱ్ఱెపిల్ల" అను గీతము ముగియువరకు నిలువబడి యుండవలెను*

## ప్రారంభము

బో:- ప్రభువు మీతో నుండుగాక.

(రా-కీరవాణి. తా-ఆది.)

సభ:- మీ యాత్మతో నుండుగాక.

బో:- మీ హృదయములను పైకెత్తుడి.

సభ:- ప్రభువుతట్టు మేము వానిని ఎత్తుచున్నాము.

బో:- మన దేవుడైన ప్రభువునకు కృతజ్ఞతా స్తోత్రములు చెల్లింతము

సభ:- ఆలాగు చేయుట తగినదియు సరియైనదియునై యున్నది.

బో:- ఓ ప్రభువా! పరిశుద్ధుడవైన తండ్రీ! సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! మేము సర్వదా సర్వత్ర నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుట నిజముగా తగినదియు సరియును హితమునై యున్నది.

*ఇచ్చట ఆయా సమయముల కొరకు ఏర్పరుపబడిన ప్రారంభ వాక్యములను చెప్పవలెను.*

## ప్రారంభ వాక్యములు

### క్రీస్తురాక

లోకములోనికి నీ కుమారుడైన యేసుక్రీస్తు రాకవలన భక్తులందరికి పరలోక రాజ్యము తెరచి యున్నావు. ఆయన రెండవ రాకవలన మృతుల పునరుత్థానమును రాబోవు లోకపు జీవమును తెచ్చెదవు. కాబట్టి దూతలతోను మొ॥

## క్రీస్తు జననము

మా కొరకు వాక్యము శరీరధారియైన మర్మమందు నీ మహిమను నూతనముగ బయలుపరచితివి గనుక నీకుమారుని స్వరూపమందున్న నిన్ను మేము చూచి, గోచరముకాని విషయములను మేము ప్రేమించి వాటివలన ఆకర్షింప బడగలము. కాబట్టి దూతలతోను మొ॥

## క్రీస్తు ప్రకటన (ఎఫిఫానియా) కాలము

మాకొరకు నీ జనితైక కుమారుని పంపినందుకును ఆయన యందు మానవుడవుగా కనబడి నీ పూర్ణ మహిమను బయలుపరచి నందుకును నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము. కాబట్టి దూతలతోను మొ॥

## క్రీస్తు శ్రమ కాలము

దేనివలన మరణము కలిగెనో దానివలననే జీవము కలుగు నట్లును, ఒకప్పుడు మ్రానిచేత జయించిన సాతాను మ్రానిచేతనే జయింపబడునుట్లును సిలువ మ్రానుమీద మా ప్రభువైన యేసుద్వారా మానవులకు రక్షణ దయచేసినావు. కాబట్టి ఆయన ద్వారా దూతలతోను మొ॥

## క్రీస్తు పునరుత్థానము

ముఖ్యముగా నీ కుమారుడును మా ప్రభువునైన యేసు క్రీస్తు యొక్క మహిమగల పునరుత్థానమునుబట్టి నిన్ను స్తుతించుటకు బద్ధులమై యున్నాము. మా కొరకు అర్పింపబడి లోక పాపములను మోసికొని పోయిన పస్కాగొఱ్ఱెపిల్ల ఆయనే. ఆయన తన మరణము వలన మరణమును నశింపజేసి తన పునరుత్థానమువలన మాకు నిత్యజీవమును దయచేసియున్నాడు. కాబట్టి దూతలతోను మొ॥

## ఆరోహణ పండుగ

మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా యీ కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆయన చనిపోయి లేచిన తరువాత తన శిష్యులందరికి బాహాటముగా కనబడి తన దైవ స్వభావమునందు మమ్మును పాలివారలనుగా జేయునిమిత్తము వారు చూచుచుండగా పరలోకమున కెక్కిపోయెను. కాబట్టి దూతలతోను మొ॥

## పరిశుద్ధాత్మ రాక

నీ ప్రియ కుమారుడును మా ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తుద్వారా యీ కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ఆయన పరలోకమున కెక్కి నీ కుడిచేతి వైపున కూర్చుండి తాను వాగ్దానము చేసిన ప్రకారముగా ఏర్పరచుకొనిన శిష్యులమీద ఈ దినముననే పరిశుద్ధాత్మను కుమ్మరించెను. అందువలన సర్వలోకమును అత్యధికముగా ఆనందించుచున్నది. కాబట్టి దూతలతోను మొ॥

## త్రియేకత్వ కాలము

నీవు నీ జనితైక కుమారునితోను పరిశుద్ధాత్మను ఏక దేవుడవును ఏక ప్రభుడవునై యున్నావు. నిజమైన దేవుడొక్కడేయని మేమొప్పుకొనుచు త్రిత్వమునందొక్కడవు గాదు, మహిమయందు భేదము లేకను, పురుషత్వమునందు ముగ్గురుగాను ఉన్న నిన్ను ఆరాధించుచున్నాము. కాబట్టి దూతలతోను మొ॥

*ప్రారంభ వాక్యము ముగిసిన వెంటనే ఈ క్రింది వచనము చెప్పవలెను.*

కాబట్టి దూతలతోను ప్రధాన దూతలతోను పరలోక సైన్యసమూహములతోను నీ మహిమగల నామమును మేము కొనియాడి, ఘనపరచి సదా నిన్ను ఇట్లు స్తుతించుచున్నాము.

*అంతట 'పరిశుద్ధుడు' అను గీతము పాడవలెను లేక చెప్పవలెను.*

## పరిశుద్ధుడు

(రా–శంకరాభరణము. తా–ఆది.)

అందరు:– పరిశుద్ధుడా! పరిశుద్ధుడా!! పరిశుద్ధుడా!!! సైన్యముల ప్రభువగా దేవా! ఆకాశమును, భూమియు నీ మహిమతో నిండియున్నవి. సర్వోన్నతమైన వానిలో హోసన్నా, ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడుగాక. సర్వోన్నతమైన వానిలో హోసన్నా.

# ప్రభువు ప్రార్థన

బో:–పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడు గాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును

నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను  చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధ ములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ము లను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

సభ:– ఆమేన్.

**నియమపు వాక్యములు**

బో:– మన ప్రభువైన యేసుక్రీస్తు తానప్పగింపబడిన రాత్రి రొట్టెను తీసికొని[1] స్తోత్రముచేసి, దానిని విరిచి తన శిష్యుల కిచ్చి, మీ కొరకు కియ్యబడుచున్న నా శరీరమైయున్నది. నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీని చేయుడని చెప్పెను.

బో:– ఆప్రకారమే భోజనమైన పిమ్మట ఆయన పాత్రను తీసికొని [2]స్తోత్రము చేసి, దాని వారికిచ్చి, దీనిలోనిది మీరందరు త్రాగుడి; ఇది పాప పరిహారము కలుగుటకై మీకొరకును అనేకుల కొరకును చిందింపబడుచున్న నా రక్తము వల్లనైన క్రొత్త నిబంధనయైయున్నది. మీరు దీని త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీని చేయుడని చెప్పెను.

బో:– ప్రభువుయొక్క సమాధానము ఎల్లప్పుడు మీతో నుండుగాక.

సభ:– ఆమేన్.

**దేవుని గొఱ్ఱెపిల్ల**

(రా–శంకరాభరణము. తా–ఆది.)

అందరు:– లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ! నీ సమాధానము మాకు దయచేయుము, ఆమేన్.

## పరిశుద్ధ సంస్కారాచారము

*బోధకుడు రొట్టెనిచ్చునపు డిట్లు చెప్పవలెను:*

పుచ్చుకొని తినుము; ఇది నీ కొరకియ్యబడిన క్రీస్తు శరీరము.

1. ఇచ్చట రొట్టెయున్న పళ్లెము తన చేతితో పట్టుకొనవలెను. 2. ఇచ్చట పాత్రను తన చేతితో పట్టుకొనవలెను.

*బోధకుడు పాత్ర నిచ్చునపు డిట్లు చెప్పవలెను:*

పుచ్చుకొని త్రాగుము; ఇది నీ పాపములకై చిందింపబడిన క్రొత్త నిబంధన రక్తము.

*రొట్టెను పాత్రను ఇచ్చిన పిమ్మట బోధకుడిట్లు చెప్పవలెను:*

మన ప్రభువైన యేసుక్రీస్తు శరీరమును, ఆయన వెలలేని రక్తమును మిమ్మును నిజమైన విశ్వాసమునందు బలపరచి నిత్య జీవము కలుగుటకై సంరక్షించునుగాక. ఆమేన్.

సమాధానముతో వెళ్లుడి.

## సెలవు గీతము

(రా–కాంభోజి. తా–త్రిపుట.)

I

1. నీ సమాధానము – దాసుని కిప్పుడు – నాథా దేవా = ఇచ్చి – నీ మాటచొప్పున – పోనిచ్చుచున్నావు – నాథా దేవా ॥

2. అన్యులకు నిన్ను – బయలు పరచెడి – వెలుగుగాను = నీకు అణకు ప్రజలైన – ఇశ్రాయేల్ వారికి – మహిమగాను ॥

3. నరులకై నీవు ఏర్పరచిన రక్షణన్ – నాథా దేవా = ఇదిగో – నా కండ్లు చూచి యా – నందించుచున్నవి. నాథా దేవా ॥

4. తండ్రికి సుతునికి – పరిశుద్ధాత్మకును కలుగుగాక = మహిమ – తరగక సదా కాలం – యుగయుగములకును కలుగునామేన్॥

II

నాథా! ఇప్పుడు నీ మాటచొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు. అన్య జనులకు నిన్ను బయలు పరచుటకు వెలుగుగాను నీ ప్రజలైన ఇశ్రాయేలునకు మహిమగాను నీవు సకల ప్రజల యెదుట సిద్ధపరచిన నీ రక్షణ నేను కన్నులార చూచితిని.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును, ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగములందుండు నట్లు మహిమ కలుగుగాక ఆమేన్.

## వందనార్పణము

బో:– యెహోవా దయాళుడు, ఆయనకు కృతజ్ఞతా స్తుతులను చెల్లింపుడి.

సభ:– ఆయన కృప నిరంతరముండును.

బో:– సర్వశక్తిగల దేవా! శ్రేయస్కరమైన ఈ దానము వలన మా యాత్మల సేద దీర్చినందుకై నీకు వందనములను చెల్లించు చున్నాము. మరియు దీనివలననే నీ యందుమాకు గల విశ్వా సమును మాలో ఒకరియందొకరి కుండవలసిన నిండు ప్రేమను నీ కృపనుబట్టి బలపరచుమని నీతోను, పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచు నుండు నీ ప్రియకుమారుడును, మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాను. ఆమేన్.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగునుగాక.

## దీవెన

బో:– ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక;

ప్రభువు నీకు తన సన్నిధి ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక;

ప్రభువు నీ మీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి నీకు సమాధానము గలుగజేయుగాక.

సభ:– ఆ–మేన్, ఆ–మేన్, ఆ–మేన్.

# ఉదయారాధన క్రమము

*ప్రారంభమున పరిశుద్ధాత్మను వేడుకొను కీర్తనగాని అనుకూలమగు వేరొక కీర్తనగాని నిలువబడి పాడవలెను.*

*సంకీర్తనము ముగియువరకు అందరు నిలువబడి పాడవలెను.*

ప్రభువి శ్రమల ధ్యానకాలములో హల్లెలూయ గీతి వాడకూడదు.

## ఉపవచనములు

బో:- ఓ ప్రభువా! నా పెదవులను తెరువుము.

(రా-మోహన. తా-త్రిపుట.)

సభ:- అప్పుడు నా నోరు నీ స్తోత్రమును బయలుపరచును

బో:- ఓ దేవా! నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము.

సభ:- ఓ ప్రభువా! నా సహాయమునకు త్వరగా రమ్ము.

బో:- తండ్రికిని, కుమారునికిని పరిశుద్ధాత్మకును.

(రా-పుర్ల కాంభోజి. తా-త్రిపుట.)

సభ:- ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగును గాక, ఆమేన్, ఆమేన్, హల్లెలూయ.

## ప్రబోధక వాక్యము

బో:- రండి, యెహోవాకు నమస్కారము చేయుదము.

(రా-కాపి నారాయణ. తా-ఆది.)

సభ:- మనలను సృజియించినవాడు ఆయనే.

## ఉత్సాహగానము

రండి యుత్సహించి పాడుదము - రక్షణ దుర్గము మన ప్రభువే॥

1. రండి కృతజ్ఞత స్తోత్రముతో - రారాజు సన్నిధి కేగుదము = సత్ ప్రభు నామము కీర్తనలన్ - సంతోషగానము చేయుదము ॥
2. మన ప్రభువే మహా దేవుండు - ఘన మహాత్మ్యముగల రాజు = భూమ్యగాధపు లోయలును - భూధర శిఖరము లాయనవే ॥

3. సముద్రము సృష్టించె నాయనదే – సత్యుని హస్తమే భువి జేసెన్= ఆయన దైవము పాలితులం – ఆయన మేపెడి గొర్రెలము ॥

4. ఆ ప్రభు సన్నిధి మోకరించి – ఆయన ముందర మ్రొక్కుదము= ఆయన మాటలు గైకొనిన – నయ్యవి మన కెంతో మేలగును ॥

5. తండ్రి కుమార శుద్ధాత్మకును – దగు స్తుతి మహిమలు కల్గుగాక॥ ఆదిని నిప్పుడు నెల్లప్పుడు – నయినట్లు యుగముల నౌనుగాక॥ తండ్రి కుమార శుద్ధాత్మకును–దగుస్తుతి మహిమలు కల్గునామేన్॥

బో:– రండి, యెహోవాకు నమస్కారము చేయుదము.

సభ:– మనలను సృజియించినవాడు ఆయనే.

## కీర్తన

### సంకీర్తనము

## త్రైకుని మహిమ

(రా–శంకరాభరణము. తా–ఆది.)

తండ్రికిన్ కుమారునికిన్ పరిశుద్ధాత్మకు ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండునట్లు మహిమకలుగునుగాక, ఆమెన్.

## పాఠములు

*పాఠలు ముగిసిన తరువాత 'ఇంతటితో మొదటి పాఠము, లేక రెండవ పాఠము, లేక సువార్త పాఠము ముగిసియున్నది' అని చెప్పవలయును.*

*ప్రతిపాఠము తరువాత ఈ దిగువ ప్రత్యుత్తర వాక్యము వాడవలెను.*

బో:– ఓ ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగును గాక.

## కీర్తన

అంతట ప్రసంగము చేయవచ్చును.

## ప్రసంగము

అంతట అర్పణలు అర్పించవచ్చును.

## అర్పణము

## స్తోత్రగీతము

1. ఓ ప్రభుండా నిన్ నుతించు – చున్నాము వినయముతోడ –
2. మా ప్రభుండ వంచు నిన్ను – మానక మే మొప్పుకొందుము
3. నిత్యుడవౌ తండ్రి లోకము – నిన్నారాధించుచు నుందు –
4. సత్య దూతల్ మోక్షమందు – సర్వప్రధానుల్ సుభక్తిన్ –
5. నిత్య మేక కంఠ్యముతోడ – నిన్ గొనియాడుచు నున్నారు
6. పరిశుద్ధ, పరిశుద్ధ – పరిశుద్ధ, సేనల దేవా –
   ధర పరలోకంబులు నీ – వర మహిమముతో నొప్పునటంచు
7. కెరూబుల్ సెరూపుల్ నిన్ను – గీర్తించుచు నున్నా రహోహో –
8. సారెకున్ నిన్నపోస్తలుల – సంఘము స్తోత్రించుచుండున్ –
9. కూరిమిన్ ప్రవక్తల సంఘము – కొనియాడుచు నిన్ నుతియించు
10. మా మహా జనకా–నిను–మాన్యుడౌ పుత్రున్ – బహు – ప్రేమగల మా పరిశుద్ధాత్మను – ప్రీతితో సంఘము భువి నొప్పుకొనున్
11. నీవే క్రీస్తు రాజవు–నిత్య కుమారుడవు – నీ విలలో మానవులను– గావగ బూనినయపుడు – పావన కన్యా – గర్భంబున బుట్టుట– బహుదీనంబనక–చావుశ్రమ నోడించి–సజ్జనులకు దివి దెరచితివే
12. నీవు దేవుని కుడి పార్శ్వంబున – నిత్యము మహిమాసీనుడవు–
13. నీవు మా న్యాయాధిపతివై – రావలయునని నమ్ముచుందుము.
14. పావనంబౌ నీ రక్తంబున – సేవకులకు దోడ్పడు మిపుడే
15. నిత్య మహిమములో –నిక– నీదు భక్తులతో – న–గత్యముగ లెక్కించుము వారలగని రక్షించుమి నీ సుజనంబున్
16. నీవు దీవించి–నీ నిత్యస్వాస్థ్యంబు – సుజీవ మిడి వారల బాలించి– లేవగ నెత్తుము సతతము ప్రీతిన్
17. ఓ ప్రభువా – పాపములో – నుండి కుండగ దోడ్పడుము – మా ప్రభువా కరుణించు – మము గరుణించుము దయతోడన్
18. ఓ ప్రభుండా నిను నమ్మి – యున్న మాకు బ్రేమ జూపు –
19. శ్రీ ప్రభుండా నిన్నే నమ్మితి – సిగ్గునొంద నీయకుము.

## బెనెడిక్టస్ (స్తుతిగానము)

1. ప్రభువైన ఇశ్రాయేలు దేవుడుస్తుతింపబడు గాక:
   ఆయన తన ప్రజలకు దర్శనమిచ్చి వారికి విమోచన కలుగజేసెను.
2. తన సేవకుడైన దావీదు వంశమునందు మనకొరకు రక్షణ శృంగమును అనగా మన శత్రువుల నుండియు మనలను ద్వేషించు వారందరి చేతినుండియు తప్పించి రక్షణ కలుగజేసెను.
3. దీనిగూర్చి ఆయన ఆదినుండి:
   తన పరిశుద్ధ ప్రవక్తల నోటపలికించెను.
4. ఆయన మనపితరులను కరుణించుటకును:
   తన పరిశుద్ధ నిబంధనను, అనగా మన తండ్రియైన అబ్రాహాముతో తాను చేసిన ప్రమాణమును జ్ఞాపకము చేసికొనుటకును
5. మనము శత్రువుల చేతినుండి విడిపింపబడి:
   మన జీవిత కాలమంతయు నిర్భయులమై
6. ఆయన సన్నిధిని పరిశుద్ధముగాను నీతిగాను ఆయనను సేవింపను:
   అనుగ్రహించుటకు ఈ రక్షణ కలుగజేసెను.
7. మరియు ఓ శిశువా:
   నీవు సర్వోన్నతుని ప్రవక్తవన బడుదువు.
8. మన దేవుని మహా వాత్సల్యమునుబట్టి:
   వారిపాపములను క్షమించుట వలన
9. తన ప్రజలకు రక్షణ జ్ఞానము ఆయన అనుగ్రహించునట్లు:
   ఆయన మార్గములను సిద్ధపరచుటకై నీవు ప్రభువుకు ముందుగా నడుతువు.
10. మన పాదములను సమాధాన మార్గములోనికి నడిపించునట్లు:
    చీకటిలోను మరణచ్ఛాయలోను కూర్చుండు వారికి వెలుగిచ్చుటకై
11. ఆ మహావాత్సల్యమును బట్టి:
    పైనుండి ఆయన మనకు అరుణోదయ దర్శన మనుగ్రహించెను.
12. తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును:
    ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగము లందుండునట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

## ప్రభుని కనికరము

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

ప్రభువా! మమ్మును కనికరింపుము.

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

బో:– ప్రార్థింతము.

*ఆ దినమునకు, లేక ఆ ముందటి ఆదివారమునకు ఏర్పరుపబడిన సంగ్రహ ప్రార్థన చేయవలెను*

*తరువాత ఇతర సంగ్రహ ప్రార్థనలు చేయవచ్చును.*

## ఉపవచనము

బో:– నీ కీర్తితోను నీ ప్రభావ వర్ణనతోను.

సభ:– దినమంతయు నా నోరు నిండియుండ నిమ్ము.

## కృపకొరకైన సంగ్రహ ప్రార్థన

అందరు:– మమ్ము నీ యుదయమువరకు సురక్షితముగ కాపాడిన యో ప్రభువా, మా పరలోకపు తండ్రీ, సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ మహా శక్తితో ఈ దినమంతయు మమ్మును సంరక్షించుము. ఈ దినమున మేము ఏ పాపమునకు లోను గాకయు,

ఏ విధమైన అపాయములోను చిక్కుకొనకయు నుండు నట్లు కృప చూపుము. మా కార్యములన్నియు నీ యాజ్ఞల కనుకూలములయి నీ దృష్టియందు నీతి యుక్తముగా నుండు నట్లు అనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగునుగాక.

## దీవేన

బో:– ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడైయుండునుగాక.

సభ:– ఆమేన్, ఆమేన్, ఆమేన్.

# సాయంకాలారాధన క్రమము

*ప్రారంభమున పరిశుద్ధాత్మ వేడుకొను కీర్తనగాని అనుకూలమగు వేరొక కీర్తనగాని నిలువబడి పాడవలెను.*

*త్రైకుని మహిమ ముగియువరకు అందరు నిలువబడియుండవలెను.*

## వచనము

బో:– ఓ ప్రభువా! నా పెదవులను తెరువుము.

(రా–మోహన. తా–త్రిపుట.)

సభ:– అప్పుడు నా నోరు నీ స్తోత్రమును బయలుపరచును

బో:– ఓ దేవా! నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము.

సభ:– ఓ ప్రభువా! నా సహాయమునకు త్వరగా రమ్ము.

బో:– తండ్రికిని, కుమారునికిని పరిశుద్ధాత్మకును.

(రా–పుర్ల కాంభోజి. తా–త్రిపుట.)

సభ:– ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగును గాక, ఆమేన్, ఆమేన్, హల్లెలూయా.

*లెంటు కాలములో 'హల్లెలూయ'కు బదులుగా మూడవ 'ఆమేన్' పాడవలెను.*

## సంకీర్తనము

*ప్రతి సంకీర్తనము త్రైకుని మహిమతో ముగియవలెను.*

## త్రైకుని మహిమ

(రా–శంకరాభరణము. తా–ఆది.)

తండ్రికిన్ కుమారునికిన్ పరిశుద్ధాత్మకు ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండునట్లు మహిమకలుగునుగాక, ఆమెన్ ఆమేన్.

## పాఠములు

*ప్రతిపాఠము తరువాత ఈ మాటలు చెప్పవలెను:*

బో:– ఓ ప్రభువా! మమ్మును కనికరింపుము.

(రా–మోహన.    తా–త్రిపుట.)

సభ:–  దేవునికి స్తోత్రము కలుగునుగాక.

## కీర్తన

*అంతట ప్రసంగము చేయవచ్చును.*

## ప్రసంగము

*అంతట అర్పణలు అర్పించవచ్చును.*

## అర్పణము

## కీర్తన

*అంతట అందరు నిలువబడవలెను.*

## వచనము

బో:– నా ప్రార్థన నీ సన్నిధిని పరిమళ వాసనార్థమైన కానుకగా నుండుగాక.

సభ:– నా చేతులెత్తుట నీకు సాయంతన యాగముగా నుండును గాక.

## సెలవు గీతము

(రా–కాంభోజి.    రా–త్రిపుట.)

1. నీ సమాధానము – దాసుని కిప్పుడు – నాధా దేవా = యిచ్చి – నీ మాట చొప్పున – పోనిచ్చుచున్నావు – నాధా దేవా ॥
2. అన్యులకు నిన్ను – యలుపరచెడి – వెలుగుగాను = నీకు – అణుగు ప్రజలైన – యిశ్రాయెల్ వారికి – మహిమగాను ॥
3. నరులకై నీవు ఏ – ర్పరచిన రక్షణన్ – నాధా దేవా = యిదిగో – నా కనులు చూచి యా – నందించుచున్నవి. – నాధా దేవా॥
4. తండ్రికి సుతునికి బరిశుద్ధాత్మకును – గలుగుగాక = మహిమ – తరగక సదాకాలము – యుగయుగములకును – గలుగు నామేన్ ॥

## ప్రభుని కనికరము

బో:–ప్రభువా! మమ్మును కనికరింపుము.

(రా–కీరవాణి. తా–ఆది.)

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

ప్రభువా! మమ్మును కనికరింపుము.

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

బో:– ప్రార్థింతము.

## ప్రార్థన

*ఆ దినమునకు, లేక ఆ ముందటి ఆదివారమునకు ఏర్పరుపబడిన సంగ్రహ ప్రార్థన చేయవలెను. ఇతర ప్రార్థనలును చేయవచ్చును.*

బో:– ప్రభువు తన జనులకు బలము నిచ్చును

సభ:– ప్రభువు తన జనులకు సమాధానముతో నాశీర్వదించును.

## సమాధాన సంగ్రహ ప్రార్థన

అందరు:– ఓ దేవా! పరిశుద్ధములేన కోరికలన్నియు, మంచి యాలోచలనును, న్యాయములైన సర్వకార్యములును నీ వలననే కలుగుచున్నవి. మేము హృదయపూర్వకముగా నీ యాజ్ఞలకు లోబడునట్లు, శత్రుభయమునుండి నీ వలన సంరక్షింపబడి మా కాలమును నిశ్చలమైన నెమ్మదితో గడుపునట్లును, లోకము ఇయ్యనేరని ఆ సమాధానము నీ సేవకులకు అనుగ్రహింపుమని నీ తోను

పరిశుద్ధాత్మతోను సదా యేకదేవుడై యుగయుగము లందు జీవించుచు పరిపాలించుచునుండు మా రక్షకుడైన యేసు క్రీస్తు పుణ్యమును బట్టి నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగునుగాక.

## దీవేన

బో:– ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికి తోడైయుండునుగాక.

సభ:– ఆమేన్, ఆమేన్, ఆమేన్.

# ప్రభువు రాత్రి భోజనమునకు సిద్ధపడు నిమిత్తము బహిరంగముగా పాపముల నొప్పుకొను ఆరాధన క్రమము

*ఈ యారాధన క్రమము సాయంతనారాధనము వంటిది. పరిశుద్ధ ప్రభు రాత్రి భోజనముకు పూర్వపు శుక్రవారము లేక శనివారము సాయంకాలమున ఇది జరుపవలెను. సంస్కారము పుచ్చుకొన నుద్దేశించు వారందరు దీనికి హాజరు కావలయును.*

*పాపపు టొప్పుదల ఆరాధన ఉదయమున ముఖ్యారాధనకు ముందుగా జరుపవలసియున్న యెడల దీనిని* "తండ్రి యొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున" *అను మాటలతో ఆరంభింపగా సభ 'ఆమేన్' అని చెప్పవలెను. అటుపిమ్మట హెచ్చరిక, పాపపు టొప్పుదల, పాప క్షమాపణ అనునవి జరిపి, క్రొత్త నిబంధన ఆశీర్వాదము చెప్పవలెను. అప్పుడు ఆరాధనను ఆ దినమునకైన ప్రారంభగీతముతో నారంభింపవలెను.*

*పరిశుద్ధాత్మను వేడుకొను నొక కీర్తనగాని తగిన మరియొక కీర్తనగాని పాడవచ్చును.*

*సభ లేచి ఈ దిగువ వచనము పాడవలెను. లేక చెప్పవలెను. దావీదు కీర్తన ముగియువరకు సభ నిలువబడియే యుండవలెను.*

## వచనము

బో:– దేవా, నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము.

సభ:– ప్రభువా, నా సహాయమునకు త్వరగా రమ్ము.

బో:– విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు.

సభ:– దేవా, విరిగి నలిగిన హృదయము నీవు అలక్ష్యము చేయవు

బో:– తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును,

సభ:– ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

## సంకీర్తనము 51:1–13,15

దేవా! నీ కృప చొప్పున నన్ను కరుణింపుము । నీ వాత్సల్య బాహుళ్యము చొప్పున నా యతిక్రమములను తుడిచి వేయుము.

నా దోషము పోవునట్లు నన్ను బాగుగా కడుగుము । నా పాపము పోవునట్లు నన్ను పవిత్రపరచుము.

నా యతిక్రమములు నాకు తెలిసేయున్నవి। నా పాప మెల్లప్పుడు నా యెదుట నున్నది.

నీకు కేవలము నీకే విరోధముగా నేను పాపము చేసియున్నాను । నీ దృష్టి యెదుట నేను చెడుతనము చేసియున్నాను.

కావున ఆజ్ఞ నిచ్చునప్పుడు నీవు నీతిమంతుడవుగా నగపడుదువు। తీర్పు తీర్చునప్పుడు నిర్మలుడవుగా నగపడుదువు.

నేను పాపములో పుట్టినవాడను । పాపములోనే నా తల్లి నన్ను గర్భమున ధరించెను.

నీవు అంతరంగమున సత్యము కోరుచున్నావు । ఆంతర్యములో నాకు జ్ఞానము తెలియజేయుదువు.

నేను పవిత్రుడనగునట్లు హిస్సోపుతో నా పాపము పరిహరింపుము। హిమముకంటెను తెల్లగా నుండునట్లు నీవు నన్ను కడుగుము.

ఉత్సాహ సంతోషములు నాకు వినిపింపుము । అప్పుడు నీవు విరిచిన యెముకలు హర్షించును.

నా పాపములకు విముఖుడవు కమ్ము। నా దోషము లన్నిటిని తుడిచివేయుము.

దేవా! నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము। నా యంతరంగములో స్థిరమైన మనస్సులు నూతనముగా పుట్టించుము.

నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము । నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము.

నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము। సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము.

అప్పుడు అతిక్రమము చేయువారికి త్రోవలను బోధించెదను । పాపులును నీతట్టు తిరుగుదురు.

ప్రభువా! నా నోరు నీ స్తుతిని ప్రచురపరచునట్లు। నా పెదవులను తెరువుము.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును । ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు,

యుగయుగములందుండునట్లు । మహిమ కలుగునుగాక, ఆమేన్.

*అంతట ఈ దిగువ నుదహరింపబడిన వేదపాఠములలో ఒక దానిని గాని మరికొన్నిటినిగాని చదువవలెను :*

| | | | |
|---|---|---|---|
| నిర్గమ | 20:1-7 | మత్తయి | 5:21-29 |
| లేవి | 19:1-4, 9-18 | " | 11:25-39 |
| యెషయా | 1:11-18 | మార్కు | 12:28-31 |
| " | 57:14-21 | లూకా | 13:1-9 |
| " | 58:1-12 | " | 15:1,2,11-31 |
| " | 59:1-21 | యోహాను | 13:1-17 |
| యిర్మియా | 5:20-31 | " | 20:19-23 |
| " | 71:14,21-28 | రోమా | 2:1-23 |
| " | 17:5-10 | " | 3:9-23 |
| యెహెజ్కేలు | 18:12-32 | " | 7:7-25 |
| " | 36:22-31 | 2 కొరిం. | 11:23-29 |
| దానియేలు | 9:4-9, 17-19 | 1 యోహాను | 1:5-9 |
| మీకా | 6:6-8 | | |

## ప్రసంగము

## కీర్తన

*అంతట ఒక ప్రసంగము చేయవచ్చును.*

*ముఖ్యారాధనకు ముందుగా ఈ క్రమము జరుపుచున్నయెడల నిచటనే ఆరంభింపవలెను.*

*అంతట సభ నిలువబడగా బోధకుడు ఈ దిగువనున్నట్లు హెచ్చరించవలెను.*

## హెచ్చరిక

మిక్కిలి ప్రియులారా, మనము మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క పరిశుద్ధ రాత్రి భోజనమునకు రావలెనని యుద్దేశించు చున్నాము. కనుక పరిశుద్ధుడైన పౌలు హెచ్చరించుచున్నట్లు మనలను మనము శ్రద్ధతో పరీక్షించుకొనుట యుక్తమైయున్నది. ఎందుకనగా, ఎవరు తమ పాపములను వినయముగా నొప్పుకొందురో, యెవరు నీతిని గూర్చి ఆకలి దప్పులు కలిగియుందురో, అట్టి వారిని ముఖ్యముగా నాదరించి బలపరచుటకై ఈ పరిశుద్ధ సంస్కారము నియమింపబడి యున్నది.

మనలను మనము ఇట్లు పరీక్షించుకొనిన యెడల మన యందు పాపమును మరణమును తప్ప మరేదియు కనబడదు. వీని నుండి మనంతట మన మెంతమాత్రమును తప్పించుకొనలేము. కావున మనప్రభువైన యేసుక్రీస్తు మన మీద కనికరము గలవాడై

మనకు ప్రతిగా దేవుని పూర్ణ చిత్తమును ధర్మశాస్త్రమును తాను నెరవేర్చుటకును, మన కొరకును మన విముక్తి కొరకును మరణము పొంది, మన పాపములవలన మనము పొందవలసిన దంతయు అనుభవించుటకును ఆయన మనుష్యుడాయెను. మనము మరి యెక్కువ దృఢముగా దీనిని నమ్మునట్లును, మన విశ్వాసమువలన బలపరుపబడి ఆయన చిత్తమునకు సంతోష పూర్వకముగా విధేయుల మగునట్లును తన రాత్రి భోజన మను పరిశుద్ధ సంస్కారమును నియమించెను. దీనియందు తన శరీరమును మన కాహారముగాను, తన రక్తము పానముగాను అనుగ్రహించుచున్నాడు.

కాబట్టి క్రీస్తుయొక్క మాటలను దృఢముగా నమ్ముచు ఎవడు ఈ రొట్టెను తిని ఈ పాత్రలోనిది త్రాగునో వాడు క్రీస్తునందును, క్రీస్తునందును, క్రీస్తు వానియందును జీవించును. అతడు నిత్య జీవము గలవాడై యుండును.

ఆయన మన అపరాధముల నిమిత్తము అప్పగింపబడి మనము నీతిమంతులముగా తీర్చబడుటకై సిలువ మరణమునొంది లేపబడెనను సత్యమును బయలు పరచుచు ఆయన జ్ఞాపకార్థఉగ దీనిని ఆచరింపవలెను. మరియు మనము దీనిని బట్టి ఆయనకు మిగుల హృదయపూర్వకములైన వందనములు చెల్లించుచు మన సిలువ నెత్తుకొని ఆయనను వెంబడించి ఆయన మనలను ప్రేమించుచున్నట్లు ఆయన ఆజ్ఞప్రకారము మనమును ఒకరి నొకరము ప్రేమింపవలెను. ఎందుకనిన, ఈ ఒకే రొట్టెయందు పాలు పుచ్చు కొనుచు, ఈ ఒకే పాత్రలోనిది త్రాగుచున్నందున మన మందరము ఒక్క శరీరమైయున్నాము.

## ప్రార్థింతము

సర్వశక్తిగల దేవా, నీకు అందరి హృదయరహస్యములు కోరికలు స్పష్టముగ తెలిసే యున్నవి. దాచబడి మరుగైయుండున దేదియు లేదు. మేము నిన్ను పరిపూర్ణముగ ప్రేమించి నీ పరిశుద్ధ నామమును సరియైన రీతిని ఘనపరచునట్లు మా హృదయాలోచనలను నీ పరిశుద్ధాత్మావేశము వలన పవిత్రపరచుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

అంతట బోధకుడు ఈ దిగువరీతిగా ఒప్పుదల నారంభింపవలెను.

## ఒప్పుదల

హృదయమును పరిశోధించెడు సర్వశక్తిగల దేవుని సముఖ మందు నేను మిమ్మును అడుగున దేమనగా:– మీరు స్వాభావికముగా పాపులనియు, చేయవలసిన మేలు చేయక చేయరానికీడు చేయుచు తలంపులవలనను మాటలవలనను క్రియలవలనను మీ రక్షకుడగు దేవునికి దుఃఖమును కోపమును కలుగ జేసితిరనియు, అందువలన ఆయన శిక్షావిధికి న్యాయముగా పాత్రులనియు, మీరు నిజముగా గ్రహించి దుఃఖించుచు ఒప్పుకొనుచున్నారా?

ఉత్తరము: ఒప్పుకొనుచున్నాను.

యేసుక్రీస్తు పాపులను రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెననియు ఆయన నామమందు విశ్వాసముంచు వారికందరికి పాపపరిహారము కలుగుననియు నిశ్చయముగా నమ్ముచున్నారా?

ఉత్తరము: నమ్ముచున్నాను.

ఆలాగైతే మీరు సకల పాపములనుండి విముక్తి పొందవలెనని ఆశక్తితో కోరుచు, క్రీస్తు నిమిత్తమున మీ పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండు మిమ్మును పవిత్రపరచుట పరలోక మందున్న మీ తండ్రియొక్క దయగల చిత్తమని మీరు రూఢిగా నమ్ముచున్నారా?

ఉత్తరము: నమ్ముచున్నాను.

ఇంతటినుండి పరిశుద్ధాత్మకు విధేయులై సమస్త పాపమును ద్వేషించి, విడిచేపెట్టి, దేవుని సన్నిధియందున్నట్లుగా జీవించుచు హృదయమునందును ప్రవర్తనయందును పవిత్రముగా నుండుటకు దినదినము ప్రయత్నింపవలెనని నిశ్చయించుకొనుచున్నారా?

ఉత్తరము: నిశ్చయించుకొనుచున్నాను.

మనము వినయముగా మోకరించి దేవుని యెదుట పాపముల నొప్పుకొని ప్రభువైన యేసుక్రీస్తు మూలమున మనకు క్షమాపణ దయచేయుమని ఆయనను వేడుకొందము.

అందరు:-ఓ దేవా! మా పరలోకపు తండ్రీ! నేను నీకు విరోధముగా అనేక విధములైన ఘోర పాపములు చేసియున్నాను. నా పాపమును నేను సంపూర్ణముగా గ్రహించలేను గాని నీ కంతయు స్పష్టముగా తెలిసేయున్నది. నా బాహ్య జీవితములోను ఆంతరంగిక జీవితములోను లెక్కలేని ఘోర పాపములు చేసియున్నానని నీ యెదుట ఒప్పుకొనుచున్నాను. మరియు, నేను పశ్చాత్తాప పడుచు నా దోషములను గురించి మనస్ఫూర్తిగా దుఖించుచు నీ మితిలేని కృపనుబట్టి నన్ను కరుణించి నీ కుమారుడును, మా ప్రభువైన యేసుక్రీస్తు నిమిత్తమున నా పాపములను మన్నించి, కృపతో నా బలహీనతలను తొలగింపుమని నిన్ను వేడుకొనుచున్నాను. ఆమేన్.

*అంతట బోధకుడు లేచి పాపక్షమాపణ ప్రకటింపవలెను. సభ ఆశీర్వాదము పొందువరకు మోకరించియే యుండవలెను.*

## పాపక్షమాపణ

పరలోకమందున్న మన తండ్రియైన సర్వశక్తిగల దేవుడు మనయందు కనికరముంచి తనప్రియ కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శ్రమ మరణ పునరుత్థానములవలన మన పాపము లన్నియు క్షమించుచున్నాడు. మరియు, క్రీస్తు ప్రభుని సంఘముయొక్క కాపరినైన నేను ఆయన యిచ్చిన అధికారమునుబట్టి మీలో నిజముగా పశ్చాత్తాపపడి ఆయనయందు విశ్వాసముంచు వారందరి పాపములు సంపూర్ణముగా క్షమింపబడియున్నవని, తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ప్రకటించుచున్నాను.

అయితే, ఆ అధికారమునుబట్టియే పశ్చాత్తాపములేని అవిశ్వాసులకు నేను తెలియజేయున దేమనగా – అట్టివారు పశ్చాత్తాపములేని స్థితిలో నున్నంత కాలము దేవుడు వారి పాపములను క్షమింపడు. మరియు, కృపాదినము అంతము కాక ముందు తమ దుర్మార్గములనుండి మళ్లుకొనకయు నిజ పశ్చాత్తాపము లేకయు క్రీస్తునందు విశ్వాసముంచకయు నున్నయెడల దేవుడు నిశ్చయముగా వారి దోషములను వారి మీదికి రప్పించును.

*బోధకుడు మోకరింపగా అందరు కలిసి ప్రభువు ప్రార్థన చెప్పవలెను.*

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును

నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*బోధకుడు ఆ దినముకైన సంగ్రహ ప్రార్థన చేయవలెను.*

## సంగ్రహ ప్రార్థన

సభ: – ఆమేన్.

*అంతట సమయమునకు తగిన యితర సంగ్రహ ప్రార్థనలను చేయవచ్చును. అటుపిమ్మట సమాధాన సంగ్రహ ప్రార్థన చేయవచ్చును.*

బో: – ప్రభువు తన ప్రజలకు బలము ననుగ్రహించును.

సభ: – ప్రభువు తన ప్రజలకు సమాధానము కలుగజేసివారి నాశీర్వదించును.

## సమాధాన సంగ్రహ ప్రార్థన

ఓ దేవా! పరిశుద్ధములైన కోరికలన్నియు, మంచి యాలోచనలును న్యాయములైన సర్వకార్యములును నీ వలననే కలుగుచున్నవి. మేము హృదయపూర్వకముగా నీ యాజ్ఞలకు లోబడునట్లును, శత్రు భయమునుండి నీ వలన సంరక్షింపబడి మా కాలము నిశ్చలమైన నెమ్మదితో గడుపునట్లును, లోకము ఇయ్యనేరని ఆ సమాధానము నీ సేవకులకు అనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడై యుగయుములందు జీవించుచు పరిపాలించుచునుండు మా రక్షకుడైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి నిన్ను వేడుకొనుచునానము. ఆమేన్.

*అంతట బోధకుడు లేచి దీవెన చెప్పవలెను.*

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికిని తోడైయుండును గాక, ఆమేన్.

# సార్వత్రిక ప్రార్థనలు

## విజ్ఞాపన ప్రార్థనలు

## (లిటని)

*పండుగలలోను, ప్రభు రాత్రి భోజన సంస్కారము నాచరించి ఆదివారముల యందును తప్ప తక్కిన ఆదివారములయందు విజ్ఞాపన ప్రార్థనలు (లిటని) ఉపయోగింపవచ్చును. ముఖ్యారాధనయందు దీని నుపయోగించు నెడల దీనిని సామాన్య ప్రార్థనకు బదులుగ వాడవచ్చును.*

*పండుగ దినములయందు తప్ప తక్కిన దినములలో ఉదయ సాయంకాల ప్రార్థనలయందు స్తోత్రగీతము పాడిన తరువాత విజ్ఞాపన ప్రార్థనలు (లిటని) ఉపయోగింపవచ్చును.*

*దీనిని ప్రత్యేకారాధనగా నుపయోగించునప్పుడు ఈ క్రింది క్రమమును వాడవలెను.*

(1) బో:– తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

(2) సంకీర్తనము: త్రైకుని మహిమ.

(3) వేదవాక్యము:

(4) బో:– ఓ ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగును గాక.

(5) కీర్తన:

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– ఓ క్రీస్తూ, ఆలకింపుము.

సభ:– ఓ క్రీస్తూ, ఆలకింపుము.

బో: – పరలోకమందున్న తండ్రివైన దేవా,

సభ: – మమ్మును కనికరింపుము.

బో: – లోక విమోచకుడవగు కుమారుడవైన దేవా,

సభ: – మమ్మును కనికరింపుము.

బో: – పరిశుద్ధాత్ముడవైన దేవా,

సభ: – మమ్మును కనికరింపుము.

బో: – మమ్మును కటాక్షింపుము.

సభ: – దయగల ప్రభువా, మమ్మునుకాయుము.

బో: – మమ్మును కటాక్షింపుము.

సభ: – దయగల ప్రభువా, మాకు సహాయము చేయుము.

బో: – పాపమంతటి నుండియు,
తప్పితములన్నటి నుండియు,
కీడులన్నిటి నుండియు

సభ: – దయగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

బో: – సాతాను తంత్రములనుండియు
బలాత్కారములనుండియు ఆకస్మిక దుర్మరణము నుండియు,
తెగుళ్లనుండియు కరవునుండియు,
యుద్ధము నుండియు హత్యల నుండియు,
రాజద్రోహము తిరుగుబాటుల నుండియు,
గాలివానల నుండియు పిడుగులనుండియు,
నిత్యమరణము నుండియు,

సభ: – దయగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

బో: – నీ పరిశుద్ధ అవతార మర్మమువలనను

నీ పరిశుద్ధ జననము వలనను,
నీ బాప్తిస్మము, ఉపవాసము, శోధన అనువాని వలనను,
నీ వేదన, రక్తపు చెమటల వలనను,
నీ సిలువ శ్రమల వలనను
నీ యమూల్య మరణము భూస్థాపన అను వీనివలనను నీ మహిమగల పునరుత్థాన ఆరోహణము వలనను ఆదరణ కర్తయయిన పరిశుద్ధాత్ముని రాకవలనను,

సభ: – దయగల ప్రభువా, మమ్మును తప్పింపుము.

బో: – మా సుఖదుఃఖములయందును,
మా కలిమి లేమిలయందును,
మరణ సమయమందును
న్యాయ విమర్శన దినమందును,

సభ: – దయగల ప్రభువా, మాకు సహాయము చేయుము.

బో: – బీదపాపులమైన మేను నిన్ను వేడుకొనుచున్నాము.

సభ: – ఓ ప్రభువైన దేవా, మా మొర నాలకింపుము.

బో: – నీ పరిశుద్ధ క్రైస్తవ సంఘమును పరిపాలించి యేలుము, నీ సంఘముయొక్క కాపరులును అధ్యక్షులును నీ వాక్యమును గూర్చి సరియైన జ్ఞానము కలిగి పరిశుద్ధమైన ప్రవర్తనగలవారై యుండునట్లు వారిని కాపాడుము.
తప్పిపోయినవారిని మోసపరచబడినవారి నందరిని సత్య మార్గమునకు నడిపింపుము.
సాతానును మా పాదములక్రింద అణక ద్రొక్కుము.
నీ కోతకు నమ్మకమైన పనివారిని పంపుము.
నా వాక్యము ప్రకటింపబడు చోట్ల నీ యాత్మను నీ కృపను కుమ్మరింపుము.
పడిపోయినవారిని లేవనెత్తి, నిలిచియున్న వారిని బల పరచుము. ధైర్యములేని వారిని దుఃఖములోనున్న వారిని ఆదిరించి వారికి సహాయము చేయుము.

సభ: – దయగల ప్రభువా, మాప్రార్థన నాలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

బో:– అపాయములోను, అక్కరలోను, ఇబ్బందిలోను ఉన్నవారి నందరిని కనిపెట్టి సంరక్షింపుము.

వెంట్ట ప్రయాణమును నీటి ప్రయాణమును గాలి ప్రయాణమును చేయువారినందరిని కాపాడుము.

ప్రసవవేదన అను అపాయములోనుండు స్త్రీల నందరిని కాపాడుము.

రోగులను పసిబిడ్డలనందిరిని బలపరచి కాపాడుము.

నిర్దోషులై ఖైదుచేయబడిన వారినందరిని విడిపింపుము.

తండ్రిలేని బిడ్డలను విధవలనందరిని కాపాడి సంరక్షింపుము. మనుష్యులనందరిరి కనికరింపుము.

సభ:– దయగల ప్రభువా, మా ప్రార్థన నాలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

బో:– మా శత్రువులను మమ్ము హింసించువారిని మామీద కొండెములు చెప్పువారిని క్షమించి వారి హృదయములను మార్చుము.

మా ఉపయోగముకొరకు భూఫలముల ననుగ్రహించి వాటిని కాపాడుము.

దయతో మా విన్నపముల నాలకింపుము.

సభ:– దయగల ప్రభువా, మా ప్రార్థన నాలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

బో:– దేవుని కుమారుడవైన యేసుక్రీస్తూ.

సభ:– మా ప్రార్థన నాలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

బో:– లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా.

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా.

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా.

సభ:– నీ సమాధానము మాకు దయచేయుము.

*అంతట బోధకుడును సభయును కలిసి ప్రభువు ప్రార్థన చెప్పవలెను.*

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*అంతట ఈ దిగువవచ్చు లిటని సంగ్రహ ప్రార్థనలలో నొకటిగాని కొన్ని గాని చేయవలెను:*

### 1

బో:– ఓ ప్రభువా, మా పాపములనుబట్టి మాకు ప్రతీకారము చేయకుము

సభ:– మా దోషములనుబట్టి మాకు ప్రతిఫలమియ్యకుము.

బో:– సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, నీవు దుర్మార్గుడు నశింపవలెనని కోరక అతడు తన దుర్మార్గమును విడిచి బ్రతుకవలెనని కోరుచున్నావు. మా పాపములనుబట్టి మేము పొంద తగియున్న శిక్షను దయతో తొలగించి ఇకమీదట ఎల్లప్పుడు నిన్ను పరిశుద్ధతతోను నిర్మల జీవితముతోను సేవించునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 2

బో:– మా రక్షణ కర్తవగు దేవా, నీ నామ ప్రభావమునుబట్టి మాకు సహాయము చేయుము.

సభ:– నీ నామమునుబట్టి మా పాపములను పరిహరించి మమ్మును రక్షింపుము.

బో:– సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ పరిశుద్ధాత్మచేత క్రైస్తవ సంఘమంతటిని ఏలుచు పరిశుద్ధపరచుచున్నావు. ఆ నీ సంఘమునకు చెందిన వారందరికొరకు మేము చేయు ప్రార్థనల నాలకించి నీ దయవలన వారు నిన్ను సత్య విశ్వాసముతో సేవించునట్లు కృప ననుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 3

బో:– ఓ ప్రభువా, మా పాపములనుబట్టి మాకు ప్రతీకారము చేయకుము

సభ:– మా దోషములనుబట్టి మాకు ప్రతిఫలమియ్యకుము.

బో:– ఓ దేవా, దయగల తండ్రీ! నలిగిన హృదయముగల వారి నిట్టూర్పులను, దుఃఖించు వారి కోరికలను నీవు నిర్లక్ష్యము చేయువాడవుకావు. కష్టములవలనను చెడుగుల వలనను మేము బాధ నొందునపుడు నీ సన్నధికి వచ్చి నిన్ను ప్రార్థించునట్లు సహాయము చేయుము. సాతానుయొక్కయు మనుష్యుల యొక్కయు కపటోపాయములచేత మాకు విరోధముగా జరిగింపబడు కీడులన్నయు నిరర్థకమగునట్లు సంరక్షించి కాపాడుము. నీ సేవకులమగు మేము ఏ హింసలవల్లనైనను హాని నొందక నీ పరిశుద్ధ సంఘములో నిత్యము నీకు స్తోత్రము చేయులాగున మేము చేసికొను మనవులు దయతో వినుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 4

బో:– ఓ ప్రభువా, నీ సేవకునితో వ్యాజ్యమాడకుము.

సభ:– సజీవులలో నొకడును నీ సన్నిధిలో నీతిమంతుడుగా నెంచబడడు.

బో:– సర్వశక్తిగల దేవా, మేము ఎన్నో గొప్ప అపాయములలో చిక్కుబడి యున్నామనియు మా స్వాభావిక బలహీనతనుబట్టి వాటియందు స్థిరముగా నిలువలేమనియు నీ వెరుగుదువు. సమస్త శోధనలను జయించుటకు మాకు శక్తి ననుగ్రహించి సకలాపాయములనుండి మమ్మును కాపాడి సంరక్షింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 5

బో:– ఆపత్కాలమున నన్నుగూర్చి మొఱపెట్టుము.

సభ:– నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను మహిమపరచెదవు.

బో:– ఓ ప్రభువా, మా పాపములను దయతో క్షమించి మమ్మును కాపాడుము. మేము

ఎడతెగకుండ చేయు అతి క్రమములచేత నీ శిక్షకు న్యాయముగా పాత్రులమై యున్నను మమ్మును కరుణించి మేము పొందదగియున్న కీడులన్నియు మా యొద్దనుండి తొలగిపోయి మా నిత్యమైన మేలుకై సమ కూడునట్లు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా కృపదయచేయుము, ఆమేన్.

**6**

బో:– ప్రభువు తన ప్రజలకు బలము ననుగ్రహించుము.

సభ:– ప్రభువు తన ప్రజలకు సమాధానము కలుగజేసి వారి నాశీర్వదించును.

బో:– ఓ దేవా, పరిశుద్ధములైన కోరికలన్నియును, మంచి యాలోచనలన్నియును న్యాయములైన కార్యములన్నియును నీ వలననే కలుగుచున్నవి. మేము హృదయపూర్వకముగ నీ యాజ్ఞలకు లోబడునట్లును, శత్రుభయమునుండి నీ వలన సంరక్షింపబడి మా కాలము నెమ్మదితో గడుపునట్లును లోకము ఇయ్యనేరని ఆ సమాధానము నీ సేవకులకు అనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు మా రక్షకుడైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

బో:– తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు మీ యందరిపై నుండుగాక.

ఆమేన్.

# ఉదయానుమతి ప్రార్థన

*ఉదయానుమతి ప్రార్థన ఉదయారాధనయందు స్తోత్రగీతము తరువాత ఉపయోగింపవచ్చును.*

*దీనిని ప్రత్యేకారాధనగా నుపయోగించునప్పుడు ఈ విధముగా నారంభింపవలెవను:*

బో:– తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

*అంతట అందరుకలసి ప్రభువు ప్రార్థన, అపోస్తులుల విశ్వాస ప్రమాణము చెప్పవలెను.*

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

## అపోస్తులుల విశ్వాస ప్రమాణము

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రివైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏకకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమ పడి సిలువవేయబడి చనిపోయి సమాధి

చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవ దినమునలేచి పరలోకమున కెక్కి సర్వ శక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును, తీర్పుచేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాము.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను, ఆమేన్.

*ఉదయానుమతి ప్రార్థన, ప్రత్యేకారాధనగా నుపయోగించునపుడు యీ క్రింది మూడు అంశములను ఇక్కడ కలుపవలెను.*

(1) సంకీర్తనము: త్రైకుని మహిమ.

(2) వేదవాక్యము.

బో:– ఓ ప్రభువా మమ్మును కనికరింపుము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగును గాక.

(3) కీర్తన.

బో:– యెహోవా! నేను నీతో మనవి చేయుచున్నాను.

సభ:– ఉదయమున నా ప్రార్థన నిన్ను ఎదుర్కొనును.

బో:– నీ కీర్తితోను, నీ ప్రభవ వర్ణనతోను,

సభ:– దినమంతయు నా నోరు నిండియుండనిమ్ము.

బో:– నా పాపములకు విముఖుడవు కమ్ము.

సభ:– నా దోషములన్నిటిని తుడిచివేయుము.

బో:– దేవా! నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము.

సభ:– నా యంతరంగములో స్థిరమైన మనస్సు నూతనముగా పుట్టించుము.

బో:– నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము.

సభ:– నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము.

బో:– నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము.

సభ:– సమ్మతిగల మనస్సు కలుగజేసి నన్ను దృఢపరచుము.

బో:– ఈ దినమున మేము పాపము చేయకుండునట్లు,

సభ:– ఓ ప్రభువా! నీ కృప ననుగ్రహింపుము.

బో:– ఓ ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మేము నీ కొరకు కనిపెట్టుచున్నాము.

సభ:– కనుక నీ కృప మా మీద నుండనిమ్ము.

బో:– యెహోవా! నా ప్రార్థన నాలకింపుము.

సభ:– నా మొఱ నీయొద్దకు చేరనిమ్ము.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ ఆత్మతో నుండునుగాక.

## ప్రార్థింతము

*అంతట ఆ దినమునకైన సంగ్రహ ప్రార్థనగాని, సమయానుకూలమైన ఇతర సంగ్రహ ప్రార్థనలుగాని ఉపయోగింపవలెను.*

అందరు:– పరలోకపు తండ్రీ! పోయిన రాత్రి సకలాపాయముల నుండియు, హానినుండియు నీవు మమ్మును కాపాడినందుకు నీ ప్రియకుమారుడైన యేసుక్రీస్తుద్వారా నీకు వందనములు చెల్లించుచున్నాము. మా సకల తలంపులలోను, మాటలలోను, క్రియలలోను నిన్ను సేవించి సంతోషపరచునట్లు ఈ దినమునకూడ మమ్మును సమస్త పాపము నుండియు కీడంతటి నుండియు కాపాడి రక్షింపుమని నిన్ను వేడుకొనుచున్నాము. నీ చేతులకు మా శరీరాత్మలను, మా సమస్తమును అప్పగించుచున్నాము. మా మీద దుష్టునికి శక్తి లేకుండునట్లు మమ్ము కాపాడుటకు నీ పరిశుద్ధ దూతకు ఆజ్ఞాపింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగును గాక.

బో:– తండ్రీ, కుమారుడు, పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు మీ యందరిపై నుండునుగాక, ఆమేన్.

# సాయంతనానుమతి ప్రార్థన

*సాయంతనారాధనయందు స్తోత్రగీతము తరువాత ఉపయోగింపవచ్చును.*

*ప్రత్యేకారాధనగా నుపయోగించునప్పుడు ఈ విధముగా నారంభింపవలెను:*

బో:– తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

*అప్పుడు అందరుకలసి ప్రభువు ప్రార్థన, అపోస్తలుల విశ్వాస ప్రమాణము చెప్పవలెను.*

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడుగాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకముందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

## అపోస్తలుల విశ్వాస ప్రమాణము

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రివైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏకకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమ పడి సిలువవేయబడి చనిపోయి సమాధి

చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవ దినమునలేచి పరలోకమున కెక్కి సర్వ శక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును, తీర్పుచేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాము.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను, ఆమేన్.

*సాయంతనానుమతి ప్రార్థన, ప్రత్యేకారాధనగా నుపయోగించునపుడు యీ క్రింది మూడు అంశములను ఇక్కడ కలుపవలెను.*

(1) సంకీర్తనము: త్రైకుని మహిమ.

(2) వేదవాక్యము.

బో:- ఓ ప్రభువా మమ్మును కనికరింపుము.

సభ:- దేవునికి స్తోత్రము కలుగును గాక.

(3) కీర్తన.

బో:- మా పితరుల దేవుడవైన ఓ ప్రభువా! నీవు స్తోత్రార్హుడవు.

సభ:- బహు కీర్తనీయుడవును నిత్యము మహిమ నొందవలసిన వాడవునైయున్నావు.

బో:- తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును స్తోత్రములు చెల్లింతము.

సభ:- నిత్యము ఆయనను స్తుతించి గొప్ప చేయుదము.

బో:- ఓ యెహోవా! ఆకాశ విశాలమందు నీవు స్తుతిపాత్రుడవును.

సభ:- నిత్యము బహుగా స్తుతింపబడి, మహిమపరచబడి యున్నతముగా హెచ్చింపబడవలసిన వాడవునైయున్నావు.

బో:- సర్వశక్తిగల కృపానిధియగు ప్రభువు మనలను ఆశీర్వదించి కాపాడునుగాక.

సభ:- ఆమేన్.

బో:- ఈ రాత్రి మేము పాపము చేయకుందునట్లు.

సభ:- ఓ ప్రభువా! దయతో మమ్మును కాపాడుము.

బో:– ఓ ప్రభువా! మమ్మును కాపాడుము.

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– ఓ ప్రభువా! మేము నీ కొరకు కనిపెట్టుచున్నాము.

సభ:– కనుక నీ కృప మా మీద నుండనిమ్ము.

బో:– ఓ ప్రభువా! నా ప్రార్థన నాలకింపుము.

సభ:– నా మొఱ నీయొద్దకు చేరనిమ్ము.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ ఆత్మతో నుండునుగాక.

## ప్రార్థింతము

*అంతట ఆ దినమునకైన సంగ్రహ ప్రార్థనగాని, సమయానుకూలమైన ఇతర సంగ్రహ ప్రార్థనలుగాని ఉపయోగింపవలెను.*

అందరు:– పరలోకపు తండ్రీ! ఈ దినమున నీవు మమ్మును ఇంత దయతో కాపాడినందుకు నీ ప్రియకుమారుడైన యేసుక్రీస్తుద్వారా నీకు వందనములు చెల్లించుచున్నాము. మా పాపములన్నిటిని, మేము చేసిన యపరాధము లన్నిటిని క్షమించి ఈ రాత్రియందలి సమస్త గండముల నుండియు అపాయముల నుండియు నీ గొప్ప కనికరముచేత మమ్ము మా శరీరాత్మలను మా సమస్తమును అప్పగించుచున్నాము. మేము దుష్టునికి లొంగి పోకుండునట్లు మమ్ము కాపాడుటకు నీ పరిశుద్ధ దూతకు ఆజ్ఞాపింపుమని మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగును గాక.

బో:– తండ్రీ, కుమారుడు, పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు మీ యందరిపై నుండునుగాక, ఆమేన్.

# ఇతర సార్వత్రిక ప్రార్థనలు

*ఈ ప్రార్థనలు ముఖ్యారాధనలోను, ఇతర ఆరాధనలలోను, వాడవచ్చును:*

I

సర్వశక్తిగల దేవా! మా పరలోకపు తండ్రీ! నీ మితిలేని జాలివలన ప్రతి మేలును, నీ కుమారుని ద్వారా రక్షణను మాకు అనుగ్రహించియున్నందున నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.

నీ వాక్యము శ్రద్ధతో విని, దాని ప్రకారము నడుచుకొని జీవించుటకు మాకు కృప దయచేయుము. నీ వాక్య సేవకుల ద్వారా నీ సంఘమునకు పవిత్రమైన బోధను వినిపించి కాపాడుము. మానవులందరి రక్షణకై ప్రార్థించుటకు మాలో విశ్వాసమును, ప్రేమను పుట్టించుము.

మా రాష్ట్రపతికిని, ప్రధాన మంత్రికిని, అధికారులందరికిని జ్ఞానమును ఆరోగ్యమును దయచేసి వారు న్యాయపాలకులుగా నుండునట్లు అనుగ్రహింపుము.

మా శత్రువులను క్షమించి వారికి సమాధానానందములు దయచేయుము. ఓ దేవా! శరీరాత్మీయములైన సకల కీడులలో నున్న వారిని నీ సత్యము నిమిత్తము హింసింపబడుచున్న వారిని ఆదరించి, ఓపికతో భరించుకొనునట్లు వారికి కృప దయచేయుము.

ఓ మిగుల కరుణగల తండ్రీ! మేము న్యాయ ప్రకారము శిక్షకు తగిన వారమేగాని నీ కనికరమువలన మమ్మును కాపాడుము. కాల మార్పువలన కలిగే సమస్త కష్టముల నుండియు, నీ కృపను గూర్చిన నిరాశ నుండియు, దుర్మరణమునుండియు, మమ్మును కాపాడి ఆపత్కాలమందు సర్వరక్షకుడవుగా నగపడుము. మాకు కావలసిన భూఫలములను కలుగజేసి పవిత్రమైన విద్యలన్నిటికి జయము దయచేయుము.

ఓ దేవా! నీతోను పరిశుద్ధాత్మతోను, సదా ఏకదేవుడై యుగయుగములయందు జీవించుచు ఏలుచునుండు నీ జనితైక కుమారుడును మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క ఘోర శ్రమను మరణమును జూచి మేము కోరిన వానిని ఇంకను నిన్ను అడుగవలసిన ఇతరమైన వానిని మాకు అనుగ్రహింపుమని నిన్ను మిక్కిలి వినయముతో వేడుకొనుచున్నాము, ఆమేన్.

II

సర్వశక్తిగల దేవా! మా పరలోకపు తండ్రీ! నీ యయోగ్య సేవకులమైన మేము, నీవు మాకును, మానవులందరికిని కనబరచిన దయాదాక్షిణ్యముల విషయమై వినయపూర్వక వందనములు చెల్లించుచున్నాము. మమ్మును పుట్టించి, కాపాడు మా జీవితమునకు సంబంధించిన అన్ని ఆశీర్వాదములు అనుగ్రహించినందుకు నిన్ను కొనియాడుచున్నాము. మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు పంపి మమ్మును విమోచించినావు; అట్టి నీ అనంత ప్రేమను దలచుకొని నీకు స్తుతులు, స్తోత్రములు చెల్లించుచున్నాము.

మా జీవిత కాలమంతటిలో నీ సన్నిధియందు పవిత్రము గాను నిష్కళంకముగాను జీవించునట్లు మమ్మును నడిపింపుము. మా పెదవులతో మాత్రమేగాక మా ప్రవర్తనద్వారా నిన్ను స్తుతించు వారినిగా మమ్మును మార్చుము. కృపవెంబడి కృపను నీవు మాకు చూపుచున్నావు; నీ కృపను గుర్తెరిగి నీ మేళ్ళను లెక్కించు జ్ఞానము మా కనుగ్రహింపుమని నిన్ను ప్రార్థించుచున్నాము.

క్రైస్తవులమని చెప్పుకొను వారందరును సత్యమార్గమందు యథార్థముగ నడుచునట్లు నీ పరిశుద్ధాత్మ సహాయము ననుగ్రహింపుము. లోకమందంతటను వ్యాపించియున్న నీ సంఘమును కాపాడి యేలుమని మనవి చేయుచునానము. సువార్త బోధకులందరి మీదను వారి సంఘముల మీదను క్షేమకరమగు నీ యాత్మను నీ ఆశీర్వాద వర్షమును కుమ్మరించుచుండుము.

మా రాష్ట్రపతిని, ప్రధాన మంత్రిని, మా దేశ నాయకు లందరిని కటాక్షించి, వారన్న వేళలందు నీ దివ్య చిత్తముననుసరించి హృదయ శుద్ధితో సేవ చేయునట్లు వారిని ప్రేరేపింపుము. మా దేశములో తర తరముల వరకు శాంతి భద్రతలును నీతి న్యాయములును భయభక్తులును స్థిరపడునట్లు సదాలోచనలను నీతి వర్తమానమును వర్ధిల్ల జేయుము.

మెట్టను, నీటను, గాలి విమానము లందును ప్రయాణము చేయువారిని సంరక్షించి, ఆపదలోను, అక్కరలోను ఉన్నవారి నాదు కొని, నీ జనులందరి యవసరములను తీర్చుమని వేడుకొను చున్నాము. వ్యాధిబాధలను, కష్టనష్టములను అనుభవించుచున్న వారిని నీ కృపా వాత్సల్యమున కప్పగించుచున్నాము. వారి కవసరమగు ఓరమిని దయచేసి మనశాంతి ననుగ్రహింపుమని ప్రార్థించు చున్నాము.

III

కరుణగల దేవా! మా పరలోకపు తండ్రీ! నీ నామమందున నీ నామమందును నీ కుమారుడైన యేసుక్రీస్తు నామమందును సమావేశమై మా కవసరమును లాభకరమునైన వాని నడుగుడని మాకాజ్ఞాపించితివి. మా ప్రార్థనలను, మనవులను ఆలకింతునని వాగ్దానము చేసియుంటివి. గనుక ఈ మా ప్రార్థనల నాలకింపుమని నిన్ను వేడుకొనుచున్నాము. మా పాపములను, మా దుర్నీతిని పరిహరించి నీ సంఘమునకును, జనులందరికిని అవసరమైన వానిని గూర్చి మేము నిన్ను ప్రార్థింప గలుగునట్లు నీ పరిశుద్ధాత్మతో మా హృదయములను ఉజ్జీవింప జేయుము.

నీ సంఘము కొరకును, సంఘస్థుల కొరకును ప్రార్థించు చున్నాము. నీచే నియమింపబడని కాపరుల బారినుండి వారిని రక్షించి కాపాడుము. నీ యెడల నిర్లక్ష్యము, బ్రతుకులలో దుర్మార్గము మా సంఘస్థులలో కనబడకుండునట్లును దుర్బోధలు, చీలికలు, వేషధారణలు అంతరించునట్లును అనుగ్రహింపుము. మేమందరమును నీ ప్రియ కుమారుని నమ్మి సత్య విశ్వాసములో ఐక్యముగా జీవింప గలుగునట్లును ఆయన యందు యేకమై ప్రేమ మార్గములో వృద్ధినొంద గలుగునట్లును దానిద్వారా నీ నామమునకు ఘనతయు మా తోడి మానవులకు మేలును కలుగునట్లును అనుగ్రహింపుము. చెదరిపోయిన నీ గొర్రెలను జాగరూకతతో వెదకి మంచి కాపరియగు యేసుప్రభువు నొద్దకు తెచ్చి నీ మార్గములో నడిపించు గురువులను, బోధకులను వారి కనుగ్రహింపుము.

మేము నిర్భయముగాను నిర్మలముగాను నీతితోను నీ దివ్య సేవను చేయగలుగునట్లు మా అధికారులు దుర్మార్గమును అణచి నీతిని నిత్యము నిలువబెట్టుటకు వారికి నీ సహాయము నిమ్మని విజ్ఞాపన చేయుచున్నాము.

సర్వలోక రక్షణార్థమై నీవు వచ్చినందున మానవులందరిని రక్షింపుమని నిన్ను వేడుకొనుచున్నాము. నీ ప్రియ కుమారునికి దూరస్థులుగా నున్నవారిని చేర్చుకొనుము. ఆయనను వెంబడించుచున్న వారు, అనుదినము కృపయందును దైవ జ్ఞానమందును వర్ధిల్లునట్లనుగ్రహింపుము.

ఆపద్బాంధవా! దుఃఖములలో నున్నవారందరి కొరకు నిన్ను వేడుకొనుచున్నాము. అట్టివారి నాదరించి, వారి యాపదలను తొలగింపుము. పరమ తండ్రీ, మేము చేసిన తప్పిదములకు నీ శిక్ష ననుభవించునప్పుడు అది తండ్రి భావముగల నీ చిత్తము

ననుసరించి కలిగినదే యని మేము గ్రహించి నీ తీర్పులోనికి రాకుండ మేము నీ కృపచేత సరిదిద్దుకొనునట్లు మమ్మును నడిపింపుము.

ఇచ్చట నిన్నారాధించుటకు సమావేశమైయున్న మేము నీ వాక్యమందు స్థిరమనస్కులమై. దురాశలను చంపుకొని మా జీవిత మంతటిని నీ సేవకై సమర్పించుకొనుటకు నీ యాత్మశక్తి ననుగ్రహింపుము. నీ ప్రియ కుమారుడును మా రక్షకుడునైన యేసు ప్రభువు ఘోర శ్రమ మరణముల నొందిపాపము నుండియు నిత్యనాశనము నుండియు మమ్మును విమోచించెను. ఆయన తన దివ్య పునరుత్థానారోహణల ద్వారా పరిశుద్ధాత్మతోను సదా యేకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు ఆయన ఘన నామమున మా విన్నపముల నాలింపుమని నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము, ఆమేన్.

# విశేష ప్రార్థనలు

## అడ్వెంటు

ఇశ్రాయేలీయుల నిరీక్షణయు, లోక విమోచకుడును, నీ కుమారుడునైన యేసుక్రీస్తు రాకనుగూర్చి పరిశుద్ధ ప్రవక్తలనోట ప్రకటించిన సర్వశక్తిగల దేవా! ఆయన మా ప్రభువును రక్షకుడునని గ్రహించుటకును, నిజమైన విశ్వాసము గలిగి నీ రక్షణ భాగ్యమం దానందించుటకును మాకు సహాయము ననుగ్రహింపుము.

తండ్రియొక్క యద్వితీయ పుత్రుడవైన కృపాసత్య సంపూర్ణుడా! కృశించియున్న నీ జనులు, దావీదు కుమారునికి జయము, ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడుగాక యని పాడు నట్లు నీ యాలయమందు ప్రవేశించి, వారిని తెప్పరిల్లజేయుము. సంఘముయొక్క యీ నూతన వత్సరము చీకటిలో గూర్చుండువారికి కృపగల దర్శన కాలముగాను, నీ మార్గముల నుండి తప్పిపోయిన వారికి సన్మార్గమునకు వచ్చు సమయముగాను, అజాగ్రత్తయందును పాపమందును ఆనందించువారికి పశ్చాత్తాపమును, మారుమనస్సు నొందు కాలముగాను, నీ నామమును ఉచ్చరించువారందరు నూతనమైన భక్తితో సేవించు సంవత్సరముగాను జేయుము.

తండ్రియొక్క నిత్యుడవైన పుత్రుడా! నీ కరకు నిరీక్షించి కనిపెట్టు వారందరిని నీ యొద్దకు చేర్చుకొందునని వాగ్దత్తము చేసిన ప్రభువా! మా నులి వెచ్చనితనమును గూర్చియు పాపమును గూర్చియు మేము మారుమనస్సు పొందునట్లును, పాపాంధకార కార్యములను విడిచి వెలుగు యొక్క ఆయుధములను ధరించు కొనునట్లును, మాకు సహాయము చేయుము. ఈ లోకమునకు నీవు న్యాయము తీర్చుటకు మహిమగల ప్రభావముతో వచ్చునప్పుడు నిత్యమహిమగల నీ పరిశుద్ధులలో లిక్కింపబడ నర్హులముగా నుండునట్లు మేము మా నడుములు కట్టుకొని, మా దివిటీలను సిద్ధపరచి వెలిగించుకొని, దేవునియందు భయముగలిగి సంతోషకరమగు నిరీక్షణతో మా జీవితకాలమును గడుపునట్లు మాకు కృప ననుగ్రహింపుమని నీ దివ్యనామమున వేడుకొనుచున్నాము, ఆమేన్.

## క్రిస్మస్ పండుగ

ప్రభువైన యో సర్వశక్తిగల దేవా! భూమిని అంధకారమును, మానవులను గాఢాంధకారమును, క్రమ్మియుండగా సహాయము చేయుటకు శక్తిని, విడిపించుటకు బలముగల రక్షకుని, జీవమును, నిత్య రక్షణయు, తప్పిపోయి నశించియున్న నరకోటికి అనుగ్రహించి నందునకు నీకు స్తుతి వందనములు కలుగుగాక. ఆయన ద్వారా వెలుగును, విమోచనమును, శక్తియు, సమాధానమును, గలుగులాగున నీ యనాదిపుత్రుని నరావతారమెత్తుటకై యిచ్చినందుకు నిత్యము నీకు స్తుతి వందనములు కలుగుగాక. పాపమువలన భూ పరదైసులో నుండి బైటకు తరుమబడిన మేము మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క పరిశుద్ధ జన్మమువలన నూతనమైన రాజ్యమునకును, పరలోకమందున్న యనంత పరదేసునకును తిరిగి తేబడినందులకు నీకు స్తుతి వందనములు కలుగుగాక!

మిక్కిలి కృపాసముద్రుడా! కృపవెంబడి కృప నను గ్రహించుట నీ చిత్త మగునుగాక. నీ కుమారుని మా విమోచకునిగా నిచ్చియున్నావు. గనుక ఆయన పుట్టుకను తగిన ప్రేమతో జ్ఞప్తి యందుంచుకొని, సంతోషహృదయములతోను, తీవ్రమైన భక్తితోను, ఆయనను ప్రభునిగాను, నిరీక్షణగాను అంగీకరించుటకు మామీద నీ పరిశుద్ధాత్మను కుమ్మరింపుము. ఆయనమీద మే మానుకొని, పాపమరణముల యధికారమునుండి విడదలను, శ్రమ దుఃఖము లందోదార్పును, అంతమందు నిత్యజీవమును పొందునట్లు ఆయనను గూర్చి నీ విచ్చిన సాక్ష్యము నంగీకరించుటకు సజీవవిశ్వాసము ననుగ్రహింపుము.

ఓ దేవా, నేడు మే మానందించుచున్న మహానందకరమైన సువార్త ఆదాము సంతానముయొక్క ప్రతి గోత్రమునకును వచ్చునట్లు దయచేయుము. మా కొరకు యీ బిడ్డ పుట్టెను. మా కొరకు ఈ కుమారు డీయబడెనని భక్తిగల సంతోషముతో మనుష్యులందరు చెప్పగలుగు నట్లనుగ్రహించుము.

అంధకారమందున్న వారందరు యీ సమాధాన కర్తయొక్క దివ్యమైన పరిపాలనలో సంతోషించునట్లు, వారందరిపై యీ వెలుగు ప్రకాశింప నిమ్ము. దుః ఖాక్రాంతులును, ఆనందరహితులును, నేడు నీ సింహాసనము వైపుచూచి భయములన్నిటి నుండియు శత్రువు లందరినుండియు విమోచించుటకు వచ్చిన ఆయనయందు పూర్ణమైన

యోదార్పును బొందుదురుగాక. విరిగిన హృదయము గలవారిని దృఢపరచి, బంధింపబడిన వారికి విముక్తిని ప్రకటింపుము. దుఃఖించు వారికి బూడిదకు బదులుగా పూలదండలను, భారభరితమైన యాత్మకు ప్రతిగా మెప్పువస్త్రమును దయచేయుము. పాపులను రక్షించుటకు యేసుక్రీస్తు యీ లోకములకు వచ్చినందుకు సంతోషించి దేవునిని మహిమ పరచులాగున పశ్చాత్తాపముగలిగి భారముగల యాత్మలకు నీ రక్షణవలన సంతోషము కలుగజేయుము. ఆయన విమోచనము పూర్తిజేయుటకు మహిమగల ప్రభావముతో వచ్చునప్పుడు మాకు నెమ్మదిగల అంతమును ఆయన రాజ్యమునందు సంతోషము పొందునట్లు బేత్లెహేములో జన్మించిన వానిద్వార మాకు సహాయముచేసి సంరక్షించి మమ్ముల నందరిని కాపాడుమని ఆ క్రీస్తు నామమున వేడుకొనుచున్నాము, ఆమేన్.

## సంవత్సరాంతము కొరకు

ఎన్నటికితప్పని కనికరములును, అంతములేని ప్రేమయుగల సర్వశక్తిగల దేవా! మా పరలోకపు తండ్రీ, మరియొక సంవత్సరము మమ్ములను కృపతో కాపాడినందుకు నీ యయోగ్య సేవకులమైన మేము వినయముతోను పూర్ణ మనస్సుతోను నీకు వందనములు చెల్లించుచున్నాము. ఈ సంవత్సరములోని దినములందును వారములందును నీ దీర్ఘశాంతమును కనికరమును గల మేళ్లను మేము అనుభవించునట్లు అనుగ్రహించినందుకు మేమును కృతజ్ఞతగల విధేయతను, ప్రేమను నీకు కనపరచునట్లు నడిపింపుము.

పరలోకపు తండ్రీ, గతవత్సరమున నిన్ను గూర్చి మేము తగురీతిగా ధ్యానించమైతిమి. నీవు ధారాళముగా నిచ్చిన యీవులను గూర్చి నీకు చూపవలసినంత కృతజ్ఞత జూపమైతిమి. ఓ ప్రభువా, మా మీద కనికరముంచి మమ్మును గూర్చి తీర్పు తీర్చక మా ప్రాణములను కాపాడి, మా పాపముల ప్రాయశ్చిత్తము కొరకు, నీ కుమారుని యిచ్చియున్నావు. గనుక ఆయన కొరకు మా పాపములను కృపతో క్షమించి నిజమైన విశ్వాసముతో ఇకమీదట నిన్ను సేవించు నట్లు నీ కృప దయచేయుము.

పాతసంవత్సరము గతించుచుండగా పాత ఆదామును వాని క్రియలతో విడిచినవారమై నూతన సంవత్సరమును క్రొత్త బ్రతుకుతో నారంభించుటకు నీ పరిశుద్ధాత్మను మా కనుగ్రహింపుము. మా గత పాపములను గూర్చియు. పొరబాటులను

గూర్చియు, పరితపించు హృదయములను మాకు దయచేయుము. నీ మహిమార్ధము జీవించులాగున మా యంతఃపురుషుని బలపరచుము. మేము జ్ఞాన హృదయము కలవారమై యీ లోకమందు పనిజేయునంత కాలము నీ యెడల భయము గలవారమై చివరకు నీ జనులకు వాగ్దత్తము జేయబడిన సమాధానమును ఆశీర్వాదమును బొందులాగున మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుమని నీ ప్రియ కుమారుడును, మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వార నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## క్రొత్త సంవత్సరము

తరతరములనుండి మా నివాస స్థలముగాను అనాది నుండియు! జ్ఞానమందును శక్తియందును మంచితనమందు ఏక విధముగానున్న ఓ దేవా, మా పరలోకపు తండ్రీ, మాజీవనమునకు కర్తవును, మా సౌఖ్యములన్నిటికి మూలకారకుడవును మంచిదియు సంపూర్ణమునైన ప్రతి దానము నిచ్చువాడవునైన నీకు స్తుతి వందనములు చెల్లించుచున్నాము.

నీవు కృపతో ఇంతవరకు మమ్ము కాపాడి యున్నావు. నీ కనికరము వలననే మేము నశించక యున్నాము. నీవు మా పాపములను బట్టి మాకు ప్రతీకారము జేయలేదు. మా అతిక్రమము లనుబట్టి మాకు ప్రతిఫలమియ్యలేదు. మానేరములకంటె మాకువచ్చిన బాధలు తక్కువ. మేము లెక్కింపగలిగిన దానికంటె నీ మేళ్లధికమై యున్నవి. నీ యాలయముయొక్క నియమములను, వాక్యమును మా కిచ్చియున్నావు. మా గృహములను, హృదయములను మంచివానితో నింపియున్నావు. తెగులు నుండియు, అంటు రోగము నుండియు, మమ్ము కాపాడితివి. అపాయములయందు మా కడ్డుపడితివి. ప్రతి యుదయము నీ కృపను మాకు క్రొత్తగా చూపుచున్నావు. ప్రతిరాత్రియు నీ విశ్వాస్యతను క్రొత్తగా కనపరచుచున్నావు. వీనియన్నింటి విషయము నీ పరిశుద్ధ నామమును స్తుతించి నిన్ను మిక్కిలి యెక్కువగా ప్రేమించుటకును మరింత బాగుగా సేవించుటకును కృపాబలముల ననుగ్రహింపుమని వేడుకొనుచున్నాము. ఓ ప్రభువా, నీకు విరోధముగా మేము చేసిన వాటిని క్షమింపుము. మా పాత పాపములను మా వెంట యీ నూతన సంవత్సరములోనికి తీసికొని పోకుండునట్లు నీ పరిశుద్ధాత్మవలన మా హృదయములను నూతన పర్చుము. పరిశుద్ధుడవైన తండ్రీ, గడచిన కాలమంతయు మమ్ము దయతో జూచి యాశీర్వదించిన ప్రకారము ఇక ముందును నీ దయను

ఆశీర్వాదమును మాకకు జూపుము. నీవు మాకు సిరి సంపదలను అను(గహించినందుకు నీకు కృతజ్ఞతగలవారమైయుండి వానిని నీ మహిమార్థము వాడునట్లు మాకు సహాయము చేయుము. నీవు మాకు దారి(ద్ర్యము పంపు సమయమున మేము విసుగునొందక నీ చిత్తమునకును ఏర్పాటులకును వ్యతిరిక్తముగా నుండకుందునట్లు మమ్ము నడిపింపుము. నీ సంరక్షణలోనుండగా మా కేది సంభవించినను నీ జ్ఞానమందును, మంచితనమందును, మా నమ్మ కమును తగ్గిపోనీయక నిత్యము సహాయముగాను బలముగాను స్వాస్థ్యముగా ఉండుము. మే మెవరి కొరకు (ప్రార్థింపవలెనో వారి నందరిని నీ (పేమ చిహ్నములతో దర్శింపుము. ఈ సంవత్సరము సీయోనుకు క్షేమ వత్సరముగాను రా(ష్ట్రములయందు సమాదాన కాలముగాను ఉండునట్లు నీ సంఘమును, నీ వాక్య బోధను దీవింపుము. సకల రా(ష్ట్రములలో సత్యమును నీతిని ఈ సంవత్సరము విజయమునొందనిమ్ము. పీడింపబడువారు విడుదలను, బాధ నొందు వారు ఓదార్పును, పాపముచేసి తప్పిపోయినవారు రక్షణను పొందు దానినిగా ఈ సంవత్సరమును దీవించుము. ఎవరికి యీ సంవత్స రము చివరిదైయున్నదో వారందరు మార్పును పొంది పరిశుద్ధుల స్వాస్థ్యము పొందుటకు తగిన అర్హతగలవారైయుండునట్లు వారికి రక్షణకరమైన కృప నను(గహింపుము. మేమడుగు దానికంటెను, అనుకొను దానికంటెను అమితముగా నియ్యకలిగిన నీకు అన్ని యుగములయందును యేసు(కీస్తుద్వారా మహిమయు, శక్తియు కలుగును గాక, ఆమేన్.

## ఎపఫానియ పండుగ

సర్వశక్తిగల నిత్యదేవా! నీ కుమారుడైన యేసు(కీస్తును ఆరాధించుటకు జ్ఞానులు తమ బహుమతులతోను కానుకలతోను వచ్చునట్లు ఒక నక్ష(త సాక్ష్యమువలన అయన నరావతారమునుగూర్చి వారికి తెలియజేసిన జ్యోతుల తం(డీ, మా కొరకు (కొత్తగా పుట్టిన రాజును గూర్చిన తెలివియందు, పరిశుద్ధాత్మయొక్క జ్ఞానముచేత మేము అనుదినము వృద్ధిపొందునట్లును, ఆయననే మేము ఒప్పుకొని గౌరవపరచి సేవించుట మా నిత్యానందముగాను భాగ్యముగా నెంచు కొనునట్లును, నీ నీతి నక్ష(తమును నిత్యము మా హృదయములలో (ప్రవేశింపజేయుమని వేడుకొనుచున్నాము.

(ప్రభుడవైన ఓ దేవా, తప్పు మార్గములయందు నడుచు మమ్మును కనికరముతో మరలించి, రక్షణకరమైన నీ సత్యమును మేము వీక్షించులాగున నీ వెలుగులో

నడిపింపుము. పొరబాటుల యందున్న వారందరు నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును తెలిసి కొనుటకు వారిలో ఆశను పుట్టించుము. నీ పిల్లలవలె మేము వెలుగులో నడిచి నిత్యజీవముయొక్క వెలుగును మహిమను స్వతంత్రించు కొనులాగున చేయుము. నీ వాక్యబోధవలన జ్ఞానము పొందిన మాకు, నిన్ను నిత్యము హత్తుకొనియుండు గాఢమైన ప్రేమను భక్తిని దయచేయుమని, నీతోను పరిశుద్ధాత్మలోను జీవించుచు, ఏలుచు సర్వమునకు దేవుడును, నిత్యము ధన్యుడునైన మా ప్రభువు యేసు క్రీస్తు ద్వార నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## భస్మబుధవారము

ఓ దేవా! కనికరముతో నరుని తన మొదట స్థితికి తెచ్చిన కర్తా! సైతాను తంత్రమువలనను శోధనవలనను మనుష్యుడు నిత్య జీవమును పోగొట్టుకొనినప్పుడు నీ యేక కుమారుని రక్తమువలన మానవులను విమోచించినావు. మా దీన విన్నపము నాలకింపుము. కరుణాసముద్రుడవైన నీవు దూరముగా నుండకుము. మేము మృతి నొందకుండునట్లు మా పాపములను గూర్చి దుఃఖించి పాడుదాస్యము నుండి విడిపింప బడునట్లు నీ దాసులమైన మాలో క్రొత్తజీవము కలిగించుము. తప్పిపోయిన వారిని నీవు విడిచిపెట్టవు గనుక, వారు నీ యొద్దకు తిరిగి తేబడినపుడు వారి నంగీకరింపుము. దుఃఖించు వారియొక్కయు విరిగిన హృదయముగల వారియొక్కయు ప్రలాపములకు చెవియొగ్గి నీ కృపాకటాక్షముల కొరకు వారు చేయు విన్నపములకు విముఖుడవై యుండకుము. రాజువైన నీ సింహాసనము నెదుట సాగిలపడి, యేసుక్రీస్తు నామమున క్షమాపణను సహాయమును వేడువారందరికి నీ రక్షణ హస్తము చాపుము.

ఓ ప్రభువా! నీ మందకు నష్టము రాకుండునట్లును, నీ సంఘము తన శరీరాంగము లందెచ్చటను చెడిపోకుండునట్లును, నూతన జన్మ సంబంధమైన బాప్తిస్మముద్వారా ఒకసారి కడుగబడిన వారందరు తిరిగి రెండవసారి మృతులు కాకుండునట్లును వారి నందరిని రక్షింపుము. ఓ దేవా! తమ తప్పుల నొప్పుకొనువారి నందరిని క్షమింపుము. మా ప్రభువైన యేసుక్రీస్తునందు మానవులకు చేయబడిన కృపగల వాగ్దత్తముల ప్రకారము నిజముగా మనస్సు మార్చుకొను వారినందరిని తమ నిజస్థితికి తెమ్ము.

కరుణానిధీ, మా పాప స్వభావమునుగూర్చి తెలిసికొని దుఃఖించి మేము శాశ్వతమైన శిక్షకులోనై యుండకుండునట్లును యథార్థమైన పశ్చాత్తాపమును నిజమైన విశ్వాసమును కలిగి నీ యొద్దకు వచ్చునట్లును నీ పరిశుద్ధాత్మవలన మాకు సహాయము చేయుము.

ఓ దేవా! పరలోకపు తండ్రీ! మమ్మును కనికరింపుము.

ఓ దేవా! లోక విమోచకుడవైన కుమారుడా, మమ్మును కనికరింపుము. పరిశుద్ధాత్ముడవైన దేవా! మమ్మును కనికరించి మాకు నీ సమాధాన మనుగ్రహింపుమని క్రీస్తు నామమున వేడుకొను చున్నాము, ఆమేన్.

## క్రీస్తు శ్రమకాలము

### (1)

మిక్కిలి కనికరముగల దేవా! మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రీ, మాకును మనుష్య లందరికిని నీవు దయచేసిన లెక్కింప నశక్యమైన మేళ్లన్నిటి నిమిత్తమును, ముఖ్యముగా నీ ప్రియకుమారుని మా విమోచకునిగ నిచ్చినందుకును, ఆయన శ్రమలను మరణమును మా రక్షణార్థమై ధ్యానించుచు నిన్ను సమీ పింప ననుగ్రహించి నందుకును, నీకు వందనములు చేయు చున్నాము.

ధన్యుడవైన ప్రభుయేసూ! గంభీరమైన భక్తిగల హృదయ ములతో రక్షణకరమైన ప్రేమను మేము జ్ఞప్తికి తెచ్చుకొని అందువలన తగిన లాభమును పొందునట్లు నీ పరిశుద్ధాత్మను మాకు అనుగ్ర హింపుము. మేము పరిశుద్ధమైన కోరికలను, యథార్థమైన పశ్చాత్తా పమును నిర్మలమైన విశ్వాసమును కలిగి నిత్య జీవమును గూర్చిన నిశ్చయమైన నిరీక్షణతో జీవించునట్లు పరలోకమునుండి కృపను పంపి మమ్మును బలపరచుము. నీ నామమునకు యుగయుగములు మహిమ ఘనతలు కలుగునుగాక, ఆమేన్.

### (2)

ప్రభుడవైన ఓ దేవా! ఈ పాపలోకము యెడల నీకున్న గొప్ప కనికరమువలన నీ జనితైక కుమారునిద్వారా మేము జీవించి రక్షణ పొందునట్లు మా యందరికొరకు ఆయనను ప్రేమతో నిచ్చున సర్వశక్తిగల తండ్రీ, నీ ఆశ్చర్యకరమైన కృపకొరకు నీకు వందనములు ఆచరించుచున్నాము. ఆయనద్వార మేము నీయెదుట నీతిగా నుండు

టకు పాపమెరుగని ఆయనను మా కొరకు పాపముగల వానిగా చేసినందుకు నీ నామమును కొనియాడుచున్నాము.

ఓ ప్రభుడవైన క్రీస్తూ! తండ్రియొక్క నిత్యకుమారుడా! మా పాపములకొరకు గాయములు పొంది మా యపరాధముల కొరకు నలగగొట్టబడితివి. మాకు క్షేమార్థమైన శిక్ష నీ మీద మోపబడెను. నీవు పొందిన దెబ్బలచేత మాకు స్వస్థత కలుగుచున్నది. మా మేలు నిమిత్తమై యిష్టపూర్వకముగా నీవు సహించిన దుఃఖముల కొరకును, వేదన కొరకును, నీకు భక్తి పూర్వకమైన వందనములు ఆచరించు చున్నాము. నిన్ను నీవే మాకొరకు సమర్పించుకొంటివి గనుక మమ్మును కరుణించి మాలో నొకరైనను నశింపకుండునట్లు అనుగ్రహింపుము. మేము రక్షకుడవైన నీ తట్టు పూర్తిగ తిరిగి నీకు నిత్యస్తుతి కలుగునట్లు జీవించులాగున నీ పరిశుద్ధాత్మను మా హృదయములలోనికి పంపుము. మేమే పాపములను చేసి నీ కాయాసము గల్గించితిమో వాని నసహ్యించుకొని విడిచిపెట్టుటకును, మాకు బదులుగా నీవు పొందిన శ్రమలను పశ్చాత్తాపముగల హృదయముతో ధ్యానించుటకును, జీవముగల విశ్వాసమువల్ల నీ రక్తముద్వార పాపపరిహారము పొందునట్లు మాకు సహాయము చేయుము. ఓ ప్రభువా! నీతో శ్రమపడుట వలన నీ పరలోక రాజ్యమందు నీతో మహిమ పరచబడుదుమని మా సిలువ నెత్తుకొని నిన్ను వెంబడించునట్లు మాకు సహాయము చేయుము. నీకును, నీతో నుండు తండ్రి పరిశుద్ధాత్మలకును ఘనత మహిమ యుగయుగముల యందు కలుగును గాక, ఆమేన్.

**(3)**

పరిశుద్ధుడవైన ఓ యేసూ! నీ మేళ్లు అపరిమితమైనవి. నీ కనికరములు అగమ్యములు. నీకు చెప్పతరముగాని విచారము కలుగజేసిన మా పాపములను మేము తెలిసికొని, దుఃఖించి పాప క్షమాపణ పొందులాగున మా మీద జాలిపడి మాకు సహాయము చేయుము. నీవు మాకు జామీనుగాను వైద్యుడవుగా నున్నావు గనుక నీ శ్రమవలన కలుగు నీతిలో పాలివారమై మా పాపముల మూలమున వచ్చు దురవస్థనుండి రక్షింపబడు లాగున నీ నీతిలో మమ్ముకప్పి నీ దెబ్బలవలన మమ్ము స్వస్థపర్చుము. ప్రార్థన వినుటకు నీకున్న ఆశక్తిని బట్టి ప్రార్థించు హృదయమును మాలో రేపుము. నీవు కనికరముగల మధ్యవర్తివై యున్నావు గనుక మా ప్రార్థనలయందేమైన కొదువగనున్న

యెడల దానినికూడ మాకు దయచేయుము. కృపగల నీ మధ్యవర్తి త్వముయొక్క మేళ్లను పొందగోరు వారికందరికి సహాయము చేయుము. మా అవసరములను తీర్చు సంరక్షణను నీ శ్రమలవలన సంపాదించిన మేళ్లను మాకు దయచేయుము. యుగయుగముల యందు నీ నామమునకు మహిమ, స్తుతి కలుగునుగాక, ఆమేన్.

మహా శుక్రవారము

పరలోకపు తండ్రియొక్క కృపను దౌర్భాగ్య పాపులమైన మా విషయమై నీ పరిశుద్ధ నిరపరాధ శ్రమ మరణములవలన సంపాదించి మాకు నిత్యజీవమును తిరిగి తెచ్చిన ప్రభుడవైన ఓ యేసుక్రీస్తూ! పాపమందు పడిపోయిన మానవ జాతికి నీవు కనపరచిన గొప్ప ప్రేమ నిమిత్తమును నీకు వందనములు ఆచరించుచున్నాము.

మా పాపములకు రావలసిన శాపమును నీవే భరించితివి. మాకు సమాధానము కలుగునట్లు నీవు శ్రమనొందితివి. మేము విడుదల పొందులాగున నీవు బంధింపబడితివి. మేము నీతిమంతుల ముగా నెంచబడునట్లు నీవు నేరస్థాపన నొంది శిక్షింపబడితివి. మేము ఘనత నొందుటకై నీవు అపహాస్యము నొందితివి. మాకు నీతికిరీటము దొరుకునట్లు ముండ్లకిరీటమును ధరించితివి. మేము రక్షణ వస్త్రములు ధరించునట్లు పరిహాస వస్త్రములను ధరించితివి. మేము నిత్యము జీవించులాగున కఠినమై సిలువ మరణమును పొందితివి. వీని అన్నిటి నిమిత్తము స్తోత్రార్హుడవైన యేసూ, నీకు వందనము.

మాకు బదులుగా ఈ విధమున శ్రమ నొందితివి గనుక, మమ్మును నీవు విమోచించిన జనముగా నెంచి, నిత్యమైన నీ ప్రేమలో మమ్ము కాపాడుమని వేడుకొనుచున్నాము. అంత గొప్ప వేదనను నీకు కలిగించిన మా లోపములను గూర్చి తగినట్లు దుఃఖించునట్లును నీవు దయగల మధ్యవర్తివిగా నున్నందున మాకు లభించిన మేళ్లను మేము కృతజ్ఞతతో గైకొని నిన్ను స్తుతించునట్లును మామీద నీ పరిశుద్ధాత్మను కుమ్మరింపుము. ఓ ప్రభుడవైన యేసూ! మరణ పర్యంతము నీవు చూపిన ప్రేమను బట్టియు సిలువ మ్రానుమీద నీ దేహమునందు నీవు పొందిన బాధలనుబట్టియు మమ్మును కరుణింపుము.

లోకపాపమును తీసివేయు ఓ దేవుని గొర్రె పిల్లా! నీ సిలువను శ్రమలను ధ్యానించుటవలన మా విశ్వాసము బలపడి మా నిరీక్షణ స్థిరపడి, మా హృదయములు

విధేయతను ప్రేమను కనపరచులాగున అనుగ్రహింపుము. మా కష్ట దుఃఖములలో నీ బాధలను జ్ఞప్తికి తెచ్చుకొని మేము ఓరిమిని ఓదార్పును పొందుదుము గాక. మేము నీ నామమును పట్టుదలతో ఒప్పుకొనుచు మా యవసాన కాలమున నీ నిత్యమైన రాజ్యములోనికి చేరులాగున ఈ లోకమందు జీవించునట్లు సహాయముచేయుము.

మమ్మును ప్రేమించి, తన స్వంతరక్తముతో మా పాపములను పరిహరించి తన తండ్రియైన దేవునికి మమ్ము రాజులను గాను యాజకులనుగాను చేసిన ఆయనకు నిత్యరాజ్య మహిమలుండు నుగాక, ఆమేన్.

## ఈస్టరు పండుగ

పరిశుద్ధుడవు, పరిశుద్ధుడవు, పరిశుద్ధుడవు అని కొనియాడ బడు సర్వశక్తిగల దేవా! నిన్న, నేడు, నిరంతరము, ఒక్కటే రీతిగా నుండు ప్రభువా! నీవు పరిశుద్ధతయందు ప్రభావముగల వాడవును, స్తుతులయందు గంభీరుడవును, అద్భుతములు చేయు దేవుడవునై యున్నావు గనుక, మహిమ ఘనత స్తుతులు, నీకు కలుగునుగాక.

మేము సంతోషించి ఆనందించుటకు నీవు ఈ దినము కలుగజేసి నందుకు నీకు మహిమ, ఘనత, కృతజ్ఞతాస్తుతులు కలుగును గాక.

నరావతార మెత్తుటకును, మా పాపములు తీసివేయుట కును, సిలువమీద తనకు తానే బలిగా అర్పించుకొనుటకును, జీవమును అమరత్వమును బైలుపరచుటకును, నమ్మిన వారందరికి పరలోకమును తెరుచుటకును నీ ప్రియపుత్రుడైన యేసుక్రీస్తును ఇచ్చి నందులకు, నీకు మహిమ, ఘనత, కృతజ్ఞతా స్తుతులు కలుగునుగాక.

మేము నీతిమంతులమని తీర్చబడుటకు మా అపరాధముల నిమిత్తము అప్పగింపబడిన యేసును తిరిగి లేపినందున ఆలోచనయందాశ్చర్యకరుడవును, క్రియలయందు కీర్తనీయుడవునైన నీకు మహిమ, ఘనత, కృతజ్ఞతాస్తుతులు కలుగును గాక.

మమ్మును మేము ఏ పొరపాటువలనను పాపము వలనను చెప్ప శక్యముగాని నీ దయకును, కృపకును, అయోగ్యులముగా చేసికొంటిమో వాటిని క్షమింపుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. యేసుక్రీస్తు నొద్దకు మేము ఏ నిరీక్షణతో పిలువబడితిమో దానిని మేము గ్రహించి, మహిమగల తన సువార్తయందు మా పూర్ణ హృదయముతో

ఆనందించునట్లు మా జ్ఞాననేత్రములను కృపతో తెరచి మా బలహీనతలను తొలగింపుము. గొర్రెల గొప్ప కాపరియైన మా ప్రభువగు యేసుక్రీస్తును మృతులలోనుండి తిరిగి తెచ్చితివి గనుక, మృతులలోనుండి లేచిన యేసుక్రీస్తుయొక్క పునరుత్థానమువలన నీ కృపా బాహుళ్యమునుబట్టి జీవముగల నిరీక్షణ మాలో కలుగజేసి, నూతన జీవముగలవారమై ఆయన పవిత్రముగా నున్నలాగున మమ్మును పవిత్రపరచుము.

ఈ బ్రతుకునందు మాకు సంభవించిన శోధనల మధ్యను కష్టముల మధ్యను స్థిరముగాను నిలకడగానుండి, ప్రభువు పనిని నిత్యము ధారాళముగా జరిగించునట్లు ఆయనతోపాటు మమ్ములను సజీవులనుగా జేయుము.

మా రక్షణకర్తయొక్క మరణ పునరుత్థానములద్వార అంధకారశక్తులను పడగొట్టిన ఓ దేవా! అన్యులను ఆయనకు స్వాస్థ్యముగాను భూదిగంతములను ఆయనకు స్వాధీనముగాను చేయుము. దైవభక్తిలేమి, దుర్మార్గత, చెడుగైనది ప్రతిదియు గతించునట్లును, తండ్రియైన దేవునియొక్క మహిమార్థము మనుష్యులందరు యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, ఆయన శత్రువులనందరిని తన పాదముల క్రిందనుంచి సూర్యోదయము మొదలు అస్తమయమువరకు ఆయన దివ్యపరిపాలనను కొనసాగించుము.

ఓ ప్రభువా! దుఃఖములోను ఇబ్బందిలోను ఉన్నవారికిని, అక్రమముగ బాదింపబడువారందరికిని, సత్యముకొరకు శ్రమపడు వారందరికిని, అజ్ఞానమందును పాపభారము క్రిందనున్న వారి కందరికిని, గొప్ప శోధనలకు లోనైనవారికందరికిని, రోగభారముచేత క్రుంగిపోవుచున్న వారి కందరికిని, మరణ భయముచేత పీడింప బడుచున్న వారికందరికిని, నీ కృపను గూర్చి నిరాశపడుచున్న వారికందరికిని, నీ సువార్తవలన కలుగు ఆదరణ సమాధానములను దయచేయుము. మరణ నరకములమీద క్రీస్తుపొందిన జయమువలన కలుగు సంతోషమును నిన్ను నమ్మువారందరును తమ హృదయ ములలో పొంది అనుభవించునట్లు కృపచూపుము.

క్రీస్తు మృతులలోనుండి లేచి నిద్రించువారి ప్రథమ ఫలము ఆయెను గనుక తండ్రియొద్దకు ఆయన ద్వార వచ్చిన వారి నందరిని ఆయన అంతమువరకు రక్షించుటకు శక్తిగలవాడని గ్రహించి, వారందరికొరకు విజ్ఞాపనము చేయుటకు నిత్యము జీవించుచున్నాడని ఎరిగి, మేమందరమును నిత్యమును సంతోషముతో ఎదురు చూచెదముగాక.

పడిపోకుండునట్లు మమ్ము కాపాడుటకును, మహిమగల ఆయన సన్నిధిలో నేరములేని వారివలె మమ్మును పరసంతోషముతో కనపరచుటకును శక్తిగలవాడును మా రక్షకుడును జ్ఞానవంతుడునైన ఏక దేవునికి మహిమ, ఘనత, రాజ్యము, బలము, ఇప్పుడును నిరంతరమును కలుగునుగాక, ఆమేన్.

## ఆరోహణ దినము

సర్వశక్తిగల దేవా! మా ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రీ, నీ ఆధిక్యతనుబట్టియు, మహిమనుబట్టియు, మానవజాతి యెడల నీవు చూపిన ప్రేమ కృపాకృత్యముల విషయమై నిన్ను సేవించి స్తుతించుచున్నాము. మమ్ము విమోచించుటకును పాప మరణముల నుండి మమ్ము రక్షించుటకును నీ పుత్రునిచ్చినందునకు, నీవు వందనములు చెల్లించుచున్నాము. ప్రధానులకును, అధికారులకును పై నామమని చెప్పబడు ప్రతినామమునకు పైగా పరలోకమునకు జయముతో ఆయన ఆరోహించినందుకు నీకు వందనము లాచరించుచున్నాము. మరణమువరకు విధేయత కనపరచిన ఆయనకు కిరీటమును మహిమతో ధరింపజేసి, ఆయనను సంఘము నకు శిరస్సుగా ఉంచి, ఘనతకును సింహాసనమునకును ఆయనను లేవనెత్తినందునకు నిన్ను స్తుతించుచున్నాము. ఆయన మా కొరకు సంపాదించిన గొప్ప జయము నిమిత్తము నిన్ను స్తుతించుచు ఆయనను మహిమగల రాజుగాను, భూలోకమునకు రక్షకునిగాను ఘనపరచి, సేవించుటకు మాకు కృపను దయచేయుమని వేడుకొనుచున్నాము.

మేము తొట్రిల్లకుండ మమ్మునన కాపాడుటకును, నీ మహిమ యెదుట ఆనందముతో నిర్దోషులముగ నిలువబెట్టుటకును శక్తిగల మా రక్షకుడవైన అద్వితీయ దేవా! నీకు మా ప్రభువైన యేసు క్రీస్తుద్వార మహిమయు మహాత్మ్యమును, అధికారమును యుగములకు పూర్వమును, యిప్పుడును సర్వ యుగములకును కలుగునుగాక! ఆమేన్.

ఘనతగల నత్యుడవైన ఓ మహా యాజకుడా! నీవు పరిశుద్ధ పరచిన మార్గముద్వార మేమును నీవు వెళ్లిన చోటునకు వెళ్లి, నీ పరలోక రాజ్యమందు నీతో నిత్యము జీవించులాగున కనికరముగల నీ మధ్యవర్తిత్వమువలన కలిగిన లాభములయందు మాకు పాలు దయచేయుము. మేము నీ చిత్తప్రకారము చేయునట్లును, నీ యాజ్ఞ లకు లోబడి నమ్మకమైన మంచి సేవకులు పొందు బహుమానములు

పొందునట్లును, మమ్ము నీ సత్యముయొక్క సరియైన జ్ఞానమందు నడుపుటకును మేము నీ నామమును మనఃపూర్వకముగా ఒప్పుకొనులాగున మమ్మును బలపరచి నిలువబెట్టుటకును మా బలహీనతలయందు తోడ్పడుటకును, ఆదరణ కర్తయైన నీ పరిశుద్ధాత్మను కృపతో మా కనుగ్రహింపుము.

ఓ దేవా! పనిచేయుచున్న నీ సంఘమును జ్ఞప్తికి దెచ్చుకొనుము. నీ పని భూమిమీద ఎన్నడు క్షీణింపకుండునట్లు, నీ పరము దానములను ఆశీర్వాదములను నీ సంఘము మీదను సంఘములోను ఉంచుము. తగిన కాలమున ప్రతివారికి ఆత్మీయాహారము పెట్టుటకు నమ్మకమయిన బుద్ధిగల గృహనిర్వాహకులగు పనివారిని నీ సేవకు పంపుము.

నీవు ఏర్పరచుకొన్న వారందరు నీ నామము పేరిట కూడునట్లును, ఏర్పరుపబజిన వారి సంఖ్య పూర్తియగునట్లును, పనిజరుపుము. కష్టములలోను, ఆయాసములలోను, బలహినతలలోను ఉన్నవారిని ఆదరింపుము. నీ రక్షణయందలి సంతోషము నెరుగునట్లు పాపమువలనను అపనమ్మకమువలనను బంధింపబడిన వారి నందరిని విడిపింపుము. తండ్రియొక్క దక్షిణ హస్తమున నీవు కూర్చుండియున్న ఆ పై స్థలమందున్న వాటిని అందరు వీక్షించుటకును, నీవు ఉన్నచోటను వారును ఉండునట్లు నీవు నీ జనులను చేర్చుకొనవచ్చు సమయమును నిరీక్షణతో కనిపెట్టుటకును అందరికి సహాయము చేయుమని ప్రభువైన క్రీస్తు పేరిట వేడుకొనుచున్నాము, ఆమేన్.

## పెంతెకొస్తు పండుగ

నిత్యుడవైన సర్వశక్తిగల దేవా! సర్వమును సృష్టించి ఇహపరలోకములయందు వెలుగును ఆనందమును కలుగజేయు ప్రభువా! మానవ రక్షణార్థమై నీవు చేసిన ఆలోచన నెరవేర్చిన్‌దులకు నిన్ను కొనియాడి స్తుతించుచున్నాము. మా రక్షకుడైన క్రీస్తు మా పాపపరిహారమునకై తృప్తికరమైన పనిచేసి మృతులలోనుండి తిరిగి లేచి పరలోకమునకు ఆరోహించినందున ఆయన నిమిత్తము నీ జనులకు క్రొత్తయీవుల ననుగ్రహించి, పరిశుద్ధాత్మను కుమ్మరించుటవలన నీ పరిశుద్ధ సంఘమును స్థిరముగ స్థాపించి నందుకు నీకు వందనములాచరించుచున్నాము. జనులందరిని రక్షించు నీ సత్యము యొక్క రాయబారులుగాను సాక్షులుగాను ఉండుటకు నీ మొదటి శిష్యులకు నీ యాత్మ నిచ్చి, వారిని వెలిగించి పరిశుద్ధపరచినందుకు నీకు వందనములు. మా బలహీనతలయందు మాకు తోడ్పడుటకును, నీ చిత్తమును జరిగించుట కగత్యమైన జ్ఞానమును కృపను

మేము కలిగియుండుటకును, నీ బిడ్డలకున్న మహిమగల స్వేచ్ఛలో స్థిరపడుటకును, నీ పరిశుద్ధాత్మ ముద్రను మాకును దయచేయుము.

పరిశుద్ధాత్మను పంపుదునను వాగ్దత్తము తండ్రినుండి పొంది, దివ్యమైన ఆ వరముతో నాశ్చర్యముగ నీ శిష్యులను నింపి ఆరోహించిన ప్రభుడవైన రక్షకా! మేమును పరిశుద్ధాత్మ శక్తివలన బలము పొంది, సర్వపాపములనుండి పవిత్ర పరుపబడి నీ నామమును ఘనపరచు పూర్ణమైన ఆసక్తిగలవార మగుటకు మాకు ఆత్మను అనుగ్రహింపుము. మేము నీ నామమును ఘనపరచి నీతో నిత్యమైన మహిమ గలిగి జీవించునట్లు నీ స్వరూపమును మా కనుగ్రహింపుము.

తండ్రి కుమారులనుండి బైలుదేరు పరిశుద్ధాత్మా! నేడు నీ ప్రేమయు శక్తియుగల కార్యమును మాయందు సంపూర్ణముచేసి మాతో నిత్యము నివసించుము. క్రీస్తుయొక్క సంగతులను మాకు తేటపరుపుము. మాలో నిజమైన విశ్వాసమును ఆనందకరమైన నిరీక్షను తీవ్రమైన ప్రేమను వృద్ధిచేయుము. మమ్ములను నీవు నివసించు ఆలయములనుగా చేయుము. మా దేహమును ఆత్మను మనస్సును పరిపూర్ణముగా శుద్ధిచేయుము. ఈ లోకమందు మాకు కలుగు కష్టము లన్నిటియందు మమ్ము నాదరింపుము. మేము పూర్తిగా విమోచింపబడు దినమువరకు మా స్వాస్థ్యమునకు ముద్రగాను సంచకరవుగాను ఉండుము.

తండ్రి కుమార పరిశుద్ధాత్మలను నిత్యైక దేవునికి యుగ యుగములు మహిమ స్తుతులన్నియు కలుగును గాక, ఆమేన్.

## త్రిత్వకాలము-త్రిత్వాదివారము

మేము గ్రహింపజాలని తేజస్సునందు నివసించుచు మేము కనుగొనలేని స్వభావ లక్షణములను, మా జ్ఞానమునకు మించిన ఆలోచనలను గలవాడవైనను, మేము నిన్ను తెలిసికొని, ఆరాధించి స్తుతించునట్లు నీ మహిమను మాకు బయలుపరచినావు.

పరభూలోకములకు ప్రభుడవయిన దేవా! మాకు నీ స్థితిని నీ సుగుణములను తెలియపరచి, ఇకముందు పరలోకములోని శాశ్వతమయిన వెలుగునందును ఆనందమునందును నిన్ను వీక్షించుటకును నిరీక్షణ గలిగించిఉనందుకు నీకు వందనములు.

ఓ సర్వశకితగల తండ్రీ! దృశ్యాదృశ్యములైన వాని కన్నిటికిని సృష్టికర్తవును సంరక్షకుడవును పరిపాలకుడవునై యున్నందులకు నిన్ను స్తుతించి ఆరాధించుచున్నాము. మేము నీ యాజ్ఞలకు లోబడు మనస్సు గలవారమై నీ పరిశుద్ధమైన ప్రత్యక్షతవలన కలిగిన వెలుగునందు నీ యెదుట మేము నడుచులాగున నిన్ను గూర్చియు నీవు పంపిన యేసుక్రీస్తును గూర్చియు సరియైన జ్ఞానమును మాకు దయచేయుము.

తండ్రియొక్క నిత్య కుమారుడా! శిక్షావిధి నుండియు నిత్య మరణమునుండియు, నీ రక్తముచేత మమ్ము విడిపించినందులకు నిన్ను స్తుతించుచున్నాము. నీవు మృతులలోనుండి లేచి నిరంతరము జీవించుచు ఏలుచు నుండుటనుబట్టి, మేము నీ నమ్మకమయిన ప్రేమగల జనులమైయుండి, నిత్యమయిన నీతితోను నిర్దోషత్వము తోను ధన్యతతోను నిన్ను సేవించు నిమిత్తము మమ్మును నీ వారినిగా అంగీకరించి, మేము తండ్రి చిత్తము పూర్తిగా నెరవేర్చునట్లు సహాయము చేయుమని నిన్ను ప్రార్థించుచున్నాము.

తండ్రి కుమారులనుండి బయలుదేరు ఓ పరిశుద్ధాత్మా! వెలిగించువాడా! ఆదరణకర్తా! ఆలోచలపరుడా! యేసుక్రీస్తు రక్తము వలన విడిపింపబడినవారి కందరికి తెరవు చూపువాడా! సువార్తద్వార మమ్మును పిలిచి నిత్యజీవము కొరకు మాకు ఆశను నిరీక్షణను కలిగించినందులకు నిన్ను స్తుతించుచున్నాము. క్రైస్తవ సంఘము ఘనముగాను, నిష్కళంకముగాను ముడుతయైనను మరి యేదైనను లేకుండునట్లు దాని నంతటిని వెలిగించి పరిశుద్ధపరచి యేసుక్రీస్తు కొరకు కాపాడుటనుబట్టి మమ్మును కూడ నిజమయిన విశ్వాసమందు కాపాడి స్థిరపరచి ఓదార్చుచుండుమని నిన్ను వేడుకొనుచున్నాము.

నిత్యము ముగ్గురుగాను నిత్యము ఒక్కడుగాను ఉన్న తండ్రి కుమార పరిశుద్ధాత్మలగు ప్రభువైన ఓ దేవా! నీవే దేవుడవు. ఆరాధన యావత్తును నీదై యున్నది. గనుక నిన్ను మా పూర్ణ హృదయముతోను, పూర్ణ మనస్సుతోను, పూర్ణాత్మతోను, పూర్ణ శక్తితోను, స్తుతించి ఆరాధించుచున్నాము. మా ఆరాధనను అంగీకరించి మా ప్రార్థనలను దయతో ఆలకింపుము. నీ పరిశుద్ధ క్రైస్తవ సంఘమను మొక్కను భూమిమీద నాటితివి గనుక దానిని కాపాడి వృద్ధిచేసి మహాశక్తిగల నీ పనిచేత దానిని పూర్తిచేసి, దానికి మేలును సకలాభివృద్ధియు కలుగునట్లు సమస్తమును పరిపాలింపుము. ఈ చీకటి లోకమందు అది నీ బంగారు దీపముగా నుండునట్లు రక్షణకరమైన నీ కృపతో నీ

సంఘమందు నివసించుము. నమ్మువారందరు రక్షింపబడులాగున సత్యమును నిత్యము కాపాడుము. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలగు సత్యైక దేవా! తరతరముల పర్యంతము ఆరాధన, రాజ్యము నీవైయుండు గాక, ఆమేన్.

## అపోస్తలులయొక్కయు, పరిశుద్ధులయొక్కయు పండుగ

ఓ దేవా! మనుష్యులందరి ఆత్మలయొక్క నాథా! అబ్రాహాము ఇస్సాకు యాకోబుల దేవా! నీతి మంతుడైన హేబేలును, పరిశుద్ధ హతసాక్షులందరును చిందించిన రక్తము జ్ఞప్తియందుంచుకొనిన వాడా! నీ సత్యమును గూర్చియు కార్యములను గూర్చియు, సాక్ష్యమిచ్చుటకు ఆదినుండి పని వారిని లేవనెత్తుచున్నందుకు, నీ మహిమగల నామమును కొనియాడి నీకు హృదయ పూర్వకమైన వందనములు ఆచరించుచున్నాము. నీవు పితరులకు వాగ్దత్తములనిచ్చి వాటిని నమ్ముటకు కృపననుగ్రహించినందుకు నిన్ను స్తుతించుచున్నాము. పూర్వకాలపు ప్రవక్తల కొరకును, వారిలో గొప్పవాడును క్రీస్తుయొక్క నమ్మకమైన రాయబారియునైన వానికొరకు, నీకు వందనము లాచరించుచున్నాము. మా ప్రభువుయొక్క తల్లియగుటకు, స్త్రీలలో ఆశీర్వదింపబడిన కన్యమరియకు కనపరచిన కృప నిమిత్తము నీకు వందనము లాచరించుచున్నాము. నీవు మా కనుగ్రహించిన అపోస్తలుల కొరకును, హతసాక్షుల కొరకును, సువార్తికుల కొరకును, బోధకుల కొరకును, ఉపాధ్యాయుల కొరకును, సంఘస్థుల కొరకును, నిన్ను ఒప్పుకొనిన వారందరి కొరకును, కృతజ్ఞతలు ఆచరించు చున్నాము. వారి కాలమందును తరమునందును నిన్ను ఎవరు నమ్మకముగా సేవించిరో, ఎవరి కష్టముల ఫలితము మేమనుభవించు చున్నామో, వారందరి కొరకు నిన్ను స్తుతించుచున్నాము. మరణము నొంది నీయందు విశ్రాంతి నొందిన వారందరి కొరకును, భూమిమీద జీవించుచున్న నీ పరిశుద్ధులందరి కొరకును, నీకు కృతజ్ఞతలు ఆచరించుచున్నాము. మేము వారి విశ్వాసమందు పాలివారమై యుండుటకు వారి మంచి మాదిరి నవలంబించుటకును, మేము జీవించునంతకాలము నిన్ను నమ్మకముగ సేవించుటకును, నిన్ను గూర్చి సాక్ష్యమిచ్చుటకై మరణ పర్యంతము సిద్ధముగా నుండుటకును మాకు కృప ననుగ్రహింపుమని నిత్యము మహిమగల మా విమోచ కుడైన యేసుక్రీస్తు ద్వార నిన్ను బ్రతిమాలుచున్నాము.

ఓ దేవా! నీ కుమారుడును మా ప్రభువునైన క్రీస్తు మూలమున మా ప్రార్థన నాలకింపుము. నీతోను పరిశుద్ధాత్మతోను ఏక దేవుడైన ఆయనకు నిత్యము మహిమ కలుగునుగాక, ఆమేన్.

## కృతజ్ఞతార్పణల పండుగ

మంచి యీవుల కన్నిటికి మూలకారకుడవైన సర్వశక్తిగల దేవా! నీ వెల్లప్పుడును మాకు దయచేయుచున్న లెక్కింప శక్యముగాని మేళ్లన్నిటినిగూర్చి నీకు కృతజ్ఞత నాచరించుచున్నాము. బోధింపబడిన నీ వాక్యము కొరకును, నీ ఆలయమునందు లభించు మేళ్లన్నిటి నిమిత్తము నిన్ను స్తుతించుచున్నాము. భూమి నిలిచియున్నంతవరకు వెదకాలమును, కోత కాలమును, శీతోష్ణములనును, వసంత శీతాకాలములును, దివారాత్రములును ఉండక మానవను నీ స్థిరమైన వాగ్దత్తమునకై, నీకు వందనములు ఆచరించుచున్నాము. భూమి నీది; నీవే దానిని ఫలింపజేయుచున్నావు. వర్షమును, ఎండను వాని కాలమున నిచ్చుచున్నావు. నీటిబుగ్గలను లోయలోనికి పంపుచున్నావు. వాని ప్రవాహములు పర్వతములలో ప్రవహించుచున్నవి. పశువుల కొరకు కూరగాయలు పండునట్లును, చేయుచున్నావు.

విత్తువానికి విత్తనము లుండునట్లును, తినువానికి ఆహారము కలుగునట్లును, నాగటి చాలును వర్షముచేత మెత్తపరచుచు అందు మొలకలు పెరుగునట్లును దీవించుచున్నావు. పచ్చిక బయళ్లను పశువుల మందలతో నింపి, భూమిని ధాన్యాదులతోను ద్రాక్షావల్లుల తోను క్రమ్ముచున్నావు. భూమిని ఫలవంతముగాను సంవత్సరమును శుభకరమైనదిగాను చేయుచున్నావు.

ఓ దేవా! మేమనర్హులమును, పాపులము నైనప్పటికిని మాకు సమృద్ధిగా నీవు దయతేసిన భూమిమీది పంటలను సమకూర్చుకొన నిచ్చితివి. కనుక మేము మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వార నిన్ను స్తుతించి, కొనియాడి, ఆరాధించుచు నీ నామమును మహిమ పరచుచున్నాము. మాయందు కనికరముంచి, మమ్ములనందరిని నీ ఘనతా మహిమల నిమిత్తమై పరిశుద్ధ పరుపుమని, నిన్ను వినయముతో వేడుకొనుచున్నాము. పేదల కాహారము తక్కువ కాకుండునట్లును నీ సంఘమునకు ఏదియు కొదువ కాకుండునట్లును, మేము యుక్తనైనది చేసి మాకు కలిగిన దానిలో భాగమునిచ్చు బుద్ధి మాలో పుట్టించుము. ఓ ప్రభువా! మాలో సత్కార్యమను పంట ఫలించునట్లు మా

కవసరమైన దానిని ముఖ్యముగా నీ పరిశుద్ధ వాక్య సంస్కారములను, మాకు సమృద్ధిగా దయచేయుము. లోకము యొక్క కోతకాలము వచ్చునప్పుడు, నిత్య మహిమయందు మేము నీ భక్తులతో తిని త్రాగునట్లు, మమ్మును నీ కృపవలన నీ పరలోక రాజ్యములోనికి చేర్చుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వార వేడుకొనుచున్నాము. నీతోను పరిశుద్ధాత్మతోను నిత్యము ఏకదేవుడైన ఆయనకు స్తుతి, ఆరాధన, రాజ్యము యుగయుగములవరకు కలుగునుగాక, ఆమేన్.

## దీనత్వము కనపరచు దినము

*భస్మ బుధవారమున వాడదగును*

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! మా కర్తా! న్యాయాధిపతీ! నీవు పరిశుద్ధుడవు. మే మపరిశుద్ధులము; నీవు నీతిమంతుడవు. మేము నీతి రహితులము. పాపములో గర్భమున ధరించబడి పుట్టి, తప్పిపోయిన గొర్రెలవలె నీ మార్గమునుండి తప్పిపోతిమి, నీ యాజ్ఞలను మీరితిమి; నీ మాట వినమైతిమి; నీ కృపగల ఆత్మకు విరోధముగా నడిచితిమి; అనేకమైన మా అపరాధముల వలన నీ యాగ్రహమును రేపి, నిత్యమయిన దండనకు పాత్రులమైతిమి. మా పాపముల నొప్పుకొని దుఃఖించుచు, ఘోర పాపులమైన మమ్ము కరుణించుమని తండ్రివైన నిన్ను నిండుమనస్సుతో వేడుకొనుచు, మా దుష్ప్రవర్తనకై పూర్ణమైన విధేయతతో నీ పాదములయొద్ద సాగిల పడుచున్నాము.

ప్రభుడవైన దేవా! ఆపదలయందుండి దుఃఖించి పశ్చాత్తాప పడువారిని నీవు నిత్యము కనికరించుచున్నావు. మా పూర్వకులు నిన్ను నమ్మిరి. వారి మనవులను వింటివి. వారు నీకు మొరబెట్టగా, నీవు వారిని తమ కష్టములనుండి విడిపించితివి గనుక నీ కృపనుబట్టి మమ్మును కరుణింపుము. నీవు మా తండ్రివి కావా? నీ ప్రియ కుమారుడు మా యపరాధములను భరించి, మా కొరకు దుఃఖముల పాలాయెను గదా! మేము నీకు భయపడునట్లు నీ యొద్ద క్షమాపణ ఉన్నది గదా! మా మధ్యవర్తియు ఉత్తరవాదియునైన నీతిగల యేసు క్రీస్తుయొక్క ఘోరమైన శ్రమ మరణముల నిమిత్తము మామీద కనికరముంచుమని నిన్ను వేడుకొనుచున్నాము.

ఓ దేవా! మేము నీ కొరకు బ్రతుకుటకును, మా యాత్మలు జీవించుటకు, నిజమైన పశ్చాత్తాపము మా కనుగ్రహింపుము. మేము మా పాపములవల్ల తెచ్చుకొనిన దండనలనుండి కరుణతో మమ్ము తప్పించి, సర్వశక్తిగల నీ హస్తము క్రింద మమ్ము

మేము తగ్గించు కొనుచు, పరిశుద్ధమైన నిర్మలత్వముగల బ్రతుకుతో నిన్నిక మీదట సేవించునట్లు, కృప ననుగ్రహింపుమని నిన్ను బ్రతిమాలు కొనుచున్నాము. ఎల్ల కాలముల యందును నీవు మాత్రమే మా ఆశ్రయమును విమోచకుడవునని నిన్ను నిజముగా నమ్మునట్లు మా విశ్వాసమును వృద్ధిచేసి బలపరచుము. ఈ చివరి దుర్దినములయొక్క అంధకారమును, మాంద్యమును మేము పోగొట్టు కొనలాగున, నూతనపర్చి జీవింప జేయు నీ పరిశుద్ధాత్మయొక్క వెలుగుతో మా హృదయములలో ప్రకాశించుము. దివ్యమైన సువార్తయెడల మేము కనబరుచు అలక్ష్యము తొలగించి సైతానుయొక్క చిక్కులయందు పడకుండునట్లు మెళుకువపడి ప్రార్థించులాగున నడిపింపు. నీ నామమును బట్టి పిలుచు వారందరు నీయందలి సమాధానమును పొంది వారికి కలుగునట్టిగాని, వారు భయపడునట్టిగాని, పాపములవల్ల క్రుంగిపోకుండునట్లు వారి కందరికి సహాయముచేసి వారిని ఆశీర్వదించుము. నీ సంఘమును, నీ వాక్యముయొక్క నమ్మకమైన బోధను, నిలువబెట్టి వృద్ధిచేయుము. దుర్మార్గులు చేయు చెడ్డ ప్రయత్నము లన్నిటిని నిష్ఫలముజేసి, నీ పరిశుద్ధ సత్యమును గూర్చి దూషణలు పరుగు వారి నోరు మూయించుము. సమాధానమును, అభివృద్ధియును, నిత్యము మా స్వాస్థ్యముగా నుండునట్లు, నీతి పరిపాలనను నిలువబెట్టుము. మేము ఈ కష్ట దుఃఖముల లోయలోనుండగా నీ కృప మెండుగా దయచేయుము. పరిశుద్ధాత్మయొక్క ఓర్పువల్ల మాకు సంతోషమును ఆదలణయును కలిగించుము. నీ పిలుపు వచ్చు సమయమున త్రియేక దేవుడవైన నీకు మేము వందనములు స్తుతులు చెల్లించుచు సంతోషముతో నీ సన్నిధిని చేరునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## మతోద్ధారణ పండుగ

సర్వశక్తిగల దేవా! మా పరలోకపు తండ్రీ! నీవు నీ సంఘమును ఇహమందు స్థాపించినందున, దానికి విరోధముగా నరకముయొక్క ద్వారములు ప్రబలకుండునట్లు చేసినందుకును నీకు వందనములు ఆచరించుచున్నాము. అది క్షీణించు సమయమున దానిని నిలువబెట్టినందులకు నీకు కృతజ్ఞతలు ఆచరించుచున్నాము. శత్రువులు జలప్రవాహమువలె వచ్చినప్పుడు వారికి ప్రతీకారము చేసితివి.

నీవు మా పూర్వీకులకు చూపిన కృపకొరకును, నీ రక్షణతో వారిని దర్శించినందుకును, వారియందు నీ శక్తిని నమ్మకమును కనపరచినందుకును, వారు కష్టపడి చేసిన సేవద్వారా నీ నామమును మహిమపరచినందుకును, నశించి పోవుచున్న నీ మందకు పవిత్రమైన వాక్యమును, సంస్కారమును తిరిగి తెచ్చినందుకును, నీకు వందనము లాచరించుచున్నాము. శుభకరమైన నీ సువార్త కొరకును పాపక్షమాపణ, కృపనుబట్టి నీతిమంతులమని తీర్చబడుట, నిత్యజీవము మొదలగునవి యేసుక్రీస్తునందలి విశ్వాసము ద్వారా కలుగునని మాకు తేటపరచినందునకును, నీకు వందనములు ఆచరించుచున్నాము.

నీవు మాకు దయచేయు అనేక మేళ్ల కొరకును, కృపకొరకును ముఖ్యముగా మా యాత్మల రక్షణార్థమై నీవు కృపతో చేసిన ఏర్పాటుల కొరకును, నీకు వందనములు ఆచరించుచున్నాము. మేమును, మా వెనుకవచ్చు తరమువారును, నీవు నీ కుమారుని రక్తము ద్వారా ఆయత్త పరచిన సంపూర్ణమైన విమోచనమునకై నిన్ను స్తుతించునట్లు కృప దయచేయుము.

నీ వాక్యమును సరిగా తెలిసికొని గ్రహించునట్లు, నీ సంఘమును కనికరముతో కాపాడుము. పొరబాటులనుండియు, లౌకికము నుండియు, మత భేదము నుండియు, దానిని కాపాడుటకు నీ పరిశుద్ధాత్మను దానిలో నివసింపనిమ్ము. నీ సేవకులకు రక్షణ యను వస్త్రము ధరింపజేసి, నీ సత్యమును పరిశుద్ధాత్మతోను బలముతోను బోధించువారి సంఖ్యను హెచ్చుజేయుము. నీ పరిశుద్ధమైన పనికి పిలువబడినవారు నమ్మకముగా నుండునట్లును, నీవు వారికిచ్చిన స్వేచ్ఛయందు స్థిరముగ నిలుచునట్లును, వారి ప్రమాణములను ప్రార్థనలను పరిచర్యను వృద్ధిచేయుము.

రాజులరాజా! సంఘముయొక్క అద్వితీయ శిరస్సా, ఈ దేశమును ఇతర దేశములను నీ కృపా సన్నిధివలన కలుగు నూతన జీవముతో దర్శించుము. ఏడు దేవాత్మలు కలవాడా! నీ అపోస్తులుల యొక్కయు, నిన్ను ఒప్పుకొనిన వారియొక్కయు విశ్వాసమును భక్తియు అవసరముగల యీ మా దినములయందు తిరిగి వృద్ధియగునట్లు, నీ సింహాసనమునుండి నూతనమైన బాప్తిస్మముతో నిన్ను అంగీకరించు వారందరి మీదదిగుము. బంగారు దీపస్తంభముల మధ్య నడుచుచు దక్షిణ హస్తమందు నక్షత్రములు గలవాడా! నీ ఆలయమును శుద్ధి చేయుటకును, నిత్యము వెలుగునట్టి నీ దీపములను

పరిశుద్ధమైన నూనెతో నింపుటకును, నీ వేర్పరుచుకొనిన వారిని లేవదీసి పంపుము. నీ వెలుగును నీ సత్యమును వెడలునట్లుచేసి అపనమ్మకమను చీకటిని, అజ్ఞానమును, అసత్యమును లయము చేయుము. నీ వాక్యము బంధింపబడక వేగముగాను ధారాళముగాను వ్యాపించి మహిమ పరచబడులాగున దానికి ఉన్న అడ్డులను ఆటంకములు తీసివేయుము.

పరభూలోకములందు సర్వాధికారీ! రాజా! వస్త్రములను ధరించి ప్రపంచమంతయు నీ మహిమతో శీఘ్రముగా నిండునట్లు, సర్వశక్తిగల నీ తండ్రి నీకు ఇచ్చిన నిరంకుశమైన దండమువహించి రమ్ము. ఓ దేవా, నీవు నీ రాజ్య వైభవముతో వచ్చునపుడు మేము నీ దృష్టికి నమ్మకమును, విశ్వాసమునుగల సేవకులముగానుండి, నీ రాజ్యానందము పొందులాగున పరిశుద్ధాత్మయొక్క నూతనమైన శక్తితోను నిన్ను ఒప్పుకొను వారందరికి చురుకుదనము పుట్టింపుమని తండ్రితో పరిశుద్ధాత్మతోను తరతరములు జీవించుచు నేలుచునుండు నిత్యైక దేవా! నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## దేశీయకృతజ్ఞత

సర్వశక్తిగల దేవా! దృశ్యాదృశ్యములైన వాటి నన్నిటిని కాపాడు ప్రభువా! నీ పోషణ వలననే మేము జీవించుచున్నాము. నీ కృపవలననే మేము సుఖముగా నున్నాము. నీవు సమృద్ధిగా మాకు దయతేసిన యిహ పరలోక సంబంధమైన లెక్కలేని మేళ్లకై నిన్ను స్తుతించుటకు నీ సన్నిధికి వచ్చుచున్నాము.

దూతకంటె మమ్మును కొంచెమె తక్కువ చేసినందుకును నిన్ను గ్రహించి ప్రేమించి, నీయందు నిత్యము ఆనందించు శక్తులు మాకుండునట్లు మమ్ము సృష్టించి నందుకును, నీకు వందనములు ఆచరించుచున్నాము.

నీ దివ్యమైన దూరదృష్టివలన మాకు కలిగిన కనికరముల కొరకును ఈవుల కొరకును, మా జీవయాత్రయందలియన్ని యవస్థలయందు మమ్ము నిలువబెట్టి సంతోషపరచు సదుపాయము లన్నిటికొరకును, సౌఖ్యముల కొరకును, నీకు వందనములు ఆచరించుచున్నాము.

శిక్షా విధినుండియు, నిత్య మరణమునుండియు మమ్ము తప్పించునట్లు నీ ప్రియ కుమారుడు చేసిన కార్యము కొరకును, ఆయన రక్తముద్వారా కలిగిన విమోచనము

కొరకును, పాప క్షమాపణ కొరకును, నిత్యజీవము దొరుకు ఏర్పాటుల కొరకును, నిరీక్షణ కొరకును, నీకు వందనములు ఆచరించుచున్నాము.

మేము ఏ దేశమందు జీవించుటకు మాకు హక్కును దయచేసితివో; దేనియందు నదులును, జలదారులును, తటాక ములును, లోచలును, గిరులునున్నవో, ఎచ్చటను వరి, జొన్నలు, కాయధాన్యములు, గోధుమలు, కాఫీ, తేయాకు, ఫల వృక్షములు ఫలించుచున్నవో; ఎచ్చట సమృద్ధియైన ఆహారమున్నతో; ఏ దేశమందు ఇనుము బంగారము నేలబొగ్గు ఇతర లోహములు దొరుకుచున్నవో; నమ్ము ప్రతివాడును రక్షణ పొందుటకు ఏ దేశమున నీ యాలయమును కట్టించి శుభకరమైన నీ సువార్తయొక్క వెలుగును పంపితివో; ఆ మా దేశము కొరకు నీకు వందనము లాచరించు చున్నాము.

నీ జనులు జీవించి వర్థిల్లుటకును, వారు నీ వాక్య ప్రకారము నిన్ను ఆరాధించి సేవించుటకును, వారిని ఎవరును బాధించి భయపెట్టకుండ యుక్తమైన చట్టములను న్యాయమైన పరిపాలనను దయచేసినందుకు నీకు వందనములు ఆచరించుచున్నాము.

మా శ్రమలయందు నీవు నీ దయగల హస్తములతో మమ్ము కాచినందుకును, మేము పొందవలసిన న్యాయతీర్పులను నీవు ప్రేమ పూర్వకముగా తొలగించి, మా దుః ఖములన్నిటియందును, వ్యాధుల యందును, విచారములయందును, దుర్దశలయందును, ఘోరమైన శోధనలయందును, మమ్మును దిక్కులేని వారినిగా విడిచిపెట్టక మాకు తోడైయుండినందుకును, మా లెక్కలేని పాపములనుబట్టి నీ గ్రంథము నుండి మా నామము తుడిచి వేయనందుకును, నీకు వందనములు ఆచరించుచున్నాము.

ఓ దేవా! మా కొరకు గొప్ప కార్యములను జేసియున్నావు; వాటికొరకు అపరిమితమైన కృతజ్ఞతను, ప్రేమను నీకు అచ్చియున్నాము. పూర్వము మా పెద్దల కాలములో నీవు చేసిన మహా కార్యములనుగూర్చి వారు మాతో చెప్పిరి. మా చెవులార వింటిమి. వారి తరతరముల పిల్లలందరకును నీ కృపను తెంపులేక చూపుచుండుమని నిన్ను వినయముతో వేడుకొనుచున్నాము.

ఈ హిందూ దేశము మీద నీ ప్రేమ ముఖ్యముగా కనపరచుము. మహిమతో మా మధ్య నివసింపుము. కనికరమును, సత్యమును, నీతి, సమాధానములను, మాకు నిత్యమైన స్వాస్థ్యముగా ఉంచుము. మా రాష్ట్రపతియు, ప్రధానమంత్రియు, దేశనాయకులును విధులను నీకు జవాబుదారులుగా చేయునట్లు వారికి శక్తినిమ్ము.

మా రాజ్య సభవారికిని, మా లోక్‌సభవారికిని ఆలోచన నిమ్ము. నాధులై పరిపాలన చేయువారి అందరి నేత్రములకు వివేకమును మరుగు కాకుండునట్లు చేయుము. వృద్ధులలోనుండి ఆలోచన శక్తి తీసివేయకుము. ధనికులు, కఠినహృదయులును కృతఘ్నులును నిర్దయులును కాకుండునట్లును, అస్థిరమైన ధనమునందు ఆనుకొన కుండునట్లును వారిని కాపాడుము. పేదలు నీకు వ్యతిరిక్తముగ ప్రవర్తింపకుండునట్లు వారికి సహ్యాముచేసి వారి విశ్వాసమును గొప్ప చేయుము. ఎవరి నెరుగుట నిత్యజీవమై యున్నదో అట్టివాడవైన నిన్ను అందరు తెలిసికొనునట్లు నీ పరిశుద్ధ వాక్యము యొక్క బోధను, కాపాడి ఆశీర్వదించుము.

ఓ దేవా! యీ మా స్తుతులను, మనవుల నంగీకరించుము. మా పాపములను క్షమించుము. మా లోపములను తొలగించుము. తుదకు నీ పరలోక రాజ్యములోనికి మమ్ము చేర్చుకొనుమని నీతోను పరిశుద్ధాత్మతోను నిత్యైక దేవుడుగా యుగాంతములవరకు జీవించుచు ఏలుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

# బాప్తిస్మ క్రమము

*బాప్తిస్మము బహిరంగ ఆరాధన సమయమున ఆచరింపవలయును. అవసరమున్న యెడల ఏకాంతముగాను ఆచరింపవచ్చును గాని, దానిగూర్చి తరువాత బహిరంగముగా ప్రకటింపవలెను.*

*తమ బిడ్డలకు బాప్తిస్మ మిప్పించుటలో ఆలస్యము చేయకుండునట్లు తల్లిదండ్రు లను ప్రేరేపింపవలెను*

*తల్లిదండ్రుల పేర్లు, జ్ఞానతల్లిదండ్రుల (లేక జవాబుదారుల) పేర్లు బిడ్డ పేరు, అతని లేక ఆమె పుట్టుకతేది, పుట్టిన స్థలము, బాప్తిస్మముపొందిన స్థలముల పేర్లతో కూడ సంఘ రిజిస్టరులో నెక్కించి తగిన యోగ్యతా పత్రిక నియ్యవలెను.*

*సంఘములోని సభికులు మాత్రమే జ్ఞాన తల్లిదండ్రులు (జవాబు దారులు)గా నుండవచ్చును.*

*ఆరాధన సమయమున బాప్తిస్మ మిచ్చినయెడల విశ్వాస ప్రమాణమునకు లేక ముఖ్య ప్రార్థనకు పిమ్మట ఈ క్రింది క్రమమును వాడవచ్చును.*

*సాయంకాలపు ఆరాధన సమయమున బాప్తిస్మ మిచ్చిన యెడల పాఠములకు లేక ప్రసంగమునకు పిమ్మట ఈ క్రమమును వాడవచ్చును.*

*ప్రత్యేకముగ నేర్పాటు చేయబడిన ఆరాధనయందు బాప్తిస్మ మిచ్చిన యెడల ఒక కీర్తన పాడిన పిమ్మట ఈ క్రమమును వాడవచ్చును.*

*పెద్దవారెవరైన క్రీస్తునందు తమకుగల విశ్వాసము నొప్పుకొని పరిశుద్ధ బాప్తిస్మము పొందగోరిన యెడల వారికి చిన్న ప్రశ్నోత్తరిలో నున్న రీతిగా క్రైస్తవ విశ్వాసమునుగూర్చి బోధింపవలెను.*

బో:– తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

బో:– మిక్కిలి ప్రియులారా! మనుష్యులందరు పాపమునందు గర్భమున ధరింపబడి పుట్టుచున్నారు గనుకను, తలంపు వలనను, మాటవలనను, క్రియవలనను దేవుని పరిశుద్ధ చట్టమును మీరుచున్నారు గనుకను, ఒకడు నీటిమూలము గాను, ఆత్మమూలముగాను జన్మించితేనే గ్నఇ దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని మన రక్షకుడైన యేసుక్రీస్తు చెప్పి యున్నాడు గనుకను (ఈయనను, ఈమెను, వీరిని) దేవుడు తన దయాదాక్షిణ్యములవలన బాప్తిస్మము మూలముగా విమోచకుని సంఘములోనికి చేర్చుకొని దనిలో జీవముగల అవయవము(లు)గ చేయునట్లు మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవుని వేడుకొనవలయునని మిమ్మును బ్రతిమాలు చున్నాను.

బో:– ప్రార్థింతము.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రీ! మేము ఈ నీ బద్ద(ల) నిమిత్తము నీ యొద్దకువచ్చి పునర్జన్మ సంబంధమైన స్నానముద్వారా

(ఈయనకు, ఈమెకు, వీరికి) నీ బాప్తిస్మ వర ప్రసాదమును, నీ నిత్య కృపను అనుగ్రహింపవలెనని నిన్ను బ్రతిమాలి వేడుకనుచున్నాము. ఓ ప్రభువా! అడుగుడి మీ కియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తియ్యబడునని నీ ప్రియ కుమారుని ద్వారా నీవు వాగ్దానము చేసియున్నావు గనుక ఈ బిడ్డ(ల)ను, నీ బిడ్డ(ల)నుగా అంగీకరింపుమని ఆ యేసుక్రీస్తుద్వారానే వేడు కొనుచున్నాము, ఆమేన్.

బో:- పరిశుద్ధ సువార్త వాక్యము వినుడి.

*పిల్లలకు:*

తమ చిన్న పిల్లలను ముట్టవలెనని కొందరాయన యొద్దకు వారిని తీసికొని వచ్చిరి; అయితే శిష్యులు ఆ పిల్లలను తీసికొని వచ్చిన వారిని గద్దించిరి. యేసు అది చూచి కోపపడి-చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి, వారి నాటంక పరచవద్దు; దేవుని రాజ్యము ఈలాటివారిదే. చిన్న పిల్లలవలె దేవుని రాజ్యము నంగీకరింపనివాడు అందులో ప్రవేశింపడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని చెప్పి ఆ పిల్లలను ఎత్తి కౌగలించుకొని వారిమీద చేతులుంచి ఆశీర్వ దించెను.

*పెద్దలకు:*

యూదుల అధికారియైన నికొదేమను పరిసయ్యు డొకడుండెను. అతడు రాత్రియందు ఆయన యొద్దకువచ్చి బోధకుడా, నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము. దేవుడతనికి తోడై యుంటేనేగాని నీవు చేయుచున్న సూచకక్రియలను ఎవడును చేయలేడని ఆయనతో చెప్పెను. అందుకు యేసు అతనితో-ఒకడు క్రొత్తగా జన్మించితేనేగాని దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు నికొదేము-ముసలి వాడైన మనుష్యుడేలాగు జన్మింపగలడు? రెండవ మారు తల్లి గర్భమందు ప్రవేశించి జన్మింపగలడా? అని ఆయన నడుగగా యేసు యిట్లనెను: ఒకడు నీటిమూలముగాను ఆత్మ మూలముగాను జన్మించితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశింప లేడని నీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. శరీర మూలముగా జన్మించినది శరీరమును, ఆత్మమూలముగా జన్మించినది ఆత్మయునైయున్నది. మీరు క్రొత్తగా జన్మింపవలెనని నేను నీతో చెప్పినందుకు ఆశ్చర్య పడవద్దు. గాలి తన కిష్టమైన చోటను విసురును. నీవు దాని శబ్దము విందువేగాని, అది ఎక్కడనుండి వచ్చునో యెక్కడికి పోవునో నీకు తెలియదు. ఆత్మమూలముగా జన్మించిన ప్రతివాడును ఆలాగే యున్నాడనెను.

*పిల్లలకును, పెద్దలకును:*

మన ప్రభువైన యేసుక్రీస్తు–

పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికార మియ్య బడియున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు కూమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోకి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీ కేయే సంగతుల నాజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి పర్యంతము సదాకాలము మీతోకూడ నున్నాను. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడునని చెప్పెను.

## ప్రభువు ప్రార్థన

*అందరు నిలువబడియుండగా:*

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధపరచ బడుగాక. నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెఱ వేఱుచున్నట్లు భూమియందును నెఱవేఱగాక. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యరాధములను క్షమించుము. శోధనలోనికి తేక కీడునుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

## వాగ్దానములు

బో:– మిక్కిలి ప్రియులారా! మీరు (ఈ బిడ్డ(ల)కు) పరిశుద్ధ బాప్తిస్మము <u>(పొందుటకు, యిప్పించుటకు)</u> వచ్చియున్నారు. మన ప్రభువైన యేసుక్రీస్తు (మిమ్మును, ఈ బిడ్డ(ల)ను,) చేర్చుకొని, ఆశీర్వదించి, పాపములనుండి (మిమ్మును, ఈ బిడ్డ (ల)ను) విడిపించి పరలోక రాజ్యమును నిత్యజీవమును అనుగ్రహింపవలెనని యీ సంఘము ప్రార్థించిన విధము మీరు వినియున్నారు. మరియు మనము ప్రార్థించినవన్నియు ఇచ్చెదనని తన పరిశుద్ధ వాక్యమునందు మన ప్రభువైన యేసుక్రీస్తు వాగ్దానము చేసినట్టు మీరు వినియున్నారు. ఆయన ఆ వాగ్దానము తనమట్టుకు తాను దృఢ నిశ్చయముతో నెరవేర్చును.

*పిల్లలకు:*

బో:– కాబట్టి క్రీస్తు యిట్లు వాగ్దానము చేసినందువల్ల మీరు (ఈ బిడ్డ (ల) పక్షమున) సంఘము నెదుట ఈ వాగ్ధానములు చేయవలయును.

సాతాను వాని క్రియలనన్నిటిని, లోకముయొక్క వ్యర్థాతి శయమును, ఘనమును, లోక సంబంధమైన దురాశలన్నిటిని శరీర సంబంధమైన పాపేచ్ఛలను వెంబడింపక, వాటివల్ల ప్రేపింపబడక వాటిని మీరు ఈ బిడ్డ(ల) పక్షమున విడిచి పెట్టు చున్నారా?

ఉ: విడిచిపెట్టుచున్నాను.

*పెద్దలకు:*

బో:– కాబట్టి క్రీస్తు యిట్లు వాగ్దానము చేసినందువల్ల మీరు సంఘము నెదుట ఈ వాగ్దానములు చేయవలెను. సాతానును వాని క్రియల నన్నిటిని, లోకముయొక్క వ్యర్థాతిశయమును, ఘనమును, లోక సంబంధమైన దురాశలన్నిటిని, శరీర సంబంధమైన పాపేచ్ఛలను వెంబడింపక, వాటివల్ల ప్రేరేపింపబడక, వాటిని నీవు విడిచిపెట్టు చున్నావా?

ఉ: విడిచిపెట్టుచున్నాను.

*పిల్లలకును పెద్దలకును కలిసి:*

కాబట్టి క్రీస్తు యిట్లు వాగ్దానము చేసినందువల్ల మీరు సంఘము నెదుట ఈ వాగ్దానములు చేయవలెను. మీరును ఈ బిడ్డ(ల) పక్షమున సంఘము నెదుట ఈ వాగ్దానములు చేయవలెను.

సాతానును వాని క్రియలన్నిటిని, లోకముయొక్క వ్యర్థాతి శయమును, ఘనమును, లోకసంబంధమైన దురాశలన్నిటిని, శరీర సంబంధమైన పాపేచ్ఛలను వెంబడింపక, వాటివల్ల ప్రేరేపింపబడక వాటిని మీరు ఈ బిడ్డ(ల) పక్షమున విడిచిపెట్టుచున్నారా? నీవు విడిచిపెట్టుచున్నారా?

ఉ: విడిచిపెట్టుచున్నాము. విడిచిపెట్టుచున్నాను.

బో:– (మీరు ఏ విశ్వాసమును ఒప్పుకొని బాప్తిస్మము పొంద గోరుచున్నారో) (ఈ బిడ్డ(లు) ఏ విశ్వాసములోనికి బాప్తిస్మము నొందవలెనో) ఆ విశ్వాసము నొప్పుకొందము.

## అపోస్తలుల విశ్వాస ప్రమాణము

*అందరు నిలువబడి:*

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రివైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏకకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమ పడి సిలువవేయబడి చనిపోయి సమాధి చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవ దినమునలేచి పరలోకమున కెక్కి సర్వ శక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును, తీర్పుచేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాము.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను, ఆమేన్.

బో:- ఈ క్రైస్తవ విశ్వాసములోనికి బాప్తిస్మము (పొందుటకు ఈ బిడ్డ(ల)ను తెచ్చియున్నారా?) (పొందవలెనని కోరుచున్నావా?)

ఉ:- (ఔను. తెచ్చియున్నాము). (ఔను. కోరుచున్నాను).

బో:- (ఈ విశ్వాసమందు నిలిచియుందునని) (ఈ బిడ్డ(ల)కు దేవుని వాక్యము నేర్పించి ప్రభువుయొక్క బోధలోను, శిక్షలోను పెంచెదనని) వాగ్దానము చేయుచున్నావా?

ఉ:- ఔను. దేవుని సహాయమువల్ల ఆలాగే చేయుదును

*పెద్దలకు:*

బో:- ఎవాంజెలికల్ లూథరన్ సంఘముయొక్క బోధలయందు నమ్మకముగానుండి కృపాసాధనములను శ్రద్ధతో నుపయోగించు కొందునని వాగ్దానము చేయుదువా?

ఉ:- దేవుని సహాయమువల్ల ఆలాగే చేయుదును.

*పిల్లలకు:*

బో: – ఎవాంజెలికల్ లూథరన్ సంగముయొక్క బోధలయందు ఈ బిడ్డ(ల)ను పెంచెదనని వాగ్దానము చేయుదువా?

ఉ: – దేవుని సహాయమువల్ల ఆలాగే చేయుదును.

బో: – కనికరముగల దేవా! ఈ బిడ్డ(ల)లో నుండు పాత ఆదాము పాతిపెట్టబడి క్రొత్త స్వభావము జనించునట్లు అనుగ్రహింపుము.

ఈ బిడ్డ(ల)లో శరీర దురాశలన్నియు నశించి ఆత్మ సంబంధమైన దంతయు వృద్ధి పొందునట్లనుగ్రహింపుము.

ఈ బిడ్డ(లు) లోకమును, శరీరమును, కాతానును గెలిచి జయకరముగ జీవించుటకు ఈ బిడ్డ(ల)కు సామర్థ్యమును బలమును అనుగ్రహింపుము.

సర్వమును సదా పరిపాలించు సర్వశక్తిగల దేవా, ఇక్కడ నీకు సమర్పింపబడు వీరు నీ కనికరమువల్ల పవిత్రమైన జీవముతో అలంకరింపబడి నిత్యఫలములు పొందునట్లు యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

## బాప్తిస్మము

*బాప్తిస్మము పొందవచ్చినవారు మోకరించగా, పిల్లలను తెచ్చినవారు నిలువబడియుండగా వారి (బిడ్డల) తలమీద గురువు ముమ్మారు నీళ్లు పోయుచు, లేక చిలకరించుచు ఈలాగు చెప్పవలెను:*

బో: – (బాప్తిస్మము పొందువారిని పేరుతో పిలిచి) నేను తండ్రి యొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున నీకు బాప్తిస్మ మిచ్చుచున్నాను, ఆమేన్.

సిలువ వేయబడిన క్రీస్తును నీవు యికమీదట ఒప్పుకొనవలెననియు క్రీస్తు శక్తిగలిగి లోకముతోను పాపముతోను సాతానుతోను ధైర్యముగా పోరాడుచు మరణ పర్యంతరము క్రీస్తుయొక్క నమ్మకమైన <u>(సేవకుడవుగా సేవకురాలవుగా)</u> నుండవలెనని నీ మీద సిలువగురుతు వేయుచున్నాను, ఆమేన్.

*ఇప్పుడు గురువు ఇతని(ఈమె) నొసట సిలువ గురుతు వేయవలెను.*

*అంతట గురువు బాప్తిస్మము పొందిన ఆయన (లేక ఆమె) తలమీద తన చేతినుంచి యీలాగు చెప్పవలెను:*

మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క తండ్రియగు సర్వశక్తిగల దేవుడు నీటి మూలముగాను పరిశుద్ధాత్మ మూలముగాను నిన్ను మరల జన్మింపజేసి నీ పాపము లన్నిటిని క్షమించెను. ఆయన తన కృపచేత నిత్యజీవమునకై నిన్ను బలపరచుగాక, ఆమేన్.

నీకు సమాధానము కలుగుగాక.

## కృతజ్ఞత కానుకలు

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

బో:– ప్రార్థింతము.

సర్వశక్తియు మిగుల కనికరముగల దేవా! తండ్రీ! నీవు నీ సంఘమును అనుగ్రహముతో కాపాడి వృద్ధి నొందించుచున్నావు. బాప్తిస్మము పొందిన ఈ బిడ్డ(ల)ను నీటి మూలముగాను, ఆత్మమూలముగాను మరల జన్మింపజేసి యున్నావు. (ఇతని, ఈమె, వీరి) పాపము లన్నింటిని క్షమించి యున్నావు. ఇతనిని, ఈమెను, వీరిని నీ బిడ్డ(ల)ను గాను నీ రాజ్యమునకు వారసుని, వారసురాలిని, వారసులను, గాను అంగీకరించి యున్నావు. కనుక నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు చున్నాము. (ఇతడు, ఈమె, వీరు) ఎల్లప్పుడు నీ చిత్తానుకూరముగ జీవించుచు తుదకు నీ నిత్య రాజ్యములో నీ వాగ్దత్తమును సంపూర్ణముగా పొందునట్లు (ఇతనిని, ఈమెను, వీరిని) నీ కృపయందు కాపాడి సంరక్షింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును, మా ప్రభువునైన యేసు క్రీస్తుద్వారా వినయముగా బ్రతిమాలి వేడుకొనుచున్నాము, ఆమేన్.

## బాప్తిస్మము పొందిన పెద్దల విధులు

*పెద్దలకు:*

బో:– నీవు ఎవరిని ఒప్పుకొని సేవించుటకు వాగ్దానము చేసి యున్నావో ఆ ప్రభుయేసు నామమున నీవు ఈ సంఘములో నొక సభ్యుడవై (సభ్యురాలవై) యున్నావని యిందుమూలముగా నేను ప్రకటించుచున్నాను. మరియు బాప్తిస్మము వల్ల యిప్పుడు క్రీస్తు ధరించిన నీవు యేసుక్రీస్తునందలి విశ్వాసమువలన దేవుని యొక్క వెలుగు బిడ్డగా

చేయబడియున్నావు గనుక వెలుగు బిడ్డలకు తగినట్లుగా నడుచుకొనుట నీ బాధ్యతయు విధియునై యున్నది. బాప్తిస్మము పొందిన మనము పాపము విషయమై చనిపోయి నీతి విషయమై తిరిగి లేచి దురేచ్ఛలను నిత్యము చంపి సమస్త సద్గుణములయందు దైవభక్తితో అనుదినము నడుచుకొనవలెనని జ్ఞాపకమందుంచు కొనవలెను.

## తల్లిదండ్రుల విధులు

*బాప్తిస్మము కొరకు పిల్ల(ల)ను తెచ్చిన వారితో యిట్లు చెప్పవలెను:*

బో:- ఈ బిడ్డ(ల)కు బాప్తిస్మమిప్పించుటవలన యింతటి ధర్మ కార్యమును చేసిన మీరు (ఇతనికి, ఈమెకు, వీరికి) పది ఆజ్ఞలను, విశ్వాస ప్రమాణమును, ప్రభువు ప్రార్థనను శ్రద్ధతోను నమ్మకముగాను నేర్పించవలయును; మరియు (ఇతడు, ఈమె, వీరు) పెరిగి (పెద్దవాడు, పెద్దది, పెద్దవారు) అగుచుండగా పరిశుద్ధ లేఖనములను చదువుకొనునట్లు చేసి దేవాలయములో జరుగు ఆరాధనలకు తీసుకొని రావలయుననియు తాను (ము) తన (మ) బాప్తిస్మమున జేసిన యొడంబడిక యందును సంఘ సహవాసమునందున నిలిచి యేసుక్రీస్తు రాకడ దినమువరకు దైవభక్తితే జీవించుటకై పెంచబడులాగున క్రైస్తవ విశ్వాసము నందు నేర్పు పొందునట్లు చేయవలెననియు మిమ్మును హెచ్చరించుచున్నాను.

*సభ నిలువబడియుండగా గురువు యిట్లు చెప్పవలెను:*

బో:- ఈ సంఘపు సభ్యులైన మీరు (ఇతనిని, ఈమెను, వీరిని) మీ తోడి (సభ్యుని, సభికురాలిని, సభికులు)గాను మీ (సహోదరుని, సహోదరి, సహోదరులు) గాను క్రీస్తుయేసునందు (వారసుని, వారసురాలిని, వారసులు) గాను అంగీకరించి దేవుడు తన పరిశుద్ధాత్మ మూలమున (ఇతని, ఈమె, వీరి) యం దారంభించిన కార్యమును సంపూర్తి చేయునట్లు ఎల్లప్పుడు ప్రార్థింపవలెనని మిమ్మును హెచ్చరించుచున్నాను. మరియు (ఇతని, ఈమె, వీరు) కృపయందును మన ప్రభు యేసుక్రీస్తును గూర్చిన జ్ఞానమందును అభివృద్ధిపొంది ఇహమందు భక్తితోను, నీతితోను, స్వస్థబుద్ధితోను ప్రవర్తించునట్లు దేవుని పరిశుద్ధ వాక్యమును చాల శ్రద్ధతో చక్కగా నేర్చుకొనునట్లు మీరు (ఇతనికి, ఈమెకు, వీరికి) తోడ్పడవలయును.

తండ్రి కుమారుడు పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు మీతో నుండునుగాక, ఆమేన్.

# నిర్ధారణ క్రమము

*నిర్ధారణ నొందనైయున్నవారు చిన్న ప్రశ్నోత్తరి బోధననుసరించి క్రైస్తవ విశ్వాసమునందు నేర్పుపొంది తమ పాస్టరునకు పంచాయితీ వారికి అట్టి నేర్పు తృప్తకరముగ నున్నట్లు అంగీకరింపబడవలెను.*

*నిర్ధారణ క్రియ సంఘముయొక్క ఆత్మీయ హక్కులన్నిటిని అనుభవించుటకు అధికారమిచ్చును. సంఘముయొక్క పద్ధతుల ననుసరించి దానికి సంబంధించిన లౌకిక విషయములలో పాలివారగుటకు నిర్ధారణ నొందినవారికి హక్కు కలుగును.*

*నిర్ధారణ నాచరించుటకు ఈస్టరు పెంతెకోస్తు పండుగల సమయములు అనుకూలమయినవని పురాతన కాలమునుండి యెంచపడుచున్నవి. అయినను దానిని మఱి యే సమయమందయినను ఆచరింపవచ్చును.*

*సంఘముయొక్క బహిరంగారాధన సమయమందు నిర్ధారణ నాచరింపవలెను. చాల జబ్బుగ నున్నప్పుడు లేక మిక్కిలి అవసరమునుబట్టి సంఘ సభికుల యెదుట ఏకాంతముగ దాని నాచరింపవచ్చును. అట్లు ఆచరించిన యెడల ఆ సంగతిని గూర్చి సభవారికి బహిరంగముగా ప్రకటింపవలెను.*

*నిర్ధారణను ఆరాధన సమయమున ఆచరించినప్పుడు ఈ దిగువ క్రమమును ముఖ్య ప్రార్థనకు పిమ్మట నుపయోగింపవలెను.*

*పరిశుద్ధాత్మను వేడుకొను నొక కీర్తన పాడవలెను.*

*అంతట గురువు నిర్ధారణ నొందవలసినవారి పేరులను పిలువగా వారు వేదికయొద్దకు రావలెను.*

*అంతట గురువు చెప్పవలసినది:*

మిక్కిలి ప్రియులారా! మీరు పరిశుద్ధ బాప్తిస్మమునందు మన ప్రభువైన యేసుక్రీస్తువల్ల అంగీకరింపబడి ఆయన పరిశుద్ధ సంఘములోని అవయవములుగా చేయబడితిరి. మన ప్రభువు యొక్క ఆజ్ఞానుసారముగ మీరు దైవవాక్యము నేర్చుకొని ఆయన చిత్తమును గూర్చియు, ఆయన కృపా సువార్తను గూర్చియు తెలిసికొనియున్నారు. ఇప్పుడు క్రీస్తునందలి మీ విశ్వాసమును, దేవుని చిత్తమునకును ఆజ్ఞలకును విధేయులై మీ జీవిత కాలమంత నడుచుకొనుటకు మీ దృఢమైన నిశ్చయమును, మీ బాప్తిస్మమునుబట్టి మీరు నెరవేర్చుటకు బద్ధులైయున్న మీ క్రైస్తవ విధులను ఈ సంఘముయెదుట బాహాటముగా ఒప్పుకొని నిర్ధారణ పొందవలసియున్నారు.

కాబట్టి నేను మీలో ప్రతివానిని అడుగున దేమనగా:

ప్రశ్న: బాప్తిస్మమునందు మీ పేరట చేయబడిన గంభీరమైన వాగ్దానము దేవుని యెదుటను ఈ సంఘముయెదుటను తిరిగిచేసి, మీ యంతట మీరే వాటిని స్థిరపరచి, మీకు ప్రతిగా, అప్పుడు పూనుకొన్నవన్నియు నెరవేర్చుటకు మీరు బద్ధులైయున్నారని ఒప్పుకొనుచున్నారా?

ఉత్తరము: ఒప్పుకొనుచున్నాను.

ప్రశ్న: సాతానును వాని క్రియలన్నిటిని, ఈ దుష్టలోకము యొక్క వేడుకలను డంబమును, శరీర సంబంధమైన పాపేచ్ఛలన్నిటిని విడిచిపెట్టుచున్నారా?

ఉత్తరము: విడిచిపెట్టుచున్నాను.

ప్రశ్న: సర్వశక్తిగల దేవుని నమ్ముచున్నారా?

ఉత్తరము: అవును, భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

ప్రశ్న: యేసుక్రీస్తును నమ్ముచున్నారా?

ఉత్తరము: ఆయన ఏక కుమారుదును మన ప్రభువునైన యేసు క్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతిపిలాతు అధికారము క్రింద శ్రమపడి సిలువవేయబడి చనిపోయి సమాధి చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చని పోయిన వారిలోనుండి మూడవ దినమున లేచి పరలోకమున కెక్కి సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును మృతులకును తీర్పు చేయుటకు అక్కడనుండి వచ్చుననియు నమ్ముచున్నాను.

ప్రశ్న: పరిశుద్ధాత్మను నమ్ముచున్నారా?

ఉత్తరము: పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థానమును, నిత్య జీవమును ఉన్నవని నమ్ముచున్నాను.

ప్రశ్న: ఈ విశ్వాసమునందు నిలిచియుందుమని ఆలాగే యుందు నని వాగ్దానము చేయుచున్నాను.

ఉత్తరము: అవును, దేవుని సహాయమువల్ల ఆలాగే యుందునని వాగ్దానము చేయుచున్నాను.

ప్రశ్న: ఎవాంజెలికల్ లూథరన్ సంఘపు సభికులైన మీరు దాని బోధలయందు నమ్మకముగనుండి కృపాసాధనములను శ్రద్ధతో నుపయోగించుకొందుమని వాగ్దానము చేయుదురా?

ఉత్తరము: అవును, దేవుని సహాయమువల్ల ఆలాగే చేయుదును.

# నిర్ధారణ

*అంతట గురువు చెప్పవలసినది:*

బో: – ప్రభువు నామమువలననే మనకు సహాయము కలుగు చున్నది.

సభ: – భూమ్యాకాశములను సృజించినవాడు ఆయనే.

బో: – ప్రభువు నామము స్తుతింపబడుగాక.

సభ: – ఇది మొదలుకొని యుగయుగములు స్తుతింపబడుగాక.

బో: – ప్రభువా, మా ప్రార్థనలను ఆలకింపుము.

సభ: – మా మొర నీ యొద్దకు చేరనిమ్ము.

బో: – ప్రార్థించుదము.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! నీవు కరుణతో ఈ నీ సేవకులను బాప్తిస్మమునందు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను మఱల జన్మింపజేసి వీరి పాపము లన్నిటిని క్షమించియున్నావు. ఆదరణ కర్తయగు పరిశుద్ధాత్మతో వీరిని బలపఱచి జ్ఞాన వివేకముల కాధారమగు ఆత్మను, ఆలోచన బలముల కాధారమగు ఆత్మను, తెలివిని, యెహోవాయెడల భయభక్తులను పుట్టించు ఆత్మను, ఇప్పుడును నిరంతరమును అనుగ్రహించి వివిధములగు కృపావరములను వీరియందు దిన దినము పెంపొంద జేయుమని మా యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

*అంతట నిర్ధారణ పొందవలసియున్నవారు మోకరించగా గురువు తన చేతిని లేక చేతులను ఒక్కొక్కరి తలమీదనుంచి దీవెన ప్రార్థన చెప్పవలెను. దీవెన ప్రార్తనకు ముందు ప్రతివారికి ఒక్కొక్క బైబిలు వాక్యము చెప్పవచ్చును.*

యేసుక్రీస్తు నిమిత్తమున నీవు విశ్వాసమందు బలపడి, కృపయందు పెంపారి, శ్రమలలో ఓర్పుగలిగి, నిత్యజీవమును గూర్చి దివ్యమైన నిరీక్షణ గలిగియుండునట్లు మన పరలోకపు తండ్రి పరిశుద్ధాత్మ వరమును నీలో నూతనపరచి వృద్ధినొందించు గాక.

*నిర్ధారణ పొందిన వారొక్కొక్కరు చెప్పవలసినది:*

ఆమేన్.

*అంతట వారు నిలిచియుండగా గురువు చెప్పవలసినది:*

మీరు ఎవరిని ఒప్పుకొని సేవించుటకు వాగ్దానము చేసియుంటిరో ఆ ప్రభువైన యేసు నామమున మీరు ఈ సంఘములో సభికులైయున్నారని యిందు మూలముగా నేను ప్రకటించుచున్నాను. మరియు ప్రభువు రాత్రి భోజనము పుచ్చుకొనుటకును ఈ సంఘమునకు చెందు ఆత్మీయ హక్కులన్నిటియందు పాలు పుచ్చు కొనుటకును మీకు అధికారమిచ్చుచున్నాను.

*అంతట సభ నిలువబడియుండగా గురువు చెప్పవలసినది:*

ఈ సంఘపు సభికులైన మీరు ఈ మీతోడి సభికులను అంగీకరించి మీ సహోదరులనుగాను క్రీస్తుయేసునందు వారసులను గాను ఒప్పుకొని దేవుడు తన పరిశుద్ధాత్మ మూలమున వీరియందు ఆరంభించిన కార్యమును సంపూర్తి చేయునట్లు ఎల్లప్పుడు ప్రార్థింప వలెనని మిమ్మును హెచ్చరించుచున్నాను.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

## ప్రార్థింతము

సర్వశక్తియు కనికరముగల దేవా, పరలోకపు తండ్రీ! నీ కిష్టమైన వాటిని మేము ఇచ్ఛయించుటకును చేయుటకును మాలో కార్యసిద్ధి కలుగజేయువాడవు నీవే. ఈ నీ సేవకులలో నీ వారంభించిన కార్యమును స్థిరపరచుము. నీ సంఘ సహవాసమందును నీ సువార్త యందలి విశ్వాసమందును వీరు నిలిచియుండి తప్పు బోధగాని, శరీరేచ్ఛలుగాని ఐహిక ప్రేమగాని, నీ యొద్దనుండియు వీరొప్పుకొనిన సత్యమునుండియు వీరిని తొలగి పోనియ్యకుము. వీరు నీ వాక్యము నకు సంతోషముతో లోబడి తమ తోడివారి మేలు కొరకును నీ ప్రజలు జ్ఞానాభివృద్ధికొరకును నీ నామ మహిమ కొరకును ఎల్లప్పుడు జీవించునట్లు చేయుము. నన్ను సంపూర్ణముగా తెలిసికొని ఆసక్తితో నిన్ను ప్రేమించి, ప్రతి మంచి మాటయందును కార్యము నందును నిన్ను సేవించు నట్లనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మ తోను సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట అందరు కలిసి చెప్పవలసినది:*

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసిన వారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధము లను క్షమించుము. శోధనలోకి తేక దుష్టునినుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*అంతట గురువు వారిని పంపివేయకముందు చెప్పవలసినది:*

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు మీ యందరిపైనుండుగాక, ఆమేన్.

*తరువాత వెంటనే ప్రభురాత్రి భోజన సంస్కారము ఆచరించనియెడల 23-వ సంకీర్తనముగాని లేక మరి యే కీర్తనయైనగాని పాడవచ్చును.*

*పిమ్మట ఆశీర్వాదము చెప్పవలెను.*

# వివాహ కార్యక్రమము

*వివాహ దినమునకు పూర్వము ఒకటి లేక రెండు, మూడు ఆదివారముల యందు వివాహ ప్రకటన ఆలయములో చేయవలెను. అదియెట్లనగా:*

.............కాపురస్తుడు............అను ఆయునయు............... కాపురస్తురాలు.............అను ఆమెయు దేవుని యేర్పాటు ప్రకారము పరిశుద్ధ గృహస్థ జీవనములో ప్రవేశింప నుద్దేశించు చున్నారు. వారు ఈ దాంపత్యములో ప్రభుని నామమందు ప్రవేశించి అందులో వర్ధిల్లునట్లు వారికొరకు ప్రార్థన చేయవలెనని కోరుచు న్నారు. వీరు జతపరచబడ కూడదని న్యాయమైన హేతువు నెవరైన కనుపరుపగలిగిన యెడల అట్టివారు తమ యాక్షేపణను వివాహ దినములోగా తెలియజేయు వలయునని హెచ్చరించుచున్నాను.

*వివాహము జరుపక ముందు గురువు ఈ దిగువ అంశములను స్పష్టముగా తెలిసికొనవలెను:*

1. వివాహ మాడగోరు వారి దాంపత్యము పరిశుద్ధ లేఖనముల కనుగుణ్యముగ నుండుట.
2. రాజ్య, సంఘ, చట్టముల కనుకూలించుట.

3. వివాహ మాడువారు అందు విషయమై తమ సమ్మతిని ధారాళముగ తెలుపుట.

4. సాధారణ సమయములయందును ముఖ్యముగా వధూ వరులు యుక్త వయస్సు గలవారు (మైనారిటి దాటినవారు) కానప్పుడును, వారి తలిదండ్రులు గాని, పోషకులుగాని సమ్మతించుట. పురుషునికి 21 సం॥లును, స్త్రీకి 18 సం॥లును ఉండి తీరవలయును.

5. దాంపత్యము దైవాశీర్వాదమున కనుకూలమైనదేయని గురువు నకు నచ్చినయెడలనే గాని యే వివాహమును చేయరాదు.

*వివాహ కార్యము ఆలయములో జరుపవలెను. అవసరమయిన యెడల ఇతర స్థలములలో గూడ జరిగించవచ్చును. సభ్యులు నిలువబడి యుండగ బోధకుడు చెప్పవలసినది:*

తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

**వచనము**

బో:– దేవా! నాయందు శుద్ధ హృదయము కలుగజేయుము.

సభ:– నా అంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టించుము.

బో:– నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము.

సభ:– నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము.

బో:– నీ రక్షణానందము నాకు మరల పుట్టించుము.

సభ:– సమ్మతిగల మనస్సు గలుగజేసి నన్ను దృఢపరుచుము.

బో:– ఓ ప్రభువా! మమ్మును కనికరింపుము

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మేము నీ కొరకు కనిపెట్టుచున్నాము.

సభ:– కనుక నీ కృప మా మీద నుండనిమ్ము.

బో:– యెహోవా! నా ప్రార్థన నాలకింపుము.

సభ:– నా మొర నీ యొద్దకు చేరనిమ్ము.

## పరిశుద్ధ వివాహము కొరకైన సంగ్రహ ప్రార్థన.

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ, దైవవాక్యమనెడి నీ దివ్యమైన వెలుగువలన మేము నీ కుమారుని తెలిసికొను నట్లను గ్రహించి యున్నావు. మమ్మును నీ పరిశుద్ధాత్మతో నింపి మా రక్షకుడైన క్రీస్తునందలి నమ్మకమునుబట్టి యానందించుచు తుదకు నిత్య రక్షణ నొందునట్లు అనుగ్రహించుమని ఆ నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## సంకీర్తన

*67 గాని 127 గాని 128 గాని చదువవచ్చును.*

## కీర్తన

## హెచ్చరికలు

*వివాహ మాడువారు (పురుషుడు స్త్రీకి కుడివైపున నుండవలెను) పీఠము నొద్దకు రాగా గురువు ఇట్లు చెప్పవలెను.*

మిక్కిలి ప్రియులారా, ఈ స్త్రీ పురుషులకు పరిశుద్ధ వివాహము చేయుటకు దేవుని సముఖమందును, ఈ సంఘము యెదుటను మనము కూడియున్నాము. వివాహమనునది దేవుడు తానే నియమించిన ఘనమైన స్థితియైయుండి, క్రీస్తునకును ఆయన సంఘమునకునుగల మర్మమైన ఐక్యమును సూచించుచున్నది. గలిలైయలోని కానాలో వివాహమునకు క్రీస్తు వెళ్లియుండుటవల్లను అక్కడచేసిన మొదటి అద్భుత క్రియవల్లను ఆ పరిశుద్ధస్థితిని అలంకరించెను. మరియు ఇది అందరును ఘనముగా ఎంచదగినదని పరిశుద్ధ లేఖనము మెచ్చుకొనుచున్నది. కాబట్టి ఎవరును దీనిని ఆలోచన లేకుండను, చులకనగాను, శరీరేచ్ఛ కొరకును పూనుకొన గూడదు. కాని వివాహము ఏర్పడిన హేతువులను తగినట్టుగా యోచించి, భక్తి వినయములతోను, వివేకముతేను, సుబుద్ధితోను, దైవ భయముతోను, దీనిని పూనుకొనవలెను. ఆ హేతువు లేవనగా:–

మొదటిది, దేవుడు తన చిత్త ప్రకారము మనుష్యజాతి వృద్ధి పొందునట్లును, పిల్లలు ప్రభువుయొక్క భయమునందును, శిక్షయందును, ఆయన పరిశుద్ధ నామమునకు మహిమ కారణముగా పెంచబడునట్లును వివాహము ఏర్పడియున్నది.

రెండవది, దేవునిచే నాటబడిన స్వాభావికమైన కోరికలును ఆపేక్షలును పరిశుద్ధ పరచబడి యుక్తముగా క్రమపరచబడునట్లును దేవునివలన యీ పరిశుద్ధ స్థితికి పిలువబడినవారు అందులోనే పవిత్రులుగా జీవించునట్లును ఇది ఏర్పడియున్నది.

మూడవది, సుఖదుఖములలో ఒకరి కొకరు తోడుగాను సహాయముగాను, ఆదరణగాను ఉండునట్లు ఇది ఏర్పడియున్నది.

ప్రభువైన దేవుడు చెప్పిన దేమనగా:–

"నరుడు ఒంటరిగా నుండుట మంచిదికాదు, వానికి సాటి యైన సహాయమును వానికొరకు చేయుదును"

మన ప్రభువైన యేసు క్రీస్తు చెప్పిన దేమనగా:–

సృష్ట్యాదినుండి దేవుడు వారిని పురుషునిగాను స్త్రీనిగాను కలుగజేసెనని మీరు చదువలేదా? ఈ హేతువు చేత పురుషుడు తన తల్లిదండ్రులను విడిచిపెట్టి తన భార్యను హత్తుకొనును. వారిద్దరుగ నుండక యేక శరీరముగా నుందురు. కాబట్టి దేవుడు జతపరచిన దానిని మనుష్యుడు వేరుచేయకూడదు.

అపోస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మావేశమువలన చెప్పినదేమనగా:–

"పురుషులారా! మీ భార్యలను ప్రేమించుడి. క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను. స్త్రీలారా! ప్రభువునకువలె మీ సొంత పురుషులకు లోబడియుండుడి."

మరియు పాపకారణమును బట్టి యీ గృహస్థమార్గమునం దనేకములైన కష్టములును శ్రమలును రావలసియున్నను. కరుణాళుడైన మన పరలోకపు తండ్రి అంత పరిశుద్ధమైనట్టియు, తనకు హితమైనట్టియు నీ స్థితియందు తన బిడ్డలను విడనాడక అత్యధికాశీర్వాదములతో ఎల్లప్పుడు వారికి తోడైయుండును.

ఈ పురుషుడును, ఈ స్త్రీయు పరిశుద్ధమాన ఈ గృహస్థ జీవనములో జతపరచబడట కిప్పుడు వచ్చియున్నారు. వీరు జత పరుపబడుట సరికాదని ఎవరైన న్యాయమైన హేతువును కనుపరుప గలిగినయెడల ఇప్పుడే తెలియజేయవలెను. లేని యెడల ఇక నెప్పటికిని ఊరకుండవలసినదే.

*అంతట గురువు పురుషునితో చెప్పవలసినది:–*

........నీవు ఈ స్త్రీని వివాహము చేసికొనుటకు దేవుని యెదుట సమ్మతించుచున్నావా?

పు:– సమ్మతించుచున్నాను.

ఈమెను ప్రేమించి ఆదరించి ఘనపరచి సుఖదుఖముల యందు సంరక్షించి మీరిద్దరు బ్రతికి యున్నంత కాలము ఇతరుల నెవ్వరిని ఆశింపక ఈమెతోనే కాపురము చేయుదువా?

పు:– కాపురము చేయుదును.

*గురువు స్త్రీతో చెప్పవలసినది:*

..........నీవు ఈ పురుషుని నీ భర్తగా స్వీకరించి దేవుని నియమము చొప్పున పరిశుద్ధ గృహస్థ మార్గమందు జీవించెదవా?

స్త్రీ:– జీవించెదను.

ఈయనను ప్రేమించి ఆదరించి ఘనపరచి సుఖదుఖముల యందు సంరక్షించి మీరిద్దరు బ్రతికి యున్నంత కాలము ఇతరుల నెవ్వరిని ఆశింపక ఈయనతోనే కాపురము చేయుదువా?

స్త్రీ:– కాపురము చేయుదును.

*ఈ స్త్రీని వివాహార్థమై యిచ్చెడు తండ్రి లేక పోషకుడు ఆమె కుడి చేతిని పెండ్లికుమారుని కుడిచేతికి అప్పగించవలయును. అంతట పురుషుడు గురువు వెంబడి చెప్పవలసినది:*

................అను నేను..................అను నిన్ను నా భార్యనుగ స్వీకరించి నా జీవిత కాలమంతయు నీ యెడల నమ్మకముగా నుందునని ప్రమాణము చేయుచున్నాను.

అంతట స్త్రీ అదే విధముగా గురువు వెంబడి చెప్పవలసినది:

................అను నేను..................అను నిన్ను నా భార్యనుగ స్వీకరించి నా జీవిత కాలమంతయు నీ యెడల నమ్మకముగా నుందునని ప్రమాణము చేయుచున్నాను.

*అంతట గురువు మంగళసూత్రము నడిగి తీసికొని పురుషుని చేతికిచ్చి స్త్రీ మెడలో కట్టింపవలయును. (ఉంగరము నుపయోగించు నెడల గురువు పురుషుని చేతికిచ్చి స్త్రీ యొడను చేతి నాలుగవ వ్రేలికి పెట్టించవలయును)*

*మంగళ సూత్రము కట్టునపుడు లేక ఉంగరము పెట్టునపుడు పురుషుడు గురువు వెంబడి చెప్పవలసినది:*

వివాహ సంబంధమైన ప్రేమకును నిబంధనకును గురుతుగా ఈ మంగళ సూత్రమును (ఉంగరమును) అంగీకరించుము.

## ప్రార్థింతము

ఓ దేవా! వివాహముచేత నీవు ఏకము చేసిన వారిని విడదీయుట ఎప్పటికిని విధికి విరుద్ధమని నేర్పితివి. మరియు క్రీస్తుకును ఆయన సభకును గల ఏకత్వమును ఆత్మీయ వివాహమును సూచించుటకై వివాహపు స్థితి దివ్యమైన మర్మముగా నుండునట్లు పరిశుద్ధ పరచితివిగదా. తన శరీరమువలె తన భార్యయైన సభను ప్రేమించి సంరక్షించి దాని కొరకు తన్నుతాను అప్పగించుకొనిన క్రీస్తు దానిని ప్రేమించినట్లే ఈ పురుషుడును నీ వాక్యప్రకారము తన భార్యను ప్రేమించులాగునను ఈ స్త్రీకూడ పతివ్రతయు తన పెనిమిటికి ప్రియురాలును ఇష్టురాలునై యుండి సంపూర్ణ శాంతము తోను సుబుద్ధితోను సమాధానముతోను పరిశుద్ధియు భక్తియుగల ఇల్లాంద్రను వెంబడించులాగునను ఈ వధూవరులను కటాక్షించుము. ఓ ప్రభువా! ఈ దంపతులను ఆశీర్వదించి వీరు నిత్యరాజ్యమునకు వారసులగునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపుము, ఆమేన్.

*అంతట గురువు చెప్పవలసినది:*

మీ కుడి హస్తమును కలిపి పట్టుకొనుడి.

*అంతట గురువు తన కుడిచేతిని వారి కుడి హస్తములమీద నుంచి చెప్పవలసినది:*

....................అను వీరు పరిశుద్ధ వివాహమునకు సమ్మతించి దేవుని యెదుటను ఈ సంఘము యెదుటను దానిని గూర్చి బహిరంగముగా తెలియజేసినందున, తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున వీరు భార్య భర్తలని ప్రకటించుచున్నాను, ఆమేన్.

దేవుడు జతపరచిన దానిని మనుష్యుడు వేరుచేయకూడదు.

*అంతట వధూవరులు మోకరించగా, గురువు వారి నీ విధముగా నాశీర్వదించవలెను:*

మన యాది తల్లిదండ్రులను కలుగజేసి, వివాహమునందు వారియైక్యతను పవిత్రపరచిన ప్రభువైన దేవుడు మిమ్మును పవిత్ర పరచి మీరు శరీరాత్మీయ విషయములయందు ఆయనను సంతోష పరచుచు మరణ పర్యంతము పరిశుద్ధమయిన ప్రేమలో జీవించు నట్లనుగ్రహించునుగాక, ఆమేన్.

*పరిశుద్ధ సమాభాక్ష్యము ఆచరించుట ఏర్పర్చబడిన యెడల ఇక్కడ ఆచరించవలెను.*

*పరిశుద్ధ సమభాక్ష్యము ఆచరించని యెడల బోధకుడు ఇట్లు చెప్పవలెను:*

## ప్రార్థింతము

సర్వశక్తియు మిక్కిలి కనికరమును గల దేవా! ఈ స్త్రీ పురుషులను పరిశుద్ధ వివాహమునందు జతపరచి యున్నావు. వీరు నీ పరిశుద్ధ వాక్యము ననుసరించి తమ గృహస్థ జీవనమును కొనసాగించు కొనునట్లు వీరికి నీ కృప ననుగ్రహింపుము. వీరు ఒకరి యెడల నొకరు ఎడతెగని నమ్మకమును నిజమయిన ప్రేమయు గలిగి జీవించునట్లు వీరిని బలపరచుము. సకల శ్రమలయందును శోధనలయందును వీరిని కాచి కాపాడుము. నీ యందు విశ్వాసమును, నీ పరిశుద్ధ సంఘములో సహవాసమును, ఒకరి యెడల నొకరు ప్రేమతో గూడిన పరామరికయు గలిగి తమ జీవయాత్ర సాగించునట్లును; అందును బట్టి నీ పరమాశీర్వాదము లను చిరకాలము అనుభవించునట్లును; నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా కృప దయచేయుము, ఆమేన్.

*అంతట అందరు చెప్పవలసినది:*

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసిన వారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధము లను క్షమించుము. శోధనలోకి తేక దుష్టునినుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

## స్తుతి కీర్తన

*అంతట గురువు ఆశీర్వాదము చెప్పవలెను:*

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికి తోడైయుండునుగాక, ఆమేన్.

# గృహ ప్రవేశపు టారాధన క్రమము

*ప్రతిష్ఠింపవలసిన గృహమును తోరణములు మొదలగువానిచే తగినరీతిగ నలుకరించవలెను. గదిలో నొక ప్రాముఖ్యమైన స్థలమున క్రీస్తు పటము గోడకు తగిలించవలెను. దాని సమీపమున బైబిలును ఆరాధన పుస్తకమును ఉంచుట యుక్తము. నూతన గృహమున ఇకమీదట కుటుంబారాధన కిదియే ఉచితమైన స్థానముగ నుండును. ఏర్పాటు చేయబడిన సమయమున గురువును పిలువబడిన సోదరులును ఆ గృహము నెదుట సమావేశమై యీ దిగువరీతిని ఆరాధన జరుపవలెను.*

అందరు

## కీర్తన

**బో:** – తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున

**సభ:** – ఆమేన్.

**బో:** – యెహోవా యిల్లు కట్టించనియెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే.

**సభ:** – యెహోవా పట్టణమును కాపాడనియెడల దాని కావలి కాయువారు మేలుకొనియుండుట వ్యర్థమే.

**కుటుంబము:** – ప్రభువైన యేసూ! రమ్ము. మా యతిథివై యుండుము. ఈమా నివాసస్థలము నీయునికిపట్టైయుండుగాక.

**<u>దైవాహ్వాన ప్రార్థన:</u>** – త్రైక దేవా! తండ్రీ! కుమారుడా! పరిశుద్ధాత్మా! మేము నీయందే మా దృష్టి నిలిపి నీ దివ్యనామముననే మా పనుల నారంభించుచున్నాము. మేము భోజనము చేసినను పానముచేసినను ఏమి చేసినను సమస్తము నీ మహిమకొరకు చేయవలెనని నీ పరిశుద్ధ వాక్యమందు మాకు విశదపరచియున్నావు. కావున మేము చేయున దంతయు కేవలము నీ స్తుతికొరకును, మహిమకొరకును చేయు లాగున మమ్మును నడిపించుము. నీ నామమున ఈ గృహమునందు ప్రవేశించు నీ సేవకులు నీ యాశీర్వాదము నొంది వర్ధిల్లునట్లు నీ దయగల దృష్టి దీనిపై ప్రసరింపజేయుము. దయగల మా పరమ తండ్రీ! మా యొద్దకు వచ్చి యీ మా యింటిలో నివసించుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

(తాళముతీసి తలుపు చెరచుచు) కృతజ్ఞతార్పణలు చెల్లించుచు ఆయన గుమ్మములో ప్రవేశించుడి. కీర్తనలు పాడుచు ఆయన ఆవరణములో ప్రవేశించుడి.

## ప్రతిష్ఠ కీర్తన

*అందరు పాడుచు ప్రవేశింపగా గురువును, ఆ కుటుంబమును, తగిన స్థలముల నాక్రమింతురు. అంతట గురువు ఈ దిగువ నుదహరించిన పరిశుద్ధ లేఖనములలో నొక దానిని చదువవలెను.*

ద్వితీ. 6:11-13, లూకా 10:38-42, యోహాను 2:1-11,

ఎఫెసీ 6:11-13.

క్లుప్త ప్రసంగము

## సమర్పణ

బో:- ఈ గృహమును సకల శుభములనిచ్చు దేవునికే సమర్పణ చేయుచున్నాము.

సభ:- ఈ యింటిని ప్రభువునకే సమర్పించుచున్నాము.

బో:- ఈ గృహ నివాసులైన మీరు ఆయనయందు పూర్ణ విశ్వాసముంచి ఆయన సన్నిధికాంతియందు నడుచుకొనెదరా?

కుటుంబము:- ఆయననే నమ్మికొని ఆయనను హృదయ పూర్వక ముగ వెంబడింతుము.

బో:- ఈ గృహమునందు క్రీస్తునకును, దేవుని వాక్యముకును ప్రధాన స్థానము నిచ్చెదరా?

కుటుంబము:- అవును, ఆలాగే చేయుదుము.

బో:- ఈ యింటిని ప్రార్థన పూర్వకముగ దేవునికి ప్రతిష్ఠింతము.

## సమర్పణ ప్రార్థన

ప్రభుడవైన దేవా! మా పరలోకపు తండ్రీ! శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును నీ యొద్దనుండియే వచ్చును. కృతజ్ఞతతో నిన్ను స్తుతించుచు నీ కృపా సింహాసనమువైపు మా కన్నులెత్తుచున్నాము. ప్రతి యుదయమునను మాకు నూతనా శీర్వాదములను అనుగ్రహించుచున్నావు. నీ కృపకు అంతము లేదు. మా యాత్మలకును శరీరములకును అవసరమగు వాని నన్నిటిని దయచేయుచున్నందుకు నీకు వందనములు చెల్లించుచున్నాము. (ఈ నీ సేవకులు తమకు నివాసస్థలముగ ఈ గృహమును కట్టు కొనుటకు వీరికి శక్తి దయచేసినందుకు నిన్ను స్తుతించు చున్నాము.) ఓ దేవా! నీ

కృపయు ఆశీర్వాదమును లేనియెడల మానవులు చేయు ప్రయత్నములన్నియు వ్యర్థమేనని మేమొప్పుకొను చున్నాము. కాబట్టి కరుణతోను సర్వశక్తిగల నీ కృపతోను వచ్చి మేము దీనియందు నీ పరిశుద్ధనామమున ప్రవేశించునట్లును, ఇది కేవలము క్రైస్తవగృహమై యుండునట్లును దీవించుమని వేడు కొనుచున్నాము.

ఈ గృహమందు జీవించు నీ సేవకులను పాపము నుండియు, నీకు చింత గలిగించు ప్రతి దానినుండియు కాపాడి సంరక్షించుము. ఈ కుటుంబమునకు నీవు శిరస్సుగాను, ప్రతి భోజన సమయమునను కనబడని యతిథిగాను ఉండుము. ఈ యింట ప్రేమ, నెమ్మది, సమాధానము, సంతోషము నెలకొని యుండునట్లు నీ యాత్మ ననుగ్రహించుము. ఇందు నివసించు వారికి నీ చిత్తము ననుసరించి ఆయురారోగ్యములు దయచేయుము. వ్యాధిగాని, మరి యే యాపదగాని, సంభవించునప్పుడు వీరికి సాహాయముచేసి స్వస్థత కలిగించి ఆశీర్వదించుటకు వీరి సమీపమున నుండుము.

నీ వాక్యమును వెలుగు ఈ గృహమునం దెల్లప్పుడు ప్రకాశింపనిమ్ము. దీనిద్వారా సమీప గృహములు వెలిగింపబడు నట్లనుగ్రహింపుము. క్రైస్తవాతిథ్యమున కిదియిరవైయుండనిమ్ము. ఈ గృహనివాసులతో నెల్లప్పుడు నీవుండుము. నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా మేము చేయు ఈ మనవుల నంగీక రింపుమని నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ప్రభువు ప్రార్థన

**దీవెన**

# కుటుంబ ప్రార్థన క్రమము

## ఉదయము

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

### కీర్తన ఒకటి పాడవలెను

వీనిలో దేనినైనను చెప్పుము లేక పాడుము

1. పదియాజ్ఞలు, 2. విశ్వాస ప్రమాణము, 3. నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను, నీ దేవుడైన ప్రభువును ప్రేమింపవలెను. నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమింపవలెను.

బైబిలు పాఠము

## ప్రార్థన

ప్రియ తండ్రీ, నేడు నీవు మాకు తోడుగానుండి నిన్ను సేవించుటకై మమ్మును బలపర్చుమని యేసుక్రీస్తు నామమున నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ప్రభువు ప్రార్థన

## సాయంకాలము

తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

## కీర్తన

బైబిలు పాఠము

## ప్రార్థన

ఓ ప్రభువా, ఈ దినము మమ్మును కనికరముతో నడిపించి నందుకు నీకు వందనములు. మేము చేసిన పనులను దీవించుము. తప్పులున్నయెడల దిద్దుము. నేటిరాత్రి మమ్మును మా ప్రియులందరిని కాపాడుము. సమస్త పాపమునుండి మమ్మును రక్షించిన యేసుక్రీస్తు పేరిట నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసిన వారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధము లను క్షమించుము. శోధనలోకి తేక దుష్టునినుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

# బాలింతలు కృతజ్ఞతాస్తుతులు చెల్లించు క్రమము

*స్త్రీ ప్రసవించిన తరువాత నియమిత కాలమందు దేవాలయములోనికి వచ్చి, యెప్పటి చోటనైనను; లేక గురువు నిర్ణయించిన చోటనైనను మోకాళ్లూని యుండగా బోధకుడు ఆమెతో ఇట్లు చెప్పవలెను. తగిన కారణము ఉంటే ఆరాధన గృహమందు జరుపవచ్చును.*

సర్వశక్తిగల దేవుడు తన కృపవల్ల నీకు చల్లని కానుపు దయచేసి ప్రసవమువల్ల కలుగు గొప్ప ఉపద్రవమునో నుండి నిన్ను తప్పించినాడు గనుక నీవు ఆయనకు నిండు మనస్సుతో కృతజ్ఞతాస్తుతులు చెల్లించి చెప్పవలసిన దేమనగా:

*అప్పుడు 116 లేక 127 సంకీర్తన చెప్పవలెను.*

*అంతట బోధకుడు చెప్పవసినది:*

## ప్రార్థింతము

ప్రభువా, మమ్మును కనికరింపుము.

క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

ప్రభువా, మమ్మును కనికరింపుము.

ప్రభువు ప్రార్థన

సేవకుడు:– ఓ ప్రభువా, ఈ నీ సేవకురాలిని రక్షింపుము,

ఉత్తరము:– ఈమె నిన్ను నమ్ముకొనుచున్నది.

సేవకుడు:– ఈమె శత్రువు ఎదుట

ఉత్తరము:– ఈమెకు బలమైన కోటగా నుండుము.

సేవకుడు:– ప్రభువా, మా ప్రార్థన ఆలకింపుము.

ఉత్తరము:– మా మొర నీ యొద్దకు చేరనిమ్ము.

సోవకుడు:– ప్రార్థింతము.

ఓ సర్వశక్తిగల దేవా, ఈ నీ సేవకురాలిని ప్రసవమువల్ల కలిగిన గొప్ప వేదననుండియు ఉపద్రవమునుండియు తప్పించుటకు కృప అనుగ్రహించినావు గనుక నీకు వినయముతో కృతజ్ఞతాస్తుతులను చెల్లించుచున్నాము. మిక్కిలి కనికరముగల తండ్రీ,

నీ సహాయముచేత ఈమె యిహమందు నమ్మకముగా ప్రవర్తించి, నీ చిత్తప్రకారము నడుచుకొనునట్లును పరమందు నిత్యమహిమలో పాలు పొందు నట్లును పరమందు నిత్యమహిమలో పాలు పొందునట్లును దయచేయు మని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను బ్రతిమాలు కొను చున్నాము, ఆమేన్.

ఓ దేవా! పరలోకపు తండ్రీ, ఈ నీ సేవకురాలికి ఒక బిడ్డను అనుగ్రహించి నందుకై నీ మహిమగల నామమునకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. ప్రభువా ఈమెయు ఈమె భర్తయు, ఈ బిడ్డ తమకు ఆశీర్వాదముగాను నీ నామమునకు మహిమగాను ఉండునట్లు అతనిని (ఆమెను) నీతిమార్గమందు పెంచులాగున వీరికి వివేక మనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

*ఒకవేళ బిడ్డ చనిపోయియుండిన యెడల పై ప్రార్థనకు ప్రతిగా ఈ దిగునవ ప్రార్థన చదువవచ్చును.*

ఓ దేవా, నీ మార్గములు అగోచరములు, నీ కార్యములు బహు ఆశ్చర్యముగా ఉన్నవి. నీవు ఏ కార్యమును నిరర్థకముగా జేయవు. నీవు సృజించిన వాటినన్నిటిని ప్రేమించుచున్నావుగదా. బహుగా గాయపరచబడి వ్యాకులములోనున్న ఈ నీ సేవకురాలి హృదయ మును నీవే ఓదార్చుము. ఈమె రాబోవు లోకములో నీ వాగ్దానము లను సంపూర్ణముగా పొందునట్లు నిన్ను ఈ లోకమందు ప్రేమించి సేవించులాగున దయచేయుమని మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ఆశీర్వాదము

దేవుని దయాదాక్షిణ్యములకును, ప్రాపునకును నిన్ను అప్పగించుచున్నాము. ప్రభువు నిన్ను ఆశీర్వదించి కాపాడునుగాక. ప్రభువు తన ముఖమును నీ మీాద ప్రకాశింపచేసి నీయందు దయ యుంచునుగాక. ప్రభువు తన ముఖకాంతిని నీ మీాద ప్రకాశింపచేసి యిప్పుడును ఎల్లప్పుడును నీకు సమాధానము దయచేయును గాక, ఆమేన్.

*కృతజ్ఞత కానుక అర్పించవచ్చును.*

# జన్మదినారాధన క్రమము

*జన్మదినము తటస్థించిన కుటుంబపు వారందరు నియమింపబడిన గడియ బంధు మిత్రాదులతోపాటు తమ యింటియొద్ద నీ దిగువ రీతిని ఆరాధన జరుపుట యుక్తము. చిన్నపిల్లల జన్మదినమైనచో ఇంటిలో నా దినమున క్రీస్తు చిన్న పిల్లల నాశీర్వదించుటను సూచించు పటము గోడకు తగిలించుట మంచిది.*

ఆరాధన

## దైవాహ్వాన కీర్తన

వేదపాఠము:

*ఇచట నుదహరింపబడిన దానిలో నొక పాఠమును చదువవలెను.*

పిల్లలకు: 1 సమూయేలు 1:24-28; మార్కు 10:13-16.

పెద్దలకు: ద్వితీ. 8:1-18; యెషయా 26:1-12; కీర్తన 65, 127,128

ఎవరికైనను: కీర్తన 103.

సంగ్రహ హెచ్చరిక :

*ఇచట బోధకుడు తల్లిదండ్రుల నిధుల గూర్చిగాని, క్రీస్తుకు చిన్న బిడ్డల యెడలగల ప్రేమను గూర్చిగాని, పెద్దవారి జన్మదిన మయిన యెడల కృతజ్ఞత చెల్లించుటను గూర్చిగాని క్లుప్తముగా మాటలాడవచ్చును.*

*బోధకుడు అడగవలసినది:*

I. పిల్లలకు

బో:- ఈ బిడ్డయొక్క బాప్తిస్మ కాలమున మీరు ఇతనికి (ఈమెకు) బదులుగ చేసిన ప్రమాణములను జ్ఞాపకముంచుకొని యున్నారా?

త|| ద||:- అవును. జ్ఞాపకముంచుకొన్నాము.

బో:- ఆ గంభీరమైన ప్రమాణములను మనస్సునందుంచుకొని ఈ బిడ్డను దైవ భయములోను భక్తిలోను పెంచుటకై మీరు సర్వ విధముల ప్రయత్నింతురా?

త||ద||:- అవును. దేవుని సహాయముతో ఆలాగే పెంచుటకు ప్రయత్నింతుము.

II పెద్దలకు

బో:- నీ నిర్ధారణ కాలమున నీ వలన చేయబడిన ప్రమాణములను జ్ఞాపకముంచుకొని యున్నావా?

పు||స్త్రీ:- అవును, జ్ఞాపకముంచుకొన్నాను.

బో:- ఆ గంభీరమైన ప్రమాణములను మనస్సునందుంచుకొని దేవుని సహాయముతో ఈ నూతన సంవత్సరములో నూతన క్రైస్తవ జీవితము జయకరముగా జీవించుటకు ప్రయత్నించెదవా?

పు॥స్త్రీ:- అవును, దేవుని సహాయముతో ఆలాగే జీవించుటకు ప్రయత్నించెదను

కృతజ్ఞతా కానుక సమర్పణ.

**ప్రార్థన:**

స్తోత్రగీతము లేక కీర్తన

**దీవెన.**

# రోగుల కొరకు వేద పాఠములును ప్రార్థనలును

## I. శ్రమలు, వాని లాభములు

సంకీర్తలు 27; 30; 42

### పాఠములు

యాకోబు 5:14-16; యిర్మియా 29:11-14; విలాప. 3:18-33; మత్తయి 8:1-13; యోహాను 5:1-14; హెబ్రీ 12:6-13; యాకోబు 1:2-12; 1పేతురు 1:3-25; 4:1-19;

### వాక్యములు

నీతిమంతునికి కలుగు ఆపదలు అనేకములు. వాటి యన్ని టిలోనుండి యెహోవా వాని విడిపించును. కీర్తన 34:19.

అంతేకాదు. శ్రమ ఓర్పును; ఓర్పు పరీక్షను; పరీక్ష నిరీక్షను కలుగజేయునని ఎరిగి శ్రమలయందును అతిశయపడుదము. మన హృదయములలో కుమ్మరింపబడియున్నది. కనుక ఈ నిరీక్షణ మనలను సిగ్గుపరచదు. రోమా 5:3-5.

మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ ఎదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్న తగినవి కావని ఎంచుచున్నాను. రోమా8:18.

గురువు:- నిత్యుడవయిన దేవా! కరుణగల తండ్రీ! మా అక్కరల యందును, దుఃఖముల యందును, మమ్మును ఆదరించి సంరక్షించుచు పాప విషయములో తప్ప సమస్త విషయము లలోను మావలెనే శోధింపబడి మా బలహీనతలయందు మాతో సహానుభవము కలవాడై యుండు నమ్మకమయిన ప్రధాన యాజకుడుగా నీ కుమారుని మా కనుగ్రహించియున్నావు. భారమైన నీ హస్తముక్రింద పడిబాధపడుచున్న ఈ మా సోదరునికి (సోదరికి) తన పాపములనుబట్టి తీర్పు విధింపక నీ పరిశుద్ధాత్మునివలన ఈయనను (ఈమెను) ఆదరించి విశ్వాస మందును, ఓర్పునందును బలపరచి ఈ వ్యాధి నీ మహిమార్థ మును ఈయన (ఈమె) రక్షణార్థమును పరగునట్లు దయచేయు మని పరమ వైద్యుడును మా సోదరుడును ప్రభువునైన యేసు క్రీస్తుద్వారా నీ బిడ్డలమగు మేము మా సోదరుని (సోదరి) నిమిత్తము బ్రతిమాలుకొనుచున్నాము, ఆమేన్.

## II. పాపజ్ఞానమును, పశ్చాత్తాపమును

సంకీర్తనలు 6; 31; 38; 51; 88; 102; 130; 138; 139; 143.

**పాఠములు**

యిర్మియా 30:12-15,17; విలాప. 3:37-44; 55-58; యెహెజ్కేలు 18:19-24; దానియేలు 9:4-19; లూకా 13:1-19; ప్రక 2:1-17; 3:1-6;

**వాక్యములు**

మనము పాపములేని వారమని చెప్పుకొనిన యెడల మనలను మనమే మోసపుచ్చుకొందము. మరియు మనలో సత్య ముండదు. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మతగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపము లను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. 1 యోహాను 1:8,9.

నేను లేచి నా తండ్రియొద్దకు వెళ్లి - తండ్రీ, నేను పరలోకము నకు విరోధముగాను నీ యెదుటను పాపము చేసితిని.

- లూకా 15:18.

మే మందరము అపవిత్రుల వంటి వారమయితిమి. మా నీతి క్రియ లన్నియు మురికి గుడ్డవలె నాయెను; మేమందరము ఆకువలె వాడిపోతిమి. గాలివాన కొట్టుకొనిపోవునట్లుగా మా దోషములు మమ్మును కొట్టుకొని పోయెను. యెహోవా! అత్యధికముగా కోపపడకుము; మేము చేసిన దోషమును నిత్యము జ్ఞాపకము చేసికొనకుము. - యెషయా 64:6-9.

ప్రార్థన

పరిశుద్ధుడవగు కరుణగల తండ్రీ! నా పాపములను బట్టి ఈ వ్యాధి నేను అనుభవింపవలసి యున్నదేయని శిక్షింపబడి పరితపించుచున్న హృదయముతో ఒప్పుకొనుచున్నాను, గాని నీ దివ్య ప్రభావమునకు కోపము పుట్టించి నే నీ శ్రమను దెచ్చుకొంటినని నిండు మనస్సుతో దుఃఖించుచున్నాను. నా శ్రమను బాధను చూచి విరిగిన నా హృదయమును కుదుర్చుము. నా ప్రభువు యేసుక్రీస్తు మూలమున నా పాపములన్నియు క్షమించి సమస్త దుర్నీతినుండి నన్ను పవిత్రపరచుము, ఆమేన్.

## III. క్రీస్తునందలి విశ్వాస మూలమున పాపక్షమాపణను గూర్చిన స్థిర నమ్మకము

సంకీర్తనములు 25, 40, 77

**పాఠములు**

మత్తయి 9:1-8; లూకా 7:36-50; 15:1-10; 11-32; యోహాను 14, 15, 16, 17 అధ్యాయములు; రోమా 3:23-28; 10:9-13;

**వాక్యములు**

నిశ్చయముగా నతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. మన యతిక్రమ క్రియలనుబట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగ గొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష యతని మీదపడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మన మందరము గొఱ్ఱెల వలె త్రోవ తప్పిపోతిమి. యెహోవా మన యందరి దోషమును అతని మీద మోపెను. -యెషయా 53:4-6

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకురండి; నేను మీకు విశ్రాంతి కలుగచేతును. మీ మీద నా కాడి యెత్తుకొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి. -మత్తయి 11:28-30.

పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది.

- 1 తిమోతి 1:15.

ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను; ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నే నతని యొద్దకు వచ్చి యతనితో నేనును నాతోకూడ నతడును భోజనము చేయుదుము. -ప్రకటన 3:20.

## ప్రార్థన

ఓ ప్రభువైన యేసుక్రీస్తూ! “ప్రయాసపడి భారము మోసి కొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును” అని నీవే

సెలవిచ్చియున్నావు. కాబట్టి బాధలో నున్న ఈ మా సోదరుని (సోదరి) నిమిత్తమై విజ్ఞాపనములతో నిన్ను సమీపించుచున్నాము. ఓ ప్రభువైన క్రీస్తూ! ఈయనను (ఈమెను) కరుణింపుము. ముందుగా ఈయన (ఈమె) మీదనుండి పాప భారమును తొలగింపుము. ఎందుచేతననిన నీవు లోకమంతటి పాపమును మోసికొని పోవు దేవుని గొఱ్ఱెపిల్లవై యున్నావు. పాపము విస్తరించిన చోట కృప అంతకంటె విస్తరించునట్లు ఈయన (ఈమె) పాపములకును దైవోగ్రతకును మధ్యను సిలువ శ్రమ మరణముల నుంచి ఈయనను (ఈమెను) కాపాడుము. ఈయనకు (ఈమెకు) తగినట్లు ఈయన (ఈమె) యెడల జరిగింపక నీవు క్రయమిచ్చి కొన్నందున ఈయన (ఈమె) విషయమైన విజ్ఞాపనము చేసి నీ మూలమున తండ్రిని జేరు మార్గము కనుగొని నిత్యజీవనము నొందునట్లు దయచేయము, ఆమేన్.

## IV. శ్రమయందు ఓర్పును, దేవుని సహాయమందు నమ్మకమును

సంకీర్తనములు 13, 17, 23, 27, 34, 42, 62, 63:1-9; 71, 91 121

### పాఠములు

లూకా 11:1-13; 18:1-8; అపో.కార్య 3:1-10; రోమా 5:1-5; 8:18-27; 8:28,39; 14:7-9; 2కొరింథీ 1:3-7; 4:7-18; యాకోబు 5:7-11; కీర్తన 10:17,18; 37:5; 50:15; 68:20,21; 138:7,8; యెషయా 30:15; 40:29-31; 41:10; 42:3; 43:1-3; 49:13-16; మత్తయి 16:24; 24:13; రోమా 12:12;

### వాక్యములు

ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొరబెట్టుము; నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను మహిమ పరచెదవు. కీర్తన 50:15.

నేను ఆపదలో చిక్కుబడియున్నను, నీవు నన్ను బ్రతికించె దవు. నా శత్రువుల కోపమునుండి నన్ను రక్షించుటకై నీవు నీ చేయి చాపెదవు. నీ దక్షిణ హస్తము నన్ను రక్షించును. యెహోవా నా పక్షమున కార్యము సఫలముచేయును. యెహోవా! నీ కృప నిరంతరముండును. కీర్తన 138:7,8.

భయపడకుము; నేను నీకు తోడైయున్నాను, దిగులు పడకుము; నేను నీ దేవుడనైయున్నాను; నేను నిన్ను బలపరతును; నీకు సహాయము చేయువాడను నేనే; నీతి యను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును. యెషయా 41:10.

ఓ ప్రభువా! పరలోకపు తండ్రీ! నీవు నమ్మతగిన దేవుడవు. మేము సహింపగలిగి నంతకంటె నెక్కువగా మమ్ము శోధింప బడనీయక, సహింప గలుగుటకు శోధనతోకూడ తప్పించుకొను మార్గము కలుగ చేయుచున్నావు. కాయిలాగానున్న ఈ మా సోదరుని (సోదరిని) కష్టమందును బాధయందును సిలువ భరింపలేనంత భారము కాకుండ జేయుమని ఈయన (ఈమె) కొరకు ప్రతిమాలు కొనుచున్నాము. నీ కృపనుగూర్చి నిరాశ చెందక దీనిని శాంతముతో సహించునట్లు ఈయనను (ఈమెను) బలపరచుము, ఆమేన్.

## V. మరణమునకు సిద్ధపడుట

సంకీర్తనములు 89,90

**పాఠములు**

యోబు 14:1–5; యెషయా 38:1–8; 40:6–8; 2కొరింథీ 5:1–10; ఫిలిప్పీ1:21–30; లూకా 2:25–32.

**వాక్యములు**

నా యాత్మను నీ చేతికి అప్పగించుచున్నాను. యెహోవా సత్యదేవా, నన్ను విమోచింపు వాడవు నీవే. కీర్తన 31:5.

నే నిప్పుడే పానార్పణముగా పోయబడుచున్నాఉ. నా నిర్యాణ కాలము సమీపమైయున్నది. మంచి పోరటము పోరాడితిని. నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని. ఇక మీదట నా కొరకు నీతి కిరీట ముంచబడియున్నది. ఆ దినమందు నీతి గల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకును, నాకు మాత్రమే కాకుండా తన ప్రత్యక్షత నపేక్షించువారి కందరికిని అనుగ్రహించును. 2 తిమో4:6–8;

**ప్రార్థన**

సర్వశక్తుడవును నిత్యుడవునైన మిక్కిలి కరుణగల దేవా! మేము ఎడతెగని పాపమువలన నశించి పోకుండ నిత్యజీవములో ప్రవేశించునట్లు భ్రష్టమైయున్న ఈ పాపలోకమునుండి మరణము ద్వారా మమ్మును నీ యొద్దకు పిలుచుకొని అంగీకరించుచున్నావు. ఈ యెడబాపునుగూర్చి ఆనందించుచు నీవు పిలిచినప్పుడు నిత్య రాజ్యములో సంతోషముతో ప్రవేశించుటకై మేమీ విషయమును గ్రహించి పూర్ణాత్మతో నమ్మునట్లు సహాయము చేయుమని నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## VI. పునరుత్థాన నిత్య జీవములను గూర్చిన నిరీక్షణ

సంకీర్తనములు 116,126

**పాఠములు**

ప్రకటన 3:7-13; 7:13-17; 21:1-7; 22:1-5;

యోహాను 5:24-29; 14:1-14;

**వాక్యములు**

యెహోవా విమోచించినవారు పాటలు పాడుచు తిరిగి సీయోనుకు వచ్చెదరు. వారి తలలమీద నిత్యానందముండును; వారు ఆనంద సంతోషములు గలవారై వచ్చెదరు. దుఃఖమును నిట్టూర్పును ఎగిరిపోవును. యెషయా 35:10.

అయినను పాతాళవశములోనుండి నేను వారిని విమో చింతును; మృత్యువునుండి వారిని రక్షింతును. మృత్యువా! నీబాధ లేమాయెను? పాతాళమా నీ చేతి నాశనమేమాయెను? హోషేయ 13:14.

నేను పునరుత్తానమును, జీవమునై యున్నాను; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును. బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడు ఎన్నటికిని చనిపోడు. యోహాను 11:25,26

**ప్రార్థన**

ఓ నిజమైన రక్షకా! యేసుక్రీస్తూ! లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లా! నీ రక్తమువలన నన్ను కడిగి పవిత్ర పరచి యున్నావు. కఠినములైన నీ శ్రమలను బట్టియు, ముఖ్యముగా నీ యాత్మ శరీరమునుండి వెడలి పోవునప్పుడు నీ వనుభవించిన అత్యంత వేదనను బట్టియు, మరణ సమయమందు కృశించిన నా యాత్మను కరుణించి నన్ను నిత్య జీవమున చేర్చుమని నిరంతరము జీవించి ఏలుచున్న నిన్ను బ్రతిమాలు కొనుచున్నాను, ఆమేన్.

# మృతుల భూస్థాపన క్రమము

*క్రైస్తవ విశ్వాసమునందు మృతి నొందినవారిని భూస్థాపన చేయునపుడు మాత్రమే ఈ క్రమమును ఉపయోగింపవలెను.*

*సభలో నెవ్వరైనను చనిపోయినయెడల వెంటనే సంఘాధ్యక్షునికి తెలియజేయ వలెను. ఆయనతో ఆలోచించకుండ సమాధి నిమిత్తము ఏ యేర్పాటులను చేయగూడదు.*

*ఈ క్రమమును భూస్థాపనకు పూర్వము ఆలయమునొద్దగాని యింటి యొద్ద గాని ఉపయోగింపవచ్చును.*

*క్రైస్తవు లెవరైన మృతినొందినపుడు చావుగంట కొట్టించవలెను.*

*విశేష కారణములనుబట్టి తప్ప ఈ దిగువ నుదహరింపబడిన యారాధన క్రమమును తప్పక ఉపయోగించవలయును.*

*ఆరాధన కీర్తనతో ఆరంభము కావలెను*

*కీర్తన*

బో:– తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

*ఇచ్చట ఈ క్రింది దావీదు కీర్తనలలో నొకటి చెప్పవలెను.*

దావీదు కీర్తనలు 23, 90, 130

*అంతట ఈ దిగువ సూచింపబడిన పరిశుద్ధ లేఖనములలో నొక దానిని గాని కొన్నిటిని గాని చదువవలెను.*

| | | | |
|---|---|---|---|
| మత్తయి | 9:18,19,23-36. | రోమా | 8:31-39. |
| మార్కు | 10:13-16. | 1కొరింథీ | 15:12-26, 35-58. |
| లూకా | 7:11-17. | 2కొరింథీ | 5:1-10. |
| యోహాను | 5:19-29. | 1థెస్స | 4:13-18. |
| ” | 11:21-27. | 1పేతురు | 1:3-9. |
| ” | 14:1-6. | ప్రకటన | 7:9-17, 21:3-7 |

*ఇచ్చుట ఒక ప్రత్యుత్తర వాక్యము చదువవలెను.*

## ప్రత్యుత్తర వాక్యములు

### I

మనము దేవునివలన మేలు ననుభవించెదమా । కీడును మన మనుభవింప తగదా?

యెహోవా ఇచ్చెను. యెహోవా తీసికొనిపోయెను. యెహోవా నామమునకు స్తుతి కలుగు గాక.

### II

నా విమోచకుడు సజీవుడనియు, తరువాత ఆయన భూమి మీద నిలుచుననియు నే నెరుగుదును.

శరీరముతో నేను దేవుని చూచెదను.

నా మట్టుకు నేను చూచెదను.

మరి యెవరు కాక నేనే కన్నులార ఆయనను చూచెదను.

శరీరముతో నేను దేవుని చూచెదను.

### III

యేసు మృతిబొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల అదే ప్రకారము యేసునందు నిద్రించనవారిని దేవుడు ఆయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. కావున, నిరీక్షణలేని యితరుల వలె మీరు దుఃఖపడకుడి.

ఆదామునందు అంద రేలాగు మృతి నొందుచున్నారో ఆలాగుననే క్రీస్తునందు అందరును బ్రతికింపబడుదురు.

కావున నిరీక్షణ లేని యితరులవలె దుఃఖపడకుడి.

### IV

నీతిమంతు డెట్లు మృతిబొందునో చూడుము. ఎవరును దానిని మనస్సున బెట్టరు. భక్తులైనవారు తీసికొని పోబడు చున్నారు. కీడు చూడకుండ నీతమంతులు తీసికొని పోబడు చున్నారని ఎవరికిని తోచదు.

అతని జ్ఞాపకము సమాధాన యుక్తమగును.

అతడు సమాధానముతో భూమియందు విశ్రాంతి పొందును.

అతని నివాసస్థలము సీయోనులో నున్నది.
అతని జ్ఞాపకము సమాధాన యుక్తమగును.

V

నెమ్మదితో పండుకొని వెంటనే నిద్రపోవుదును.

మనలో నెవడును తనకొరకు బ్రతుకడు, ఎవడును తనకొరకు చనిపోడు.

మనము బ్రతికినను చనిపోయినను ప్రభువువారమై యున్నాము.

మనలో నెవడు తన కొరకు బ్రతుకడు. ఎవడును తన కొరకు చనిపోడు.

**కీర్తన**

## ప్రసంగము

*అంతట సభ లేచి ఈ దిగువ ప్రార్థననైనను లేక ఇతర ప్రార్థనల నయినను చెప్పవలెను*

బో:– పరలోకమందున్న తండ్రియైన దేవా,

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– లోక విమోచకుడవగు కుమారుడవైన దేవా,

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– ఆదరణ కర్తయగు పరిశుద్ధాత్ముడవైన దేవా,

సభ:– నీ సమాధానమును మాకు దయచేయుము.

*అంతట బోధకుడు ఈ దిగువ సంగ్రహ ప్రార్థనలలో కొన్నిగాని చేయవలెను.*

సర్వశక్తిగల దేవా, మేము సాతాను అధికారమునుండి విడిపింపబడునట్లు అనిత్యములైన మా శరీరమును మృతులలో నుండి లేపబడునట్లును నీవు నీ కుమారుని మరణమువలన పాపమును మరణమును నశింపజేసి ఆయన పునరుత్థానము వలన నిర్దోషత్వ మును నిత్యజీవమును మరల మా కనుగ్రహించియున్నావు. కావున మేము మా పూర్ణ హృదయముతో దీనిని రూఢిగా నమ్మి తుదకు నీ పరిశుద్ధులందరితో నీతిమంతుల ఆనందరకమైన పునరుత్థానములో పాలుపొందునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువు నైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ దేవా, మా పరలోకపు తండ్రీ, యేసునందు నిద్రించు వారి విషయమై అధికముగా దుఃఖపడకూడదని అపోస్తలుడైన పౌలు ద్వారా మాకు తెలియపరచితివి. కావున, మేము ఈ బ్రతుకు చాలించిన తరువాత నీ పరిశుద్ధులందరితో నిత్యానందములోనికి చేర్చుకొనబడునట్లు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

సర్వశక్తిగల దేవా, ప్రభువునందు మృతినొందినవారి యాత్మలు నీయొద్ద నున్నవి. విశ్వాసుల యాత్మలు దేహమను ఈ గుడారమును విడిచిపెట్టిన తరువాత నీతో ఆనందించుచున్నవి. తమ విశ్వాసపు పరుగును తుదముట్టించి తమ ప్రయాసములు మాని విశ్రాంతిపొందుచున్న నీ సేవకులకు నీ వనుగ్రహించిన పని నిమిత్తము మేము హృదయపూర్వకమైన వందనములు చెల్లించుచున్నాము. నీ పరిశుద్ధ నామమందు విశ్వసించి మృతులైన వారందరితో పాటు నీ నిత్య మహిమలో శరీరాత్మలయందు పరిపూర్ణస్థితిని పరమానంద మును పొందునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

సర్వశక్తియు మిగుల కనికరముగల దేవా, మేము మా ప్రభువైన యేసుక్రీస్తుతో గలిసి నిత్య మహిమలో ప్రవేశింపక పూర్వము ఆయనతో కూడ శ్రమలును మరణమును అనుభవింపవలెనని నీవు నియమించి యున్నావు. మేము నీ పరిశుద్ధ చిత్తమునకు ఎల్లప్పుడును లోబడి మరణ పర్యంతము నిజమైన విశ్వాసమందు స్థిరులముగా నిలిచి మృతుల పునరుత్థానమును రాబోవు లోకమునందు మహిమయు కలుగునను శుభ నిరీక్షణవలన ఎల్లప్పుడు సంతోషమును సమాధానమును పొందునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు విచారగ్రస్తులను ఆదరించువాడవును, బలహీనులకు శక్తి నిచ్చువాడవునైయున్నావు. శ్రమలయందుగాని దుఃఖమునందుగాని యుండి నీకు మొఱ్ఱ పెట్టువారి ప్రార్థనలను దయతో నాలకించి వారు తమ అక్కరలన్నిటి యందు నీ యత్యధికమైన కృపనుగుర్తించి ఆదరణ పొందులాగున సాహాయము చేయుమని నీ కుమారుడను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## శిశువు భూస్థాపనకొరకైన ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రీ, నీ కుమారుడు చిన్నబిడ్డలను తన చేతులతో నెత్తుకొని పరలోక రాజ్యము ఈలాటివారిది అని దయతో సెలవిచ్చెను. పరిశుద్ధ బాప్తిస్మము ద్వారా నీవు అంగీకరించిన ఈ బిడ్డలు నిత్యజీవముకొరకు కాపాడబడి, నీ కనికరమువలన ఇచ్చట నిన్ను సేవించిన వారందరితో పాటు నీతిమంతుల ఆనందకరమైన పునరుత్థానములోను పరలోకపు స్వాస్థ్యమువలన కలుగు సౌఖ్యములోను పాలుపొందుటకై ఇతడు (ఈమె) ఇహలోక దుఃఖములనుండియు, శోధనలనుండియు తప్పింప బడియున్నాడని (యున్నదని) మేము రూఢిగా నమ్మునట్లు మాకు సాహాయము చేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఇచ్చట ప్రత్యేకమైన ప్రార్థనలు మనవులు చేయవచ్చును. పిమ్మట ఈ దిగువవచ్చు సంగ్రహ ప్రార్థన చేయవలెను.

ఓ ప్రభువైన యేసుక్రీస్తూ, నీవు బ్రతికియుండు వారిని చని పోయిన వారిని విమర్శించుటకై తిరిగివచ్చి నిత్య జీవార్థమైన పునరుత్థా నమునకైనను, శిక్షావిధికైన పునరుత్థానమునకైనను సమాధులలో నిద్రించుచున్న వారి నందరిని బయటికి రమ్మని పిలిచెదవు. మేము నిరంతరము నీతోకూడ నుండి జీవించునట్లు మాయందు కనికర ముంచి మమ్మును నిత్యజీవమునకై లేపుమని తండ్రితోను పరిశుద్ధాత్మ తోను సదా ఏక దేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నిన్ను వేడుకొనుటున్నాము, ఆమేన్.

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసిన వారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధము లను క్షమించుము. శోధనలోకి తేక దుష్టునినుండి మమ్ములను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

### ఆశీర్వాదము

మన ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికి తోడైయుండునుగాక, ఆమేన్.

## సమాధియొద్ద జరుపబడు ఆరాధన

*దేహమును సమాధిలో నుంచిన తరువాత బోధకుడు ఈ దిగువ వాక్యములను చెప్పవలెను*

**వాక్యములు**

ఇప్పటినుండి ప్రభువునందు మృతునొందు మృతులు ధన్యులని వ్రాయుమని పరలోకమునుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురని ఆత్మ చెప్పుచున్నాడు.

నేనే పునరుత్థానమును జీవమునై యున్నాడు; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును. బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు.

మృతులలోనుండి యేసును లేపినవాని ఆత్మ మీలో నివసించిన యెడల మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు చావునకు లోనైన మీ శరీరములనుకూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును.

*పై వాక్యముల నుపయోగించనియెడల బోధకుడు ఈ దిగువ వాక్యములను ఉపయోగించవలెను:*

సజీవులమై యుండియు మనము మరణమునకు లోనై యున్నాము. మా పాపముల నిమిత్తము మా మీద న్యాయ ప్రకారము కోపమునొందు ఓ ప్రభువా, సహాయమునకై నిన్నుగక మఱి యెవ్వరి నాశ్రయింతుము?

అయినను మిక్కిలి పరిశుద్ధుడవగు ఓ ప్రభువైన దేవా, సర్వశక్తిగల ప్రభువా, మనిక్కిలి కరుణగల ఓ పరిశుద్ధ రక్షకుడా, నిత్య మరణముయొక్క ఘోరబాధలకు మమ్మును అప్పగింపకుము.

*అంతట బోధకుడు ఇట్లు చెప్పవలెను:*

గతించిపోయిన మన సహోదరుని (సహోదరి) యాత్మను సర్వశక్తిగల దేవుడు తన మహాకృపచేత తనయొద్దకు చేర్చుకొనుటకు అనుగ్రహించియున్నాడు. కావున సమస్తమును తనకు లోబఱచు కొనజాలిన శక్తినిబట్టి మన దీనశరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపముగల దానినిగా మార్చెడు మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిత్యజీవార్థమై పునరుత్థానము కలుగునను నిరీక్షణతో ఈయన (ఈమె) శరీరమును మంటికి మన్నుగాను బూడిదకు బూడిదగాను దుమ్ముకు దుమ్ముగాను భూమికి అప్పగించు చున్నాము.

## కీర్తన

## ప్రార్థన

బో:– సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తునందు మృతి నొందు వారందఱు సమాధానమును నిరీక్షణయు కలిగియుండు నట్లు ఆయన మరణముచేత మరణమును నశింపజేసి, సమాధి యందు ఆయన పొందిన విశ్రాంతినిబట్టి నీ పరిశుద్ధుల సమాధు లను పరిశుద్ధపరచి ఆయన మహిమగల పునరుత్థానమువలన "జీవమును అక్షయతను వెలుగులోనికి తెచ్చియున్నావు." మా కొఱకును ఆయనయందు నిద్రించువారందఱికొరకును మరణము మీదను సమాధి మీదను ఆయన పొందిన విజయము నిమిత్తమై మా హృదయ పూర్వకములైన వందనములను అంగీకరింపుము. ఇంకను శరీరముతో నున్న మమ్మును భూమిమీద నీ కొఱకు కనిపెట్టుకొనుచున్న వారియొక్కయు పరలోకమందు నిన్ను చుట్టుకొనియుండు వారందఱియొక్కయు నిత్య సహవాసమందును పునరుత్థానమును జీవమునైన నీ కుమారుడును మా ప్రభువునైన యేసు క్రీస్తు తోడి ఐక్యమందును కాపాడుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువైన యేసుక్రీస్తూ, నీ మరణమువలన మరణపు ముల్లు విరుగగొట్టి యున్నావు. దయగల ప్రభువా, మేము నీయందు నెమ్మదిగా నిద్రించి తుదకు నీవలె తిరిగి లేచునట్లు నీవు దారిచూపిన స్థలమునకు మేము విశ్వాసముతో నిన్ను వెంబడించులాగున నీ సేవకులమైన మాకు కృప దయచేయు మని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ఆశీర్వాదము

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందఱికి తోడైయుండును గాక, ఆమేన్.

లేక

గొర్రెల గొప్ప కాపరియైన యేసు అను మన ప్రభువును నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమునుబట్టి మృతులలో నుండి లేపిన సమాధాన కర్తయగు దేవుడు యేసుక్రీస్తుద్వారా, తనదృష్టి కనుకూలమైన దాని మీలో జరిగించుచు ప్రతి మంచి విషయము లోను తన చిత్తప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపరచునుగాక, యేసుక్రీస్తుకు యుగయుగములు మహిమ కలుగునుగాక, ఆమేన్.

# లూథరు చిన్న ప్రశ్నోత్తరి

*పెద్దలు తమ కుటుంబములలో నేర్పవలసిన క్రమము:*

## మొదటి ముఖ్య భాగము

## దేవుడు దయచేసిన పది యాజ్ఞలు

### 1-వ యాజ్ఞ

నీ దేవుడనైన యెహోవాను నేనే; నేను తప్ప వేరొక దేవుడు నీ కుండగూడదు. పైన ఆకాశమందైనను క్రింద భూమియందైనను భూమిక్రింద నీళ్లయందైనను నుండు దేని రూపమునుగాని విగ్రహ మునుగాని నీవు చేసికొనగూడదు; వానికి సాగిలబడగూడదు. వానిని పూజింపగూడదు.

### దాని కర్థమేమి?

మనము సమస్తమైన వానికంటె దేవునికి భయపడి, ఆయనను ప్రేమించి నమ్మియుండవలెను.

### 2-వ యాజ్ఞ

నీ దేవుడైన యెహోవా నామమును వ్యర్థముగా నుచ్చరింప గూడదు; యెహోవా తన నామమును వ్యర్థముగా నుచ్చరించు వానిని నిర్దోషిగా నెంచడు.

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, ఆయన పేరట శపింపకయు, ఒట్టు పెట్టుకొనకయు, మంత్ర తంత్రములు చేయకయు, అబద్ధమాడకయు, వంచన చేయకయు, సకల శ్రమల యందు ఆయనను పేరుపెట్టి పిలిచి, వేడుకొని, స్తుతించి, కృతజ్ఞత నగపరచవలెను.

### 3-వ యాజ్ఞ

విశ్రాంతి దినము పరిశుద్ధముగా నాచరించుటకు జ్ఞాపకముంచుకొనుము.

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, సువార్త ప్రసంగమును గాని ఆయన వాక్యమునుగాని తిరస్కరింపక, పరిశుద్ధ ముగా నెంచి సంతోషముతో విని నేర్చుకొనవలెను.

### 4-వ యాజ్ఞ

నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతు డగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము.

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన తల్లిదండ్రులను అధికారులను తిరస్కరింపకయు, వారికి కోపము పుట్టింపకయు, వారిని ఘనముగానెంచి, సేవించి, వారికి లోబడి, వారియెడల ప్రేమను మర్యాదను అగపరచవలెను.

### 5-వ యాజ్ఞ

## నరహత్య చేయగూడదు

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన పొరుగువాని శరీరమునకు హానియైనను ఆపదనైనను కలుగజేయక, సమస్త శరీర సంకటములయందు వానికి సాహాయ్యమును ఉపకార మును చేయవలెను.

### 6-వ యాజ్ఞ

## వ్యభిచరింపగూడదు

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మాటలయందును క్రియలయందును, చిత్తశుద్ధియు, శరీరశుద్ధియు గలవారమై నడచుకొనవలెను. మరియు భార్యాభర్త లొకరి నొకరు ప్రేమించి సన్మానింపవలెను.

### 7-వ యాజ్ఞ

## దొంగిలగూడదు

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన పొరుగువాని సొమ్మునైనను సొత్తునైనను దొంగిలింపకయు, మోసమైన సరకులచేతను వర్తకముచేతను వానిని మన వశము చేసికొనకయు, వాని యాస్థిని జీవనోపాయమును అభివృద్ధి పొందించి కాపాడుటలో వానికి సహాయము చేయవలెను.

### 8-వ యాజ్ఞ

## నీ పొరుగువానిమీద అబద్ధసాక్ష్యము పలుకగూడదు

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన పొరుగువానికి విరోధముగా అబద్ధమాడకయు, ద్రోహము చేయకయు, కొండెములు చెప్పకయు, వాని కపకీర్తి సంభవింప చేయకయు, అతని పక్షముగా మాటలాడి అతనినిగూర్చి మంచి మాటలు పలికి అతని ప్రవర్తనను గూర్చి ప్రేమగల భావము కలిగియుండవలెను.

### 9-వ యాజ్ఞ

## నీ పొరుగువాని యిల్లాశింపగూడదు

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన పొరుగువాని యింటిని స్వాస్థ్యమును తంత్రోపాయముచేత సంపాదించుటకును, అన్యాయము న్యాయమనిపించి వాని నాక్రమించుటకును కోరక, అవి అతనికి స్వాధీనముగా నుండుటకు మన మతని కనుకూలముగా నుండి, తగిన సాహాయము చేయవలెను.

### 10-వ యాజ్ఞ

నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని ఎద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువాని దగు దేనినైనను ఆశింపగూడదు.

### దీని కర్థమేమి?

మనము దేవునికి భయపడి ఆయనను ప్రేమించి, మన పొరుగువాని భార్యను లాలించి వశపరచుకొనకయు పనివారిని బలత్కారముగా తొలగింపకయు, పశువులను అక్రమముగా తోలుకొని పోకయు, వారును అవియు అతని యొద్దనుండి చేయవలసిన దంతయు చేయునట్లు మనము ప్రయత్నము చేయవలెను.

## ఈ ఆజ్ఞలన్నిటినిగూర్చి దేవుడు తెలియజెప్పినదేమి?

నీ దేవుడనైన యెహోవాయను నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారిలో మూడు నాలుగు తరములవారి పర్యంతము తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి నా యాజ్ఞలను గైకొనువారిని వెయ్యితరముల పర్యంతము కరుణించు వాడనై యున్నానని తెలియజెప్పెను.

### దీని కర్థమేమి?

దేవుడీయాజ్ఞలను మీరువారి నందరిని శిక్షించెదనని బెదరించుచున్నాడు. గనుక మన మాయన కోపమునకు భయపడి, యీ యాజ్ఞలకు విరోధముగా ప్రవర్తింపక యుండవలెను. అయినను ఈ యాజ్ఞలను గైకొను వారికందరకును కృపగలవాడనై సకలాశీర్వాదములను దయజేసెదనని వాగ్దానము చేయుచున్నాడు; గనుక మన మాయనను ప్రేమించి ఆయనయందు నమ్మకముంచి ఆయన యాజ్ఞల ప్రకారము సంతోషముతో చేయవలెను.

## రెండవ ముఖ్య భాగము

## విశ్వాస ప్రమాణము

### 1-వ యంశము

## సృష్టిని గూర్చినది

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రియైన దేవుని నేను నమ్ముచున్నాను.

### దీని కర్థమేమి?

దేవుడు నన్నును సమస్తమును కలుగజేసి, నాకు శరీరాత్మ లను, కన్నులు చెవులు మొదలైన సకలావయములను, బుద్ధిని సమస్తేంద్రియములను దయచేసి వానిని కాపాడుచున్నాడని నమ్ము చున్నాను. ఇంతేకాక, జీవమునకు కావలసినదంతయు, అనగా వస్త్రములును అన్నపానాదులును, ఇల్లు ఆవరణమును, భార్య పిల్లలను, భూమి పశువులను, మొదలైన సమస్త వస్తువులను ఆయన నాకు దయచేసి, నన్ను అనుదినమును నా అక్కరలను తీర్చుచు సకలాపాయములనుండి నన్ను తప్పించి, కీడులన్నిటినుండి నన్ను కాపాడి సంరక్షించుచున్నాడని నమ్ముచున్నాను. ఆయన యివి యావత్తు నా పుణ్యమును బట్టియు నా యోగ్యతను బట్టియు గాక తండ్రి భావముగల దైవ ప్రేమవలనను కృపవలనను దయచేయు చున్నాడు. కాబట్టి నే నీ సమస్తమును గూర్చి ఆయనకు కృతజ్ఞత నగపరచి, ఆయనను స్తుతించి సేవించి ఆయనకు లోబడుటకు బద్ధుడనై యున్నానని నమ్ముచున్నాను, ఇది వాస్తవమే.

## 2-వ యంశము

## విమోచనమును గూర్చినది

ఆయన యేక కుమారుదును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి, కన్యయైన మరియకు పుట్టి, పొందిపిలాతు అధికారము క్రింద శ్రమ పడి, సిలువ వేయబడి, చనిపోయి, సమాధి చేయబడెననియు, అదృశ్యలోకములోనికి దిగెననియు, చనిపోయినవారిలోనుండి మూడవ దినమున లేచి, పరలోకమునకెక్కి, సర్వశక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతి వైపున కూర్చుండి యున్నాడనియు సజీవులకును మృతులకును తీర్పు చేయుటకు అక్కడనుండి వచ్చుననియు నమ్ముచున్నాను.

## దీని కర్థమేమి?

తండ్రినుండి అనాదియందు పుట్టిన నిజమైన దేవుడును మరియ యను కన్యనుండి పుట్టిన నిజమైన మనుష్యుడునైన యేసుక్రీస్తు నా ప్రభువై యున్నాయని నమ్ముచున్నాను. తప్పిపోయి శిక్షకు విధింపబడిన మనుష్యుడనైన నన్ను ఈయన వెండి బంగారముల చేతగాక, వెలలేని తన పరిశుద్ధమైన రక్తము చేతను తాను పొందిన నిరపరాధ శ్రమ మరణములచేతను సమస్త పాపముల నుండియు మరణమునుండియు సాతాను అధికారము నుండియు విమోచించి, రక్షించి నన్ను సంపాదించుకొనెను. మరియు ఆయన మరణము నుండి లేచి నిరంతరము బ్రతికి యేలుటనుబట్టి, నేనును ఆయన వాడనైయుండి, ఆయన రాజ్యములో ఆయన చేతిక్రింద బ్రతికి నిత్యమైన నీతిని నిర్ధోషత్వమను మోక్షనందము కలిగిన వాడనై ఆయనను సేవించుటకు ఆయన యిదంతయు చేసెనని నమ్ముచున్నాను, ఇది వాస్తవమే.

## 3-వ యంశము

## పరిశుద్ధ పరచుటను గూర్చినది

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాపక్షమాపణయు, శరీర పునరుత్థాన మును, నిత్యజీవమును ఉన్నదని నమ్ముచున్నాను, ఆమేన్.

### దీని కర్థమేమి?

నేను నా స్వబుద్ధివలననైనను స్వశక్తి వలననైనను నా ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచి ఆయన యొద్దకు జేరనేలేను గాని, పరిశుద్ధాత్మ సువార్తవలన నన్ను పిలిచి, తన వరముల వలన నన్ను వెలిగించి, నిజమైన విశ్వాసమందు నన్ను పరిశుద్ధపరచి కాపాడుచున్నాడని నమ్ముచున్నాను. ఈలాగుననే యాయన భూమిమీదనున్న సమస్త క్రైస్తవ సంఘమును పిలిచి, తనచెంత చేర్చి, వెలిగించి పరిశుద్ధపరచి నిజమైన యేక విశ్వాసమందు యేసుక్రీస్తు నొద్ద కాపాడుచున్నాడు. ఆయన ఈ సంఘములో నా యొక్కయు విశ్వాసులందరియొక్కయు సమస్త పాపములను అనుదినము సంపూర్ణముగా మన్నించుచు అంత్య దినమందు నన్నును చనిపోయిన వారి నందరును లేపి, నాకును క్రీస్తునందు విశ్వాసముంచు వారందరకును, నిత్యజీవము దయచేయునని నమ్ముచున్నాను, ఇది వాస్తవమే.

## మూడవ ముఖ్య భాగము

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధపరచ బడుగాక. నీ రాజ్యము వచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెర వేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక; మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరాధములను చేసిన వారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

### ప్రభువు ప్రార్థన ఆరంభమేమి?

## పరలోకమందున్న మా తండ్రీ

### దీని కర్థమేమి?

ప్రియులైన పిల్లలు తమ ప్రియుడైన తండ్రిని వేడుకొను లాగున మనము సంతోషముతోను పూర్ణమైన నమ్మకముతోను దేవుని వేడుకొనునట్లు, ఆయన మనకు సొంత తండ్రి యనియు మన మాయనకు సొంత పిల్లలమనియు నమ్మవలెనని ఆయన యీ వాక్యమువలన మనలను చేరదీసికొనుచున్నాడు.

## 1-వ మనవి

# నీ నామము పరిశుద్ధ పరచబడుగాక

### దీని కర్థమేమి?

దేవుని నామము సహజముగ నిత్యము పరిశుద్ధమై యున్నది. అయిన నది మనలో గూడ పరిశుద్ధ పరచబడునట్లు ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

### అదెట్లు జరుగును?

దేవునివాక్య మెట్టి కల్పన లేకుండ శుద్ధముగా బోధింపబడుట వలనను మనము దేవుని పిల్లలముగా, దాని ప్రకారము పరిశుద్ధముగా ప్రవర్తించుట వలనను ఆయన నామము పరిశుద్ధ పరచబడును.

పరలోకమందున్న ప్రియమైన తండ్రీ, ఈలాగు చేయుటకు మాకు సహాయము చేయుము.

అయినను దేవుని వాక్య ప్రకారము బోధింపకయు నడుచుకొనకయు నుండువాడు మనమధ్య దేవుని నామమున పరిశుద్ధ పరచక దూషించువాడగుచున్నాడు.

పరలోకమందున్న మా తండ్రీ, మే మీలాగు చేయకుండ మమ్మును కాపాడుము.

## 2-వ మనవి

# నీ రాజ్యము వచ్చుగాక

### దీని కర్థమేమి?

దేవుని రాజ్యము మన ప్రార్థన లేక దానంతట అదే వచ్చును గాని, అది మన మధ్యకు గూడ రావలెనని ఈ మనవిలో వేడు కొనుచున్నాము.

### అదెట్లు జరుగును?

మనము దేవుని కృపవలన ఆయన పరిశుద్ధ వాక్యమును నమ్మి ఇహపరములందు దేవుని పోలిక కలిగినవారమై ప్రవర్తించుటకు పరలోకమందున్న తండ్రి మనకు తన పరిశుద్ధాత్మను దయచేసినప్పుడు ఆయన రాజ్యము వచ్చును.

### 3-వ మనవి

నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరుగాక

### దీని కర్థమేమి?

దేవుని కృపగల చిత్తము మన ప్రార్థన లేకయే నిజముగా జరుగుచున్నది. అయిన నది మన మధ్యగూడ జరుగవలెనని ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

### అదెట్లు జరుగును?

మనము దేవుని నామము పరిశుద్ధ పరచుటకును ఆయన రాజ్యము వచ్చుటకును ఆటంకముచేయు సాతాను, లోకము, మన శరీరము, వీని దుష్టాలోచనను చిత్తమును దేవుడాటంక పరచి కొట్టి వేసి, మరణ పర్యంతము మనలను తన వాక్యమందును సత్య విశ్వాసమందును దృఢపరచి కాపాడిన యెడల అది జరుగును. ఆయన కృపగల చిత్తమిదే.

### 4-వ మనవి

## మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము

### దీని కర్థమేమి?

దేవుడు మన ప్రార్థన లేకయే సకల దుర్మార్గులకు కూడ దినాహారము దయచేయుచున్నాడు. అయినను ఆయన కృపవలన దినాహారము దయచేయ బడుచున్నదని మనము తెలిసికొని దానిని కృతజ్ఞతతో ననుభవించు బుద్ధి ఆయున మన కనుగ్రహించవలెనని ఈ మనవిలో వేడుకొనుచున్నాము.

### దినాహార మనగా నేమి?

మన జీవమునకు కావలసినదంతయు; అనగా, అన్న పానాదులు, వస్త్రములు, ఇల్లు, ఆవరణము, భూమి, పశువులు, సొమ్ము, సొత్తులు, నమ్మకమైన పనివారు, మంచి స్నేహితులు, నమ్మకముగల పొరుగువారు, భక్తిగల యుత్తములైన యధికారులు, మంచి యేలుబడి, సౌఖ్యకాలములు, సమాధానము, ఆరోగ్యము, శిక్షణ, ఘనత ఈ మొదలైనవి దినాహార మనబడును.

5-వ మనవి

## మా యెడల అపరాధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధములను క్షమించుము.

దీని కర్థమేమి?

మనము దేవుని వేడుకొను దేనినైనను పొందుటకు పాత్రులము కాము; దానికి తగిన క్రియలు చేసినవారమును కాము; మరియు, మన మనుదినము విస్తారముగా పాపము చేసి శిక్షను మాత్రమే పొందవసియున్నాము గనుక, పరలోకమందున్న తండ్రి మన పాపములను జూచి, వానినిబట్టి ఈ మనవులు కొట్టివేయక, ఆయన తన కృపవలననే యదంతయు మనకు దయచేయవలయు నని ఈ మనవిలో వేడుకొనుచున్నాము. ఆలాగుననే మనముగూడ మనకు విరోధముగా పాపము చేయువారిని పూర్ణ మనస్సుతో మన్నించి, సంతోషముతో వారికి మేలుచేయుటకు ఇష్టపడియున్నామని ఈ మనవిలో ఒప్పుకొనుచున్నాము.

6-వ మనవి

## మమ్ము శోధనలోనికి తేకుము

దీని కర్థమేమి?

దేవుడు నిశ్చయముగా ఎవనిని పాపమునకు ప్రేరేపింపడు గాని సాతాను, లోకము, మన శరీరమనునవి మనలను అవిశ్వాసము నిరాశ మొదలైన గొప్ప దోషములకును దుర్మార్గములకును లోబరచి మోసపుచ్చకుండునట్లును, అవి మనల నెంతగా రేపి తొందర చేసినప్పటికిని మనము జయించి అంతమువరకు నిలుచునట్లును, దేవుడు మనలను తప్పించి కాపాడవలెనని యీ మనవిలో వేడుకొను చున్నాము.

7-వ మనవి

## కీడునుండి మమ్మును తప్పించుము

దీని కర్థమేమి?

పరలోకమందున్న తండ్రి శరీరమునకును ఆత్మకును ఆస్తికిని ఘనతకును వచ్చు కీడులన్నింటినుండి మనలను విడిపించి తుదకు మన యవసాన కాలము వచ్చునపుడు, మంచి చావు దయచేసి యీ కష్టలోకమునుండి పరలోకములో తనయొద్దకు కృపతే చేర్చుకొనవలెనని యీ మనవిలో వేడుకొనుచున్నాము.

ప్రభువుప ప్రార్థన ముగింపు

## రాజ్యమును, శక్తియు, మహిమయు నిరంతరము నీవియై యున్నవి. ఆమేన్.

### ఆమేన్ అనుమాట కర్థమేమి?

మన మీలాగు ప్రార్థింపవలెనని ఆయనే మన కాజ్ఞాపించి మన ప్రార్థనవిని దయచేసెదనని వాగ్దత్తము చేసెను గను, ఈ మనవులు పరలోకమందున్న తండ్రి కనుకూలముగా నున్నవనియు, ఆయన వీని నంగీకరించుననియు మనము నిశ్చయించుటకు, "ఆమేన్" అనుచున్నాము. ఆమేన్ అనుమాటకు నిజముగా ఆలాగు జరుగునను నర్థము.

## నాల్గవ ముఖ్య భాగము

## పరిశుద్ధ బాప్తిస్మ సంస్కార నియమము

### మొదటిది

### పరిశుద్ధ బాప్తిస్మమనగా నేమి?

పరిశుద్ధ బాప్తిస్మము వట్టి నీళ్లుమాత్రమే కాదుగాని దేవుని యాజ్ఞతో కూడి, ఆయన వాక్యముతో కలిసిన సంస్కారము.

### ఆ దేవ వాక్యమేది?

"మీరు సర్వలోకమునకు వెళ్లి, తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున సమస్త జనులకు బాప్తిస్మ మిచ్చుచు నేను మీ కేయే సంగతుల నాజ్ఞాపించితినో వాని నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుచు వారిని శిష్యులనుగా చేయుడి." అని మన ప్రభువైన క్రీస్తు చెప్పినది మత్తయి కడపటి అధ్యాయమందు కలదు.

### రెండవది

### పరిశుద్ధ బాప్తిస్మము వలననైన ప్రయోజనమేమి?

దానివలన పాప పరిహారము కలుగుచున్నది; మరణము నుండియు, సాతాను నుండియు విడిపింపబడుచున్నాము. దేవుని వాక్య వాగ్దత్తముల ప్రకారము నమ్మువారందరకు నిత్య మోక్ష మియ్యబడుచున్నది.

**దేవుడిచ్చిన యావాక్య వాగ్దత్తము లేవి?**

"నమ్మి బాప్తిస్మము పొందినవారు రక్షింపబడుదురు; నమ్మని వానికి శిక్ష విధింపబడు"నని మన ప్రభువైన క్రీస్తు చెప్పినది మార్కు కడపటి యధ్యాయమందు కలదు.

**మూడవది**

**ఇటువంటి ఘనమైన మేళ్లు నీళ్లచేత నేలాగు కలుగును?**

వట్టి నీళ్లచేత కలుగవుగాని, నీళ్లతో చేర్చబడిన దేవ వాక్యము చేతను నీళ్లతో చేర్చబడిన యీ దేవవాక్యమును విశ్వసించు విశ్వాసముచేతను ఈ ఘనమైన మేళ్లు కలుగును. ఎట్లనగా దేవ వాక్యము లేని నీళ్లు వట్టి నీళ్లు మాత్రమేగాని పరిశుద్ధ బాప్తిస్మము కాదు. అయినను దేవుని వాక్యముతో జేర్చబడిన నీళ్లే పరిశుద్ధ బాప్తిస్మము. అనగా కృపగల జీవపు నీళ్లును, పరిశుద్ధాత్మవలననైన పునర్జన్మము కలిగించు సంస్కారమునై యున్నవి.

**దీనిని గూర్చి పరి. పౌలు తీతునకు వ్రాసిన ఉత్తరము**

**మూడవ యధ్యాయమందు**

"మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజయుట ద్వారాను మనలను రక్షించెను. మన మాయన కృపవలన నీతిమంతు లమని తీర్చబడి నిత్యజీవమునుగూర్చిన నిరీక్షణనుబట్టి దానికి వారసులమగుటకై ఆ పరిశుద్ధాత్మను మన రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా ఆయన మనమీద సమృద్ధిగా కుమ్మరించెను. ఈ మాట నమ్మదగినది గనుక దేవునియందు విశ్వాసముంచినవారు సత్ క్రియలను శ్రద్ధగా చేయుటయందు మనస్సుంచునట్లు నివీ సంగతు లను గూర్చి దృఢముగా చెప్పుచుండవలెనని కోరుచున్నాఉ. ఇవి మంచివియు మనుష్యులకు ప్రయోజన కరమైనవియునై యున్నవి. ఈ మాట నమ్మదగినద"ని చెప్పుచున్నాడు.

### నాల్గవది

### నీళ్లతో బాప్తిస్మమిచ్చుట దేనిని సూచించును?

మనలోనున్న పాత ఆదాము సకల పాపములతోను దురేచ్ఛ లతోను ప్రతిదినము మనో దుఃఖమువలనను పశ్చాత్తాపమువలనను మునిగి చావలెననియు, దేవుని సముఖమందు నీతిమంతుడుగాను, పరిశుద్ధుడుగాను ఎల్లప్పుడును బ్రతుకు క్రొత్త మనుష్యుడు ప్రతి దినము ప్రతివానిలో తిరిగి పుట్టి లేవవలెననియు సూచించుచున్నది.

### దీనిని గూర్చి యెక్కడ వ్రాయబడియున్నది?

పరిశుద్ధుడైన పౌలు తాను రోమీయులకు వ్రాసిన యుత్తరములో ఆరవ యధ్యాయమునందే: "తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో యాలాగే మనమును నూతన జీవమును పొందినవారమై గుర్తించవలెనని మరణములోనికి బాప్తిస్మము పొందుటవలన ఆయనతో గూడ పాతిపెట్టబడితిమి" యని వ్రాయబడి యున్నది.

## ఐదవ ముఖ్య భాగము

## ప్రభు రాత్రి భోజన సంస్కార నియమము

### మొదటిది

### ప్రభు రాత్రి భోజనమనగా నేమి?

అది మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క నిజమైన శరీరమును రక్తమునై యున్నది. క్రైస్తనులమైన మనము దీనిని రొట్టెతోను ద్రాక్షరసముతోను తిని త్రాగుటకు క్రీస్తు తానే యీ రాత్రి భోజనము నియమించెను.

### ఇదెక్కడ వ్రాయబడియున్నది?

మత్తయి, మార్కు, లూకా యను పరిశుద్ధ సువార్తికులును, పరిశుద్ధుడైన పౌలును వ్రాసిన వానిలోనే- అదేమనగా, మన ప్రభువైన యేసుక్రీస్తు తాను అప్పగింపబడిన రాత్రియందు రొట్టె తీసికొని స్తోత్రము చేసి, దానిని విరిచి తన శిష్యుల కిచ్చి మీరు తీసికొని తినుడి, ఇది మీ కొరకియ్యబడుచున్న నా శరీరమైయున్నది. నన్ను జ్ఞాపకము చేసికొనుటకై యిది చేయుడని చెప్పెను. ఆ ప్రకారమే వారు భోజనము చేసిన తరువాత

ఆయన పాత్రను తీసికొని స్తోత్రము చేసి, దానిని వారికిచ్చి, దీనిలోనిది మీరందరు త్రాగుడి, యీ పాత్ర నా రక్తము వలనైన క్రొత్తనిబంధన; మీరు దీనిలోనిది త్రాగునపుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీని చేయుడని చెప్పెను.

**రెండవది**

**వీనిని తినుటవలనను త్రాగుటవలనను కలుగు ప్రయోజనమేమి?**

పాపపరిహారము కలుగుటకై మీ కొరకు ఇయ్యబడుచున్న దనియు చిందింపబడుచున్నదనియు చెప్పబడు మాటలు వీని ప్రయోజనమును మనకు తెలియజెయుచున్నవి. ఏమనగా, ఈ మాటనవలననే ప్రభురాత్రి భోజనములో మనకు పాప పరిహారమును జీవమును మోక్షమును ఇయ్యబడుచున్నవి. ఎందుల కనగా, పాప పరిహార మెక్కడనో అక్కడనే జీవమును మోక్షమును ఉన్నవి.

**మూడవది**

**శరీర సంబంధముగా తినుటవలనను త్రాగుటవలనను ఇటువంటి ఘనమైన మేలు లేలాగు కలుగును?**

తినుటవలనను త్రాగుటవలనను మాత్రము కాదుగాని, ''మీ కొర కియ్యబడుచున్న"దనియు, "పాప పరిహారము కలుగుటకై మీ కొరకు చిందింప బడుచున్న"దనియు, చెప్పబడు ఈ మాటలవలన ఈ మేలు కలుగును. శరీర సంబంధముగా తినుట త్రాగుట అను వానితో గూడ ఈ మాటలు ప్రభురాత్రి భోజనములో ప్రధానమైనవి. ఈ మాటలు విశ్వసించు వానికి పాప పరిహారము కలుగుచున్నది.

**ప్రభు రాత్రి భోజనమును పాత్రుడుగా పొందదగిన వాడెవడు?**

ఉపవాసము మొదలగు శరీర సంబంధమైన ప్రయాసములు మంచి బాహ్యశిక్షలైయున్నవి. ఐనను పాపపరిహారము కలుగుటకై మీ కొరకియ్యబడు చున్నదనియు చిందింపబడు చున్నదనియు చెప్పబడు మాటలకు విశ్వసించువాడే దానిని పాత్రుడుగా పొందదగిన వాడును బాగుగా సిద్ధపడిన వాడునై యున్నాడు.

ఈ మాటలు విశ్వసింపక సందేహపడువాడు దాని కపాత్రు డును, సిద్ధపడని వాడునై యున్నాడు. ఎందుకనిన 'మీ కొరకు' అను మాటకు పూర్ణ విశ్వాసముగల హృదయములే అవసరము.

## పది యాజ్ఞలకు సంబంధించిన నూతన నిబంధనలోని వచనములు

1వ ఆజ్ఞ: దేవుడు ఆత్మ గనుక ఆయన నారాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను. (యోహాను 4:24)

2వ ఆజ్ఞ: యెహోవాను స్తుతించుడి; యెహోవా దయాళుడు; ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి, ఆయనకృప నిత్యముండును. (కీర్త106:1)

3వ ఆజ్ఞ: ఆయన– అవునుగాని దేవుని వాక్యము విని దాని గైకొను వారు మరి ధన్యులని చెప్పెను. (లూకా 11:28)

4వ ఆజ్ఞ: పిల్లలారా! అన్ని విషయములలో మీ తల్లిదండ్రుల మాట వినుడి; ఇది ప్రభువునుబట్టి మెచ్చుకొనతగినది; దాసులారా! మనుష్య లను సంతోష పెట్టువారైనట్లు కంటికి కనబడవలెననిగాక; ప్రభువునకు భయపడుచు శుద్ధాంతఃకరణ గలవారై, శరీరమునుబట్టి మీ యజ మానులైన వారికి అన్న విషయములలో విధేయులై యుండుడి.

(కొలస్స 2:20–32)

5వ ఆజ్ఞ: కనికరము గలవారు ధన్యులు; వారు కనికరము పొందుదురు.

(మత్తయి 5:7)

6వ ఆజ్ఞ: హృదయశుద్ధిగలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు.

(మత్తయి 5:8)

7వ ఆజ్ఞ: దొంగిలించువాడు ఇకమీదట దొంగిలించక అక్కర గలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతే మంచి పని చేయుచు కష్టపడవలెను.

(ఎఫెసీ 4:28)

8వ ఆజ్ఞ: మనము ఒకరి కొకరము అవయవములమైయున్నాము గనుక మీరు అబద్ధమాడుటమాని ప్రతివాడును తన పొరుగువారితో సత్యము మాటలాడవలెను.

(ఎఫెసీ 4:25)

9వ ఆజ్ఞ: దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమన ములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణములును హృదయములో నుండియేకదా వచ్చును (మత్తయి 15:19)

10వ ఆజ్ఞ: ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత నీడ్వబడి మరలుకొల్పబడినవాడై

శోధింపబడును. దురాశ గర్భము ధరించినదై పాపమును కనగా, పాపము పరిపక్వమైనదై మరణమును కనును

(యాకోబు 1:14,15)

ముగింపు: ఏలయనగా పాపమువలన వచ్చు జీతము మరణము; అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము.

(రోమా 6:23)

## విశ్వాస ప్రమాణమునకు సంబంధించిన వచనములు

1వ అంశము: దేవుడైన యెహోవా నేల మంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ యాయెను. (ఆదికాండము 2:7)

2వ అంశము: దేవుడు లోకమును నెంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారుడుగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. (యోహాను 3:16)

3వ అంశము: సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడనుకాను ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, హెల్లేనియునికి కూడ రక్షణ కలుగ జేయుటకు అది దేవుని శక్తియైయున్నది.

## ప్రభువు ప్రార్థనకు సంబంధించిన వచనములు

ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్య మేమనగా, ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి నాలకించు ననునదియే. (1 యోహాను 5:14)

ప్రారంభము: యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. (గలతీ 3:26)

1వ మనవి: ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు. తండ్రి రొమ్ముననున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలు పరచెను

(యోహాను 1:18)

2వ మనవి: మరియు – మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి.

(మార్కు 16:15)

3వ మనవి: మీరు పరిశుద్ధులగుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగానుండుటయే దేవుని చిత్తము (1థెస్స. 4:3)

4వ మనవి: మన ప్రభువైన యేసుక్రీస్తు పేరిట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి.

(ఎఫెసీ. 5:20,21)

5వ మనవి: మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును. మీరు మనుష్యుల అపరాధములను క్షమింపకపోయిన యెడల మీ తండ్రియు మీ అపరాధములను క్షమింపడు. (మత్తయి 6:14,15)

6వ మనవి: నా కుమారుడా, పాపులు నిన్ను ప్రేరేపింపగా ఒప్పకుము.

(సామెతలు 1:10)

7వ మనవి: అందుకు- నా కృప నీకు చాలును. బలహీనతయందు నా శక్తి పరిపూర్ణమగుచున్నదని ఆయన నాతో చెప్పెను. కాగా క్రీస్తు శక్తి నా మీద నిలిచియుండు నిమిత్తము, విశేషముగా నా బలహీనత యందే బహు సంతోషముగా అతిశయ పడుదును.

ముగింపు: నీ రాజ్యము శాశ్వత, రాజ్యము, నీ రాజ్య పరిపాలన తరతరములు నిలుచును. (కీర్తన 145:13)

## బాప్తిస్మము

పేతురు- మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి: అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు. అ.కార్య2:38.

## ప్రభు రాత్రి భోజన సంస్కార నియమము

కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను (ఆత్మ) పరీక్షించు కొనవలెను; ఆలాగు చేసి ఆ రొట్టెను తిని, ఆ పాత్రలోనిది త్రాగవలెను. 1 కొరింథీ 11:28.

ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును మత్తయి 11:28.

## ప్రార్థనలు

### 1. ఉదయ ప్రార్థన

ప్రియ తండ్రీ! నేడు నీవు నాకు తోడుగానుండి నిన్ను సేవించుటకై నన్ను బలపర్చుమని యేసుక్రీస్తు నామమున నిన్ను వేడుకొనుచున్నాను, ఆమేన్.

### 2. సాయంకాల ప్రార్థన

ఓ ప్రభువా! యేసుక్రీస్తు నిమిత్తమై నేటిరాత్రి నన్ను చూచి నా పాపముల నన్నిటిని క్షమించి నన్ను మంచివానిగా చేయుమని నిన్ను వేడుకొనుచున్నాను, ఆమేన్.

### 3. భోజన సమయపు ప్రార్థన

ఓ నా తండ్రివైన దేవా! నీ దయవలన నా కిచ్చిన ఆహార మును దీవించి నన్ను కాపాడుమని యేసుక్రీస్తు పేరిట నిన్ను వేడుకొను చున్నాను, ఆమేన్.

### 4. ఇంటినుండి దేవాలయమునకు బయలుదేరునపుడు చేయదగిన ప్రార్థన.

పరలోకపు ప్రియ తండ్రీ! నిన్ను ఆత్మతోను సత్యముతోను ఆరాధించుటకు నన్ను స్థిరపరచుము, ఆమేన్.

### 5. దేవాలయములో ప్రవేశించిన వెంటనే చేయదగిన ప్రార్థన

ఓ ప్రభువా, నిన్ను స్తుతించుటకుగాను నా పెదవులను తెరచి నీ పరిశుద్ధ వాక్యము నంగీకరించునట్లు నా హృదయమును స్థిరపరచుము, ఆమేన్.

### 6. ఆరాధన ముగించిన తరువాత చేయదగిన ప్రార్థన

ఓ తండ్రీ! నా పాపములను క్షమించుదువని నీవు చేసిన వాగ్దానము కొరకు నిన్ను స్తుతించుచున్నాను. నీ చిత్తము నేను నిరంతరము జరిగించునట్లు సహాయమిమ్మని యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాను, ఆమేన్.

### 7. పరిశుద్ధ సంస్కారము పుచ్చుకొనుటకు ముందు చేయదగిన ప్రార్థన

దేవా! పాపినైన నా యెడల కరుణ చూపుము, ఆమేన్.

### 8. సంస్కారము పుచ్చుకొనిన తరువాత చేయదగిన పార్థన

ఓ తండ్రీ! యేసు ప్రభువుయొక్క వెలలేని రక్తమాంసములు నా కనుగ్రహించినందుకు నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. ఈ సంస్కారము ద్వారా

నన్ను బలపరచి నిత్యజీవము పొందువరకు కాపాడి సంరక్షించుమని నీ ప్రియ నామమున ప్రార్థించుచున్నాను, ఆమేన్.

# ప్రారంభ గీతములు

## సంగ్రహ ప్రార్థనలు, పత్రిక పాఠములు, సువార్త పాఠములు

## అడ్వెంటులోని మొదటి ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నా యాత్మను నీ దిక్కునకు చూచి యెత్తికొను చున్నాను. । నా దేవా నీ యందు నమ్మికయుంచి యున్నాను.

నన్ను సిగ్గుపడనియ్యకుము । నా శత్రువులను నన్ను గూర్చి ఉత్సహింపనియ్యకుము.

నీ కొరకు కనిపెట్టువారిలో । నెవడును సిగ్గునొందడు.

యెహోవా నీ మార్గములను నాకు తెలియజేయుము । నీ త్రోవలను నాకు తేటపరచుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మా పాపములవలన కలుగు భయంకరమైన విపత్తుల నుండి మమ్మును తప్పించి కాపాడుటకును, నీ గొప్ప శక్తివలన మమ్మును విమోచించి రక్షించుటకును, నీ ప్రభావముతో రమ్మని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా యోక దేవుడవై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచు నుండు నిన్ను వేడుకొను చున్నాము. ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 13:11-14

సువార్త పాఠము-మత్తయి 21:1-9

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యిర్మీ 33:14-18 | కొలస్సె 1:12-23 | లూకా 1:1-25 |
| (బి) యెష 61:1-3 | ప్రకటన 1:4-8 | లూకా 1:68-70 |
| (సి) ఆది 3:1-15 | ప్రకటన 1:4-8 | లూకా 17:20-30 |
| (డి) యిర్మీ 31:31-34 | హెబ్రీ 10:19-25 | లూకా 1:68-70 |

## అడ్వెంటులోని రెండవ ఆదివారము

### ప్రారంభ గీతము

సీయోను కుమారీ! ఇదిగో రక్షణ నీ యొద్దకు వచ్చుచున్నది.

యెహోవా తన ప్రభావముగల స్వరమును వినిపించును । మీకు హృదయానందము కలుగును.

ఇశ్రాయేలునకు కాపరి । మందవలె యోసేపును నడిపించు వాడా, చెవి యొగ్గుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మేము నీ జనితైక కుమారుని మార్గము సరాళము చేయునట్లు

మా హృదయములను ప్రేరేపింపుము. అప్పుడు ఆయన రాకవలన మేము పవిత్ర హృదయములతో నిన్ను సేవింప గలుగునట్లనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా యేక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు నామమున నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 15:4-13

సువార్త పాఠము-లూకా 21:25-36

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) మీకా 4:1-7 | రోమా 2:1-16 | లూకా 1:26-38 |
| (బి) మలాకీ 4:1-6 | 1తిమో 6:11-16 | లూకా 17:20-30 |
| (సి) ఆది 9:1-19 | ప్రకటన 2:1-7 | లూకా 13:18-30 |
| (డి) మలాకీ 4:1-6 | 2పేతు 1:3-11 | లూకా 17:29-30 |

## అడ్వెంటులోని మూడవ ఆదివారము

### ప్రారంభ గీతము

ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడి । మరల చెప్పుదును ఆనందించుడి.

మీ సహవాసమును సకల జనులకు తెలియబడ నియ్యుడి। ప్రభువు సమీపముగా నున్నాడు.

దేని గూర్చియు చింతింపకుడి । కాని ప్రతివిషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి.

యెహోవా, నీవు నీ దేశమునెడల కటాక్షము చూపియున్నావు। చెఱకు పోయిన యాకోబు సంతతిని నీవు వెనుకకు రప్పించి యున్నావు.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మ్మాప్రార్థనలకు చెవి యొగ్గుము. నీవు దయతో మాలో ప్రవేశించి మా హృదయాంధకారమును తొలగించి మమ్మును వెలిగింపుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగ యుగములు జీవించుచు పరిపాలించుఇచునుండు నిన్ను వేడు కొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 4:1-5

సువార్త పాఠము-మత్తయి 11:2-10

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) మలాకీ 3:1-6 | రోమా 1:16-25 | లూకా 1:39-56 |
| (బి) యెష 40:1-10 | రోమా 2:12-16 | మత్తయి 3:1-12 |
| (సి) ఆది 22:1-18 | ప్రకటన 3:1-13 | యోహా 12:35-50 |
| (డి) యెష 40:1-8 | 2తిమో 4:5-8 | మత్త 13:1-11 |

## అడ్వెంటులోని నాలుగవ ఆదివారము

### ప్రారంభ గీతము

అంతరిక్షమా, మహావర్షము వర్షించుము । ఆకాశ మండలము నీతిని కురిపించుగాక.

భూమి నెఱియలు విడిచి । రక్షణ ఫలించుగాక.

ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి । అంత రిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మేము నీ చిత్తమును నెరవేర్చకుండ మా పాపములు మమ్ము నాటంకపరచుచున్నవి. ఇట్లు అడ్డగింపబడిన కార్యములను మేము శీఘ్రముగ

నెరవేర్చగలుగునట్లు కృపగల నీ ప్రాయశ్చిత్తమువలన మాకు సహాయము చేయుటకై నీ శక్తిని పురికొలిపి నీ ప్రభావముతో మా యొద్దకు రమ్మని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా యేకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–ఫిలిప్పీ 4:4–7

సువార్త పాఠము–యోహాను 19–28

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 40:1–8 | హెబ్రీ 12:15–29 | లూకా 1:67–80 |
| (బి) యెష 2:2–5 | 1కొరి 1:26–29 | లూకా 1:46–55 |
| (సి) ఆది 49:8–12 | ప్రకటన 3:14–22 | మత్త 11:11–19 |
| (డి) ద్వితీ 18:15–19 | 1యోహా 1:1–4 | యోహా 1:15–78 |

## అడ్వెంటు కాలమునకు తగిన ఇతర సంగ్రహ ప్రార్థనలు

ఓ ప్రభువా, నీ జనితైక కుమారుడు శరీరధారియై మొదటిసారి వచ్చుటనుగూర్చి జనులు ఎంతగా సంతోషించుచున్నారో అంతగా ఆయన రెండవసారి తన మహిమతో వచ్చునప్పుడు సంతోషించుచు నిత్యజీవమను వరమును పొందునట్లు వారి ప్రార్థనలను దయతో ఆలకింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు నామమున నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

మిగుల కరుణగల దేవా, నిత్యవాక్య మనబడు మా ప్రభువు పవిత్ర కన్యకనుండి యవతరించునట్లు అనుగ్రహించియున్నావు. నీ ప్రజలమైన మేము శరీరేచ్ఛలను విసర్జించి నీ దర్శన దినమునకై సిద్ధపడి యుండునట్లు కృప చూపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు మూలముననే నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువా, నీ ప్రజలమైన మా ప్రార్థనలను దయతో ఆలకింపుము. మా

పాపములనుబట్టి న్యాయముగా శ్రమపడుచున్న మేము నీ రాకవలన ఓదార్పు పొందునట్లు అనుగ్రహింపుమని తండ్రి తోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## క్రిస్మసు దినము-మన ప్రభువు జన్మదినము

### I

### ఉదయారాధన

### ప్రారంభ గీతము

యెహోవా నా కీలాగు సెలవిచ్చెను. నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను.

యెహోవా రాజ్యము చేయుచున్నాడు । ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు.

యెహోవా బలము ధరించి । బలముతో నడుము కట్టుకొని యున్నాడు.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నిజమైన వెలుగగు క్రీస్తు ప్రభుని జన్మమువలన ఈ మహా పరిశుద్ధ రాత్రిని ప్రకాశమానముగా జేసియున్నావు. ఈ లోక మందుండగనే ఆ వేలుగుయొక్క మర్మములను మాకు వెల్లడి పరచియున్నావు. మేము పరలోకమందును ఆయనవలన గలుగు పరిపూర్ణ సంతోషము ననుభవించునట్లు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-తీతు 2:11-14; యెషయా 9:2-7

సువార్త పాఠము-లూకా 2:1-14

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 7:10-14 | హెబ్రీ 1:1-12 | యోహా 1:1-14 |
| (బి) యెష 9:6,7 | " 1:1-6 | లూకా 2:1-14 |
| (సి) మీకా 5:1-14 | 1యోహా 4:1-6 | మత్త 1:18-25 |

| | | |
|---|---|---|
| (డి) యెష 9:6,7 | " 3:1-5 | " 1:18-23 |

## II

## (తరువాతి యారాధన)

### ప్రారంభ గీతము

మనకు శిశువుపుట్టెను, మనకు కుమారుడు అనుగ్రహింప బడెను ఆయన భుజముమీద రాజ్యభార ముండును.

ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు। నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతియని అతనికి పేరు పెట్టుదురు.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మేము పాపముయొక్క కాడి క్రింద పురాతన కాలమునుండి బందింపబడియున్నాము. శరీరమును ధరించిన నీ జనితైక కుమారుని క్రొత్త జన్మమువలన మేము మా దాస్యమునుండి విడుదల నొందునట్లు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-హెబ్రీ 1:1-12

సువార్త పాఠము-యోహాను 1:1-14

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) మీకా 5:2-4 | 1యోహా 4:7-17 | యోహా 1:15-18 |
| (బి) మీకా 5:2-6 | 1యోహా 1:1-4 | యోహా 1:1-18 |
| (సి) 2 సమూ 7:1-13 | రోమా 8:29-39 | యోహా 6:2-39 |
| (డి) మీకా 5:1-3 | హెబ్రీ 1:1-6 | యోహా 1:1-14 |

## క్రిస్మసు తరువాతి దినము

క్రిస్మసు దినమునకైన ప్రారంభ గీతమును సంగ్రహ ప్రార్థనయు వాడవలెను.

పత్రిక పాఠము-తీతు 3:4-7

సువార్త పాఠము-లూకా 2:15-20

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) మీకా 5:2-4 | 1యోహా 4:7-17 | యోహా 1:15-18 |
| (బి) మీకా 5:2-6 | 1యోహా 1:1-4 | యోహా 1:1-18 |
| (సి) 2 సమూ 7:1-13 | రోమా 8:29-39 | యోహా 6:2-39 |
| (డి) మీకా 5:1-3 | హెబ్రీ 1:1-6 | యోహా 1:1-14 |

## క్రిస్మసు తరువాతి ఆదివారము

### ప్రారంభ గీతము

నీ శాసనములు ఎన్నడును తప్పిపోవు। యెహోవా, ఎన్న టెన్నటికిని పరిశుద్ధతయే నీ మందిరమునకు అనుకూలము.

పురాతన కాలమునుండి నీ సింహాసనము స్థిరమాయెను. సదాకాలమున్నవాడవు నీవే.

యెహోవా రాజ్యము చేయుచున్నాడు. ప్రభావమును ఆయన వస్త్రముగా ధరించియున్నాడు। యెహోవా బలము ధరించి బలముతో తన నడుము కట్టుకొని యున్నాడు.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ ప్రియకుమారుని పేరట మేము సత్క్రియలయందు వృద్ధిపొందునట్లు నీ కటాక్షముచొప్పున మా సకల కార్యములయందు మమ్మునడిపింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-గలతీ 4:1-7

సువార్త పాఠము-లూకా 2:33-40

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 11:1-5 | హెబ్రీ 2:9-16 | లూకా 2:22-32 |
| (బి) " 63:7-17 | 2తిమో 4:3-8 | " 2:22-32 |
| (సి) " 11- | యూదా 1:17-25 | యోహా 8:12-19 |
| (డి) " 63:7-17 | 2కొరి 5:1-9 | లూకా 2:25-32 |

## ఛేదన సంస్కారము-యేసు నామకరణము

### (సంవత్సరాది)

### ప్రారంభ గీతము

యెహోవా మా ప్రభువా, ఆకాశములలో నీ మహిమను కనపరచువాడా। భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది.

నీవు వానిని జ్ఞాపకము చేసికొనుటకు మనుష్యుడు ఏపాటివాడు? నీవు దర్శనమిచ్చుటకు నరుడు ఏపాటివాడు?

యెహోవా నీవే మాకు తండ్రివి। అనాది కాలమునుండి మా విమోచకుడవని నీకు పేరేగదా.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, మా ప్రభువా, మా నిమిత్తము నీ ప్రియకుమారుడైన మా రక్షకుని ధర్మశాస్త్రమునకు లోబరచిన ఆయన శరీర సంబంధ మైన ఛేదన సంస్కారమును సహించునట్లు ఏర్పరచి యున్నావు. మా హృదయములు సమస్త పాపేచ్ఛలను విసర్జించి పవిత్రముగ నుండునట్లు మాకు వాస్తవమైన ఆత్మీయఛేదన సంస్కారము దయ చేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-గలతీ 3:23-29

సువార్త పాఠము-లూకా 2:21

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|

| | | |
|---|---|---|
| (ఎ) యెష 55:1-13 | యాకోబు 4:13-17 | లూకా 4:16-21 |
| (బి) " 40:26-31 | 1పేతు 2:1-10 | లూకా " |
| (సి) కీర్తన 67 | 1తిమో 6:13-19 | లూకా " |
| (డి) కీర్తన 90 లేక 121 | రోమా 8:24-32 | లూకా " |

## సంవత్సరాదికొరకగు సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి వరమును నీ యొద్దనుండియే వచ్చుచున్నది. గత వత్సరమున మా శరీరాత్మలకు నీవనుగ్రహించిన మేళ్లన్నిటి నిమిత్తము నీకు వందనములు చెల్లించుచున్నాము. నీ కృపవలన ఈ సంవత్సరము మమ్మును సకలాపాయములనుండియు గండముల నుండియు కాపాడి ఇది మాకు అనుకూలమును సంతోషకరమునైన సంవత్సరముగ నుండునట్లు నీ పూర్ణాశీర్వాదము మాపై కుమ్మరింపు మని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## క్రిస్మసు తరువాతి రెండవ యాదివారము

*ప్రారంభ గీతము, ప్రార్థన, క్రిస్మసు తరువాతి మొదటి యాదివారమున కైనవే ఉపయోగించవలెను.*

పత్రిక పాఠము-1 పేతురు 4:12-19
సువార్త పాఠము-మత్తయి 2:13-23

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 42:1-9 | రోమా 3:9-22 | మత్తయి 3:1-12 |
| (బి) ఆది 11:1-9 | " 7:7-25 | " " |
| (సి) యెష 42:1-9 | " 3:19-22 | " " |
| (డి) కీర్తన 73:25-28 | యాకో 4:13-17 | " 16:1-4 |

## ఎపిఫానియ లేక అన్యజనులకు మన ప్రభుని ప్రత్యక్షత

### ప్రారంభ గీతము

ఇదిగో రాజైన ప్రభువు వచ్చియున్నాడు । రాజ్యమును శక్తియు మహిమయు ఆయన చేతిలోనున్నవి.

దేవా, రాజునకు నీ న్యాయవిధులను । రాజకుమారునికి నీ నీతిని తెలియజేయుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నక్షత్ర సహాయమువలన అన్యజనులకు నీ జనితైక కుమారుని ప్రత్యక్షపరచియున్నావు. ఇప్పుడు విశ్వాసముద్వారా నిన్ను తెలిసికొనుచున్న మేము ఈ బ్రతుకు చాలించిన తరువాత నీ మహిమగల దైవత్వము యొక్క ఫలమును పూర్ణముగ అనుభవించు నట్లు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–యెషయా 60:1–6

సువార్త పాఠము–మత్తయి 2:1–12

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 49:1–7 | రోమా 3:23–31 | మత్తయి 3:13–17 |
| (బి) " 49:1–9 | 1యోహా 3:1–6 | " " |
| (సి) 1రాజు 19:1–18 | ఎఫెసీ 2:1–12 | " " |
| (డి) యెష 2:2–5 | 2కొరి 4:3–6 | " " |

## ఎపిఫానియ తరువాతి మొదటి యాదివారము

### ప్రారంభ గీతము

అత్యున్నతమైన సింహాసనమందు । ప్రభువు ఆసీనుడై యుండగా నేను చూచితిని.

సర్వాధికారియు ప్రభువునగు మనదేవుడు ఏలుచున్నాడు. ఆయనను స్తుతించుడి । అని ఒక గొప్ప జనసమూహము చెప్పుట వింటిని.

సమస్త దేశములారా, యెహోవాకు ఉత్సాహధ్వని చేయుడి. సంతోషముతో యెహోవాను సేవించుడి.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీవు మొరబెట్టు నీ జనుల ప్రార్థనలు కరుణతో నంగీకరింపుము. వారు తాము చేయవలసిన కార్యములను బాగుగ తెలిసికొని వాటిని నమ్మకముగ నెరవేర్చుటకు కావలసిన కృపను శక్తిని దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–రోమా 12:1–5
సువార్త పాఠము–లూకా 2:41–52

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 61:1–3 | ఎఫెసీ 6:1–4 | మార్కు 10:13–16 |
| (బి) ద్వితీ 6:1–9 | రోమా 10:12–21 | యోహా 1:30–51 |
| (సి) కీర్త 122 | 1కొరి 1:20–31 | ” 1:35–51 |
| (డి) కీర్త 122 | 2కొరి 6:14–7:1 | ” 1:35–42 |

## మన ప్రభుని రూపాంతరము

ఎపిఫానియ తరువాత ఒకే యాదివార మున్నప్పుడు తప్ప, ప్రతిసంవత్సరము ఎపిఫానియ ఆదివారములలో చివరిదానిని మన ప్రభుని రూపాంతరపు టాదివారముగా వాడవలెను.

## ఎపిఫానియ తరువాతి రెండవ యాదివారము

### ప్రారంభ గీతము

ఓ దేవా, సర్వలోకము । నీకు నమస్కరించి నిన్ను కీర్తించును.

ఓ సర్వోన్నతుడా । వారు నీ నామమును కొనియాడుదురు.

సర్వలోక నివాసులారా, దేవునిగూర్చి సంతోష గీతము పాడుడి। ఆయన నామ ప్రభావము కీర్తించుడి. ఆయనకు ప్రభావము ఆరోపించి ఆయనను స్తుతించుడి.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు ఇహపరముల యందుండు సమస్తమును ఏలుచున్నావు. నీ జనులవైన మా మనవులను దయతో విని మాబ్రతుకుదినములన్నిటియందు నీ సమాధానము మాకు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 12:6-16

సువార్త పాఠము-యోహాను 2:1-11

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 18:15-19 | ఎఫెసీ 5:21-33 | లూకా 19:1-10 |
| (బి) యెష 8:20-22 | రోమా 10:1-12 | " 4:14-22 |
| (సి) ద్వితీ 18:15-22 | 1కొరి 2అ | యోహా 3:22-36 |
| (డి) యెష 61:1-6 | " 2:6-11 | " 1:43-51 |

## ఎపిఫానియ తరువాతి మూడవ యాదివారము

### ప్రారంభ గీతము

ఆయన దూతలారా, మీరందరు ఆయనకు నమస్కారము చేయుడి, సీయోను నివాసులు ఆ సంగతి విని సంతోషించుచున్నారు.

ఓ యెహోవా, నీ న్యాయవిధులనుబట్టి, యూదా కుమార్తెలు ఆనందించుచున్నారు.

యెహోవా రాజ్యము చేయుచున్నాడు, భూలోకము ఆనందించుగాక, ద్వీపములన్నియు సంతోషించుగాక.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మా బలహీనతలను కరుణతో చూచి మాకు

కలుగు సకలాపాయములలోను ఇబ్బందులలోను సహాయముచేసి మమ్మును కాపాడుటకై ప్రభావముగల నీ కుడి హస్తమును మా పై చాపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–రోమా 12:16–21

సువార్త పాఠము–మత్తయి 8:1–13

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మీ 33:6–9 | హెబ్రీ 11:1–16 | లూకా 17:5–10 |
| (బి) సంఖ్యా 24:10–17 | రోమా 5:1–5 | ” 11:25–30 |
| (సి) యెష 61:1–7 | ” 1:13–25 | యోహా 4:5–26 |
| (డి) 2రాజు 5:1–19 | ” 1:13–20 | ” 4:5–14 |

## ఎపిఫానియ తరువాతి నాల్గవ యాదివారము

*ఎపిఫానియ తరువాతి మూడవ ఆదివారపు ప్రారంభ గీతమును వాడవలెను.*

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మాకు అనేకములైన గొప్ప ఆదపదలు సంభవించుననియు, మా స్వాభావిక బలహీనతవలన మేము వానియందు యథార్థముగ నిలువబడ లేమనియు నీ వెరుగుదువు. మేము సకలాపాయములయందు స్థిరముగ నిలిచి శోధనలన్నిటిని జయించుటకు శక్తి ననుగ్రహించి కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–రోమా 13:8–10

సువార్త పాఠము–మత్తయి 8:23–27

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యెష 43:1-3 | రోమా 4:16-25 | మత్త 14:22-33 |
| (బి) " 51:1-12 | 1యోహా 1:5-10 | యోహా 8:12-16 |
| (సి) కీర్తన 93 | రోమా 7:6-25 | " 4:27-42 |
| (డి) కీర్తన 93 | " 7:7-16 | " 4:31-42 |

## ఎపిఫానియ తరువాతి ఐదవ యాదివారము

*ఎపిఫానియ తరువాతి మూడవ ఆదివారపు ప్రారంభ గీతమును వాడవలెను.*

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీ సంఘమును నీ యింటివారిని నీ సత్యమతమందు నిత్యము స్థిరముగ నిలువబెట్టుము. పరమ తండ్రివైన నీ కృపమీదనే ఆనుకొనియున్నవారిని నీ స్వశక్తిచేత కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-కొలస్సై 3:11-17
సువార్త పాఠము-మత్తయి 13:24-30

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యిర్మి 17:5-10 | 1కొరి 3:3-23 | మత్త 13:44-52 |
| (బి) " 18:1-10 | 1యోహా 4:7-17 | యోహా 6:25-35 |
| (సి) " 24అధ్యా | రోమా 8:1-11 | " 5:1-18 |
| (డి) యెహె 38:10-16 | " 8:1-9 | మత్త 7:24-29 |

## మన ప్రభుని రూపాంతరము

### ప్రారంభ గీతము

మెరుపులు లోకమును ప్రకాశింపజేసెను. భూమి వణకి కంపించెను.

సైన్యముల కధిపతియగు యెహోవా, నీనివాసములు ఎంత రమ్యములు. యెహోవా మందిరావరణములను చూడవలెనని నా ప్రాణము ఎంతో ఆశపడుచున్నది.

## సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీ జనితైక కుమారుని రూపాంతరమునందు పితరుల సాక్ష్యమునుబట్టి మా విశ్వాసమును స్థిరపరచియున్నావు. ప్రకాశమానమైన మేఘమునుండి వచ్చిన శబ్ధమువలన అద్భుత కరమైన రీతిగా మా దత్త పుత్రత్వమును సూచించితివి. మేము మహిమయందు తోడి వారసులమై ఆ రాజుతో దాని ననుభవించు నట్లనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-2పేతురు 1:16-21

సువార్త పాఠము-మత్తయి 17:1-9

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యెష 61:10,11 | 2కొరి 4:5,6 | మత్త 11:25-27 |
| (బి) " 61:10,11 | 1పేతు 1:3-11 | లూకా 7:1-10 |
| (సి) నిర్గ 3:1-15 | రోమా 10:1-17 | యోహా 5:31-47 |
| (డి) " 3:1-6 | 2కొరి 3:12-18 | యోహా 5:39-47 |

# సెప్తుయగేసిమ యాదివారము

(డెబ్బదియవ దినము)

## ప్రారంభ గీతము

మరణపాశములు నన్ను చుట్టుకొనెను. పాతాళపు పాశములు నన్ను అరికట్టెను.

నా శ్రమలో నేను యెహోవాకు మొరబెట్టితిని. ఆయన తన ఆలయములో నాలకించి నా ప్రార్థన నంగీకరించెను.

యెహోవా, నా బలమా, నినెంతో ప్రేమించుచున్నాను. యెహోవా నాశైలమును కోటయునై యున్నాడు.

## సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మా నేరములను బట్టి మేము న్యాయముగా శిక్షింపబడుచున్నాము. నీ నామమునకు మహిమ కలుగునట్లు నీ జనులమైన మమ్ములను నీ కృపవలన తప్పింపుము. ఈ మా ప్రార్థనలు కరుణతో నాలకింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–1కొరింథీ 9:24–10:5

సువార్త పాఠము–మత్తయి 20:1–16

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మి 1:4–10 | అ.కా 17:23–34 | మత్త 25:14–30 |
| (బి) దాని 5:17–30 | 2పేతు 1:3–11 | యోహా 7:14–17 |
| (సి) నిర్గ 19:3–8 | ఫిలి 1:27–2:4 | లూకా 9:18–26 |
| (డి) యిర్మి 9:23,24 | ఫిలి 1:27–2:4 | లూకా 10:38–42 |

## సెక్సగేసిమ యాదివారము

(అరువదియవ దినము)

### ప్రారంభ గీతము

ప్రభువా, మేల్కొనుము; నీవేల నిద్రించుచున్నావు. లెమ్ము నిత్యము మమ్ము విడనాడకుము.

నీ ముఖమును నీవేల మరుగుపరచియున్నావు. మా బాధను మాకు కలుగు హింసను నీవేల మరచియున్నావు?

మా ప్రాణము నేలకు క్రుంగియున్నది. మా సహాయమునకు లెమ్ము. మమ్మును విమోచింపుము.

దేవా, పూర్వకాలమున మా పితరుల దినములలో నీవు చేసిన పనిని గూర్చి

మేము చెవులారా వినియున్నాము. మా పితరులు మాకు వాటిని వివరించిరి.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, మా ప్రభూ, మేము ఎంత మాత్రము మా కార్యము లను నమ్ముకొని యుండలేదని నీవు ఎరిగియున్నావు. కీడులన్నిటి నుండి మమ్మును నీ శక్తివలన కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-2కొరింథీ 11:19-12:9

సువార్త పాఠము-లూకా 3:4-15

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 55:10-13 | 2తిమో 3:10-4:5 | మార్కు 4:36-42 |
| (బి) యెష 25:1-10 | 2పేతు 1:16-21 | మత్త 27:1-9 |
| (సి) ఆమోసు 8:1-12 | ఫిలి 1:12-26 | యోహా 11:20-46 |
| (డి) ఆమోసు 8:11,12 | ఫిలి 1:12-21 | యోహా 11:20-27 |

## క్విoక్వగేసిమ యాదివారము

(ఏబదియవ దినము)

### ప్రారంభ గీతము

నన్ను రక్షించుటకు నాకు ఆశ్రయ శైలముగాను, ప్రాకారముగల ఇల్లుగాను ఉందును.

నాకొండ నాకోట నీవే. కాబట్టి నీ నామమునుబట్టి త్రోవ చూపి నన్ను నడిపించుము.

యెహోవా నీ శరణు జొచ్చియున్నాను. నన్నెన్నడును సిగ్గు పడనీయకుము. నీ నీతినిబట్టి నన్ను విడిపింపుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మా ప్రార్థనలు దయతో విని పాపబంధముల నుండి మమ్ము విడిపించి, కీడులన్నిటినుండి కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 1:13-31

సువార్త పాఠము-లూకా 13:31-43

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 3:5-37 | 1పేతు 3:18-22 | యోహా 12:23-36 |
| (బి) యిర్మి 81:9-22 | 1కొరి 1:18-24 | మార్కు 10:32-45 |
| (సి) యిర్మి 8:4-12 | రోమా 5:1-11 | యోహా 11:47-12:8 |
| (డి) యిర్మి 8:4-9 | 1కొరి 1:21-31 | మార్కు 10:35-45 |

## భస్మ బుధవారము - లెంటులోని మొదటి దినము

### ప్రారంభ గీతము

మహోన్నతుడైన దేవునికి, నా కార్యము సఫలముచేయు దేవునికి మొఱ్ఱబెట్టుచున్నాను.

ఈ యాపదలు తొలగిపోవు వరకు, నీ రెక్కల నీడను శరణు జొచ్చియున్నాను.

నన్ను కరుణింపుము దేవా, నన్ను కరుణింపుము. నేను నీ శరణు జొచ్చియున్నాను.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు సృజించినవానిలో దేనినైన ద్వేషింపక పశ్చాత్తాపపడు వారందరి పాపములు క్షమించువాడ వునైయున్నావు. మేము మా పాపములనుగూర్చిచ తగినట్లుగా దుఖపడి దౌర్భాగ్యులమని యొప్పుకొని నిండు కనికరముగల దేవుడవైన నీవలన పరిపూర్ణ పాపపరిహారమును క్షమాపణయు పొందులాగున మాలో నలిగిన నూతన హృదయములను కలుగజేయుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము,

ఆమేన్.

పత్రిక పాఠము-యోవేలు 2:12-19
సువార్త పాఠము-మత్తయి 6:16-21

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 59:12-21 | 1యోహా 1:5-10 | లూకా 6:20-49 |

## లెంటులోని మొదటి యాదివారము

### ప్రారంభ గీతము

అతడు నాకు మొఱ్ఱపెట్టగా నే నతనికి ఉత్తర మిచ్చెదను. అతని విడిపించి అతని గొప్ప జేసెదను.

దీర్ఘాయువుచేత అతని తృప్తిపరచెదను. నా రక్షణ అతనికి చూపించెదను.

మహోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా! మా ప్రార్థనను కరుణతో నాలకించి మహిమ గల నీ కుడిచేతిని చాపి మా విరోధులు చేయు కీడు నుండి మమ్మును కాపాడుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-2కొరింథీ 6:1-10
సువార్త పాఠము-మత్తయి 14:1-11

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ఆది 3:1-24 | యాకో 1:12-15 | లూకా 22:24-32 |
| (బి) యిర్మి 2:17-19 | హెబ్రీ 12:14-18 | మత్త 11:20-24 |
| (సి) " 17:5-14 | " 4:14-5:9 | లూకా 23:31-44 |
| (డి) ఆది 22:1-14 | " 4:15,16 | మత్త 16:21-26 |

## లెంటులోని రెండవ యాదివారము

## ప్రారంభ గీతము

యెహోవా, నీ కరుణాతిశయములను జ్ఞాపకము చేసి కొనుము. నీ కృపాతిశయములను జ్ఞాపకము చేసికొనుము. అవి పూర్వమునుండి యున్నవే గదా.

నా శత్రువులను నన్నుగూర్చి ఉత్సహింప నియ్యకుము. ఇశ్రా యేలు దేవా, మా బాధలన్నిటిలోనుండి మమ్మును విమోచింపుము.

యెహోవా, నా యాత్మను నీ దిక్కునకు చూచి ఎత్తికొను చున్నాను. నా దేవా, నీ యందు నమ్మికయుంచియున్నాను. నన్ను సిగ్గుపడనియ్యకుము.

## సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, మమ్మును మేము కాపాడుకొనుటకు ఎంత మాత్రమును శక్తిమంతులము కామని నీవెరుగుదువు. కాబట్టి శరీరమునకు సంభవించు కీడు లన్నిటినుండియు, ఆత్మపై బడి పీడించు చెడ్డతలంపు లన్నిటినుండియు, మమ్మును తప్పించి మా శరీరాత్మలను కాపాడుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–1థెస్స 4:1–28

సువార్త పాఠము–మత్తయి 15:21–28

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 42:20–25 | యాకో 5:13–20 | మార్కు 9:17–29 |
| (బి) నిర్గ 14:13–31 | హెబ్రీ 2:10–15 | యోహా 8:21–30 |
| (సి) కీర్త 130 | రోమా 3:19–31 | లూకా 22:45–62 |
| (డి) నిర్గ 33:18–23 | 2యోహా 2:12–27 | లూకా 10:17–20 |

# లెంటులోని మూడవ యాదివారము

## ప్రారంభ గీతము

నా కనుదృష్టి యెల్లప్పుడు యెహోవావైపునకే తిరిగి యున్నది. ఆయన నా పాదములను వలలోనుండి విడిపించును.

నేను ఏకాకినై బాధపడువాడను. నా వైపు తిరిగి నన్ను కరుణింపుము.

యెహోవా, నా యత్మను నీ దిక్కునకు చూచి యెత్తికొను చున్నాను. నా దేవా నీయందు నమ్మిక యుంచియున్నాను. నన్ను సిగ్గుపడనియ్యకుము.

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, నీ వినయ సేవకులయొక్క హృదయపూర్వ కమైన కోరికలను చిత్తగించి ప్రభావముగల నీకుడిచేతిని చాపి మా శత్రువు లందరినుండి కాపాడుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 5:1-9

సువార్త పాఠము-లూకా 11:14-28

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) 2సమూ 22:1-7 | ప్రక 2:1-7 | యోహా 8:42-51 |
| (బి) ఆది 22:1-19 | హెబ్రీ 5:7-10 | " 10:24-33 |
| (సి) యిర్మి 26:1-12 | " 12:1-13 | లూకా 22:63-71 |
| (డి) యిర్మి 26:1-12 | 1పేతు 1:13-16 | " 9:51-56 |

# లెంటులోని నాలుగవ యాదివారము

## ప్రారంభ గీతము

యెరూషలేమును ప్రేమించు వారలారా, మీరందరు ఆమెతో సంతోషించుడి. ఆనందించుడి.

ఆమెనుబట్టి దుఃఖించువారలారా! మీరందరు ఆమెతో నుత్సహించుడి.

యెహోవా మందిరమునకు వెళ్ళుదమని, జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని.

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మా దుష్ట క్రియలనుబట్టి శిక్షకు పాత్రులమై యున్న మమ్మును

నీ కృపచే ఆదరించి నీ కరుణతో విడిపింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-గలతీ 4:21-31

సువార్త పాఠము-యోహాను 6:1-15

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 49:8-13 | 2పేతు 1:2-11 | యోహా 6:36-51 |
| (బి) యెష 48:1-2 | హెబ్రీ 10:1-14 | " 11:47-57 |
| (సి) మలాకీ 2:1-10 | 1పేతు 1:17-25 | మత్త 27:1-10 |
| (డి) యెష 52:7-20 | 2కొరి 7:4-10 | యోహా 6:47-57 |

## లెంటులోని ఐదవ యాదివారము

(శ్రమ ఆదివారము)

### ప్రారంభ గీతము

దేవా, నాకు తీర్పు తీర్చుము, భక్తిలేని జనముతో నా పక్షమున వ్యాజ్యమాడుము.

కపటము కలిగి దౌర్జన్యము చేయువారి చేతిలోనుండి నీవు నన్ను విడిపింపుము. ఏలయనగా నీవు నాకు దుర్గమైన దేవుడవు.

నీ వెలుగును, నీ సత్యమును బయలుదేరజేయుము. అవి నాకు త్రోవ చూపును. అవి నీ పరిశుద్ధ పర్వతమునకు నన్ను తోడుకొని వచ్చును.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, నీ జనులను కటాక్షించి వారి శరీరాత్మలకు ఎల్లప్పుడు నీవే ఏలికవై యుండి నీ గొప్ప దయచేత వారిని రక్షింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-హెబ్రీ 9:11-15

సువార్త పాఠము-యోహాను 8:46-59

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ఆది 12:1-8 | 1కొరి 1:21-31 | మత్త 10:32-42 |
| (బి) సంఖ్యా 21:4-9 | హెబ్రీ 7:24-27 | యోహా 12:23-33 |
| (సి) కీర్తన 2 | రోమా 5:12-21 | మత్త 27:11-31 |
| (డి) సంఖ్యా 21:4-9 | 1పేతు 1:17-32 | యోహా 13:31-35 |

## లెంటులోని ఆరవ యాదివారము

## (మట్టలాదివారము)

### ప్రారంభ గీతము

యెహోవా నాకు దూరముగా నుండకుము. నా బలమా, త్వరపడి నాకు సహాయము చేయుము.

సింహపు నోటినుండి నన్ను రక్షింపుము. గుబ్బుబోతుల కొమ్ములలో పడకుండ నన్ను రక్షింపుము.

నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి. నన్ను రక్షింపక నీవేల అంత దూరముగా నున్నావు.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు మానవకోటిమీద మిక్కిలి వాత్సల్యము గలవాడవై అందరును నీ కుమారుడును మా రక్షకుడునైన యేసుక్రీస్తుయొక్క అత్యంత విషయమున మాదిరిగా ననుసరించునట్లు మా శరీరమును దాల్చి సిలువ మీద మరణము పొందుటకు ఆయనను పంపియున్నావు. మేము ఆయన ఓరిమిననుసరించుటకు ఆయన పునరుత్థానములో పాలివారమగుటకు కృప దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఫిలిప్పీ 2:5-11

సువార్త పాఠము-మత్తయి 21:1-9

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|

| | | |
|---|---|---|
| (ఎ) జెకర్యా 9:9,10 | హెబ్రీ 12:1-11 | మార్కు 14:3-9 |
| (బి) జెకర్యా 9:8-12 | హెబ్రీ 12:1-6 | యోహా 12:1-19 |
| (సి) యిర్మి 18:1-14 | గలతీ 2:16-21 | లూకా 23:26-38 |
| (డి) జెకర్యా 9:8-12 | హెబ్రీ 12:1-16 | యోహా 12:1-8 |

## పరిశుద్ధ వారములోని సోమవారము

### ప్రారంభ గీతము

యెహోవా, నాతో వ్యాజ్యమాడువారితో వ్యాజ్యమాడుము. నాతో పోరాడువారితో పోరాడుము.

కేడెమును డాలును పట్టుకొని. నా సహాయమునకై లేచి నిలువుము.

ఈటె దూసి నన్ను తరుమువారి నడ్డగింపుము. నేనే నీ రక్షణ అని నాతో సెలవిమ్ము.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మేము ఎన్నో శోధనల మధ్య చిక్కి మా బలహీనతచేత పడిపోవుచున్నాము. నీ జనితైక కుమారుడు మా కొరకు పొందిన శ్రమనుబట్టియు ఆయన మా పక్షమున చేయు విజ్ఞాప నమును బట్టియు నీ కృపతో మమ్మును లేవనెత్తుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-యెషయా 50:5-10
సువార్త పాఠము-యోహాను 12:1-23 లేక శ్రమ చరిత్ర

## పరిశుద్ధ వారములోని మంగళవారము

### ప్రారంభ గీతము

మన ప్రభువైన క్రీస్తు సిలువయందు తప్ప, మరి దేని యందును అతిశయించుట నాకు దూరమగుగాక.

రక్షణము జీవమును పునరుత్థానమును ఆయనయందు కలవు. ఆయన వలననే

మనము విమోచింపపడి స్వతంత్రుల మగుదుము.

దేవుడు మమ్మును కరుణించి ఆశీర్వదించును గాక. ఆయన తన ముఖకాంతి మనమీద ప్రకాశింపజేయును గాక.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగలగల నిత్యుడవైన దేవా, మా ప్రభువుయొక్క శ్రమలను ధ్యానించుటవలన మేము పాపక్షమాపణ నొందునట్లు కృప దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-యిర్మియా 11:13-20

సువార్త పాఠము-యోహాను 12:24-43 లేక శ్రమ చరిత్ర

## పరిశుద్ధ వారములోని బుధవారము

### ప్రారంభ గీతము

పరలోకమందున్న వారిలోగాని, భూమిమీదనున్న వారిలో గాని భూమిక్రిందనున్న వారిలోగాని, ప్రతివాని మోకాలు యేసు నామమున వంగును.

ఆయన మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడాయెను. కాబట్టి తండ్రియైన దేవుని మహిమార్థమై ఆయన ప్రభువైయున్నాడు.

యెహోవా, నా ప్రార్థన నాలకింపుము, నా మొఱ్ఱ నీ యొద్దకు చేరనిమ్ము.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగలగల దేవా, మా దుష్కార్యములనుబట్టి యెడతెగక బాధపడుచున్న మేము నీ జనితైక కుమారుని శ్రమల వలన విమోచింపబడునట్లు కృప ననుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మ తోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-యెషయా 62:11-63:7

సువార్త పాఠము-లూకా22:1-23:42 లేక శ్రమ చరిత్ర

## పరిశుద్ధవారములోని గురువారము

### ప్రారంభ గీతము

*మంగళవారమునకు నియమింపబడిన ప్రారంభ గీతమును వాడవెను.*

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువైన దేవా, నీ శ్రమలను జ్ఞాపకము చేసికొనుటకై ఆశ్చర్యమైన సంస్కారమును మా కనుగ్రహించియున్నావు. మేము ఆ నీ శరీర రక్తముల సంస్కారమును యోగ్యముగా పుచ్చుకొని నీ విమోచన ఫలితములను మాయందెల్లప్పుడు కనబరచునట్లు దయ చేయుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 11:23-32

సువార్త పాఠము-యోహాను 13:1-15 లేక శ్రమ చరిత్ర

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) నిర్గమ 12:1-14 | 1కొరి 10:16,17 | లూకా 22:14-20 |
| (బి) " " | " 11:23-32 | యోహా 13:1-17 |
| (సి) " " | 1కొరి 10:14-21 | యోహా 6:47-58 |
| (డి) కీర్త 111 | " 10:16,17 | లూకా 22:14-20 |

## మహా శుక్రవారము

*మంగళవారపు ప్రారంభ గీతముగాని ఈ దిన ప్రారంభ గీతముగాని వాడవలెను*

### ప్రారంభ గీతము

నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను సహించెను.

మన యతిక్రమ క్రియనుబట్టి అతడు గాయపర్చబడెను। మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను.

మన మందరము గొఱ్ఱెలవలె త్రోవ త్రిప్పిపోతిమి। యెహోవా మన యందరి

దోషమును అతనిమీది మోపెను.

యెహోవా, నా ప్రార్థన నాలకింపుము । నా మొర, నీ యొద్దకు చేరనిమ్ము.

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ఎవరి నిమిత్తము మా ప్రభువైన యేసుక్రీస్తు దుష్టులచేతుల కప్పగించుటకును సిలువమీద మరణము నొందుటకును సమ్మతించెనో ఆ నీ కుటుంబమును కటాక్షించుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–యెషయా 52:13–53:12

సువార్త పాఠము–యోహాను 13:1–15 లేక శ్రమ చరిత్ర

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 50:6–9 | ప్రక 5:6–10 | మత్త 27:33–54 |
| (బి) ” 53:1–7 | హెబ్రీ 10:19–22 | యోహా 19:1–18 |
| (సి) మీకా 8:1–8 | 2కొరి 5:14–21 | లూకా 23:39–49 |
| (డి) కీర్త 22:11–1 | ” 5:14–21 | లూకా 23:39–48 |

## మహా శుక్రవారము కొరకైన యితర సంగ్రహ ప్రార్థనలు

### I

కనికరముగల నిత్యుడవైన దేవా, నరుల కొరకు నీ యేక కుమారుని ఇచ్చుటకు వెనుక తీయక సిలువమీద మా పాపములను భరించుటకై మా యందరి నిమిత్తము ఆయన నప్పగించియున్నావు. మేము ఏ శత్రుబలమునకైనను భయపడక మా హృదయములను దృఢ విశ్వాసముతో ఆయనయందు నిలుపు నట్లనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

### II

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, సాతాను అధికారమును మా మీదనుండి తొలగించుటకై నీ కుమారుడు మా కొరకు సిలువ బాధలు సహింపవలయునని

యిచ్ఛయించినావు. మేము మా ప్రభుని శ్రమలను జ్ఞాపకముంచుకొని వాని నిమిత్తము స్తోత్రములను చెల్లించుచు పాపమునుండియు నిత్య మరణమునుండియు విడుదల నొందునట్లు సహాయము చేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## పరిశుద్ధ వారములోని శనివారము

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, ప్రభుని పునరుత్థాన మహిమతో ఈ మహా పరిశుద్ధమైన రాత్రిని ప్రకాశింపజేసియున్నావు. నీ ప్రజలు శరీరాత్మల యందు నూతన పరచబడి నీకు పరిశుద్ధమైన సేవచేయునట్లు నీవను గ్రహించిన దత్తపుత్రాత్మను వారందరియందుంచి కాపాడుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ఈస్టరు దినము – ప్రభుని పునరుత్థానము

### ప్రారంభ గీతము

నేను మేల్కొనియుంటినా యింకను నీ యొద్దనే యుందును. హల్లెలూయా। నీ చేయి నా మీద నుంచియున్నావు. హల్లెలూయా.

ఇట్టి తెలివి నాకు మించినది । అది యగోచరము. అది నాకుండదు. హల్లెలూయా. హల్లెలూయా.

యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు।నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును.

లేక

ఆయన లేచియున్నాడు హల్లెలూయా। సజీవుడైన వాని మీరెందుకు మృతులలో వెదకుచున్నారు, హల్లెలూయా.

మనుష్య కుమారుడు సిలువవేయబడి మూడవ దినమందు లేవవలసియున్నదని, హల్లెలూయా । ఆయన మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. హల్లెలూయా,

హల్లెలూయా.

మహిమాప్రభావములతో వానికి కిరీటము ధరింపజేసి యున్నావు । నీ చేతి పనులమీద వాని కధికారమిచ్చి యున్నావు.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, నీ జనితైక కుమారుడగు యేసుక్రీస్తు ద్వారా మరణమును జయించి నత్య జీవపుద్వారమును మాకొరకు తెరచి యున్నావు. నీవు మా హృదయములయందు మంచి కోరికలను పుట్టించుచున్నావు. మేము వాటికి తగిన ఫలములు ఫలించునట్లుకూడ నీవే యెడతెగకుండ ఎల్లప్పుడు సహాయము చేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - 1 కొరింథీ 5:6-8

సువార్త పాఠము - మార్కు 16:1-8

## ఈస్టరు కొరకైన యితర సంగ్రహ ప్రార్థనలు

### I

సర్వశక్తిగల దేవా, నీ పస్కా విందు నాచరించుచున్న మేము పరలోకపు వాంఛలచే పురికొల్పబడి జీవపు టూటయగు క్రీస్తు ప్రభువునే యెల్లప్పుడు ఆశించునట్లు దయచేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### II

సర్వశక్తిగల దేవా, ప్రభుని పరిశుద్ధమైన పునరుత్థానపు పండుగ నాచరించుచున్న మేము పరిశుద్ధాత్మవలన నూతన పరచబడి ఆత్మీయ మరణమునుండి తిరిగి లేచునట్లు దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## ఈస్టరు తరువాతి సోమవారము

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన మొదలైనవి, ఈస్టరు దినము కైనవే వాడుకొనవలెను.*

పత్రిక పాఠము–అపో. కార్య 10:34-41

సువార్త పాఠము–లూకా 24:13-35

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) హోషే 13:14 | 1కొరి 10:16,17 | లూకా 22:14-20 |
| (బి) యెష 26:13-21 | " 15:12-22 | యోహా 20:11-18 |
| (సి) కీర్తన 16 | 1కొరి 15:35-58 | యోహా 20:11-18 |
| (డి) కీర్త 16:8-11 | " 15:54-58 | యోహా 20:11-18 |

## ఈస్టరు తరువాతి మొదటి యాదివారము

### ప్రారంభ గీతము

క్రొత్తగా జన్మించిన శిశువులనుబోలి । నిర్మలమైన వాక్యమను పాలను ఆపేక్షించుడి.

నా ప్రజలారా, ఆలకించుడి నేను మీకు సంగతి తెలియ చేయుదును ఓ ఇశ్రాయేలూ, నీవు నా మాట వినినయెడల ఎంత మేలు.

మనకు బలమైన దేవునికి ఆనందగానము చేయుడి । యాకోబు దేవునిబట్టి ఉత్సాహగానము చేయుడి.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, ప్రభుని పరిశుద్ధ పునరుత్థాన పండుగ నాచరించిన మేము నీ కృపా సహాయముచేత మా మాటలయందును క్రియలయందును దానికి తగిన ఫలములను ఫలించునట్లు దయ చేయుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1 యోహాను 5:4-12

సువార్త పాఠము-యోహాను 20:19-31

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యోబు 19:25-27 | 1పేతు 1:17-2:3 | యోహా 21:15-19 |
| (బి) ఆది 32:22-31 | 1యోహా 4:1-6 | యోహా 21:15-24 |
| (సి) యెషయా 52:1-10 | 1పేతు 1:3-16 | యోహా 21:1-19 |
| (డి) ఆది 32:22-31 | " 1:3-9 | యోహా 21:15-19 |

## ఈస్టరు తరువాతి రెండవ యాదివారము

### ప్రారంభ గీతము

లోకము యెహోవా కృపతే నిండియున్నది। యెహోవా వాక్కు చేత ఆకాశములు కలిగెను.

నీతిమంతులారా, యెహోవానుబట్టి ఆనందగానము చేయుడి। స్తుతిచేయుట యథార్థవంతులకు శోభస్కరము.

### సంగ్రహ ప్రార్థన

దేవా, నీ కుమారుడు తన్నుతాను తగ్గించుకొనుటవలన పడిపోయిన మానవకోటిని నీవు లేవనెత్తి యున్నావు. నీ యందు విశ్వాసముంచు వారికి ఎడతెగని ఆనందమును దయచేసి నిత్య మరణాపాయమునుండి నీవు సంపాదించిన శాశ్వత సంతోషముతో పాలివారగునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక

దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్

పత్రిక పాఠము-1 పేతురు 2:21-25
సువార్త పాఠము-యోహాను 10:11-16

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెహె 34:11-16 | హెబ్రీ 13:20,21 | యోహా 10:22-30 |
| (బి) " " | ప్రక. 2:1-5 | యోహా 21:1-14 |
| (సి) " " | 1పేతు 4:12-19 | యోహా 14:1-14 |
| (డి) కీర్తన 23 | ఎఫెసీ 2:4-10 | యోహా 14:1-6 |

## ఈస్టరు తరువాతి మూడవ యాదివారము

### ప్రారంభ గీతము

సర్వలోక నివాసులారా, దేవునిగూర్చి సంతోషగీతము పాడుడి. ఆయన నామ ప్రభావమును కీర్తించుడి. ఆయనకు ప్రభావమును ఆరోపించి ఆయనను స్తోత్రించుడి.

నీ కార్యములు ఎంతో భీకరమైనవి. నీ బలాతిశయమును బట్టి నీ శత్రువులు లొంగి నీ యొద్దకు వచ్చెదరు. అని దేవుడితో చెప్పుడి.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, అక్రమస్తులు నీతిమార్గమునకు మళ్లుకొను నట్లు వారికి నీ సత్యమును వెలుగును కనబరచి యున్నావు. క్రీస్తు మత సహవాసములోనికి చేర్చుకొనబడిన వారందరు ఆ మతమునకు ప్రతికూలమైన వాటినన్నిటిని విసర్జించి అనుకూలమైనవాటినే చేయునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1 పేతురు 2:11-20
సువార్త పాఠము-యోహాను 16:16-23

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) విలాప 3:18-26 | హెబ్రీ 4:14-16 | యోహా 14:1-11 |

| | | |
|---|---|---|
| (బి) యెష 61:10,11 | ప్రక. 3:1-6 | యోహా 10:1-10 |
| (సి) కీర్తన 23 | 1యోహా 3:1-6 | యోహా 12:20-26 |
| (డి) యెష 40:26-31 | " 4:9-14 | యోహా 12:20-26 |

## ఈస్టరు తరువాతి నాలుగవ యాదివారము

### ప్రారంభ గీతము

యెహోవా ఆశ్చర్యకార్యములు చేసియున్నాడు। ఆయనను గూర్చి క్రొత్త కీర్తన పాడుడి.

యెహోవా తన రక్షణ వెల్లడి చేసియున్నాడు। అన్యజనుల యెదుట తన నీతిని బయలు పరచియున్నాడు.

ఆయన దక్షిణ హస్తము ఆయన పరిశుద్ధ బాహువు। ఆయనకు విజయము కలుగ జేసియున్నది.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీ యందు విశ్వాసముంచువారి మనస్సులను ఏకీభవింప జేయుచున్నావు. నీ ప్రజలమైన మేము నీ వాఙ్ఞపించు దానినే ప్రేమించి నీవు వాగ్దత్తము చేసినవాటి నపేక్షించుచు లోకమందు నానావిధములైన మార్పులు కలుగు చున్నను నిజమైన సంతోషము ఎక్కడ కలుగునో అక్కడనే మా హృదయములను నిలుపునట్లు కృప దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-యాకోబు 1:16-21
సువార్త పాఠము-యోహాను 16:5-15

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 12:1-6 | 2కొరి 5:14-21 | యోహా 8:21-36 |
| (బి) యెష 5:1-7 | ప్రకటన 3:7-11 | యోహా 15:1-11 |
| (సి) " 57:11-21 | 2తిమో 2:8-13 | యోహా 6:60-70 |
| (డి) కీర్తన 98 | " " | యోహా 6:60-69 |

## ఈస్టరు తరువాతి ఐదవ యాదివారము

### ప్రారంభ గీతము

యెహోవా తనసేవకుడైన యాకోబును విమోచించెనను సంగతి। ఉత్సాహధ్వనితో తెలియజేయుడి. హల్లెలూయా.

భూదిగంతములవరకు అది వినబడునట్లు దాని ప్రక టించుడి। హల్లెలూయా, హల్లెలూయా.

సర్వలోక నివాసులారా, దేవుని గూర్చి సంతోషగీతము పాడుడి; ఆయన నామప్రభావమును కీర్తించుడి। ఆయనకు ప్రభావమును ఆరోపించి ఆయనను స్తోత్రించుడి.

### సంగ్రహ ప్రార్థన

మేళ్లన్నిటికి కారకుడవైయున్న ఓ ప్రభువా, నీ పరిశుద్ధమైన ఆవేశమువలన మేము మంచివాటినే యోచించి నీ కృపగల సహాయము వలన మేము వాటిని నెరవేర్చునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-యాకోబు 1:22-27
సువార్త పాఠము-యోహాను 16:23-30

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మి 29:11-14 | రోమా 8:24-28 | యోహా 17:1-19 |
| (బి) యెష 54:7-13 | ప్రకటన 3:14-22 | యోహా 14:13-21 |
| (సి) కీర్తన 102:11-28 | 1తిమో 2:1-6 | యోహా 6:60-70 |
| (డి) యెష 55:6-11 | " " | లూకా 11:5-13 |

## ప్రభుని ఆరోహణము

### ప్రారంభ గీతము

గలిలైయ మనుష్యులారా, మీ రెందుకు నిలిచి ఆకాశమువైపు చూచుచున్నారు। హల్లెలూయా.

మీ యొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే యే రీతిగా పరలోకమునకు వెళ్లుట మీరు చూచితిరో ఆ రీతిగానే ఆయన తిరిగి వచ్చును। హల్లెలూయా, హల్లెలూయా.

సర్వజనులారా, చప్పట్లు కొట్టుడి। జయధ్వనులతో దేవుని గూర్చి ఆర్భాటము చేయుడి.

## సంగ్రహ ప్రార్థన

### I

సర్వశక్తిగల దేవా, నీ జనితైక కుమారుడగు మా ప్రభువైన యేసుక్రీస్తు పరలోకమునకు ఎక్కిపోయెనని నమ్ముచున్నాము. ఆలాగు ననే మేము మా హృదయములను, మనస్సులను పరలోకమున కెక్కించి నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### II

ఓ మహిమగల రాజా, సేనల యెహోవా, నేటి దినమున నీవు ఆకాశములన్నిటికి పైగా విజయముతే ఆరోహించి యున్నావు. మమ్మును అనాధులనుగా విడువక తండ్రిచేత వాగ్దత్తము చేయబడిన సత్యాత్మను పంపుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదాఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-అపో. కార్య 1:1-11
సువార్త పాఠము-మార్కు 16:14-20

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 57:15 | ఎఫెసీ 1:3-14 | లూకా 24:46-53 |
| (బి) కీర్తన 110 | ” 1:15-23 | లూకా 24:50-53 |
| (సి) ఆది 14:14-20 | హెబ్రీ 9:24-10:14 | యోహా 17:12-26 |
| (డి) కీర్తన 110 | కొలస్సై 3:1-4 | లూకా 24:50-63 |

## ఆరోహణము తరువాతి యాదివారము

## ప్రారంభ గీతము

యెహోవా, నేను కంఠ ధ్వనియెత్తి నిన్ను ప్రార్థించునప్పుడు నా మనవి నాలకింపుము। హల్లెలూయా.

నా సన్నిధిని వెదకుడని నీవు సెలవియ్యగా। యెహోవా నీ సన్నిధిని వెదకుదునని నా హృదయము నీతోననెను.

నీ ముఖము నాకు దాచకుము। హల్లెలూయా, హల్లెలూయా.

యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు। నే నెవరికి భయపడుదును?

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మా హృదయముల యందు ఎల్లప్పుడు నీ యెడల భక్తియుక్తమైన కోరికలను కలిగించుచు ప్రభావముతో మేము పవిత్రమైన సేవ చేయునట్లు కృప దయ చేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1పేతురు 4:7-11
సువార్త పాఠము-యోహాను 15:26-16:4

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెహె 36:25-27 | రోమా 8:29-39 | యోహా 17:20-26 |
| (బి) యెష 64:1,2 | 1యోహా 3:19-24 | యోహా 14:1-12 |
| (సి) కీర్తన 42 | కొలస్సై 3:1-11 | యోహా 17:12-26 |
| (డి) కీర్తన 42 | ఎఫెసీ 1:15-23 | యోహా 7:33-39 |

## పెంతెకొస్తు పండుగ - ధవళాదివారము

## ప్రారంభ గీతము

యెహోవా ఆత్మ లోకమును ఆవరించియున్నది। హల్లెలూయా.

నీతిమంతులు సంతోషింతురుగాక. వారు దేవుని సన్నిధిని ఉల్లసించుదురుగాక।

వారు మహదానందము పొందుదురుగాక. హల్లెలూయా, హల్లెలూయా.

దేవుడు లేచుగాక. ఆయన శత్రువులు పారిపోవుదురుగాక। ఆయనను ద్వేషించువారు ఆయన సన్నిధినుండి పారిపోవుదురుగాక.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీవు నీ పరిశుద్ధాత్మను పంపి నీ యందు విశ్వాస ముంచువారి హృదయములను వెలిగించి యున్నావు. వేము ఆ యాత్మమూలముననే సర్వవిషయములను సరియైనరీతిని గ్రహించి, ఆయన పరిశుద్ధమైన ఆదరణయందు ఎల్లప్పుడు ఆనందించునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–అపో. కార్య 2:1–13
సువార్త పాఠము–యోహాను 14:23–31

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యోవే 2:28–32 | ఎఫెసీ 4:7–16 | యోహా 14:15–11 |
| (బి) యెష 44:1–6 | హెబ్రీ 8:8–11 | యోహా 7:37–39 |
| (సి) " 62 | ఎఫెసీ 1:3–23 | యోహా 15:1–7 |
| (డి) యెహె 36:22–28 | ఎఫెసీ 2:10–22 | యోహా 14:15–21 |

## ధవళాదివారము తరువాతి సోమవారము

*ప్రారంభగీతము ధవళాదివారము కొరకైనది వాడవలయును.*

### సంగ్రహ ప్రార్థన

దేవా, నీ యపోస్తలులకు నీ పరిశుద్ధాత్మతోను అనుగ్రహించి యున్నావు. నీ ప్రజలమైన మా మనవులను అంగీకరించి నీవు అనుగ్ర హించిన విశ్వాసముతోపాటు నీ సమాధానమును మాకు దయ చేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదాఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–అపో. కార్య 10:42–48

సువార్త పాఠము-యోహాను 3:16-21

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 32:14-20 | అ.కా 2:42-47 | యోహా 4:5-26 |
| (బి) యెహె 30:22-28 | " 2:22-39 | యోహా 4:19-24 |
| (సి) యెష 54:7-13 | ఎఫెసీ 2:13-22 | యోహా 15:8-16 |
| (డి) " 44:1-6 | " 4:11-16 | యోహా 15:9-16 |

## పరిశుద్ధ త్రిత్వమును గూర్చిన పండుగ

### ప్రారంభ గీతము

పరిశుద్ధ త్రిత్వమును విభజింపబడనేరని ఏకత్వమును స్తుతింపబడుగాక। ఆయన తన కృపను మనకు చూపియున్నాడు, ఆయనను మహిమపరచుదము.

యెహోవా, మా ప్రభువా। భూమియందంతట నీ నామము ఎంత ప్రభావము గలది.

లేక

సైన్యముల కధిపతియగు యెహోవా పరిశుద్ధుడు। పరిశుద్ధుడు।। పరిశుద్ధుడు।।। ఆయన మూలముగను ఆయన ద్వారాను ఆయన నిమిత్తమును సమస్తమును కలిగియున్నది.

యెహోవా, మా ప్రభువా। భూమియందంతట నీ నామము ఎంత ప్రభావముగలది।

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నిజమైన విశ్వాసముగలిగి నిత్యత్రిత్వముయొక్క మహిమను తెలిసికొనుటకును దైవ ప్రభావముగల నీ శక్తిని బట్టి యేకత్వమును ఆరాధించుటకును నీ సేవకులమైన మాకు కృప ననుగ్రహించియున్నావు. ఈ విశ్వాసమునందు మమ్మును స్థిరముగా నిలిపి కీడులన్నిటి నుండియు కాపాడుమని సదా ఏక దేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 11:33-36

సువార్త పాఠము-యోహాను 3:1-15

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెహె 18:30-32 | 2కొరి 13:14 | మత్త 28:18-20 |
| (బి) యెష 6:3-7 | 1కొరి 12:4-13 | మత్త 28:18-20 |
| (సి) యెష 6:1-8 | అ.కా 2:33-47 | మత్త 28:18-20 |
| (డి) యెష 6:1-8 | ఎఫెసీ 1:3-14 | మత్త 28:16-20 |

## త్రిత్వము తరువాతి మొదటి ఆదివారము

### ప్రారంభ గీతము

ఓ ప్రభువా, నేను నీయందు నమ్మిక యుంచియున్నాను। రక్షణ విషయమై నా హృదయము హర్షించుచున్నది.

యెహోవా నాకు మహోపకారములను చేసి యున్నాడు। నేను ఆయనను కీర్తించెదను.

యెహోవా, ఎన్నాళ్లవరకు నన్ను మరచిపోదువు। నాకెంత కాలము విముఖుడవై యుందువు।

నిన్ను నమ్మిన వారందరికి బలమైయున్న యోదేవా, మా ప్రార్థనలను కరుణతో చిత్తగింపుము. మరియు మా మానవ స్వభావ బలహీనతనుబట్టి నీవు లేనిది మంచిదేదియు చేయజాలము. గనుక మేము నీ యాజ్ఞలను గైకృని మా తలంపులవలనను క్రియలవలనను నిన్ను సంతోషపరచునట్లు నీ కృపాసహాయము దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1యోహాను 4:16-21

సువార్త పాఠము-లూకా 16:19-31

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మి 9:23,24 | 1తిమో 6:6-19 | లూకా 12:13-21 |
| (బి) ఆది 12:1-4 | అ.కా. 2:42-47 | మార్కు 4:26-29 |

| | | |
|---|---|---|
| (సి) ద్వితీ 6:1-15 | అ.కా. 4:32-37 | మత్త 5:1-10 |
| (డి) ద్వితీ 6:4-13 | అ.కా. 4:32-35 | మత్త 13:31-35 |

## త్రిత్వము తరువాతి రెండవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా నన్ను ఆదుకొనెను. విశాలమైన స్థలమునకు నన్ను తోడుకొని వచ్చెను.

నేను ఆయనకు ఇష్టుడను. గనుక ఆయన నన్ను తప్పించెను.

యెహోవా నా బలమా, నేను నిన్ను ఎంతో ప్రేమించు చున్నాను. యెహోవా నా శాలము నా కోట.

సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీయందు స్థిరమైన భయభక్తులతో నీవు పెంచెడు జనులకు ఎల్లప్పుడు సహాయము చేయుచునిత్యము వారిని పాలించు చున్నావు. నీ పరిశుద్ధ నామమునందు మేము నిరంతరము ఎడతెగని భయభక్తులు గలవారమగునట్లు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1యోహాను 3:13-18

సువార్త పాఠము-లూకా 14:16-24

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 25:6-9 | ప్రక 3:14-22 | లూకా 14:25-35 |
| (బి) ఆది 15:1-6 | అ.కా. 3:1-10 | మత్త 9:9-13 |
| (సి) సామె 9:1-11 | అ.కా. 5:1-11 | మత్త 5:27-41 |
| (డి) సామె 9:1-10 | రోమా 10:1-15 | మత్త 9:9-13 |

## త్రిత్వము తరువాతి మూడవ ఆదివారము

### ప్రారంభ గీతము

నేను ఏకాకిని, బాధపడువాడను. నా వైపు తిరిగి నన్ను కరుణింపుము.

నా బాధను నా వేదనను కనుగొనుము. నా పాపములన్ని టిని క్షమింపుము.

యెహోవా, నాయాత్మను నీ దిక్కునకు చూచి యెత్తికొను చున్నాను. నా దేవా, నీయందు నమ్మిక యుంచియున్నాను. నన్ను సిగ్గుపడనీయకుము.

## సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీవు నిన్ను నమ్మిన వారందరికి ప్రాపకుడవై యున్నావు. నీవు లేకున్న నేదియు బలముగానైనను పరిశుద్ధముగా నైనను ఉండనేరదు. మేము అనిత్యమైన వాటిని అనుభవించుచున్నను తుదకు నిత్యమైన వాటిని పోగొట్టుకొనకుండునట్లు నీవు మాకు రాజువును మార్గదర్శివినైయుండి మా మీద నీ కృపను అత్యధికముగా కుమ్మరింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1పేతురు 5:6-11

సువార్త పాఠము-లూకా 15:1-10

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) మీకా 7:18-20 | అ.కా 9:1-18 | లూకా 15:11-32 |
| (బి) ఆది 17:1-9 | అ.కా. 4:1-12 | మత్త 5:1-6 |
| (సి) యహో 24:14-27 | అ.కా. 3:1-16 | లూకా 15:11-32 |
| (డి) యెష 12 | " " | " " |

## త్రిత్వము తరువాతి నాలుగవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా నాకు వెలుగును రక్షణయునైయున్నాడు. నే నెవరికి భయపడుదును? యెహోవా నా ప్రాణదుర్గము ఎవరికి వెరతును?

దుష్టులను నన్ను బాధించు శత్రువులను నా మీదికి వచ్చినప్పుడు వారు తొట్రిల్లి కూలిరి.

నాతో యుద్ధము చేయుటకు దండు దిగినను నా హృదయము భయపడదు.

## సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీ సంఘము భక్తిసహితమైన నెమ్మదిగలిగి సంతోషముతో నిన్ను సేవించులాగున ఈ లోక చర్యలన్నిటిని నా పరిపాలనచే సమాధానముగా జరుపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–రోమా 8:18–23

సువార్త పాఠము–లూకా 6:36–42

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 58:6–12 | రోమా 14:7–17 | మత్త 5:43–48 |
| (బి) ఆది 18:20–33 | అ.కా. 8:26–28 | మత్త 5:7–12 |
| (సి) 1సమూ 3:1–19 | అ.కా. 4:8–31 | మత్త 5:11–16 |
| (డి) యెష 65:1–19,24,25 | అ.కా. 4:1–12 | మత్త 5:13–16 |

## త్రిత్వము తరువాతి ఐదవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నేను కంఠ ధ్వని యెత్తి నిన్ను ప్రార్థించినపుడు నా మనవి నాలకింపుము.

నా రక్షణ కర్తవగు దేవా, నన్ను దిగనాడకుము. నన్ను విడవకుము

యెహోవా నాకు వెలుగును రక్షణయునై యున్నాడు. నే నెవరికి భయపడుదును?

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నిన్ను ప్రేమించువారికొరకు నరుని యోచనకు మించిన మంచివాటిని నీవు సిద్ధపరచియున్నావు. సమస్తమైన వాటి కంటే నిన్నెక్కువగా ప్రేమించుచు మేము కోరగల వాటి నన్నిటిని మించిన నీ వాగ్దానములను పొందునట్లు ప్రేమతో మా హృదయ ములను నింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1పేతురు 3:8-15

సువార్త పాఠము-లూకా 5:1-11

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యిర్మి 16:14-21 | 1పేతు 2:4-10 | మత్త 16:1-23 |
| (బి) ఆది 19:15-26 | అ.కా. 9:1-19 | మత్త 7:24-29 |
| (సి) 1సమూ 16:1-13 | అ.కా. 5:17-41 | లూకా 7:36-50 |
| (డి) విలా 3:22-32 | అ.కా. 5:34-42 | లూకా 9:18-26 |

## త్రిత్వము తరువాతి ఆరవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా తన జనులకు ఆశ్రయము. ఆయన తన యభిషిక్తుని రక్షణ దుర్గము.

నీ జనులను రక్షింపుము. నీ స్వాస్థ్యము నాశీర్వదింపుము. వారికి కాపరివై నిత్యము వారి నుద్ధరింపుము.

యెహోవా, నేను నీకు మొఱ్ఱబెట్టుచున్నాను. నా యాశ్రమ దుర్గమా, మౌనముగా నుండక నా మనవి నాలకింపుము. నీవు మౌనముగా నుండిన యెడల సమాధిలోనికి దిగువారివలె నగుదును.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తియు పరాక్రమమును గలదేవా, నీవు మేళ్లన్నిటికిని కారకుడవును దాతవునైయున్నావు. నీ నామమునకు తగిన ప్రేమను మాలో నాటుము. మాలో నిజమైన దైవభక్తిని వృద్ధిచేయుము. సమస్తమైన మంచివాటితో మమ్మును పోషించి నీ గొప్ప కనికరమును బట్టి వాటియందు మమ్ము నిలుపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచు నుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 6:3-11

సువార్త పాఠము-మత్తయి 5:20-26

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) నిర్గమ 20:1-17 | ఎఫెసీ 2:4-10 | మత్త 19:16-29 |

| | | |
|---|---|---|
| (బి) ఆది 25:7-10 | అ.కా. 14:8-18 | మత్త 19:16-25 |
| (సి) 1సమూ 24:1-20 | అ.కా. 8:26-38 | మార్కు 4:26-32 |
| (డి) కీర్తన 1 | అ.కా. 8:26-38 | మత్త 21:28-32 |

## త్రిత్వము తరువాతి ఏడవ ఆదివారము

### ప్రారంభ గీతము

సర్వజనులారా, చప్పట్లు కొట్టుడి. జయధ్వనులతో ఆర్భా టము చేయుడి.

ఆయన జనములను మనకు లోబరుచును. మన పాదముల క్రింద ప్రజలను అణగద్రొక్కును.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, పరలోక భూలోకములయందు సమస్తమును శాశ్వతమైన నీ సంరక్షణ క్రిందనే జరుగుచున్నది. గనుక హానికరమగు దేనిని మా యొద్దకు రానియ్యక, లాభకరమగుననే మా కను గ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-రోమా 6:19-28

సువార్త పాఠము-మత్తయి 8:1-9

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మి 31:23-25 | అ.కా. 14:8-23 | మత్త 10:24-31 |
| (బి) ఆది 28:10-22 | అ.కా. 16:22-38 | మత్త 13:44-46 |
| (సి) 1రాజు 3:5-14 | అ.కా. 9:1-19 | మత్త 19:16-26 |
| (డి) యెష 62:6-12 | తిమోతి 6:6-12 | మార్కు 4:26-29 |

## త్రిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారము

### ప్రారంభ గీతము

దేవా, మేము నీ యాలయమున నీ కృపను ధ్యానించితిమి.

దేవా, నీ నామము ఎంత గొప్పదో నీ కీర్తియు భూదిగంత ముల వరకు అంతగొప్పది. నీ కుడిచెయ్యి నీతితో నిండియున్నది.

మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు, యెహోవా గొప్పవాడును బహుకీర్తనీయుడునై యున్నాడు.

### సంగ్రహ ప్రార్థన

ప్రభువా, నీవులేనిది మేము మంచిదేదియు చేయజాలము. నీ చిత్తప్రకారము జీవించు మనస్సు ననుగ్రహించి మేము ఎల్లప్పుడు సరియైన దానినే యోచించి చేయునట్లు శక్తిదయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–రోమా 8:12–17
సువార్త పాఠము–మత్తయి 7:15–23

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మీ 15:19–21 | అ.కా. 20:17–38 | మత్త 7:22–29 |
| (బి) నిర్గ 3:1–14 | అ.కా. 16:12–15 | మార్కు 8:34–38 |
| (సి) యిర్మీ 23:16–32 | అ.కా. 16:16–36 | మత్త 10:32–43 |
| (డి) యిర్మీ 23:16–19 | అ.కా. 6:6–12 | మత్త 12:46–50 |

## త్రిత్వము తరువాతి తొమ్మిదవ ఆదివారము

### ప్రారంభ గీతము

ఇదిగో, దేవుడే నాకు సహాయకుడు. ప్రభువే, నా ప్రాణము నాదరించువాడు.

నా శత్రువులు చేయు కీడు ఆయనవారి మీదికి రప్పించును. ఓ ప్రభువా నీ సత్యమునుబట్టి వారిని నశింపజేయుము.

దేవా, నీ నామమునుబట్టి నన్ను రక్షింపుము. నీ పరాగ్రమ మునుబట్టి నాకు న్యాయము తీర్చుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీ వినయ సేవకుల ప్రార్థనలకు కరుణతో చెవి యొగ్గి నీ కిష్టమైనవాటినే అడుగునట్లు వారిని నడిపించి వారి మనసుల నంగీకరింపుమని నీతోను,

పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 10:6-13

సువార్త పాఠము-లూకా 16:1-9

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) 1దిన 29:10-13 | 2తిమో 1:3-14 | లూకా 12:32-48 |
| (బి) నిర్గ 17:1-7 | అ.కా. 24:22-26 | మత్త 14:22-34 |
| (సి) సామె 16:1-9 | అ.కా. 17:16-34 | మత్త 13:44-52 |
| (డి) సామె 16:1-9 | అ.కా. 17:16-34 | మత్త 13:44-46 |

## త్రిత్వము తరువాతి పదియవ ఆదివారము

### ప్రారంభ గీతము

నేనైతే దేవునికి మొఱ్ఱపెట్టుకొందును. ఆయన నా ప్రార్థన నాలకించును. వారు నా మీదికి రాకుండునట్లు సమాధానము కలుగ జేసి ఆయన నా ప్రాణము విమోచించియున్నాడు.

పురాతనము మొదలుకొని ఆసీనుడగు దేవుడు మారు మనస్సు లేనివారై తనకు భయపడని వారికి ఉత్తరమిచ్చును. నీ భారము యెహోవా మీద మోపుము; ఆయనే నిన్నాదుకొనును.

దేవా, చెవియొగ్గి నా ప్రార్థన నాలకింపుము. నా విన్నపము నకు విముఖుడువై యుండకుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీవు ముఖ్యముగా దయాదాక్షిణ్యములు చూపుట వలన నీ సర్వశక్తిని కనబరచుచున్నావు. మేము నీ యాజ్ఞల చొప్పున నడుచుకొనుచు నీవు దయతో మాకు వాగ్దత్తము చేసినవాటిని పొంది నీ పరలోక భాగ్యమందు పాలివార మగునట్లు నీ కృప నత్యధికముగా ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, .ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 12:1-11

సువార్త పాఠము-లూకా 19:41-48

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మీ 7:1-7 | హెబ్రీ 3:7-15 | మత్త 11:16-24 |
| (బి) సంఖ్యా 32:1-15 | అ.కా. 7:54-60 | మత్త 23:34-39 |
| (సి) యిర్మీ 7:1-15 | అ.కా. 20:17-38 | లూకా 11:49-56 |
| (డి) యిర్మీ 7:1-11 | అ.కా. 20:17-38 | మత్త 23:34-39 |

## త్రిత్వము తరువాతి పదునొకండవ ఆదివారము

### ప్రారంభ గీతము

దేవుడు తన పరిశుద్ధాలయమందున్నాడు. దేవుడు ఏకాంగు లను సంసారులనుగా చేయువాడు

ఇశ్రాయేలు దేవుడే, తన ప్రజలకు బలపరాక్రమములు ననుగ్రహించుచున్నాడు.

దేవుడు లేచుగాక ఆయన శత్రువులు చెదిరిపోవుదురు గాక. ఆయనను ద్వేషించువారు ఆయన సన్నిధినుండి పారిపోవుదురుగాక.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మేము ప్రార్థించుటకు సిద్ధమనస్కులముగానుండు నంతకంటే ఆలకించుటకు నీవు ఎల్లప్పుడు ఎక్కువ సిద్ధముగానున్నావు. మేము కోరు దానికన్నను పొందదగిన దానికన్నను ఎక్కువగా ననుగ్రహించువాడవై యున్నావు. వేటిని గూర్చి మా మనస్సాక్షి భయపడుచున్నదో వాటిని క్షమించి యేసుక్రీస్తు నీతి మధ్యవర్తిత్వముల ద్వారా తప్ప మరి దేనినిబట్టియైనను మేము అడుగుటకు తెగింపలేని మంచి యీవుల ననుగ్రహించి నీ కరుణాసమృద్ధిని మా మీద కుమ్మరింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 15:1-10

సువార్త పాఠము-లూకా 18:9-14

| పా.ని | ప.పా. | సు.పా. |
| --- | --- | --- |
| (ఎ) 2సమూ22:21-29 | రోమా 10:4-18 | లూకా 7:36-50 |
| (బి) 1సమూ 7:5-12 | అ.కా. 17:15-34 | మత్త 16:13-20 |
| (సి) దాని 9:8-19 | 1తిమో 6:6-12 | మార్కు 12:41-44 |
| (డి) దాని 9:15-18 | రోమా 8:33-39 | లూకా 7:30-50 |

## త్రిత్వము తరువాతి పన్నెండవ ఆదివారము

### ప్రారంభ గీతము

దేవా, నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము. యెహోవా, నాకు సహాయము చేయుటకు త్వరగా రమ్ము.

నా ప్రాణము తీయగోరువారు, సిగ్గుపడి అవమాన మొందు దురుగాక.

నాకు అపాయము కలుగగా చూచి సంతోషించువారు వెనుకకు త్రిప్పబడి సిగ్గునొందుదురుగాక.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తియు కనికరమునుగల దేవా, నీ కృపచేతనే నీ విశ్వాసులు నీకు సత్యమైనట్టియు మెచ్చదగినట్టియు సేవచేయగలరు. కనుక, తుదకు మేము పరమందు నీ దివ్య వాగ్దానములను తప్పకుండ పొందులాగున ఇహమందు నిన్ను నమ్మకముగా సేవించునట్లు దయ చేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-2కొరింథీ 3:4-11
సువార్త పాఠము-మార్కు 7:31-37

| పా.ని | ప.పా. | సు.పా. |
| --- | --- | --- |
| (ఎ) యెష 29:18,19 | యాకో 3:1-12 | మత్త 12:31-42 |
| (బి) 1సమూ 16:1-13 | అ.కా. 19:23-41 | మత్త 13:31-45 |

| | | |
|---|---|---|
| (సి) కీర్త 62అ | యకోబు. 3అ | యోహా 8:37-45 |
| (డి) యెష 20:18-21 | అ.కా. 16:9-15 | యోహా 8:31-36 |

## త్రిత్వము తరువాతి పదమూడవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నీ నిబంధనను జ్ఞాపకము చేసికొనుము. నలిగినవానిని అవమానముతో వెనుకకు మరలనీయకుము.

దేవా లెమ్ము, నీ వ్యాజ్యము నడుపుము. నీ విరోధులు చేయు గల్లంతు మరువకుము.

దేవా నీవు నిత్యము మమ్మును విడనాడితివేమి. నీవు మేపు గొఱ్ఱెల మీద నీ కోపము పొగరాజుచున్నదేమి?

### సంగ్రహ ప్రార్థన

స్వశక్తిగల నిత్యుడవైన దేవా, విశ్వాసము, నిరీక్షణ, ప్రేమయు మాలో వృద్ధిచేసి నీవు వాగ్దానముచేసినది పొందులాగున నీవు ఆజ్ఞాపించు వాటినిమేము ప్రేమించునట్లు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-గలతీ 3:15-22

సువార్త పాఠము-లూకా 10:23-37

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) లేవీ 18:1-5 | 1తిమో 1:5-17 | మత్త 20:20-28 |
| (బి) 2సమూ 12:1-10 | అ.కా. 20:17-38 | మత్త 5:13-19 |
| (సి) సామె 4:4-27 | 1పేతు 2:1-10 | యోహా 9:24-41 |
| (డి) సామె 7:4-10 | 1పేతు 2:1-10 | మార్కు 12:41-44 |

## త్రిత్వము తరువాతి పదునాలుగవ ఆదివారము

### ప్రారంభ గీతము

దేవా, మా కేడెమా, దృష్టింపుము. నీవు అభిషేకించిన వాని ముఖము లక్షింపుము.

నీ యావరణములలో నొక దినము గడుపుట. వెయ్యి దినములకంటే శ్రేష్టము.

సైన్యముల కధిపతియగు యెహోవా నీ నివాసములు ఎంత రమ్యములు. యెహోవా మందిరావరణములను చూడవలెనని నా ప్రాణము ఎంతో ఆశపడుచున్నది. అది సొమ్మసిల్లుచున్నది.

## సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీ యెడతెగని కనికరముతో నీ సంఘమును కాపాడుము. మానవుడు బలహీనుడైనందున నీవు లేనిది నిలువ జాలడు. గనుక హానికరములగు వాటి నన్నిటిని తప్పించి నీ సహాయమువలన మమ్మును ఎల్లప్పుడు కాపాడి మా రక్షణకు ఉపయోగకరమైన వాటి నన్నిటిని పొందునట్లు మమ్మును నడిపింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–గలతీ 5:16–24

సువార్త పాఠము–లూకా 17:11–19

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యిర్మి 17:13,14 | అ.కా. 3:1–10 | యోహా 5:1–15 |
| (బి) సామె 4:14–23 | ఎఫె 2:19–22 | మత్త 10:16–22 |
| (సి) కీర్తన 63:1–8 | కొరింథీ 4అ | మత్త 20:20–28 |
| (డి) కీర్తన 50:14–28 | 1తిమో 1:12–17 | యోహా 5:1–14 |

## త్రిత్వము తరువాతి పదునైదవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నా ప్రార్థనకు చెవి యొగ్గుము. నా మనవుల ధ్వని నాలకింపుము. నా దేవా, నిన్ను నమ్ముకొనియున్న నీ సేవకుని రక్షింపుము.

ప్రభువా, దినమెల్ల నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నన్ను కరుణింపుము.

ప్రభువా నా ప్రాణము నీ వైపున కెత్తుచున్నాను. నీ సేవకుని ప్రాణము

సంతోషింపజేయుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, నీ యెడతెగని జాలిచేత నీ సంఘమును పవిత్ర పరచి కాపాడుము. అది నీ సహాయము లేకుండ సురక్షితముగ నిలువనేరదు గనుక, నీ కృపా సహాయముల చేత దాని నెల్లప్పుడు సంరక్షింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-గలతీ 5:25-6:10

సువార్త పాఠము-మత్తయి 6:24-34

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 6:4-7 | అ.కా. 8:26-39 | లూకా 10:38-42 |
| (బి) 1రాజు 17:1-16 | ఎఫెసీ 4:8-16 | లూకా 11:5-13 |
| (సి) 1రాజు 17:1-16 | 2కొరి 8:1-15 | మత్త 12:15-23 |
| (డి) 1రాజు 17:8-16 | 2థెస్స 3:6-13 | యోహా 11:1-11 |

## త్రిత్వము తరువాతి పదునారవ ఆదివారము

### ప్రారంభ గీతము

ప్రభువా, దినమెల్ల నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నన్ను కరుణింపుము.

ప్రభువా, నీకు దయాళుడవు క్షమించుటకు సిద్ధమైన మనస్సు గలవాడవు. నీకు మొఱపెట్టు వారందరియెడల కృపాతిశయము గలవాడవు.

యెహోవా, నేను దీనుడను దరిద్రుడను. చెవియొగ్గి నాకు ఉత్తరమిమ్ము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మేము ఎడతెగక సత్క్రియలును చేయునట్లు నీ కృప మా ముందువెనుకలను ఎల్లప్పుడు నుంచుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 3:16-21

సువార్త పాఠము-లూకా 7:11-17

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 32:39-40 | 1కొరి 15:21-28 | యోహా 11:19-45 |
| (బి) 1రాజు 17:17-24 | 1థెస్స 5:14-24 | మత్త 25:14-30 |
| (సి) యోబు 5:17-26 | హెబ్రీ 12:14-24 | లూకా 9:49-56 |
| (డి) యోబు 5:17-26 | హెబ్రీ 12:18-24 | మత్త 11:25-30 |

## త్రిత్వము తరువాతి పదునేడవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నీవు నీతిమంతుడవు. నీ న్యాయవిధులు యధార్థములు. నీ కృపచొప్పున నీ సేవకునికి మేలుచేయుము.

యేహోవా, ధర్మశాస్త్రము ననుసరించి. నీర్దోషముగా నడుచు కొనువారు ధన్యులు.

### సంగ్రహ ప్రార్థన

ప్రభువా సాతానువలన శోధనలను జయించి ఏకదేవుడవైన నిన్ను పవిత్రమైన హృదయములతోను మనస్సులతోను వెంబ డించుటకు నీ జనులను కృప దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 4:1-6

సువార్త పాఠము-లూకా 14:1-11

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) 1సమూ 2:1-10 | యూదా 20-25 | మార్కు 2:18-28 |
| (బి) సామె 16:1-9 | యాకో 3:13-18 | లూకా 10:38-42 |
| (సి) కీర్తన 136 | హెబ్రీ 6:1-15 | లూకా 9:57-62 |
| (డి) కీర్తన 75:4-7 | హెబ్రీ 4:9-13 | మత్త 12:1-8 |

## త్రిత్వము తరువాతి పదునెనిమిదవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నీ నిమిత్తము ఎదురుచూచువారికి మేలు చేయుము. నీ ప్రవక్తలను నమ్మకమైనవారిగా చేయుము.

నీ సేవకుల ప్రార్థన నాలకింపుము. నీ ప్రజలైన ఇశ్రాయేలీ యుల విన్నపములకు చెవి యొగ్గుము.

యెహోవా మందిరమునకు వెళ్లుదుమని జనులు నాతో ననినప్పుడు నేను సంతోషించితిని.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, నీవు లేనిది మేము నిన్ను సంతోషపరవజాలము, గనుక నీ పరిశుద్ధాత్మ మా హృదయములను అన్ని విషయములందును నడిపించి యేలునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచు నుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1కొరింథీ 1:4-9

సువార్త పాఠము-మత్తయి 22:34-46

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 10:12-21 | 1యోహా 3:1-8 | యోహా 15:1-17 |
| (బి) యిర్మీ 17:5-10 | 2కొరి 7:6-10 | లూకా 7:36-50 |
| (సి) విలాప 3:22-40 | హెబ్రీ 10:22-39 | మత్త 12:30-37 |
| (డి) 2దిన 1:7-12 | యాకో 2:10-17 | మార్కు 10:17-27 |

## త్రిత్వము తరువాతి పందొమ్మిదవ ఆదివారము

### ప్రారంభ గీతము

నేనే నీ రక్షణ అని నాతో సెలవిమ్ము. నీతిమంతులు మొఱ్ఱపెట్టుగా యెహోవా ఆలకించును.

వారి శ్రమ లన్నిటిలోనుండి ఆయన వారిని విడిపించును. ఆయన వారికి నిరంతరము దేవుడై యున్నాడు.

నా జనులారా, నా భోదకు చెవి యొగ్గుడి.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తియు మిగుల కనికరముగల దేవా, మేము శరీరాత్మలయందు సిద్ధముగానుండి నీవు కోరువాటిని సంతోషముతో నెరవేర్చునట్లు మాకు హానికరమైన సమస్తమునుండి మమ్మును తప్పించి నీ విశేష దయవలన కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచు నుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 4:22-28
సువార్త పాఠము-మత్తయి 9:1-8

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 44:21-23 | 1కొరి 12:12-27 | యోహా 1:35-51 |
| (బి) 1రాజు 19:1-18 | 2థెస్స 3:5-12 | మత్త 12:1-13 |
| (సి) హోషే 14:1-19 | కొలస్సై 4:2-9 | లూకా 18:1-8 |
| (డి) కీర్త 32:1-7 | యాకో 5:13-20 | యోహా 9:24-41 |

## త్రిత్వము తరువాతి ఇరువదియవ ఆదివారము

### ప్రారంభ గీతము

మన దేవుడైన యెహోవా తన కార్యములన్నిటిలో న్యాయ వంతుడు. ఏలయనిన మన మాయన మాటలకు లోబడమైతిమి.

ఓ ప్రభువా, నీ నామమునకు మహిమ కలుగనిమ్ము. నీ కృపాబాహుళ్యమునుబట్టి మాకు మేలు చేయుము.

మన దేవుని పట్టణమందు ఆయన పరిశుద్ధ పర్వతమందు యెహోవా గొప్పవాడును కీర్తనీయుడునై యున్నాడు.

## సంగ్రహ ప్రార్థన

కరుణగల దేవా, నీ విశ్వాసులు తమ పాపములన్నిటినుండి పవిత్రపరుపబడి నెమ్మదిగల మనస్సులతో నిన్ను సేవించునట్లు వారికి క్షమాపణయు సమాధానమును అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 5:15-21

సువార్త పాఠము-మత్తయి 22:1-14

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 65:1,2 | రోమా 11:25-32 | మత్త 21:28-44 |
| (బి) 1రాజు 21:17-25 | ఎఫెసీ 6:1-9 | లూకా 9:1-10 |
| (సి) కీర్తన 1 | 1థెస్స 2:9-20 | మత్త 9:35-38 |
| (డి) సామె 2:1-8 | రోమా 14:1-9 | యోహా 15:1-8 |

# త్రిత్వము తరువాతి ఇరువదియొకటవ ఆదివారము

## ప్రారంభ గీతము

యెహోవా, సర్వశక్తిగల రాజా! సర్వలోకము నీ శక్తిక్రింద నున్నది. నీకు ఎదురాడు మనుష్యుడు లేనేలేడు.

నీవు భూమ్యాకాశములను, ఆకాశముక్రింద ఆశ్చర్యకరమైన వాటినన్నిటిని కలుగజేసియున్నావు. నీవు సర్వమునకు ప్రభుడవు.

యెహోవా ధర్మశాస్త్రము ననుసరించి నిర్దోషముగ నడుచు కొనువారు ధన్యులు.

## సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, క్రైస్తవ సంఘమును నీ కుటుంబము నిరంతరము భక్తిగలదై యుండునట్లు నడిపింపుము. నీ సంరక్షణచేత అది కీడులన్నిటినుండి తొలగి, నీ నామమహిమార్థమై నిన్ను సత్క్రియ లతో సేవించుటకు ఆసక్తిగల దగునట్లు కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు

పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఎఫెసీ 6:10-17

సువార్త పాఠము-యోహాను 4:48-54

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) హోషే 13:14 | ప్రక 3:7క్ష13 | యోహా4:31-42 |
| (బి) యెష 30:15-19 | 2కొరి 8:1-12 | లూకా 12:15-21 |
| (సి) 2సమూ 7:17-29 | ఎఫెసీ 6:1-9 | లూకా 19:1-10 |
| (డి) 2సమూ 7:17-29 | ఎఫెసీ 6:1-9 | మార్కు 10:13-16 |

## త్రిత్వము తరువాతి ఇరువది రెండవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నీవు దోషములను కనిపెట్టి చూచిన యెడల, ప్రభువా ఎవడు నిలువగలడు?

అయినను జనులు నీయందు భయభక్తులు నిలుపునట్లు, నీయొద్ద క్షమాపణ దొరుకును.

యెహోవా, అగాధస్థలములలో నుండి నీకు మొఱ్ఱ పెట్టు చున్నాను. ప్రభువా, నా ప్రార్థన నాలకింపుము.

### సంగ్రహ ప్రార్థన

మా యాశ్రయమును కోటయునైన దేవా, యావద్భక్తికి కర్తా, నీ సంఘముచేయు ప్రార్థనలు విని మేము విశ్వాసముతో అడుగువానిని అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఫిలిప్పీ 1:3-11

సువార్త పాఠము-మత్తయి 18:23-35

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 7:9-11 | ఎఫెసీ 4:10-22 | మత్తయి 18:1-20 |
| (బి) జెఫన్యా 13:14-20 | యాకోబు 5:7-11 | లూకా 10:17-22 |
| (సి) సామె 2:1-15 | హెబ్రీ 13:1-21 | యోహా 8:23-36 |
| (డి) సామె 24:14-20 | హెబ్రీ 13:1-9 | లూకా 9:57-62 |

## త్రిత్వము తరువాతి ఇరువది మూడవ ఆదివారము

### ప్రారంభ గీతము

నేను మిమ్మును గూర్చి యుద్దేశించిన సంగతులను నే నెరుగుదును. అవి సమాధానకరమైన ఉద్దేశములే కాని హానికరమైనవి కావు.

అప్పుడు మీరు నాకు మొఱ్ఱపెట్టుదురు. నాకు ప్రార్థన చేయుదురు.

నేను మీ మనవి నాలకింతును. నేను మిమ్మును చెరలో నుండి రప్పించెదను.

నేను మిమ్మును చెరపట్టి ఏ జనులలోనికి ఏ స్థలములోనికి మిమ్మును తోలివేసితినో, ఆ జనులందరిలో నుండియు ఆ స్థలము లన్నిటిలో నుండియు మిమ్మును సమకూర్చి రప్పించెదను.

యెహోవా నీవు నీ దేశమునెడల కటాక్షము చూపియున్నావు. చెరకుపోయిన యాకోబు సంతతిని నీవు వెనుకకు రప్పించియున్నావు.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మా బలహీనతచేత మా మీదికి తెచ్చుకొనిన మా పాపబంధములనుండి అత్యధికమైన నీ దయచేత నొందునట్లు నీ జనుల నేరములను క్షమింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-ఫిలిప్పీ 3:17-21

సువార్త పాఠము-మత్తయి 22:15-22

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 32:1-8 | రోమా 13:1-7 | మార్కు 12:41-44 |
| (బి) హగ్గ 2:1-9 | కొలస్సై 3:1-4 | లూకా 13:23-30 |
| (సి) కీర్తన 126 | హెబ్రీ 4:1-13 | యోహా 5:19-26 |
| (డి) కీర్తన 85:8-13 | 1తిమోతి 4:4-11 | మత్త 10:24-33 |

## త్రిత్వము తరువాతి ఇరువది మూడవ ఆదివారము

### ప్రారంభ గీతము

ఆయన మన దేవుడు మనము ఆయన పాలించు ప్రజలము. ఆయన మేపు గొఱ్ఱెలము.

రండి నమస్కారము చేసి సాగిలపడుదము. మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము.

రండి యెహోవాను గూర్చి ఉత్సాహధ్వని చేయుదము. మన రక్షణ దుర్గమునుబట్టి సంతోషగానము చేయుదము.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, విశ్వాసులైన నీ ప్రజలు సత్క్రియలను ఫలము విస్తారముగా ఫలించు నీ కృపచేత అనేకమైన ఈవులను పొందునట్లు వారి మనస్సులను పురికొల్పుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-కొలస్సై 1:9-14
సువార్త పాఠము-మత్తయి 9:18-28

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 51:9-16 | 2కొరి 5:1-16 | యోహా 5:17-29 |
| (బి) యెష 63:1-9 | 1థెస్స 5:1-11 | మత్త 24:1-14 |

| | | |
|---|---|---|
| (సి) పరమ 7:3-9 | యాకోబు 4 అ | యోహా 10:22-30 |
| (డి) కీర్తన 39:6-13 | 1థెస్స 5:14-24 | " 10:23-30 |

## త్రిత్వము తరువాతి ఇరువది ఐదవ ఆదివారము

### ప్రారంభ గీతము

యెహోవా, నేను ఇరుకున పడియున్నాను. నన్ను కరుణింపుము. నా శత్రువుల చేతిలోనుండి నన్ను రక్షింపుము. నన్ను తరుమువారినుండి నన్ను రక్షింపుము.

యెహోవా, నీకు మొఱ్ఱపెట్టియున్నాను. నన్ను సిగ్గునొంద నియ్యకుము.

యెహోవా, నీ శరణు జొచ్చియున్నాను. నన్నెన్నడును సిగ్గు పడనియ్యకుము.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మేము మా పుణ్యకార్యములను నమ్ముకొని యుండలేదు. కనుక ఖండితమైన నీ న్యాయతీర్పు చొప్పునకాక నీ కృపచొప్పున నీ వినయ సేవకులమైన మా యెడల జరిగింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-1థెస్స 4:13-18
సువార్త పాఠము-మత్తయి 24:15-28

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) యెష 49:12-17 | 2పేతు 3:3-15 | లూకా 17:20-33 |
| (బి) యెష 35:3-10 | 2థెస్స 2:1-12 | యోహా 11:21-27 |
| (సి) కీర్తన 39 | 1యోహా 2:12-29 | మత్త 10:16-28 |
| (డి) యోబు 14:1-5 | హెబ్రీ 10:32-39 | యోహా 5:19-28 |

## త్రిత్వము తరువాతి ఇరువదియారవ ఆదివారము

### ప్రారంభ గీతము

దేవా, నీ నామమునుబట్టి నన్ను రక్షింపుము. నీ పరాక్రమమును బట్టి నాకు

న్యాయము తీర్చుము.

దేవా, నా ప్రార్థన నాలకింపుము. నా నోటి మాటలు చెవిని పెట్టుము.

నా శత్రువులు చేయుకీడు ఆయన వారి మీదికి రప్పించును. నీ సత్యమునుబట్టి వారిని నశింపజేయుము.

### సంగ్రహ ప్రార్థన

ఓ దేవా, మేము సమస్తమైన వాటి యంతమును నీ న్యాయపు తీర్పు దినమున ఎల్లప్పుడు మదిలో నుంచుకొని మా బ్రతుకు చాలించిన పిమ్మట నిరంతరము నీతో నివసించునట్లు ఈ లోకమందు మేము పరిశుద్ధముగా జీవించులాగున నీ పరిశుద్ధాత్మచే మమ్మును ప్రేరేపించి మా హృదయములను మనస్సులను చక్కబరచి యేలుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము-2పేతురు 3:3-14 లేక థెస్స 1:3-10

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) యెష 40:9,11 | హెబ్రీ 4:9-11 | మత్త 11:2-30 |
| (బి) యెష 40:9,11 | ప్రకటన 7:9-17 | యోహా 5:19-26 |
| (సి) మలాకీ 3:13 | యాకోబు 5:7-20 | లూకా 19:11-27 |
| (డి) కీర్తన 126 | ప్రకటన 2:8-11 | " " |

## త్రిత్వము తరువాతి ఇరువదియేడవ ఆదివారము

ప్రతి సంవత్సరము త్రిత్వము తరువాతి చివరి యాదివారము కొరకు ఈ దిగువ వచ్చు ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన, పత్రిక పాఠము, సువార్త పాఠమును ఉపయోగింపవలెను

### ప్రారంభ గీతము

అల్ఫాయు ఓమెగయు నేనే, వర్తమాన భూత భవిష్యత్కాలము లలోనుండు

వాడను నేనే అని సర్వాధికారియు దేవుడు నగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు.

ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ నున్నది. ఆయన వారితో కాపురముండును. వారాయన ప్రజలైయుందురు. దేవుడు తానే వారికి దేవుడై యుండి తోడై యుండును.

గుమ్మములారా, మీతలలు పై కెత్తుకొనుడి, పురాతనమైన తలుపులారా, మిమ్మును లేవనెత్తుకొనుడి. అప్పుడు మహిమగల రాజు ప్రవేశించును.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, మా బలహీనత చేత మా మీదికి తెచ్చుకొనిన మా పాప బంధములనుండి అత్యధికమైన నీ దయచేత విడుదల నొందునట్లు నీ జనుల నేరములను క్షమింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడు ను మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము–1థెస్స 5:1–11

సువార్త పాఠము–మత్తయి 25:1–13

| | పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|---|
| (ఎ) | యెష 65:17–19 | ప్రకటన 21:1–7 | మత్త 5:13–16 |
| (బి) | " " | " " | లూకా 12:35–46 |
| (సి) | " 65:12–19 | " 21:1–8 | " " |
| (డి) | " 35:3–10 | " 7:9–17 | " 12:35–43 |

## అపొస్తలుల దినము

### ప్రారంభ గీతము

నేను నమ్మినవాని నెరుగుదును, నేను ఆయన కప్పగించిన దానిని రాబోవుచున్న దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను.

నా కొరకు నీతి కిరీట ముంచబడియున్నది. ఆదినమున నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అది నాకిచ్చును.

యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసుకొనియున్నాను. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును.

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, నిన్నెరుగుటయే నిత్యజీవమై యున్నది. నీ కుమారుడైన యేసుక్రీస్తే మార్గమును సత్యమును జీవమునై యున్నాడని పూర్ణముగ గ్రహించునట్లనుగ్రహించి, మేము ఆయన యడుగుజాడలను వెంబడించుచు నిత్యజీవ మార్గమునందు గురి తప్పక నడుచునట్లు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

ఓ సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తును బట్టి పరిశుద్ధులైన నీ అపొస్తులులకు అనేకములైన శ్రేష్ఠ వరములను దయచేసి నా మందను మేపుడని గట్టిగా ఆజ్ఞాపించియున్నావు. కాబట్టి నిత్యమహిమ కిరీటము పొందులాగున సంఘ కాపరులందరు నీ పరిశుద్ధ వాక్యమును శ్రద్ధతో బోధించునట్లు జనులు దానిని విధేయతతో అనుసరించునట్లును దయచేయుమని నీతోను, పరి శుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ సర్వశక్తిగల దేవా, శ్రీమంతుడైన నీ కుమారుని ద్వారా నీ యపోస్తులుడుగాను సువార్తికుడుగా నుండుటకు మత్తయిని సుంకపు మెట్టునొద్దనుండి పిలిచినావు మేమును సమస్త ధనాపేక్షయు లోభత్వ ములు విడిచిపెట్టి నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

సర్వశక్తిగల దేవా, క్రీస్తుయేసే ముఖ్యఇమైన మూలరాయియై యుండగా అపోస్తులులును ప్రవక్తలును వేసిన పునాదిమీద నీ సంఘమును కట్టియున్నావు. వారి యుపదేశము వలన మేము ఆత్మ మూలముగా ఐక్యత గలిగినవారమై నీకు అనుకూలమైన పరిశుద్ధాల యముగా కట్టబడునట్లు అనుగ్రహింపుమని  నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును

మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

కరుణగల దేవా, ధన్యులైన నీ యపోస్తులుల బోధను బట్టి సత్యమను నీ వెలుగునందు నడుచుచు తుదకు నిత్యజీవపు వెలుగులో ప్రవేశించునట్లు నీ సంఘమును నీ జ్ఞానదీప్తిచే నింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## సువార్తికుల దినములు

### ప్రారంభ గీతము

మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి.

వారి స్వరము భూలోకమంతటికిని వారి మాటలు భూదిగంతముల వరకును బయలు వెళ్లెను.

నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునైయున్నది.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, పరలోక సంబంధమైన బోధను నీ సువార్తికులద్వారా పరిశుద్ధ సంఘమునకు నేర్పించి యున్నావు. తప్పు బోధలను గాలికి కొట్టుకొనిపోవు పిల్లలవలె మే ముండక పరిశుద్ధ సువార్త సత్యములయందు స్థిరులమై నిలుచునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## అపొస్తలుడైన పరిశుద్ధతోమా దినము

డిశెంబరు 21

*అపోస్తలుల దినములలో ప్రారంభగీతము సంగ్రహ ప్రార్థన పాడవలెవను.*

పత్రిక పాఠము- ఎఫెసీ 13-6

సువార్త పాఠము- యోహాను 20 21-31

## హతసాక్షియైన పరిశుద్ధ స్తెఫను దినము

డిశంబరు 26

### ప్రారంభ గీతము

అధికారులు నాకు విరోధముగా సభ తీర్చి మాటలాడు కొందురు. నన్ను సంహరింపవలెనని భక్తిహీనులు నా కొరకు పొంచియున్నారు.

దేవా, నాకు సహాయము చేయుము. నేను నీ శాసనములను అనుసరించుచున్నాను.

యెహోవా ధర్మశాస్త్రము ననుసరించి నిర్దోషముగా నడుచుకొను వారు ధన్యులు.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా నీ సత్యమును గూర్చి సాక్ష్యమిచ్చుట వలన ఇహ లోకములో మాకు కలుగు శ్రమలన్నిటియందు మేము నిలకడగా నుండి నీవైపే మాకన్నులెత్తి ముందు ప్రత్యక్షము కాబోవు మహిమను మేము విశ్వాసముద్వారా చూడగలుగునట్లు అనుగ్రహింపుము. శ్రీమంతుడవైన యేసూ, మాకొరకు మధ్యవర్తివియు న్యాయవాది వియునై నీ కొరకు శ్రమపడువారికి సహాయము చేయు నిమిత్తము దేవుని కుడిచేతి వైపున నిలువబడి యున్నావు. కనుక మేము పరిశుద్ధాత్మతో నింపబడినవారమై నీ మొదటి హతసాక్షియైన పరిశుద్ధ స్తెఫను తన్ను చంపుచున్న వారికై నిన్ను ప్రార్థించునట్లు మేమును మమ్మును హింసించువారిని ప్రేమించి జీవించులాగున సహాయము చేయుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము.

పత్రిక పాఠము – అపో. కార్య. 6:8–7:60

సువార్త పాఠము – మత్తయి 23:34–39

## అపొస్తలుడును సువార్తికుడునైన పరిశుద్ధ యోహాను దినము

డిశంబరు 27

*ప్రారంభ గీతము సంగ్రహ ప్రార్థన కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - 1యోహాను 1:1-10

సువార్త పాఠము - 21:19-24

## పరిశుద్ధుడైన పౌలు మారుమనస్సు పొందుట

జనవరి 25

*ప్రారంభ గీతము సంగ్రహ ప్రార్థన కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - అపో. కార్య. 9:1-22

సువార్త పాఠము - మత్తయి 19:27-30

## క్రీస్తు దేవాలయములో సమర్పింపబడుట

ఫిబ్రవరి 2

### ప్రారంభ గీతము

*త్రిత్వము తరువాతి ఎనిమిదవ ఆదివారమునకైన గీతము వాడవలెను.*

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగలిగి సదాజీవించుచుండు దేవా, నీ జనితైక కమారుడు మా శరీరత్వము గలవాడై దేవాలయములో నేడు సమర్పింపబడిన ప్రకారము మేమును పవిత్రమైన హృదయములతో యేసుక్రీస్తు మూలముననే నీకు సమర్పింబడు లాగున కృప దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - మలాకీ 3:1-4

సువార్త పాఠము - లూకా 2:22-32

## అపొస్తలుడైన పరిశుద్ధ మత్తయిదినము

ఫిబ్రవరి 24

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - అపో. కార్య. 1:15-26

సువార్త పాఠము - మత్తయి 11:25-30

## కన్య మరియకు వచ్చిన శుభవర్తమానము

మార్చి 25

### ప్రారంభ గీతము

జనులలో ఐశ్వర్యవంతులు నీ దయను వెదుకుదురు. విచిత్రమైన పనిగల వస్త్రములను ధరించుకొని రాజు నొద్దకు ఆమె తీసికొని రాబడుచున్నది.

ఆమెను వెంబడించుచు ఆమె చెలికత్తెలైన కన్యకలు ఉత్సాహ సంతోషములతో నీ యొద్దకు తీసికొని రాబడుచున్నారు.

ఒక దివ్యమైన సంగతితో నా హృదయము బహుగా నుప్పొంగు చున్నది. నేను రాజును గూర్చి రచించిన దాని పలికెదను.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువా, దేవదూత తెచ్చిన వర్తమానమువలన మేము నీ కుమారుడైన యేసుక్రీస్తు అవతారమును తెలిసికొనిన ప్రకారము ఆయన సిలువ శ్రమలవలన ఆయన పునరుత్థాన మహిమను అనుభవించినట్లు నీ కృప మా హృదయములలో కుమ్మరింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - యెషయా 7:10-16

సువార్త పాఠము - లూకా 1:26-37

## సువార్తికుడైన పరిశుద్ధ మార్కు దినము

ఏప్రియల్ 25

*ప్రారంభ గీతము కొరకు 'సువార్తికుల దినములు' సంగ్రహ ప్రార్థన కొరకు 'అపోస్తలుల దినములను' చూడుము.*

పత్రిక పాఠము - ఎఫెసీ 4:7-13

సువార్త పాఠము - యోహాను 15:1-11

## అపొస్తలులైన పరిశుద్ధ ఫిలిప్పు యాకోబుల దినము

మే 1

*ప్రారంభ గీతము కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, క్రీస్తుయేసే ముఖ్యమైన మూల రాయియై యుండగా అపోస్తలులును ప్రవక్తలను వేసిన పునాదిమీద నీ సంఘమును కట్టియున్నావు. వారి యుపదేశము వలన మేము ఆత్మాను కూలముగా ఐక్యత కలిగిన వారమై నీకు అనుకూలమైన పరిశుద్ధాలయముగా కట్టబడునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేదుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము – ఎఫెసీ 2:19–22

సువార్త పాఠము – యోహాను 14:1–14

## బాప్తిస్మ మిచ్చు పరిశుద్ధ యోహాను దినము

జూన్ 24

### ప్రారంభ గీతము

అరణ్యములో యెహోవాకు మార్గము సిద్ధపరచుడి. ఎడారిలో మా దేవుని రాజమార్గము సరాళము చేయుడి. అని కేకలు వేయుచున్న ఒకని శబ్ధము.

యెహోవా మహిమ బయలు పరచబడును.

యెహోవాను స్తుతించుట మంచిది. మహోన్నతుడా నీ నామమును కీర్తించుట మంచిది.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువయిన దేవా, పరలోకపు తండ్రీ, యేసుక్రీస్తు లోక పాపములను మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్ల యనియు ఆయనయందు విశ్వాసముంచువారు నిత్యజీవమును స్వతంత్రించు కొందురనియు నీ సేవకుడైన బాప్తిస్మమిచ్చు యోహానుద్వారా

సాక్ష్యమిచ్చియున్నావు. మేము ఈ సాక్ష్యమునందు సంతోషమును ఆదరణను పొంది నిజమైన విశ్వాసమందు నిలుకడగానుండి తుదకు నీ విశ్వాసులందరితో నిత్యజీవము పొందునట్లు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము – 40:1–5

సువార్త పాఠము – 1:57–80

## అపొస్తలులైన పరిశుద్ధ పేతురు పరిశుద్ధ పౌలుల దినము

జూన్ 29

*ప్రారంభ గీతము కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

### సంగ్రహ ప్రార్థన

ఓ సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తును బట్టి పరిశుద్ధులైన నీ యపోస్తలులకు అనేకములైన శ్రేష్టవరములను దయచేసి నా మందను మేపుడని గట్టిగా ఆజ్ఞాపించియున్నావు. కాబట్టి, నిత్య మహిమ కిరీటము పొందులాగున సంఘ కాపరులందఱు నీ పరిశుద్ధ వాక్యమును శ్రద్ధతో బోధించునట్లును జనులు దానిని విధేయతతే అనుసరించునట్లును దయ చేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము – అపో. కార్య. 12:1,11

సువార్త పాఠము – మత్తయి 16:13–20

## కన్య మరియ ఎలీసబెతును దర్శించుట

జూలై 2

*శుభ వర్తమాన దినమునకైన ప్రారంభ గీతమును వాడవలెను*

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, నీ సేవకురాలగు మరియ యను కన్య యెడల నీవు అద్భుత

కార్యములను జరిగించి ఆమెను నీ కుమారుని తల్లిగా నేర్పచుకొనుటవలన బీదలను, దీనులను తృణీకరింపబడిన వారిని నీవు దయతో చూచువాడవని తెలియజేసితివి. మేము పూర్ణ మైన దీనత్వమును సాత్వికమును గలవారమై హృదయపూర్వకమైన విశ్వాసముతో నీ వాక్యము నంగీకరించి అందువలన నీ ప్రియ కుమారునితో ఐక్యపరచబడునట్లు కృప ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - యెషయా 1:11-15

సువార్త పాఠము - లూకా 1:39-56

## అపొస్తలుడైన పరిశుద్ధ పెద్ద యాకోబు దినము

జూలై 25

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన 'అపోస్తలుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - రోమా 8:28-39

సువార్త పాఠము - మత్తయి 20:20-30

## అపొస్తలుడైన పరిశుద్ధ బర్తలోమై దినము

ఆగష్టు 24

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన కొరకు 'అపోస్తలుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - 2కొరింథీ 4:7-10

సువార్త పాఠము - లూకా 22:24-30

## అపొస్తలుడును సువార్తికుడునైన పరిశుద్ధ మత్తయి దినము

సెప్టెంబరు 21

*ప్రారంభ గీతము 'అపోస్తలుల దినములు' చూడుము.*

### సంగ్రహ ప్రార్తన

ఓ సర్వశక్తిగలదేవా, శ్రీమంతుడైన నీ కుమారునిద్వారా యపోస్తలుడుగాను సువార్తికుడుగాను ఉండుటకు మత్తయిని సుంకపు మెట్లనొద్ధనుంచి పిలిచినావు. మేమును

సమస్త ధనాపేక్షయు లోభ త్వమును విడిచిపెట్టి నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - ఎఫెసీ 4:7-14

సువార్త పాఠము - మత్తయి 9:9-13

## పరిశుద్ధ మిఖాయేలు యొక్కయు సకల దూతల యొక్కయు దినము

సెప్టెంబరు 29

### ప్రారంభ గీతము

యెహోవా దూతలారా! ఆయన ఆజ్ఞలకు లోబడి ఆయన వాక్యమును నెరవేర్చు బలశూరులారా! ఆయనను సన్నుతించుడి.

యెహోవా సైన్యములారా! ఆయన చిత్తము నెరవేర్చు ఆయన పరిచారకులారా! మీ రందరు ఆయనను సన్నుతించుడి.

నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. నా యంత రంగమున నున్న సమస్తమా, ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము.

### సంగ్రహ ప్రార్థన

నిత్యుడవైన ఓ దేవా! దేవదూతలును, మనుష్యులును నిన్ను వింతైన క్రమము చొప్పున సేవించునట్లు నిర్ణయించితివి. నీ పరిశుద్ధ దూతలు పర లోకమందు ఎల్లప్పుడును నీకు సేవ చేయుచున్నట్లు నీ నిర్ణయము చొప్పున వారు భూలోకమందున్న మాకు సహాయులై మమ్మును కాపాడులాగున నీకృప దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - ప్రకటన 12:7-12

సువార్త పాఠము - మత్తయి 18:1-11

## సువార్తికుడైన పరిశుద్ధ లూకా దినము

అక్టోబరు 18

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన కొరకు 'సువార్తికుల దినములు' చూడుము.*

పత్రిక పాఠము - 2తిమోతి 4:5-11
సువార్త పాఠము - లూకా 10:1-9

అక్టోబరు 28

*ప్రారంభ గీతము 'అపోస్తలుల దినములు' చూడుము.*

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపోస్తలులును, ప్రవక్తలును వేసిన పునాదిమీద మీ సంఘమును కట్టియున్నావు. వారి యుపదేశము వలన మేము ఆత్మమూలముగా ఐక్యత గలిగినవారమై నీకు అనుకూలమైన పరిశుద్ధాలయముగా కట్టబడునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - 1పేతురు 1:3-9
సువార్త పాఠము - యోహాను 15:17-21

## మతోద్ధారణ పండుగ

అక్టోబరు 31

*ఈ పండుగ దినమునకు ముందువచ్చు ఆదివారము మతోద్ధారణ (దిద్దుబాటు) ఆదివారముగా ఆచరించవచ్చును. 31వ తేదీ శనివారమైన యెడల మరుసటి దినమును మతోద్ధారణ ఆదివార ముగా నెంచవలెను.*

### ప్రారంభ గీతము

సైన్యముల కధిపతియగు యెహోవా మనకు తోడై యున్నాడు. యాకోబు యొక్క దేవుడు మనకు ఆశ్రయమై యున్నాడు.

కావున భూమి మార్పు నొందినను, నడిసముద్రములలో పర్వతములు మునిగినను మనము భయపడము.

దేవుడు మనకు ఆశ్రయమును, దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన

నమ్ముకొనదగిన సహాయకుడు.

### సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ, నీయందు విశ్వాస ముంచిన వారి మీద నీ పరిశుద్ధాత్మను కుమ్మరింపుము. నీ కృపా సత్యములలో వారిని స్థిరపరచి సర్వ శోధనలలోనుండి వారిని తప్పించి ఆదరింపుము. నీ వాక్యమునకు విరోధులైనవారినుండి నీ జనులను కాపాడి పోరాడుచున్న క్రీస్తు సంఘమునకు రక్షణకరమైన నీ సమాధానము ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు దును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

లేక

సర్వశక్తిగల దేవా, నీ సేవకులును ధన్యులైన మతోద్ధారకుల ద్వారా నీ సువార్త వెలుగును ప్రకాశింపజేసి యున్నావు. మేము నీ సువార్తయొక్క రక్షణకరమైన శక్తిని గ్రహించిన వారమై శత్రువులు దానిని చెరపకుండునట్లు నమ్మకముగా కాపాడి, ఆత్మల రక్షణార్థమును నీ పరిశుద్ధనామ మహిమార్థమును దానిని సంతోషముతో ప్రకటించు నట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాను, ఆమేన్.

పత్రిక పాఠము - గలతీ 2:16-21
సువార్త పాఠము - యోహాను 8:31-36

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఏ) 1దిన 29:12-29 | గలతీ 2:16-21 | యోహా 2:13-17 |
| (బి) " " | 1పేతు 1:22-25 | " 6:67-71 |
| (సి) కీర్తన 119:29-52 | గలతీ 5:1-15 | మత్త 11:20-30 |
| (డి) " 46 | 1కొరి 3:11-23 | యోహా 2:13-17 |

## సర్వ పరిశుద్ధుల దినము

నవంబరు 1

### ప్రారంభ గీతము

వీరు మహాశ్రమ ననుభవించి వచ్చినవారు! గొఱ్ఱెపిల్ల రక్తములో తమ వస్త్రముల నుదుకుకొని వాటిని తెలుపు చేసుకొనిరి.

అందువలన వారు దేవుని సింహాసనము నెదుటనుండి, దివారాత్రులు ఆయన ఆలయములో ఆయనను సేవించుచున్నారు.

నీతిమంతులారా, యెహోవాను బట్టి ఆనందగానము చేయుడి. స్తుతి చేయుట యదార్థవంతులకు శోభస్కరము.

## సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల ఓ దేవా, నీవు ఏర్పరచుకొనిన వారిని నీ కుమారుడగు మా ప్రభువైన యేసుక్రీస్తుయొక్క మర్మ శరీరములో అన్యోన్య సహవాసమునందు చేర్చియున్నావు. నిన్ను నిష్కపటముగా ప్రేమించు వారి కొరకు నీవు సిద్ధపరచిన ఎంచ శక్యముగాని సంతోషములను మేము పొందులాగున ధన్యులును పరిశుద్ధులు నగు నీ భక్తులకు మేము సమస్త భక్తి సత్ప్రవర్తనలయందు అనుసరరించు నట్లు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - ప్రకటన 7:2-17
సువార్త పాఠము - మత్తయి 5:1-12

# అపొస్తలుడైన ఆంద్రెయ దినము

నవంబరు 30

*ప్రారంభ గీతము, సంగ్రహ ప్రార్థన కొరకు 'అపొస్తలుల దినము'*

పత్రిక పాఠము - రోమా 10:10-18
సువార్త పాఠము - మత్తయి 4:8-22

# కోత పండుగ

## ప్రారంభ గీతము

యెహోవా, సంవత్సరమను నీ దయా కిరీటమును ధరింపజేసి యున్నావు. నీ

జాడలు సారము వెదజల్లుచున్నవి.

నీవు భూమిని దర్శించి దానిని తడుపుచున్నావు. దాని దుక్కులను విస్తారమైన నీళ్లతో తడుపుచున్నావు.

దేవా, సీయోనులో మౌనముగా నుండుట నీకు స్తుతి చెల్లించుటే. నీకు మ్రొక్కుబడి చెల్లింపవలసియున్నది.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మిగుల దయగల తండ్రీ, నీ గుప్పిలిని విప్పి ప్రతి జీవి కోరికను తృప్తిపరచుచున్నావు. పొలముల మీద నీ యాశీర్వాదము కుమ్మరించి, మమ్మును మరల భూఫలములను సమకూర్చుకొన నిచ్చినందుకై వినయముగల హృదయపూర్వకములైన వందనములను చెల్లించుచున్నాము. మేము విస్తారమైన నీతి ఫలములు గలవారమై నీకు అంగీకృతమైన స్తోత్రార్పణను ఎల్లప్పుడు చెల్లించుచుండునట్లు మా హృదయములలో విత్తబడిన దీ వాక్యమను జీవపు విత్తనమును దీవించి కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - 2కొరింథీ 9:6-11

సువార్త పాఠము - లూకా 12:15-21

| పా.ని | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) ద్వితీ 26:1-11 | యాకోబు 1:17,18 | లూకా 12:13-21 |
| (బి) " " | గలతీ 6:7-10 | " 12:22-31 |
| (సి) --------- | ---------- | --------- |
| (డి) కీర్తన 24:1-8 | 2కొరింథీ 9:6-11 | యోహా 6:34-39 |

## పశ్చాత్తాపముతో కూడిన ప్రార్థన దినము

### ప్రారంభ గీతము

యెహోవా మాటలాడుచున్నాడు. ఆకాశమా, ఆలకింపుము. భూమీ చెవి

యొగ్యము. నేను పిల్లలను పెంచి పెద్దవారలుగా చేసితిని. వారు నా మీద తిరుగబడియున్నారు.

వారు యెహోవాను విసర్జించియున్నారు, ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుని దూషింతురు. ఆయనను విడిచి తొలగి పోయి యున్నారు.

యెహోవా నీవు దోషములను కనిపెట్టి చూచిన యెడల ప్రభువా యెవడు నిలువగలడు?

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తియు మిగుల కనికరమును గల దేవా, మా పరలోకపు తండ్రీ, నీ జాలికి అంతములేదు. నీవు దీర్ఘశాంతుడవు దయాళుడవు. కృపా సత్య సంపూర్ణుడవునై యున్నావు. మా అతిక్రమములను పాపములను క్షమించుచున్నావు. మేము పాపముచేసి మూర్ఖముగా నడచితిమి. నిన్ను విడిచి ఘోరముగా నీ కోపము రేపితిమి. నీకు కేవలము నీకే విరోధముగా పాపముచేసి నీ దృష్టి యెదుట కీడైన దానిని చేసితిమి. అయినను ఓ ప్రభువా, మేము బహుగా క్రుంగి యున్నాము. మా పూర్వ దోషములను జ్ఞాపకము చేసికొని మామీద కోపముగా నుండకుము. నీ వాత్సర్యము మా మీదికి త్వరగా రానిమ్ము. మా రక్షణ కర్తవగు దేవా, మాకు సహాయము చేసి, నీ పరిశుద్ధ నామ మహిమార్థమై మా పాపములను పరిహరింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

పత్రిక పాఠము - ప్రకటన 3:1-6

సువార్త పాఠము - లూకా 15:11-32

| పా.ని. | ప.పా. | సు.పా. |
|---|---|---|
| (ఎ) దాని 9:3-19 | హెబ్రి 10:1-31 | మత్త 3:1-12 |
| (బి) " " | " 12:12-15 | లూకా 13:1-15 |
| (సి) కీర్తన 85 | రోమా 2:1-11 | " 13:1-9 |
| (డి) " 130 | హెబ్రీ 12:12-17 | మత్త 11:16-24 |

## సామాన్య లేక విశేష వందనార్పిత దినము

### ప్రారంభ గీతము

సకల ప్రాణులు యెహోవాను స్తుతించుదురు గాక! యెహోవాను స్తుతించుడి.

ఆయన పరాక్రమ కార్యములను బట్టి ఆయనను స్తుతించుడి. ఆయన మహా ప్రభావమును బట్టి ఆయనను స్తుతించుడి.

యెహోవాను స్తుతించుడి. ఆయన పరిశుద్ధాలయమునందు దేవుని స్తుతించుడి.

### సంగ్రహ ప్రార్థన

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, నీవు ప్రతి యుదయమున నీ కృపను మాకు నూతనముగా కనబరచుచున్నావు. మేము నీ దయకు ఎంత మాత్రమును పాత్రులను కాకపోయినను మా శరీరాత్మలకు కావలసిన వన్నియు సమృద్ధిగా ననుగ్రహించు చున్నావు. నీవు మా యెడల చూపిన దయాదాక్షిణ్యములను మేము హృదయపూర్వకముగా ఒప్పుకొని నీ మేళ్లన్నిటి నిమిత్తము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు మనస్ఫూర్తియైన విధేయతతో నిన్ను సేవించుటకు నీ పరిశుద్ధాత్మను దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

**పాఠములు** – ద్వితీ. 8:1–20, యెషయా 26:1–12, 1తిమోతి 2:1–8

# ప్రార్థనలు, సంగ్రహ ప్రార్థనలు

## ప రి శు ద్ధా త్మ

### 1. పరిశుద్ధాత్మ కొరకు

సర్వశక్తిగల దేవా, పరిశుద్ధాత్మ వరము కొరకు ప్రార్థింప వలయునని నీవు మాకు ఆజ్ఞ నిచ్చియున్నావు. రక్షణకరమైన నీ వాక్యమువలన మా హృదయములను తెప్పరిల్లజేసి మమ్మును సర్వలోకములోనికి నడిపించునట్లును మేము నిత్యజీవము పొందులాగున ఆయన మాకు మార్గదర్శియై బోధించి, వెలిగించి, ఏలి, ఆదరించి పరిశుద్ధపరచునట్లును, నీ పరిశుద్ధాత్మను మా కనుగ్రహింపుమని మీ కుమారుడును, మామధ్య వర్తియునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 2. పరిశుద్ధాత్మ కొరకు

సర్వశక్తిగల దేవా, నీ పరిశుద్ధాత్మ నీ చిత్తప్రకారము మమ్మును క్రమపరచుటకును, మా సకల శోధనల యందును బాధలయందును మమ్మును ఆదరించి సమస్త దోషములనుండి కాపాడి సర్వసత్యములోనికి నడిపించునట్లును ఆయనను మా హృదయములలోనికి పంపుము మరియు ఆయన సహాయము వలన మేము విశ్వాసమునందు స్థిరులమై ప్రేమయందును సత్క్రియల యందును వర్ధిల్లి తుదకు నిత్యజీవము పొందునట్లనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 3. పరిశుద్ధాత్మ కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ కుమారుడైన యేసుక్రీస్తును బట్టి మమ్మును కనికరించి మాకు పాపక్షమాపణయు, జీవమునకును దైవ భక్తికిని అవసరములైన వన్నియు ననుగ్రహించి యున్నావు. తండ్రి భావముగల నీ కృపను మేము ఎల్లప్పుడు మనస్సు నందుంచు కొని మా శరీరేచ్ఛలను చంపి లోకమును జయించునట్లును, నిర్మలమైన పరిశుద్ధ జీవితములలో నిన్ను సేవించుచు నీ కృప అంతటి నిమిత్తము ఎల్లప్పుడు నీకు స్తుతులను చెల్లించునట్లును, మమ్మును నడిపించుటకై నీ పరిశుద్ధాత్మను పంపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ప్రత్యేకమైన ఈవులు

### 4. ఆత్మీయముగా నూతన పరచబడుట కొరకు

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రి మా పాపముల విషయమై చనిపోయి, మేము నీతిమంతులముగా తీర్చబడు నిమిత్తము తిరిగి లేచుటకై నీ జనితైక కుమారుని ఇచ్చియున్నావు. క్రీస్తు పునరుత్థాన శక్తిమూలమున, మేము నిత్యము ఆయనతో నివసించు నట్లు నీ పరిశుద్ధాత్మచేత మమ్మును నూతనపరచుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 5. ఆత్మీయముగా నూతనపరచబడుట కొరకు

సర్వశక్తిగల దేవా, మా శరీరమును ధరించుకొనుటకై నీ జనితైక కుమారుని మా కనుగ్రహించి యున్నావు. మేము పునర్జన్మమునొంది నీ కృపవలనను స్వీకృత

పుత్రత్వమువలనను నీ బిడ్డలముగా చేయబడిన వారమై నీ పరిశుద్ధాత్మచేత దినదినము నూతనపరచబడునట్లు మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహించుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 6. ఆత్మీయమైన వెలుగు కొరకు

సర్వశక్తిగల దేవా, నీ మహిమయొక్క తేజస్సును మా మీద ప్రకాశింపజేయుము. నీ కృపవలన నూతనముగ జన్మించిన వారందరు నీ పరిశుద్ధాత్మచే వెలిగింపబడి నీ వెలుగును గూర్చిన జ్ఞానము గలవారై దానిచే తమ హృదయములను స్థిరపరచుకొను నట్లనుగ్రహింపుమని నీ కుమారుడును, మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 7. సత్యములోనకి నడిపించు నిమిత్తము

ఓ దేవా, నీ కుమారుని వాగ్దత్తము చొప్పున మేము సర్వ సత్యములోనికి నడిపింపబడునట్లు నీ యొద్దనుండి బయలుదేరు ఆత్మచేత మా మనస్సులను వెలిగింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 8. వాక్యమును గైకొనజేయు కృపకొరకు

శ్రీమంతుడవైన ప్రభువా, మా ఉపదేశము కొరకు పరిశుద్ధ లేఖనములను వ్రాయించి యుంచినావు. నీ పరిశుద్ధ వాక్యమును మేము బాగుగా విని, చదివి, గుర్తించి, నేర్చుకొని మా యందు దానిని జీర్ణింపజేసికొనునట్లు అనుగ్రహింపుము. మరియు ఓ ప్రభువా మా రక్షకుడైన యేసుక్రీస్తునందు మాకు నీవు దయచేసిన నిత్య జీవమును గూర్చిన నిరీక్షణను మా హృదయములలో నాటించి మేము నీ వాక్యముచే కలుగు ఓరిమి ఆదరణలవలన యెన్నటికిని దానిని విడువకుండునట్లు కృప దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 9. విశ్వాసము కొరకు

సర్వశక్తిగలిగి నిత్యము జీవించుచునుండు దేవా, నిన్ను నమ్మువారికి నీవు అమూల్యములైన మహా గొప్ప వాగ్దానములను అనుగ్రహించి యేసుక్రీస్తును పరిపూర్ణముగ నమ్మియుండునట్లును మా విశ్వాసము ఎల్లప్పుడు నీ దృష్టి కంగీకారముగ నుండునట్లును కృపదయచేయుము. ఓ ప్రభువా, మా రక్షకుడైన యేసుక్రీస్తు ద్వారా మా ప్రార్థన నాలకింపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

**10. స్థిరత కొరకు**

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, పాపులమైన మా యెడల నీకుగల మహావాత్సల్యమునుబట్టి ఆయన యందు విశ్వాసముంచి మేము నిత్యజీవము నొందునట్లు నీ కుమారుని మా కనుగ్రహించియున్నావు. మేము తుదవరకు ఈ విశ్వాసమునందు స్థిరముగా నిలిచి నిత్యజీవములో ప్రవేశించునట్లు నీ పరిశుద్ధాత్మను దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

**11. విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అనువాటికొరకు**

సర్వశక్తిగల దేవా, యేసుక్రీస్తునందు స్థిరమైవ విశ్వాసమును నీ కృపయందు సంతోషకరమైన నిరీక్షణయు, నీ యెడలను మా పొరుగువారి యెడలను హృదయపూర్వకమైన ప్రేమయు, మాకు దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్త ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

**12. దేవునియెడల ప్రేమ కొరకు**

ఓ దేవా, నిన్ను ప్రేమించువారికి మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగునట్లు చేయుచున్నావు. మా హృదయములయందు నీ పరిశుద్ధాత్మవలన కలిగిన పవిత్రమైన కోరికలు ఎట్టి శోధనలవలన నైనను అంతరించి పోకుండునట్లు మాయందు నీ యెడల స్థిరమైన ప్రేమనవు కలిగించుమని నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

**13. ప్రేమ కొరకు**

ఓ ప్రభువా, ప్రేమ లేనియెడల మా క్రియలన్నియు వ్యర్థము లనియు, అదిలేని మనుష్యుడు జీవించుచున్నను మృతుడే యనియు, మాకు నేర్పించియున్నావు. కావున నీ పరిశుద్ధాత్మను పంపి సమాధానమునకును సకల సద్గుణములకును మూలమైన

ప్రేమయను నీ శ్రేష్టవరమును మా హృదయములలో కుమ్మరింపుమని నీ యేక పుత్రుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 14. దైవచిత్తమును నెరవేర్చు కృపకొరకు

సర్వశక్తిగల దేవా, మేము అనిత్యమైన యీ జీవిత కాలమందు అంధకారక్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణములను ధరించుకొనునట్లు తోడ్పడుటకై నీ కుమారుడైన యేసుక్రీస్తును మిగుల దీనుడై యవతరించి మాలో నివసించులాగున అనుగ్రహించి యున్నావు. అంత్య దినమున ఆయన చనిపోయిన వారికిని బ్రతికియుండు వారికిని తీర్పు చేయుటకు తన మహామహిమతో తిరిగి వచ్చునపుడు మేము లేచి నిత్యజీవములో ప్రవేశించునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 15. వరములను సద్వినియోగపరచుకొనుట కొరకు

సర్వశక్తిగల ప్రభువగు దేవా, నీవు నీ పరిశుద్ధాత్మ మూల మున నీ సేవకులకు నానా విధములును విశేషములునైన వరములను అనుగ్రహించుచున్నావు. మేము అనేకములయియున్న నీ వరములను పొంది వానిని ఎల్లప్పుడు నీ మహిమకొరకు వినియోగపరచులాగున కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 16. దేవుడు మనలను నడిపించి సహాయముచేయు నిమిత్తము

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మేము నీ శాసనముల ననుసరించి నీ యాజ్ఞల ప్రకారము ప్రవర్తించునట్లు మా హృదయములను శరీరములను పవిత్రపరచి, నడిపించి, ఏలుచు నీ మహాశక్తిగల సంరక్షణచేత ఇహపరములయందు ఎల్లప్పుడు మా శరీరాత్మలను కాపాడుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 17. దేవుడు మనలను నడిపించి సహాయముచేయు నిమిత్తము

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మంచివియు నీ దివ్యప్రభావమునకు అనుకూలమునైన కార్యములను మేము ఇచ్ఛయించుటకును చేయుటకును నీవే సహాయము చేయుచున్నావు. తండ్రి భావముగల నీ హస్తము ఎల్లప్పుడు మా మీద

చాపియుంచుము. నీ పరిశుద్ధాత్మను నిరంతరము మాతో నివసింపనిమ్ము. మేము నీ వాక్యమును సరియాన రీతిగా గ్రహించి దానికి విధేయులమై తుదకు నిత్యజీవమును పొందునట్లు మమ్మును నడిపింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 18. శోధనలయందు సహాయము కొరకు

ఓ దేవా, దుష్టుడు తన దుష్టత్వమందు నశింపవలెనని కోరక భక్తిహీనులను నీతిమంతులనుగా తీర్చుచున్నావు. నీ కృపయందు నమ్మికయందు నీ సేవకులు ఎట్టి శోధనల వలననైనను నీ యొద్దనుండి జారిపోక ఎడతెగకుండు నిన్ను సేవించులాగున నీ దివ్యమైన సహాయమును కరుణతోననుగ్రహించి సదా వారిని సంరక్షించి కాపాడుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 19. శోధనలయందు సహాయము కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీ కుమారుని మూలమున మాకు పాపక్షమాపణయు నిత్యజీవమును వాగ్దానము చేసియున్నావు. మేము దినదినము మా యక్కరల యందును ముఖ్యముగా శోధన సమయములందును, ఆయన పరిశుద్ధాత్మ సహాయమును వెదకి నీ వాక్యమందలి నిజమైన విశ్వాసమువలన మేము దానిని పొందునట్లు నీ పరిశుద్ధాత్మవలన మా హృదయములను క్రమపరచి ఏలుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 20. పశ్చాత్తాపము కొరకు

కరుణగల తండ్రీ, మేము పాపము చేయుటకు ఎన్నడును తెగింపకుండునట్లు నీ కృప దయచేయుము. అయితే మేమెప్పుడైన నీ దివ్య మహిమకు విరోధముగా పాపము చేసిన యెడల మేము వాస్తవముగా దానినిగూర్చి దుఃఖించి పశ్చాత్తాపపడి జీవముగల విశ్వాసమువలన కేవలము నీ కుమారుడును మా రక్షకుడునైన క్రీస్తు మూలముననే పాపపరిహారము నొందునట్లు కృపదయచేయుము, ఆమేన్.

### 21. పాప క్షమాపణ కొరకు

ఓ ప్రభువా, నీకు మొఱ్ఱపెట్టువారి ప్రార్థనల నాలకించి నీ యెదుట తమ పాపముల నొప్పుకొనువారిని కాపాడి వారికి క్షమాపణను సమాధానమును

దయచేయుమని నీ కుమారుడును మా రక్షకుడునైన క్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 22. పాప విముక్తి కొరకు

ఓ ప్రభువా, నీ శాంతమునుబట్టి చెప్పశక్యముగాని నీ కనికరమును మాకు చూపి మా పాపములనుండి మమ్మును విడిపింపుమనియు వాటి మూలమున మాకు రావలసిన శిక్ష నుండి మమ్మును తప్పింపుమనియు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 23. క్రీస్తును తెలిసికొని వెంబడించుటకు కావలసిన కృపకొరకు

ఓ సర్వశక్తిగలదేవా, నిన్ను ఎరుగుటయే నిత్యజీవము. నీ కుమారుడైన క్రీస్తే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాడని పూర్ణముగా తెలిసికొని ఆయన అడుగుజాడలను వెంబడించి నిత్య జీవమునకు పోవు మార్గమందు స్థిరముగా నుంచులాగున కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 24. క్రీస్తును వెంబడించు నిమిత్తము కృపకొరకు

సర్వశక్తిగల దేవా, మా పాపములకొరకు బలిగాను భక్తియుక్త మైన నడతకు మాదిరిగాను నీ యేక పుత్రుని అనుగ్రహించి యున్నావు. ఆయనవలన మాకు లభించిన విలువలేని యీ మేలును మేము ఎల్లప్పుడు కృతజ్ఞతాపూర్వకముగా అంగీకరించునట్లును ఆయనయొక్క అతి పరిశుద్ధ జీవితమును అనుసరించుటకు దినదినము ప్రయత్నించు నట్లును కృపదయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 25. ఓరిమి కొరకు

ఓ దేవా, నీ జనితైక కుమారుడు మిగుల సాత్వికముతో సహించుకొనుటవలన పురాతన శత్రువగు సాతాను గర్వమును అణగ ద్రొక్కియున్నాడు. ఆయన తన కనికరముచేత మా నిమిత్తము సహించినదంతయు మేము మరచిపోక మా హృదయములయందు దానిని భద్రపరచి మేము ఆయన మాదిరి ననుసరించి మాకు వచ్చు కష్టములన్నిటిని ఓరిమితో సహించునట్లు కృపదయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 26. సంతుష్టి కొరకు

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రి, నీవు ఆకాశ పక్షులను పోషించుచు అడవి పువ్వులను అలంకరించుచు తండ్రి తన బిడ్డలయెడల జాగ్రత్త పుచ్చుకొనునట్లు మా యెడల జాగ్రత్త పుచ్చుకొనుచున్నావు. మేము నీ యందు అపనమ్మకముగాని వ్యర్థమైన చింతలనుగాని కలిగియుండక, మాచింత యావత్తు నీమీదవేసి నిశ్చలమైన విశ్వాసముగల వారమై నిన్నే నమ్ముకొని జీవించుచు నీ నామము పరిశుద్ధపరచబడునట్లును నీ రాజ్యము వచ్చునట్లును నీ చిత్తము నెరవేరునట్లును ప్రవర్తించులాగున కాపాడి నీ పరిశుద్ధాత్మ వలన సహాయము చేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 27. శ్రమలయందు ధైర్యము గలిగియుండుట కొరకు

సర్వశక్తియు మిగుల కనికరమును గల దేవా, మా ప్రభువైన క్రీస్తుతో మేము నిత్య మహిమలో ప్రవేశింపకముందు ఆయనతో పాటు శ్రమలును, మరణమును పొందవలెనని నిర్ణయించియున్నావు. మేము అన్ని సమయములందును నీ పరిశుద్ధ చిత్తమునకు లోబడి, మా జీవిత కాలమంతయు, సత్యవిశ్వాసములందు నిలకడగా నుండి మృతుల పులరుత్థానమును గూర్చియు రాబోవు లోకమహిమను గూర్చియు గొప్ప నిరీక్షణ గలవారమై యెల్లప్పుడు సంతోష సమాధానములను అనుభవించునట్లు కృపదయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 28. వినయము కొరకు

ఓ దేవా, నీవు అహంకారులను పడద్రోసి దీనులకు నీ కృపననుగ్రహించువాడవై యున్నావు. మేము గర్వించుటవలన ఎన్నడును ఏ కోపమును రేపక మిక్కిలి దీనులమై నీ కృపావరములలో పాలు పొందునట్లు నీ యేకపుత్రుడు తనయందు బయలు పరచిన నిజమైన వినయమును మాకు దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 29. నిర్మలత్వము కొరకు

సర్వశక్తిగల దేవా! నీకు అందరి హృదయ రహస్యములు కోరికలు

తెలిసేయున్నవి. నీకు దాచబడి మరుగైయుండునదేదియు లేదు. మేము నిన్ను సంపూర్ణముగా ప్రేమించి నీ పరిశుద్ధ నామమును సరియైన రీతిని ఘనపరచునట్లు నీ పరిశుద్ధాత్మావేశము చేత మా హృదయాలోచనలను పవిత్ర పరచుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 30. పరుశుద్ధత కొరకు

ఓ దేవా, బలహీనతయందు నీ శక్తి పరిపూర్ణమగుచున్నది. మా యందున్న చెడుగులన్నియు నిర్మూలనము చేయుము. మేము నిర్దోషులవలె జీవించుటవలనను, మరణ పర్యంతము స్థిరమైన విశ్వాసము కలిగియుండుటవలనను నీ పరిశుద్ధ నామమును మహిమపరచునట్లు నీ కృపచేత మమ్మును బలపరచుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్

### 31. మంచి మరణము కొరకు

సర్వశక్తిగల దేవా, నీ యయోగ్య సేవకులమైన మమ్మును నీ కృపయందు స్థిరపరచుము, మరల సమయమున మేము శత్రువునకు లొంగక నిత్య జీవమునకు పాత్రుల మగునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 32. మోక్షము కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నిన్ను విశ్వసించిన వారికి మోక్షమందు నీవు ఇయ్యనైయున్న మేళ్లను మాకొరకు సంపాదించుటకై నీ యేకపుత్రుని మా ప్రధాన యాజకునిగా నియమించితివి కాబట్టి నీ యయోగ్య సేవకులమైన మాకు పరలోకమందున్న వారితో పాలు దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 33. సమాధానము కొరకు

ఓ దేవా, నీవు సమాధానమునకు కర్తవు ఐక్యతను ప్రేమించువాడవునై యున్నావు. నిన్ను ఎరుగుటయే నిత్యజీవము. నిన్ను సేవించుటయందు సంపూర్ణ స్వతంత్రత కలదు. మేము శత్రుబలమున కెంత మాత్రమును భయపడక నీ సంరక్షణయందే రూఢిగా నమ్ముకొనియుదునట్లు విరోధి మా పై బడునపుడు నీ వినయ సేవకులమగు మమ్మును

కాపాడుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 34. సంఘము కొరకు

సర్వశక్తిగల దేవా, నీ సంఘమునకు నీ పరిశుద్ధాత్మను పైనుండి మాత్రమే కలుగు జ్ఞానమును దయచేసి, బందింపబడనేరని నీ వాక్యము నీ పరిశుద్ధ జనమునకు సంతోషమును క్షేమాభివృద్ధియు కలిగించులాగున ధారాళములే ప్రకటింపబడి వ్యాపించునట్లు అనుగ్రహింపుము. మరియు మేము స్థిరమైన విశ్వాసము గలవారమై అనుగ్రహింపుము. మరియు నొప్పుకొని తుదవరకు దానియందు నిలిచియుండులాగున నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 35. సంఘము కొరకు

ఓ ప్రభువా, నీ సంఘము చేయు ప్రార్థనలు దయతే అంగీకరించి నీ సభ క్షేమముగా నుండి స్వేచ్ఛగా నిన్ను సేవించునట్లు దానిని కాపాడి నీ సమాధానము ఈ జీవితమందే మా కనుగ్ర హింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 36. సంఘముయొక్క సంరక్షణ సమాధానముల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవము గలవారై యుండవలెనని ఇచ్ఛయించుచున్నావు. మనుష్యుల రక్షణార్థమై నీ వాక్యమును తప్పులేకుండ బోధించునట్లు నీ వాక్య సేవకులందరికి నీ పరిశుద్ధాత్మ యొక్క కృపాసహాయములను మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు ద్వారా అనుగ్రహింపుము. నీ వాక్యమును ద్వేషించువారి యొక్కయు, దుర్బోధనలవలనగాని దౌర్జన్యము వలనగాని నీ వాక్యమును పాడుచేయు నుద్దేశించువారి యొక్కయు ఆలోచనల నన్నిటిని నీ సర్వశక్తిచేతను, గ్రహింపనలవి కాని నీ జ్ఞానము చేతను విఫలము యేయుము. మైపేము నెమ్మది సమాధానమునను గలవారమై జీవించుచు, పరలోక సంబంధమైన నీ కృపాతిశయ పరిశుద్ధాత్మతోను నీతితోను సేవించునట్లు నీ మహిమను గూర్చిన సరియైన జ్ఞానమును నీ సేవకుల కనుగ్రహింపుమని

నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 37. తప్పు బోధ ననుసరించిన వారికొరకు

సర్వశక్తిగల దేవా, పరలోకపుతండ్రీ, సదా కనికరించుటయే నీ గుణలక్షణమై యున్నది. నీ పరిశుద్ధ వాక్యము బోధించు సత్యము నుండి తొలగిపోయిన వారి నందరిని వెదకి పట్టుకొని తండ్రి భావముగల నీ ప్రేమతో మందలించి వారు తమ తప్పిదములను స్పష్టముగా గ్రహించి, మార్పులేని నీ సత్యమును మరల హృదయ పూర్వకమైన విశ్వాసముతో నంగీకరించి, వానిని హత్తుకొనియుండు నట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 38. విశ్వాసమందు ఐక్యత కొరకు

ఓ క్రీస్తూ, నీ సత్యమును పాడుచేయ నుద్దేశించెడు మత భేదములను నిర్మూలనముచేసి ఇహపరములయందు నీవు మాత్రమే ప్రభువుడవై యున్నావు గనుక, సకల రాష్ట్రములనుండి సమకూర్చ బడిన నీ జనుల విశ్వాసమందు ఐక్యత గలవారై నిన్ను సేవించునట్లు దయచేయుమని తంతడ్రితేను, పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 39. సంఘపు పిల్లల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన తేవా, ఈ చిన్నవారిలో ఒకరైనను నశించుట కిష్టపడక నశించిన దానిని వెదకి రక్షించుటకు నీ యేకపుత్రుని పంపి, చిన్నపిల్లలను నిషేధింపక వారిని నా యొద్దకు రానియ్యుడి దేవుని రాజ్యము ఇట్టివారిదే అని ఆయనద్వారా సెలవిచ్చియున్నావు. నీ సంఘపు పిల్లలు కృపయందును నీ వాక్యమును గూర్చిన జ్ఞానమందును పెంపారునట్లు నీ పరిశుద్ధాత్మ మూలమున వారిని దీవించి యేలుమనియు నీ పరిశుద్ధ దూతలను వారికి కావలిగా నుంచి సకలాపాయమునుండి వారిని తప్పించి కాపాడుమనియు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

## 40. గురు మండలములోని పిల్లల కొరకు

శ్రీమంతుడవైన యేసు ప్రభువా, చిన్నపిల్లలవలె దేవుని రాజ్యము నంగీకరింపనివాడు దానిలో నెతమాత్రమును ప్రవేశింపడని సెలవిచ్చి వారిని ప్రేమించి

మిగుల దయతో నాశీర్వదించియున్నావు. మా బిడ్డలు నీ మార్గమందు నడచుచు నీ పరిశుద్ధ నామము నొప్పుకొనుటలో మాతో నేకీభవించి యెల్లప్పుడు నీ స్తుతిని ప్రచురపరచునట్లు నీ పరిశుద్ధాత్మద్వారా వారిని నీ యొద్ద కాకర్షించి నీ సేవయందు నిత్యము కాపాడుమని తండ్రితోను పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించు చునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 41. నిర్ధారణ నొందువారి కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు ఎల్లప్పుడు నీ సంఘమును విస్తరింపజేయుచు నీ వలన పునర్జన్మము నొందినవారి హృదయములను నీ జ్ఞానముతోను కృపతోను బలపరచి వారికి నీ నిబంధనను విశ్వాస్యతను స్థిరపరచుచున్నావు. నిర్ధారణ నొందబోవు ఈ మా బిడ్డను విశ్వాసమందును, జ్ఞానమందును వృద్ధినొంది తామిదివరకే పొందియుండిన బాప్తిస్మమునందు ఆనందించుచు నీతో చేయబడిన నిబంధనను యథార్థముగాను హృదయపూర్వకముగాను నూతన పరచునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## వాక్య సేవకులు

### 42. వాక్య సేవకుల కొరకు

సర్వశక్తియు కరుణగల దేవా, మా ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రీ, నీ కొతకు పనివాండ్రను పంపునట్లు ప్రార్థింపుమని ఆజ్ఞాపించియున్నావు. నీ మితిలేని కరుణవలన మాకు నమ్మకమైన బోధకులను వాక్య సేవకులను అనుగ్రహించి, వారు నీ పరిశుద్ధ వాక్యమునకు వ్యతిరేకమైన దేదియు బోదింపక, నిజముగా నీ యాజ్ఞ నెరవేర్చునట్లు వారిహృదయములను, నోళ్లను రక్షణకరమైన సువార్తతో నింపుము. మరియు మేము నీ దివ్యవాక్యమునుండి హెచ్చరిక, బోధ, పోషణ, ఆదరణయు, బలమును పొందినవారమై నీకు ప్రీతికరమును మాకు లాభకరమునైన కార్యములు చేయులాగున దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

### 43. వాక్య సేవకుల కొరకు

ఓ సర్వశక్తిగల దేవా, నీ కుమారుడైన యేసు క్రీస్తునుబట్టి పరిశుద్ధులైన నీ యపొస్తలులకు అనేకమైన శ్రేష్టవరములను దయచేసి నీ నిత్య మహిమ కిరీటమును పొందులాగున సంఘకాపరులందరు నీ పరిశుద్ధ వాక్యమును శ్రద్ధతో బోధించునట్లును, జనులు దానిని విధేయతతే అనుసరించునట్లును దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 44. కనికరయుత పరిచర్య కొరకు

ఓ అత్యంత కృపగల తండ్రీ! మానవుల అక్కరలకు తోడ్పడి, వారి యెడల మా ప్రేమ చూపమని సెలవిచ్చినావు. జబ్బుగానున్న వారిని, గాయబడిన వారిని వెదకి వారికి దయతో పరిచర్యచేయు మనసు మా కనుగ్రహింపును. చనిపోవు వారకి సమాధానమును, దుఃఖములోనున్న వారికి ఆదరణయు, బాధితులకు నెమ్మదియు కలుగులాగున పరిచర్య చేయునట్లు మమ్మును నడిపింపుము. మరియు అల్పులైన మా సహోదరులలో నొకనికి సేవచేయుట యేసుప్రభువుకు సేవచేయుటయేయని మేము గ్రహించి సేవచేయునట్లు దీవింపుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, ఏకదేవుడై సదా జీవించుచు యేలుచు నుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 45. విశ్వాసమందు ఐక్యత కొరకు

ఓ దేవా, తప్పిపోయిన వారిని నీవు తిరిగి మంచి దారికి తెచ్చు వాడవును, చెదరిపోయిన వారిని సమకూర్చు వాడవును సమకూర్పబడిన వారిని కాపాడువాడవునై యున్నావు. మన విభేదము లన్నియు పోయి నీ మంద సత్య సంఘముయొక్క నిజమైన కాపరితో ఏకీభవించి, నిన్ను సరియైన రీతిని సేవించునట్లు క్రైస్తవులైన నీ జనులమీద నీ కృపను కుమ్మరించి వారియందు ఐక్యత కలిగించమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## 46. మిషనుల కొరకు

పరలోకపు తండ్రీ, మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటింపుమని నీ కుమారుడైన యేసుక్రీస్తు ద్వారా ఆజ్ఞనిచ్చి యున్నావు. నీ వాక్యమునకు వెంటనే లోబడు బుద్ధిని మాకు దయచేయునని, మేము ఇతరుల చేసిన పనులలో

ప్రవేశించి నిన్ను సేవించునట్లును తుదకు వారును మేమును కలిసి నిత్యజీవము నొందులాగున కృపదయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 47. మిషనుల కొరకు

ఓ దేవా, నీవు లోకము నంతో ప్రేమించి నీ అద్వితీయ కుమారుడుగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడు నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయననుగ్రహించి యున్నావు. నిన్నెరుగని అన్యులను కాపరిలేని గొర్రెలవలె చెదరియున్న జనసమూహములను నీవు కటాక్షించి మేము నీ విశ్వాసు లందరితో నీ సువార్తనుగూర్చి సాక్ష్యమిచ్చుచు నశించినవారిని వెదకి నీ దరి చేర్చునట్లు మాకు నీ కృపననుగ్రహింపుము చెదరిన వారందరు ఆయా స్థరముల నుండి సమకూర్చబడి ఆత్మల కాపరియు అధ్యక్షుడును నీ కుమారుడునైన యేసుక్రీస్తు వలన బలమును పోషణయు సంరక్షణయు పొంది నడిపింపబడునట్లు దయచేయుము. ఆయనకు నీతోను పరిశుద్ధాత్మతోను రాజ్యమును బలమును మహిమయు నిరంతరము కలుగునుగాక, ఆమేన్.

### 48. మిషనెరీలను పనికి నియమించుట కొరకు

సర్వశక్తిగలదేవా, ఇహపరములయందుండు సమస్తమైనవి నీ చిత్తము నెరవేరునట్లు సంకల్పించి యున్నావు. నీ నామమున మేము పంపుచున్న ఈ నీ సేవకులను కాపాడి సంరక్షింప గలందులకు వీరిని నీ కప్పగించుచున్నాము. సదా వీరిలో నుందునని నీ కుమారుని ద్వారా చేసి వాగ్దత్తమును నెరవేర్చి, వీరికెట్టి శ్రమలు కలిగినను ఎట్టి శోధనలు తటస్థించినను నీ దయను ఎల్లప్పుడు వీరి మీద నుంచి వీని నాశీర్వదించుము. వీరి పనికి బహుమానముగా అనేక ఆత్మలు నీ చుట్టు తిరుగునట్లు చేసి, పోరాటములు సందేహములు కలుగు ప్రతి గడియయందును వీరిని బలపరచి, తొట్రిల్లకుండ నిలువబెట్టి నీ సమాధానమును వీరికనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## ఉదయము, సాయంకాలము

### 49. ప్రభువు దినమును పరిశుద్ధపరచుట కొరకు

ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ, నీ పరిశుద్ధ వాక్యమును విని పరిపూర్ణ

హృదయముతో అంగీకరించి నీ పరిశుద్ధ దినమున పరిశుద్ధ పరచునట్లు నీ పరిశుద్ధాత్మ వలన మమ్మును నడిపించి యేలుము, మరియు మేము కూడా నీ వాక్యము వలన పరిశుద్ధ పరచబడి, నీ కుమారుడైన యేసుక్రీస్తునందు పరిపూర్ణమైన నమ్మకము నిరీక్షణయు నుంచునట్లు ఆయనను వెంబడించుట వలన కీడులన్ని టినీ జయించి తుదకు నీ కృపవలన నిత్యజీవము పొందునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 50. ఉదయము

ఓ ప్రభువా, మేము ఈ దినమున ఏ పాపములో నైనను పడక నిష్కళంకముగా జీవించి దీనిని సంతోషముతోను సమాధానముతోను గడుపునట్లు అనుగ్రహింపుము. మేము సాయంకాలము వరకు నీ యెడతెగని సహాయమువలన శోధన లన్నిటిని జయించి సమస్తమును పరిపాలించుచు నిరంతరము కొనియాడబడుచున్న నిత్య దేవుడవైన నిన్ను స్తుతించునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 51. ఉదయము

ఓ ప్రభువా, పరలోక భూలోకములకు రాజా, ఈ దినమున మా తలంపులను మాటలను క్రియలును నీ కంగీకారములుగా నుండునట్లు మా హృదయములను శరీరములను నీ చిత్తము చొప్పున క్రమపరచి యేలి పరిశుద్ధపరచుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 52. సాయంకాలము

ఓ ప్రభువా, మమ్మావరించియున్న అంధకారమును తొలగించి నీ మహాకనికరమువలన ఈ రాత్రి సర్వగండముల నుండియు, విపత్తుల నుండియు నీ యేకకుమారుని బట్టి కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మతోను సదా ఏకదేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## విజ్ఞాపనములు

### 53. ఆపదలో నున్నవారి కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నీవు విచారగ్రస్తులను ఆదరించు వాడవును బలహీనులకు శక్తి నిచ్చువాడవునైయున్నావు. శ్రమయందుగాని దుఃఖములందుగాని యుండి నీకు మొఱ్ఱపెట్టువారి ప్రార్థనలను దయతో నాలకించి వారు తమ అక్కర లన్నిటియందు నీ యాత్మధికమైన కృపలను గుర్తించి ఆదరణ పొందులాగున సహాయము చేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 54. ఆపదలో నుండువారి కొరకు

ఓ ప్రభువా, మేము ఎవరి నిమిత్తము ప్రార్థనచేయుచున్నామో ఆ నీ సేవకులమీద నీ దృష్టియుంచి ఆకాశమునుండి చూచి వారి బాధలనుండి వారిని విడిపింపుము. నా కరుణాదృష్టిని వారిపై నిలిపి నీయందు స్థిరమైన నమ్మకమును ఆదరణను అనుగ్రహింపును. శత్రు భయమునుండి వారిని కాపాడి నిత్యమైన సమాధానమును క్షేమమును వారికి దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 55. రోగుల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, నిన్ను నమ్మువారి కందరికి నిత్య రక్షణ నిచ్చువాడవై యున్నావు. రోగులైయున్న నీ బిడ్డలను కనికరించి వారికి సహాయము చేయుమని వారికొరకు మేము చేయు విన్నపముల నాలకించి వారు ఆరోగ్యవంతులై నీ సంఘమునందు బాహటముగా నిన్ను స్తుతించులాగున నీ కృపదయచేయుమని నీ కుమారుడును మా ప్రభువుడైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 56. అన్యజనుల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! నీవు, దుర్మార్గుడు మరణము నొందవలెనను కోరక, నరులందు పశ్చాత్తాపపడి జీవింపవలెనని కోరుచున్నావు. అన్యజనుల కొరకు మేము చేయు ప్రార్థనల నాలకింపుము. వారి హృదయములలోని అతిక్రమమును తొలగించి, వారు తమ విగ్రహములను విడిచి జీవముగల సత్యదేవుడవైన నీ తట్టును నీ యేకపుత్రుని తట్టును తిరిగి నీ నామ మహిమార్థమై నీ పరిశుద్ధ సంఘమునందు చేరునట్లు దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 57. యూదుల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, కృప చూపుటకు నీ వెల్లప్పుడు ఇష్టుడవైయున్నావు. నీవు యేర్పరచుకొనిన యూదజనాంగమును గూర్చి మేముచేయు ప్రార్థనల నాలకించి వారు యేసుక్రీస్తువలన తమ యజ్ఞానమును పోగొట్టుకొని, సత్యముయొక్క వెలుగైయున్న ఆయననంగీకరించునట్లు కృపచూపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 58. తల్లుల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, తండ్రీ, సకల సృష్టికి నీవే కర్తవు. మా మానవ జన్మమునకు సంబంధించిన వేదనను మా ప్రభువైన నీ కుమారుని మూలమున శ్రేయస్కరమైన వేదనగా చేసియున్నావు. ఓ దయగల తండ్రీ, ప్రభువైన దేవా, నీ చేతిపనియైన మానవుని కాపాడి సంరక్షింపుము. కష్టతరమైన ప్రసవవేదనలోనుండి నీకు మొఱ్ఱబెట్టు వారి చేయి విడువక, వారికి సంతోషమును నీ దయకు కీర్తియు కలుగునట్లు వారి వేదన యావత్తు నివారింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 59. నిర్దోషులై ఖైదులో వేయబడినవారి కొరకు

సర్వశక్తిగల దేవా, నీవు అపొస్తలుడైన పేతురును చెరసాల బంధకమునుండి విడిపించి బయటికి తీసుకొని వచ్చితివి. నిర్దోషులై ఖైదు చేయబడిన వారందరిని తమ బంధకములనుండి నీ కరుణతో విడిపించి వారి విడుదల నిమిత్తము సంతోషించుచు మేము నిన్ను ఎడతెగక స్తుతించునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 60. శత్రువుల కొరకు

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా, 'మీ శత్రువులను ప్రేమించండి. మిమ్ము ద్వేషించువారికి మేలు చేయుడి మిమ్మును హింసించువారి కొరకు ప్రార్థనచేయుడి'. అని నీ కుమారుడును శ్రీమంతుడునైన మా ప్రభువుద్వారా ఆజ్ఞాపించితివి. నీ కృపతోను మా శత్రువుల దర్శించి వారిలో నిజమైన పశ్చాత్తాపమును కలిగించి వారు మాతోను సంఘమంతటితోను ప్రేమయందు ఏకీభవించు నట్లును, మేమందరము ఏక భావమును ఏక మనస్సును ఏక హృదయమును గలవారమై జీవించునట్లు అనుగ్రహింపుమని నీ

కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 61. కఠిన వ్యాధిచే బాధపడు సమయమున

సర్వశక్తియు మిగుల కనికరముగల దేవా, మా పరలోకపు తండ్రీ, మా పాపమునుబట్టి నీవు మా మీదికి పంపిన శిక్షను మేము న్యాయముగా పాత్రులమై యున్నామని తప్పిపోయిన నీ బిడ్డలమగు మేము వినయముతో ఒప్పుకొనుచున్నాము. అయినను మితిలేని దయవలన మాకు నిజమైన పశ్చాత్తాపము ననుగ్రహించి, దయతో మా పాపములను క్షమించి, మేము మా పాపములవలన తెచ్చుకొనిన యీ శిక్షను పూర్తిగా తొలగించమనియు లేక తగ్గించమనియు, మేము విధేయులైన పిల్లలవలె నీ చిత్తమునకు లోబడి మా బాధలను ఓర్పుతో సహించుకొనుటకు కృప దయచేయుమనియు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 62. అనావృష్టి కాలము

ఓ దేవా, మిగుల కరుణగల తండ్రీ, వర్షములేక భూమి యందలి సమస్తము ఎండిపోయియున్నది. కావున భూమి తిరిగి మొలకెత్తి పుష్కలముగ ఫలించునట్టు ఆకాశపు వాకిండ్లను విప్పి మంచి వర్షమును కురిపింపుము. నీ కృప నిమిత్తము మేము నిన్ను స్తుతించి మహిమపరచునట్లు ఈ యిబ్బందిలో మా విన్నపము లాలకింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 63. అకాల ఋతువునందు

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ, నీవు దయాదాక్షిణ్య ముగలవాడవు. 'ఆపత్కాలమున నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము. నేను నిన్ను విడిపించెదను' అని వాగ్దత్తమిచ్చి యున్నావు. మా పాపములను మా దుష్టకార్యములను చూడక మా యక్కరలను మాత్రమే చూచి భూమి తగిన కాలమునందు ఫలసమృద్ధి నిచ్చునట్లును, మేము నీ దయవల్ల మా యనుదినాహారమును పొందుచు నీవు కృపగల దేవుడవని తెలిసికొని నీ దయ నిమిత్తము నిరంతరము నీకు కృతజ్ఞతలు చెల్లించుచుండునట్లును, మాకు కాల ఋతువుల ననుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## జనాంగము

### 64. మన దేశము కొరకు

సర్వశక్తిగల దేవా, మా కొకదేశమునిచ్చి మేము దానియందు నీ వాక్యమును నిరాటంకముగ వినుటకును చదువుకొనుటకును నీ నామము నొప్పుకొని నీ రాజ్యవ్యాపకత్వము నిమిత్తమై మే మందరము పాటపడుటకును స్వతంత్రత ననుగ్రహించియున్నావు. మా కనుగ్రహింపబడిన యీ స్వతంత్రత మా బిడ్డల తరమువరకు నిలిచి భారాష్ట్రము లన్నిటికిని ఆశీర్వాదము, నీకు నిత్య మహిమయు కలుగు లాగున ఇచ్చట నీ సువార్త శక్తిని ప్రబలజేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 65. రాష్ట్రపతి కొరకను, ఆయన(ఆమె) కుటుంబము కొరకును

సర్వశక్తిగల నిత్యుడవగు తండ్రీ, కృపామయుడా దేశపు రాష్ట్రపతిని వారి కుటుంబము నంతటిని దయతో కాపాడుమని నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము. వారికి నీ పరిశుద్ధాత్మ ననుగ్రహించి, నీ దివ్యమగు కృపతో వారిని నింపుము, వారికి నెమ్మదినిచ్చి వారిని కాపాడి అంతములేని నీ రాజ్యమునందు చేర్చు మని మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 66. రాష్ట్రపతి కొరకును, అధికారుల కొరకును

సర్వశక్తిగల దేవా, మంచి అంతటికి మూలమైన తండ్రీ దయగల రాష్ట్రపతిని, వారి సతీమణి(భర్త)ను, వారి కుటుంబమును కాపాడుమని నీ కృపనుబట్టి వినయముగ వేడుకొనుచున్నాము. మా అధికారులు అనగా రాజప్రతినిధి, వేర్వేరు పరగణాల గవర్నర్లు, దేశాధికారులు, ముఖ్య సైన్యాధిపతి, ప్రధానమంత్రి, న్యాయాధిపతులు మొదలగు వారందరి కొరకు నిన్నువినయముగా వేడుకొనుచున్నాము. వారి పనులయందు వారిని దయతో నడిపించి, న్యాయ సభల యందును, చట్ట నిర్మాణ సభలయందును, వారుచేయు ఆలోచన లన్నియు, సరియైనవిగను ఉండునట్లు అనుగ్రహింపుము. వారి పాలనవలన సమాధాన సంతోషములును, నీతి న్యాయములును, సత్యమతమును, దైవభక్తియు, సర్వత్ర నెలకొల్పబడి, తరతరముల వరకు నిలిచి యుండునట్లు దయచేయుమని మా ప్రభువైన యేసు క్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 67. అధికారుల కొరకు

ఓ కృపగల మా పరలోకపు తండ్రీ, మానవులకున్న అధికార మంతయు నీ వనుగ్రహించినదే. దుర్మార్గులకు శిక్షయు సన్మార్గులకు మేలు కలుగు నిమిత్తము ఉన్న

అధికారములన్నియు నీవలెనే నియమింపబడియున్నవి. ఈ లోక రాజ్యములయందు నీవలన కల్గినది తప్ప మరియే యధికారమును లేదు. నీ సేవకులగు మా రాష్ట్రపతిగారు, మంత్రులు, గవర్నరులు, మా న్యాయాధిపతులు మొదలగు వారి నందరిని కటాక్షింపుము. ఓ దేవా, నీ నామముచేత వారిని వెలిగించి కాపాడుము. నీ జనులు నీతియు సమాధానమును ఐకమత్యమును గలవారై జీవించునట్లు వారిని నెమ్మదితో నేలి కాపాడి నడిపించుటకు అధికారులకు జ్ఞానమును వివేకము ననుగ్రహింపుము. ఓ మా రక్షణ కర్తవగు దేవా, మేము వారితో కూడ నీ నామ స్తుతిని ప్రచురించునట్లు వారికి దీర్ఘాయువులు దయచేసి కాపాడుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 68. దేశ సంబంధమైన ఆపదలయందు

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ, మేము మా దుష్కార్య ముల వలనను, ఎడతెగని అవిధేయత వలనను నీవు పంపిన యీ శిక్షలకు పాత్రులమని వినయముతో ఒప్పుకొనుచున్నాము. అయినను, నీ నామమును బట్టి మమ్మును కాయుమని నిన్ను మనఃపూర్వకముగా వేడుకొనుచున్నాము. శత్రువు మాకు హాని చేయకుండ వానిశక్తి నడ్డగించి, బాధపడుచున్న నీ జనులకు సహాయముచేసి నీ వాక్యము నిరాటంకముగాను నమ్మకముగాను ప్రకటింపబడునట్లును, మేము మా పాపపు బ్రతుకులను దిద్దుకొని పరిశుద్ధములైన నీ యాజ్ఞలకు విధేయులమై నడుచు కొనునట్లును అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 69. దేశ సంబంధమైన ఆపదలయందు

ఓ ప్రభువా, బాధపడుచున్న నీ ప్రజలను కటాక్షించి మా పాపములనుబట్టి మమ్మును నశించి పోనియ్యక సర్వశక్తిగల నీ కనికరముచే మమ్మును రక్షింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 70. దేశ సంబంధమేన ఆపదలయందు

మిగుల దయాదాక్షిణ్యములుగల ప్రభువైన దేవా, మేము చేసిన అనేక ఘోర పాపములనుబట్టి మమ్మును కఠినముగా శిక్షింప చిత్తగించితివి. తండ్రి తన బిడ్డలయెడల

జాలిపడునట్లు దౌర్భాగ్య పాపులమైన మా యెడల జాలిపడుమని బ్రతిమాలుకొనుచు మితిలేని కనికరమును ప్రేమయుగల తండ్రివైన నీ యొద్దకే వచ్చుచున్నాము. దుర్మార్గుడు తన దుర్మార్గతయందు నశింపవలెనని కోరక, అతడు తన దుర్మార్గతను విడిచి బ్రతుకవలెనని కోరెడు కృపగల తండ్రివైన దేవా, మేము పొందదగియున్న మరణమును మా మీదికి రానియ్యక నీ న్యాయమైన కోపమును మా మీదినుండి తొలగించి మేము ఇప్పుడును ఎల్లప్పుడును నిన్ను స్తుతించునట్లు కృప దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 71. యుద్ధసమయమున నున్నవారికొరకు

సర్వశక్తిగల మా పరలోకపు తండ్రీ, మా ఇండియా దేశములో దేశసంబంధమైన సేవ చేయువారిని నీ సంరక్షణ క్రిందనుంచి వారి శరీరాత్మలకు కలుగు అపాయము లన్నిటినుండియు వారిని కాపాడుము. మరియు నొంటరిగ నింటనున్న వారని ఆదరించి కాపాడుము. చనిపోవుచున్న వారిని మరణమునకును, జీవించువారిని సేవకొరకును సిద్ధము చేయుము. రానైయున్న నీ రాజ్యమునకు నీ నామమునకును మహిమ కలుగునట్లు త్వరగా మాకు శాశ్వతమైన సమాధానము దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 72. సమాధానము కొరకు ప్రతిదిన ప్రార్థన

జనాంగములన్నిటిని ఏకరక్తముతో సృష్టించిన ఓ దేవా! కష్టములోను, తొందరలోను ఉన్న ఈ లోకము కొరకు మేము చేయు ప్రార్థనలు కరుణతో నంగీకరింపుము. నీ వెలుగును అంధకార మందున్న ఈ లోకములోనికి పంపి సర్వరాష్ట్రములును ఏక కుటుంబముగానుండి సమాధాన మార్గములోనికి వచ్చునట్లు వారిని నడిపింపుము. మేము ఒకరి యెడల నొకరము విరోధము, ద్వేషము మొదలగువానిని విడిచిపెట్టి ఒరకి నొకరము సరియైన రీతిని గ్రహించుకొను మనస్సు మాయందు వృద్ధిపొందింపుము. తన సలహోవలన భూమి మీద ప్రజలను నడిపించుచున్న వారికి సరియైన జ్ఞానము దయచేసి వారిద్వారాను మా ద్వారాను, నీ చిత్తము నెరవేరునట్లు అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 73. లోక సమాధానము కొరకు ప్రార్థన

నిత్యుడవగు తండ్రీ, నీ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపించి

ఆయనద్వారా లోకముతో సమాధానపడి మానవులనందరిని సిలువ వైపుకు మళ్లించు ఏర్పాటు చేసియున్నావు. యేసుక్రీస్తుద్వారా అందరు రక్షణ మార్గమంగీకరించి ఆయన పరిశుద్ధ మాదిరి నవలంబించి, నీ సేవచేయుటకు నిజమైన అశ కలిగింపుము. మనుష్యులందరు నీ మూలమున సహోదర భావము గలిగి, నీ సమాధానము ప్రతిహృదయమున నెలకొని సర్వలోక మానవ హృదయముల నేలునట్లను గ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 74. జయము కొరకైన ప్రార్థన

మా ప్రస్తుత కష్టములో సహాయకుడవును, శక్తివంతుడవును, ఆశ్రయుడవైన ఓ దేవా, ఈ యుద్ధసమయములో మా ప్రియ దేశమును కాపాడి అభివృద్ధి నొందింపుమని నీకు మనవి చేయుచున్నాము. నీ కృప వలన నీ ప్రజలు జయము నొందుటకు యోగ్యులై యుండునట్లనుగ్రహింపుము. మా సైన్యమును, నావికులను విమాన నాయకులను నీ చేతి యందలి ఆయుధములవలె పనిచేయుచు భూమి మీద అక్రమ మంతటిని అణగ దొక్కుచు సతేయమును స్వతంత్రతను సార్వభౌమత్వమును స్థాపించునట్లు వారిని నడిపించి దీవింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 75. సైన్య మత బోధకుల కొరకైన ప్రార్థన

ఓ దయగల తండ్రీ, యుద్ధ సైనికులు, నావికులు, విమాన నాయకులు మొదలగు వారి మధ్య ఆత్మీయ సేవచేయుచున్న బోధకులకు నీ ప్రత్యేకమైన దీవెన ననుగ్రహించి, వారు ధైర్యముతో పాపము నెదిరించి మనుష్యులకు రక్షకుడైన క్రీస్తుతట్టు నడుపుటకు నీ పరిశుద్ధాత్మ సహాయము దయచేసి వారి జీవితములోను, సంభాషణ లలోను యేసుక్రీస్తు ప్రభువు మాదిరి నవలంబించి, అశ్రద్ధయందున్న వారిని మేల్కొలిపి, బలహీనులను బలపర్చి సందేహించు వారిని, నిరాశ జెందిన వారిని స్థిరపర్చి ప్రోత్సాహపర్చి, బాధనొందిన వారి నోదార్చి చనిపోవువారికి నీ సమాధానము నందించునట్లు ఆత్మీయ, సేవా సంబంధమైన వారి పనులన్నింటిని దీవింపుమని నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 76. సంఘ లేక దేశసేవ చేయు వారి తల్లిదండ్రుల కొరకును స్నేహితుల కొరకునైన ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ, సకల కాలములందలి ప్రజలకు నీవే సహాయకుడవును, ఆదరణకర్తవునై యున్నావు. సంఘ దేశసేవలకొరకై తమ ప్రియుల ఎడబాటువలన ఒంటరిగ విచారగ్రస్తులైన వారికి తోడై యుండుము. వారికి శక్తిననుగ్రహించి వారి కష్టములయందు వారి భారమంతయు నీ మీదనే వేయునట్లు వారికి సహాయము చేయుము వారికి వచ్చిన నష్టమును భరించి వారు నీయందును, నీ వాక్యమునందును నమ్మకము గలిగియుండులాగున వారి హృదయములను నీ సమాధానముతో నింపి ఆదరణ దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 77. జబ్బు, గాయము, చెర మొదలగు వానియందున్న వారి కొరకైన ప్రార్థన

సర్వశక్తిగల నిత్య దేవా! దుఃఖము గలవారి కాదరణయు బలహీనులకు శక్తియు ననుగ్రహింపుము. కష్టములలోను దుఃకములలోను ముఖ్యముగ జబ్బుగాను గాయముతోను, మరణాపాయములోను, చెరలోను ఉన్నవారు తమ అవసరము లన్నింటిలో నీ గొప్ప సహాయమును ఆదరణను గుర్తించి పొందు లాగున వారి ప్రార్థనలు దయతో అంగీకరింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 78. శత్రువువలన అపజయము నొందిన జనాంగము కొరకు

ఓ సర్వశక్తిగల ప్రభువా! క్రూరముగ హింసించు శత్రువుల వలన చెదరగొట్టబడి, నీకు మొఱబెట్టుచున్న ప్రజల మొఱను విని వారకి నెమ్మది దయచేయుము. రహస్య దుండగములు చేయు కూటములను చెదరగొట్టి వారి ప్రయత్నములను విఫలము నొందింపుమని వేడుకొనుచున్నాము. అసూయ, ద్వేషములకు సంబంధమైన చెడు కోరికల నణచివేసి, వారి చెడు కార్యములను మాన్పించి, లోకమంతయు నీయందు నెమ్మది నొంది అన్ని జనాంగములు నిన్ను సేవించునట్లనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 79. యుద్ధకాలములో సార్వత్రిక సంఘము కొరకు

ఓ యేసుక్రీస్తు ప్రభువా! నీవు భూలోకములో నొక సంఘమును స్థాపించి భూదిగంతముల వరకు నీ శిష్యులు సాక్షులుగ నుండవలయునని యాజ్ఞ నిచ్చి, ఈ

కాలములో నీ యందలి విశ్వాసులు, కష్టములలోను దుఖములలోను నీ నామమున ధైర్యముతో నొప్పుకొనునట్లును, సహోదరుల మధ్య నుండి వారికి సేవచేయుచు, మనుష్యుల హృదయములను నీతట్టు త్రిప్పునట్లును, బలహీనుల లేవనెత్తి, దుఖములో నున్న వారిని ఓదార్చి, చెదరినవారికివి, క్రుంగినవారికిని నీ సమాధానమును గూర్చి చెప్పునట్లును నీ పరిశుద్ధాత్మ సహాయము ననుగ్రహింపుమని తండ్రితోను పరిశుద్ధాత్మ తోను నిరంతరము జీవించుచు యేలుచునుండు ఏకదేవుడైన నిన్ను మిగుల వినయముతో వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 80. దేశీయ కృతజ్ఞత

సర్వశక్తిగల దేవా, మా పరలోకపు తండ్రీ, నీవు ప్రతి ఉదయ మున నీ కృపను మాకు నూతనముగా కనపరచుచున్నావు. మేము నీ దయకు ఎంతమాత్రమును పాత్రులము కాకపోయినను మా శరీరాత్మలకు కావలసినవన్నియు సమృద్ధిగా ననుగ్రహించుచున్నావు. నీవు మా యెడల చూపిన దయాదాక్షిణ్యములను మేము హృదయ పూర్వకముగా నొప్పుకొని మేళ్లన్నిటి నిమిత్తము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు మనస్పూర్తియైన విధేయతతో నిన్ను సేవించుటకు నీ పరిశుద్ధాత్మను దయచేయుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

### 81. దేశీయ కృతజ్ఞత

సర్వశక్తియు మిగుల కనికరమును గల దేవా, మేము పశ్చాత్తాపము లేని స్థితిలోనుండి నశించిపోకుండు నిమిత్తము జ్ఞాన సంపన్నుడవగు నీవు తండ్రి భావముతో మా పాపములను బట్టి మమ్మును శిక్షించితివి. నీవు మా మీద కోపించినను నీ వాత్సల్యతను బట్టి మమ్మును కరుణించి, మా శ్రమ నివారణ చేసియున్నావని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా నీకు మిగుల హృదయపూర్వకమైన వందనములను స్తోత్రములను చెల్లించు చున్నాము, ఆమేన్.

## కృతజ్ఞతాస్తుతులు

### 82. విమోచనము నిమిత్తము

ఓ ప్రభుడవైన దేవా, పరలోకపు తండ్రీ, నీ కరుణాతిశయము వలన మమ్మును పాపమునుండియు నిత్యమరణము నుండియు విమోచించు నిమిత్తము నీ జనితైక

కుమారుదు అవతరించి పుట్టునట్లు అనుగ్రహించి యున్నావు. గనుక నీకు వందనములు చెల్లించు చున్నాము. నీ పరిశుద్ధాత్మవలన మా హృదయములను వెలిగించి మేము సకల శ్రమలయందును శోధనలయందును నీ విమోజననుబట్టి ఆదరణ నొందినవారమై నీ కృప నిమిత్తము నిరంతరము నిన్ను హృదయపూర్వకముగా స్తుతించుచుండునట్లు అనుగ్రహింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 83. సకల వరముల నిమిత్తము

ఓ ప్రభువైన దేవా, పరలోకపు తండ్రీ నీవు మాకు సమస్తమైన మంచి యీవులను తెంపులేకుండా అత్యధికముగా అనుగ్రహించు చున్నావు. ఉచితమైన నీ కృపచొప్పున కీడులన్నింటినుండి మమ్మును దినదినము కాపాడుచున్నావు. ఈ మేళ్లన్నియు కేవలము నీ కృపవల ననే మాకు లభించుచున్నవని పూర్ణ హృదయముతో నొప్పుకొని నియమితమైన ప్రేమను నీ మితిలేని కనికరమును ఇప్పుడును ఎల్లప్పుడును కొనియాడుచుండునట్లు నీ పరిశుద్ధాత్మను అనుగ్ర హింపుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## ప్రార్థనకు ప్రత్యుత్తరము

### 84. ప్రార్థనకు ప్రత్యుత్తరము

సర్వశక్తిగల దేవా, ఈ సమయమున మేమందరము ఏక మనస్సుతే మా విన్నపములను తెలియజేసికొనుటకు కృపననుగ్రహించి యున్నావు. మరియు ఇద్దరు ముగ్గురు నీ నామమున కూడి ప్రార్థించి నప్పుడు వారి మనవులను అంగీకరించెదనని మాట నిచ్చియున్నావు. ఓ ప్రభువా, నీ సేవకులమైన మా కోరికలయందును మనవుల యందును మాకు ఉపయోగకరమైన వాటిని నెరవేర్చి మాకు ఈ లోకమందు నీ సత్యమును గూర్చిన సరియైన జ్ఞానమును పరలోకమందు నిత్యజీవమును అనుగ్రహింపుమని నీతోను పరిశుద్ధాత్మతోను సదా ఏక దేవుడవై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసు క్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

### 85. ప్రారథనకు ప్రత్యుత్తరము కొరకు

సర్వశక్తిగల దేవా, జ్ఞాననిధీ, మేము అడుగక ముందే మా యక్కరలు నీకు

తెలిసియున్నవి. మేము అడుగుట యందును లోపము లున్నవని నీ వెరుగుదువు. మా బలహీనతను చూచి మాయందు జాలిపడి మా యయోగ్యతనుబట్టి మే మడుగ తెగింపనివియు మా యజ్ఞానముచేత మే మడుగలేనివియు నీ కుమారుడును మా ప్రభువు నైన యేసుక్రీస్తు యొక్క పుణ్యమునుబట్టి మా కనుగ్రహింపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

## 86. ప్రార్థనకు ప్రత్యుత్తరము కొరకు

సర్వశక్తిగల దేవా, నీ కుమారుని నామమున ప్రార్థించు వారి మనవులను ఆలకించెదనని వాగ్దత్తమిచ్చియున్నావు. ఇప్పుడు మేము నీకు చేసికొనిన ప్రార్థనలకును విన్నపములకును దయతో చెవియొగ్గి నీ చిత్తముననుసరించి మేము నమ్మకముగా అడుగుకొని నవాటిని మాకు అనుగ్రహించి నీ నామమునకు మహిమ కలుగునట్లు మా యక్కరలను తీర్చుమని నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## 87. కృతజ్ఞతార్పణలు

(ఆరాధన సమయమున ప్రత్యేక కృతజ్ఞత కానుకలు అర్పించు నపుడు ఉపయోగింపదగిన ప్రార్థనలు)

1. ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మా విన్నపములు నీకు తెలియజేయవలెనని సెలవిచ్చిన కృపగల మా పరలోకపు తండ్రీ, నీ కృపావర్షమును మా మీద ఎన్నో విధములుగా కురిపించుచున్నందుకు నీకు మా స్తోత్ర ములు. నీ మేళ్లను అనుభవించిన ఈయన (ఈమె, వీరు) వినయము తో అర్పించు ఈ కృతజ్ఞత కానుక (ల) ను దయతో అంగీకరించుమని మా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

2. ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము. నేను నిన్ను విడిపించెదను, నీవు నన్ను మహిమపరచెదవని సెలవిచ్చిన కనికరముగల దేవా, నీవలన మేలు ననుభవించి కృతజ్ఞతాపూర్వక ముగా (ఈయన, ఈమె, వీరు) అర్పించుచున్న ఈ ప్రత్యేక కానుక(ల) ను అంగీకరించుమనియు, మేమందరము యెల్లప్పుడు నీ యెడల కృతజ్ఞతతో బ్రతుకునట్లు కృప ననుగ్రహింపుమనియు మా రక్షకుడగు క్రీస్తు ప్రభువు ద్వారా మిక్కిలి వినయముతో ప్రార్థించుచున్నాము, ఆమేన్.

# గురువుల అభిషేకారాధన క్రమము

*అభిషేకము అంధ్ర ఇవాంజెనికల్ లూథరన్ సంఘపు ప్రతినిధి మహాసభ అధికారమును బట్టియు దాని నియమమును బట్టియు చేయవలెను.*

*అభిషేకారాధన సభాధ్యక్షుని వలన జరిపించవలయును. లేక ఆయన వలన నియమింపబడిన మరియొక గురువు దానిని జరుపవచ్చును.*

*కందుకొరకు నియమింపబడిన ఒకరు గాని ఎక్కువమంది గురువులు గాని చేతులుంచి ఆశీర్వదించుటలో పాల్గొనవచ్చును.*

*ముఖ్యారాధన క్రమము నుపయోగించవలయును. ఈ దిగువ నున్న ప్రారంభ గీతమును, సంగ్రహ ప్రార్థనను, ఉత్తర పాఠమును సువార్త పాఠమును పాడవలెను.*

## ప్రారంభ గీతము

వారు నానాటికి బలాభివృద్ధి నొందుచు ప్రయాణము చేయుదురు. వారిలో ప్రతివాడు సీయోనులో దేవుని సన్నిధిని కనబడును.

నీ మందిరమునందు నివసించువారు ధన్యులు. వారు నిత్యము నిన్ను స్తుతించుదురు.

విత్తువాడు పిడికెడు విత్తనములు చేత పట్టుకొని యేడ్చుచు పోవును. అయితే అతడు సంతోషగానము చేయుచు పనులు మోసికొనివచ్చును.

## సంగ్రహ ప్రార్థన

ఓ ప్రభుడవైన దేవా! నీవు ఆకాశమును భూమిని సముద్ర మును దానిలో నున్న సమస్తమును కలుగజేసి యున్నావు. నీ సేవకులు పూర్ణ ధైర్యములో నీ వాక&యమును ప్రకటించునట్లును, నీ పరిశుద్ధ కుమారుడైన యేసు నామమున కృపా సంబంధమైన అద్భుతములు అడుగునట్లును అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారు డును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## పత్రిక పాఠము

రోమా 10:8-15

అయితే విశ్వాస మూలమగు నీతి యీలాగు చెప్పుచున్నది. ఎవడు పరలోకములోకి ఎక్కిపోవును? అనగా క్రీస్తును క్రిందికి తెచ్చుటక; లోక -ఎవడు అగాధములోకి దిగి పోవును? అనగా క్రీస్తును మృతులలో నుండి పైకి తెచ్చుటకు అని నీవు నీ హృదయ ములో అనుకొనవద్దు అదేమని చెప్పుచున్నది?-వాక్యము నీ యొద్దను నీ నోటను నీ హృదయములోను ఉన్నది, ఇ మేము ప్రకటించు విశ్వాస వాక్యమే. అదేమనగా- యేసు ప్రభువని నీ నోటితే ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగు నట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును. ఏమనగా ఆయనయందు విశ్వాసముంచు ప్రతివాడు సిగ్గుపడడని లేఖనము చెప్పుచున్నది. యూదుడని హెల్లేనీయుడని భేదము లేదు; ఒక్క ప్రభువే అందరికి ప్రభువై యుండి, తనకు ప్రార్థన చేయువారందరి యెడల (కృప చూపుటకు) ఐశ్వర్యవంతుడై యున్నాడు. ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్థన చేయువాడెవడో వాడు రక్షింపబడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్థన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసింప చేయుదురు? ప్రకటించువాడు లేకుండ వారెట్లు విందురు? (ప్రకటించు వారు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదురు? ఇందు విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో చక్కనివి అని వ్రాయబడి యున్నది.

## సువార్త పాఠము

లూకా 10:2-11,16

కోత విస్తారముగా ఉన్నది గాని పనివారు కొద్దిమందియే; కాబట్టి కోత యజమానుని తన కోతకు పనివారిని పంప వేడుకొనుడి. మీరు వెళ్లుడి; ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెపిల్లలను పంపినట్లు నేను మిములను పంపుచున్నాను. మీరు సంచినైనను జాలెనైనను చెప్పులనైనను తీసికొనిపోవద్దు; త్రోవలో నెవరినైనను కుశల ప్రశ్నలడుగ వద్దు; మీరు ఏ యింటనైన ప్రవేశించునప్పుడు ఈ యింటికి సమాధానమగు గాక అని మొదట చెప్పుడు. సమాధాన పాత్రుడు అక్కడ నుండిన యెడల మీ సమాధానము అతనిమీద నిలుచును; లేని యెడల అది మీకు తిరిగి వచ్చును. వారు మీకిచ్చు పదార్థములను తినుచు త్రాగుచు ఆయింటిలోనే యుండుడి. పనివాడు తన జీతమునకు పాత్రుడు. ఇంటింటికి తిరుగవద్దు. మరియు మీరు ఏ పట్టణములోనైన ప్రవేశించునప్పుడు

వారు మిమ్మును చేర్చుకొంటే మీ ముందర పెట్టునవి తినుడి. అందులో నున్న రోగులను స్వస్థపరచుడి. దేవుని రాజ్యము మీ దగ్గరకు వచ్చియున్నదని వారితో చెప్పుడి. మీరు ఏ పట్టణములోనైన ప్రవేశించునప్పుడు వారు మిమ్మును చేర్చుకొనకపోయిన యెడల మీరు దాని వీధులలోనికి పోయి; మా పాదములకు అంటిన మీ పట్టణపు ధూళిని సహితము మీ యెదుటనే దులిపివేయుచున్నాము; అయినను దేవుని రాజ్యము సమీపించి యున్నదని తెలిసికొనుడని చెప్పుడి. మీ మాట వినువాడు నా మాట వినును. మిమ్మును నిరాకరించువాడు నన్ను నిరాకరించును. నన్ను నిరాకరించు వాడు నన్ను పంపిన వాని నిరాకరించుననెను.

ముఖ్య ప్రార్థన తరువాత పరిశుద్ధాత్మను పిలుచు ఒక కీర్తన పాడవలెను.

తరువాత అభ్యర్థులను పరీక్షించు ఉప సభాధ్యక్షుడు గాని అందుకై నియమింపబడిన మరియొక గురువుగాని అభిషేక అభ్యర్థులను హాజరు పెట్టువలయును.

ఆంధ్ర ఇవాండెలికల్ లూథరన్ సంఘమువారు ఈ దిగువ పేర్లుగల సోదరులను సువార్తసేవ నిర్వహించవలసిన వారినిగా అంగీకరించి యున్నారు. కాబట్టి ఈ సభవారి యనుజ్ఞ ప్రకారము ఈ సోదరులను పరిశుద్ధ సువార్త సేవాభిషేకమునకై అప్పగించు చున్నాము.

ఇక్కడ అభ్యర్థుల పేరుల చదువవలయును, అప్పుడు వారు వేదిక యెదుట నిలువవలయును.

సభాధ్యక్షుడైన గురువు చెప్పవలసినది.

సభాధ్యక్షుడు:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

**ప్రార్థింతము**

సభాధ్యక్షుడు:– దేవా, నాయందు శుద్ధ హృదయమును కలుగ జేయుము.

సభ:– నా యంతరంగములో స్థిరమైన మనస్సును నూతనముగా పుట్టింపుము.

సభాధ్యక్షుడు:– ఓ దేవా, నీ పరిశుద్ధాత్మ వెలుగును పంపి నీ విశ్వాసుల హృదయములకు

బోధించుచున్నావు, ఆ యాత్మ వలననే మేము అన్ని విషయములయందు సరియైన జ్ఞానము కలిగి ఆయన యిచ్చు పరిశుద్ధారణయందు ఎల్లప్పుడు సంతోషించునట్లు అనుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

సభాధ్యక్షుడు:- వారి స్వరము భూలోక మంతటికిని:

సభ:- వారి మాటలు భూదిగంతముల వరకును బయలు వెళ్లెను.

**ప్రార్థింతము**

ఓ దేవా, నీవు మంచిదియును పరిపూర్ణమునగు ప్రతి యీవిని యిచ్చువాడవు. ఈ నీ సేవకులమీద నీ దివ్యమైన యాశీర్వాద మును కుమ్మరింపుమని బ్రతిమాలుకొనుచున్నాము. నీ బోధ యొక్క సత్యముతో వారిని నింపి, పవిత్ర జీవముతో వారి నలంకరించుము. దివారాత్రము నీ ధర్మశాస్త్రమును ధ్యానించుచు తాము చదువునది నమ్మునట్లును, నమ్మునది బోధించునట్లును, బోధించునది తమ బ్రతుకులో కనబడునట్లును కృప దయచేయుము తమ ఉద్యోగములో నిన్ను నమ్మకముగా సేవించుచు తమకు అప్పగింపబడిన దానిని ప్రభువు యేసుక్రీస్తు ప్రత్యక్ష దినము వరకును నిర్దోషముగా కాపాడుకొనునట్లు శక్తి ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అప్పుడు సభాధ్యక్షుడైన గురువు అభిషేకాభ్యర్థులకు చెప్పవలసినది.*

మిక్కిలి ప్రియులారా, అపొస్తలుల వాడుక ప్రకారము హస్త నిక్షేపణము ద్వారా ఇప్పుడు మీరు పరిశుద్ధ వాక్య సంస్కారముల ఉద్యోగమునకు ప్రత్యేకింపబడనై యున్నారు.

ఈ పరిశుద్ధ యుద్యోగమును గూర్చి మన ప్రభువైన యేసు క్రీస్తు చెప్పినది వినుడి.

"మీకు సమాధానము కలుగుగాక. తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనను మిమ్మును పంపుచున్నాను. మరల వారితో చెప్పెను ఆయన ఈ మాటలు చెప్పి వారి మీద ఊది-పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి

క్షమింపబడును. ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచియుండును. పరలోకమందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోకి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదగో నేను యుగసమాప్తి పర్యంతము సదా కాలము మీతో కూడ ఉన్నాను."

అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాయున దేమనగా: "ఎవడై నను అధ్యక్షత నాశించిన యెడల అట్టివాడు దొడ్డ పనిని అపేక్షించు చున్నాడను మాట నమ్మదగినది అధ్యక్షుడగు వాడు నిందారహితుడును ఏకపత్నీ పురుషుడును, మితానుభవుడును, స్వస్థబుద్ధి గలవాడును, మర్యాదస్థుడును, అతిది ప్రియుడును, బోధింప తగినవాడునై యుండి, మద్యపానియు, కొట్టువాడును కాక, సాత్వికుడును, జగడమాటని వాడును, ధనాపేక్ష లేనివాడునై, సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీన పరచుకొనుచు, తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. ఎవడైనను తన యింటివారిని ఏల నేరకపోయిన యెడల అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి (కలిగిన) శిక్షావిధికి లోబడకుండునట్లు క్రొత్తగా చేరినవాడై యుండకూడదు. మరియు అతడు నిందపాలై అపవాది ఉరిలో పడిపోకుండునట్లు (సంఘమునకు) వెలపటివారిచేత మంచి సాక్ష్యము పొందినవాడై యుండవలెను."

ఎఫెసు సంఘ పెద్దలనుకూడ ఆ అపొస్తలుడే ఈ దిగువ రీతిగా హెచ్చరించుచున్నాడు.

"దేవుడు తన స్వరక్త మిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగానుంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా నుండుడి."

కావున ప్రియ సహోదరులారా, సర్వశక్తిగల దేవుని యెదుటను ఈ సంఘము ఎదుటను మిమ్మును నేను అడుగున దేమనగా:-

1. ఇప్పుడు మీరు ఈ పరిశుద్ధ గురువు ఉద్యోగము వహించి దీనియందు నమ్మకముగా సేవ చేయుటకు సిద్ధముగా నున్నారా?

2. ఇవాంజెలికల్ లూథరన్ సంఘపు టొప్పుదలల ప్రకారము దేవుని వాక్యమును నిర్మలమైనదిగా ప్రసంగించుచు బోధించుచు నుందురా?

3. మన రక్షకుని ఉపదేశమును పరిశుద్ధ ప్రవర్తన వలనను భక్తిగల జీవనము వలనను అలంకరించెదరా?

*అప్పుడు అభ్యర్థులు ఒకరి తరువాత నొకరు చెప్పవలసిన దేమనిన:*

అవును, తన పరిశుద్ధాత్మ కృపాశక్తుల మూలమున ప్రభువు నాకు సహాయము చేయుటవలన నా పూర్ణ హృదయముతో ఆలాగు చేయుదును, ఆమేన్.

అటు తరువాత అభ్యర్థులు మోకరించవలెను.

*అభిషేకించు గురువు, ప్రతివాని తలమీదను కుడి హస్తముంచి ఈ దిగువ రీతిని చెప్పవలెను:*

తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున పరిశుద్ధా వాక్య సంస్కారముల యుద్యోగమును నీ కప్పగించి నిన్ను క్రైస్తవ సంఘ గురువుగా అభిషేకించి, దైవ సేవకై ప్రతిష్ఠించుచున్నాను.

*ప్రతి అభిషక్తుడు చెప్పవలసినది.*

ఆమేన్.

*అప్పుడు అందరు చెప్పవలసినది:*

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడు గాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరథములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధ ములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ము లను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*పిదప చెప్పవలసినది:*

సభాధ్యక్షుడు:– ప్రభువు మీతో నుండుగాక.

*సభ:– మీ యాత్మతో నుండుగాక*

**ప్రార్థింతము**

కృపగల దేవా, పరలోకపు తండ్రీ, మా ప్రభువు యేసుక్రీస్తు ద్వారా "కోత విస్తారముగా నున్నది గాని పనివారు కొద్దిమందియే; కాబట్టి కోత యజమానుని తన కోతకు పనివారిని పంప వేడుకొనుడి" అని మాతో పలికితివి. కావున నీ నామము పరిశుద్ధపరచబడి, నీ రాజ్యము వృద్ధిపొంది నీ చిత్తము నెరవేరునట్లు మేము గొప్ప సమూహముగా నీ యదార్ధ సువార్తికులమైయుండి, లోకమునకును శరీరమునకును సైతానునకును విరోధముగా నెల్లప్పుడు నిలకడైన విశ్వాసముతో జీవించు నిమిత్తము ఈ నీ సేవకులకును మాకును నీ వాక్య బోధకత్వమునకు పిలువబడిన వారికందరికి నీ పరిశుద్ధాత్మను విస్తారముగా ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

*అంతట వారు లేవవలయును, తరువాత అభిషేకించు గురువు చెప్ప వలసిన దేమనిన.*

ఇప్పుడు మీరు వెళ్ళి బలిమిచేత కాక దేవుని చిత్తప్రకారము ఇష్ట పూర్వకముగాను దుర్లాభ ఆపేక్షతే కాక సిద్ధమనస్సుతేను మీ మధ్యనున్న దేవుని మందను పైవిచారణ చేయుచు దాని కాయుడి. మీ కప్పగింపబడిన వారిపైన ప్రభువులైనట్టుండక మందకు మాదిరులుగా నుండుడి. ప్రధాన కాపరి ప్రత్యక్షమైనప్పుడు మీరు వాడబారని మహిమ కిరీటము పొందుదురు.

మీరు ఫలించునట్లును మీ ఫలము నిలిచియుండునట్లును ప్రభుని యాశీర్వాదము మీపై నుండుగాక.

*నూతన అభిషిక్తులు చెప్పవలసినది:*

ఆమేన్

సంఘముయొక్క క్రమము చొప్పున నూతన అభిషిక్తులకు ప్రభు భోజన సంసాకరము నాచరింపవలెను.

# గురువుల ఉద్యోగ ప్రవేశ క్రమము

*ఇది ఉదయము జరిగిన యెడల 1తిమోతి 4:6-16; యోహాను 10:1-15 ఆదినమునకై పత్రిక పాఠమునకు పూర్వమే చదువ నలయును. ముఖ్య ప్రార్థన లోని ప్రభువు ప్రార్థన లోపించవలయును. ఉద్యోగ ప్రవేశక్రమము ముఖ్య ప్రార్థన తరువాత ఆరంభించి దీవెనతో*

*ముగియువలెను.*

ఉద్యోగప్రవేశ క్రమము మధ్యాహ్నముగాని సాయంత్రముగాని జరిగిన యెడల సాయంత్ర నారాధన క్రమము నుపయోగింపవలయును. అప్పుడు సంకీర్తన 121 లేక 122;1తిమోతి 4:6-16; యోహాను 10:1-15 వినియోగింప వలయును. ఉద్యోగ ప్రవేశ క్రమము ప్రసంగము తరువాతి కీర్తన వెనుక ఆరంభమై వందన వచనముతోను, ఆ దినమునకైన సంగ్రహ ప్రార్థనతోను, దేవుని నడిపింపును సహాయమును కోరెడు సంగ్రహ ప్రార్థనతోను, శుభవచన ముతోను, సమాధానము కొరకైన సంగ్రహ ప్రార్థనతోను, 34-వ సంకీర్తనము తోను, క్రొత్త నిబంధన దీవెనతోను ముగించవలయును.

*కార్యనిర్వాహక గురువు సభవారితో చెప్పవలసిన దేమనగా:*

మిక్కిలి ప్రియులారా, గౌరవనీయుడగు మన సహోదరుడును సువార్త పనియందు సహకారియునగు..................అను ఈయనను ఈ గురుమండ లమునకు (సంఘమునకు) గురువుగా నియమించుటకు అధికారము పొందియున్నాము: అట్లు చేయుటకు ముందు మీరు దానికి తగిన నిదర్శన పత్రిక అందించగలందులకు అడుగుచున్నాను.

గురువు ఉద్యోగములో ప్రవేశించువారు క్రమముగా నియమింపబడినట్లు పంచాయితి వారుగాని, వారి కార్యదర్శిగాను, దస్కతు చేసిన నిదర్శన పత్రిక గురువున కిచ్చిన పిమ్మట ఆయన దానిని సభవారికి వినిపించవలెను.

తరువాత నూతన గురువు వేదిక యెదుట నిలువబడి యుండగా కార్యనిర్వాహక గురువు చెప్పవలసిన దేమనగా:

పరిశుద్ధమైన గురువు ఉద్యోగమును గురించిన వాక్యము వినుడి. ప్రభువైన యేసు తన శిష్యులతో ఇట్లు చెప్పుచున్నాడు:

"తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపు చున్నాను. పరిశుద్ధాత్మను పొందుడి. మీ రెవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును. ఎవరి పాపములు మీరు నిలిచియుండ నిత్తురో అవి నిలిచియుండును. పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త

జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోకి వారికి బాప్తిస్మ మిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి పర్యంతము సదా కాలము మీతో కూడ ఉన్నాను" ఆమేన్.

అపొస్తులుడైన పౌలు తిమోతికి ఇట్లు చెప్పుచున్నాడు:

మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పవిత్రతలోను, విశ్వాసులకు మాదిరిగా ఉండుము. నేను వచ్చు పర్యంతము చదువుటయందును, హెచ్చరించుటయందును, బోధించుటయందును జాగ్రత్తగా ఉండుము. పెద్దలు హస్తనిక్షేపణము చేయగా ప్రవచన మూలమున నీకు అనుగ్రహింపబడి నీలో ఉన్న వరమును అలక్ష్యము చేయకుము. నీ అభివృద్ధి అందరికి తేటగా కనబడు నిమిత్తము వీటిని మనస్కరించుము, వీటియందే సాధకము చేసికొనుము. నిన్ను గూర్చియు నీ బోధనుగూర్చియు జాగ్రత్త కలిగి యుండుము. వీటిలో నిలకడగా ఉండుము. నీ వీలాగు చేసి నిన్నును నీ బోధ వినువారిని రక్షించుకొందువు.

కాబట్టి ప్రియ సహోదరుడా, దేవుని యెదుటను ఈ సంఘము నెదుటను నేను నిన్ను అడుగున దేమనిన:

ఈ సంఘములో గురుస్థానము (దైవజ్ఞాన కళాశాలలో ఉపాధ్యాయుని, అధ్యక్షుని స్థానము) వహించి అందు నమ్మకముగా సేవచేయుటకు సిద్ధముగా నున్నావా?

ఇవాంజెలికల్ లూథరన్ సంఘపు టొప్పుదలల ప్రకారము దేవుని వాక్యమును నిర్మలమైనదిగా ప్రసంగించుచు బోధించుచు నుండుమాట ఇచ్చెదవా?

మన రక్షకుని ఉపదేశమును పరిశుద్ధ ప్రవర్తనవలనను భక్తిగల జీవమువలనను అలంకరించెదవా?

పిలువబడిన గురువు చెప్పవలసినది:

దేవుని సహాయముచేత ఆలాగు చేసెదను:

*అంతట సంఘము నిలువబడి యుండగా, కార్యనిర్వాహక గురువు చెప్పవలసినదేమనిన:*

మిక్కిలి ప్రియులారా, మీరు మీ సంఘ (గురు మండలము) గురువుగా నుండుటకు

పిలిచిన ఈయన చేసిన గంభీర ప్రమాణమును వినియున్నారు. ఇప్పుడు నేను మిమ్మును అడుగున దేమనిన:

మీరు ఈయనను అంగీకరించి, ఆత్మలకు ముఖ్యకాపరియు అధ్యక్షుడునైన ప్రభువు యేసుక్రీస్తు తానే ఈ సంఘముపై నియమించిన మార్గదర్శియగు కాపరికి తగిన ప్రేమ, గౌరవము, లక్ష్యము ఈయన యెడల చూపించెదరా?

ఈయనను గౌరవించి, గొప్పగా నెంచి, పరిశుద్ధుడైన పౌలు హెచ్చరించినట్లు మీతో ప్రయాసపడుచు ప్రభువునందు మీకు పైవారై యుండి మీకు బుద్ధిచెప్పువారిని మన్ననచేసి, వారి పనిబట్టి వారిని ప్రేమతో మిక్కిలి ఘనముగా నెంచెదరా?

అట్లయినచో "అవును దేవుని సహాయముచేత ఆలాగున చేయుదుము" అని జవాబు చెప్పండి.

సభ:– అవును దేవుని సహాయముచేత ఆలాగున చేయుదుము.

*అప్పుడు కార్యనిర్వాహక గురువు చెప్పవలసినది:*

మీరు చేసిన యదార్థ వాగ్దానములనుబట్టి రెవరెండు............... .......................గారిని ...................అను ఈ సంఘము (గురుమండలము) నకు (దైవజ్ఞాన కళాశాలకు) యుక్తరీతిని ప్రవేశ పెట్టబడిన గురువుగా, (అధ్యక్షునిగా, ఉపాధ్యాయునిగ) స్థిరపడు చున్నాను.

**ప్రార్థింతము**

ఓ ప్రభు యేసుక్రీస్తూ! దేవుని కుమారుడా! నీవు తండ్రి కుడిచేతి వైపున కూర్చుండి నీ జనమునకు వరములు ఇచ్చుచున్నావు. ఈ సంఘమునకు గురువును అనుగ్రహించినందుకు నీకు వందనములు చేయుచున్నాము. అనేక ఆత్మల రక్షణ కొరకును నీ సంఘముయొక్క అభివృద్ధి కొరకును తన ఉద్యోగమును నమ్మకముగా నెరవేర్చి, ఈ పనిలో విస్తారమైన దీవేనలు పొందునట్లును, నీవు ఇయ్యనైయున్న నీతికిరీటము ఆయనకున్న ఈ సంఘములోనున్న వారందరికిని దొరుకునట్లును ఆయనకు కావలసినంతగా కృపావరములు అనుగ్రహింపుమని తండ్రితోను, పరిశుద్ధాత్మతోను సదా యేకదేవుడవై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువైన దేవా! పరిశుద్ధాత్ముడా! నీ విశ్వాసులను పరిశుద్ధపరచువాడా! ఈ సంఘమును ప్రేమానుగ్రహముతో దర్శించి, నీ వాక్యము గైకొనులాగున వారి హృదయములను తెరచి, నీ నిత్య సువార్త వెలుగువలన వారి మనో నేత్రములను వెలిగించి యథార్థమై దైవభక్తి వారిలోనభివృద్ధిపరచి, నీవు వారియందు ఆరంభించిన సత్కార్యము యేసుక్రీస్తు ప్రత్యక్ష దినమువరకు కొనసాగింపబడునట్లు నీ కృపా బాహుళ్యమును బట్టి ప్రేమ సమాధానముల అనుబందము చేత ఐక్యపరచుమని తండ్రితోను నీతోను సదా ఏకదేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించుచునుండు మా ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

అందరు:- పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడు గాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధ ములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ము లను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*అప్పుడు కార్యనిర్వాహక గురువు చెప్పవలసిన దేమనిన:*

మీరు విస్తార ఫలములు ఫలించునట్లును మీ ఫలములు నిలిచి యుండునట్లును ప్రభువు ఆశీర్వాదము మీమీద నుండుగాక! ఆమేన్.

*ఒక కీర్తన పాడిన తరువాత ఇప్పుడు ప్రవేశపెట్టబడియున్న గురువు ఈ క్రమారంభమునకు ముందు వ్రాయబడిన ఏర్పాటుల ప్రకారము ఆరాధన ముగించవలయును.*

## అనభిషిక్తులగు పనివారి ఉద్యోగ ప్రవేశ క్రమము

*బోధకులను, ఉపాధ్యాయులను, లే లిడర్లను, సంఘ సహాయార్థ సమాజముల ఉద్యోగస్థులను తమ ఉద్యోగములలో ప్రవేశింప జేయుటకు ప్రత్యేకమైన ఆరాధన సమాలోచన సభాధ్యక్షుని వలన*

*జరుపబడవలెను.*

*ముఖ్యారాధన క్రమము యథావిధిగా జరుగవలెను. ముఖ్యప్రార్థన తరువాత ఉద్యోగములో ప్రవేశించువారు వేదికముందు నిలువవలెను.*

*ఈ దిగువ ప్రార్థన వాడుకొనవలెను.*

*బోధకుడు చెప్పవలసినది.*

## ప్రార్థింతము

సర్వశకితగల దేవా! పరలోకమందున్న మా తండ్రీ! నీ పరిశుద్ధ వాక్యముకొరకు నిన్ను స్తుతించుచున్నాము. మనుష్యులందరికి నీ వాక్యము ప్రకటించుటకు తగిన ఉద్యోగమును నీవు యేర్పరచి నందున మేము నీకు వందనములు చేయుచున్నాము. ఈ నీ సేవకుడు* తప్పులలో పడకుండునట్లు ఈయనను కాపాడి, రక్షణార్థ మైన నీ సత్యమును సాఫల్యముగా ప్రకటించు లాగున ఈయన హృదయమును పరిశుద్ధాత్మతో నింపుము. నీ సువార్తను బోధించుటకు ఇంక నెక్కువ మందిని ప్రేరేపించి వారిని తగినవారినిగా చేయుము. సర్వలోక మందున్న నీ సంఘమును వృద్ధి నొందించి కాపాడుము.

**ఉద్యోగములో ప్రవేశపెట్టబడువారు ఒకరికంటే ఎక్కువగా నున్న యెడల ఆయా పదములకు సరిపడు బహువచనములను వాడవలయును.*

ముఖ్యముగా ఈ నీ సేవకుని దీవించుము. నీ సంఘమునకు అభివృద్ధియు నీ నామమునకు ఘనతయు కలుగునట్లు మాటల వలనను నడతవలనను నిన్ను నమ్మకముగా సేవించులాగున ఈయన కు దైవబలమును నిండుగా అనుగ్రహించి పరిశుద్ధముగా ప్రవర్తించు నట్లు ఈయనను కాపాడుము. ఈ యారాధనలో నీవు మాకు తోడుగా నుండి సహాయము చేయుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

*కార్యనిర్వాహక గురువు ఆ తరువాత చెప్పవలసిన దేమనగా:*

మిక్కిలి ప్రియులారా! మన క్రైస్తవ సహోదరుడును సువార్త సేవలో జతపనివాడునైన*................అను ఈయనను మన ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘములో*..........................గా నియమించుటకు అధికారము

పొందియున్నాము. క్రైస్తవ యుద్యోగమునకు పాత్రుడనని విద్యవలనను అనుభవమువలనను ఈయన కనబరచియున్నాడు.

దేవుని వాక్యమును ప్రకటించువారిని గురించి చెప్పబడిన దైవ వాక్యమును వినుడి.

### 1. సువార్త బోదకుల కొరకు

అప్పుడు వారు లేఖనములు గ్రహించునట్లుగా ఆయన వారి మనస్సును తెరచి–క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో

*ఇక్కడ పేరు చెప్పవలయును. *ఇక్కడ ఉద్యోగము పేర్కొనవలయును.

నుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరిట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడ వలెననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీ మీదికి పంపుచున్నాను.

### 2. ఉపాధ్యాయుల కొరకు

మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు. మీరు లోకమునకు వెలుగై యున్నారు. కొండమీదనుండు పట్టణము మరుగై యుండనేరదు. మనుష్యులు దీపము వెలిగించి కుంచము క్రింద పెట్టరు గాని అది యింటనుండు వారందరికి వెలుగిచ్చుచటకై దీప స్తంబము మీదనే పెట్టుదురు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి.

### అపొస్తలుడైన పౌలు ఈలాగు వ్రాయుచున్నారు.

### 1. సువార్త బోధకుల కొరకు:

దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పు తీర్చు క్రీస్తుయేసు యెదుటను, ఆయన ప్రత్యక్షముతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టి చెప్పున

దేమనగా–వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాస పడుము, సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు, ఖండించుము, గద్దించుము, బుద్ధి చెప్పుము. ఎందుకనగా జనులు హితబోధను సహింపక దురద చెవులు గలవారై పోగుచేసికొని, సత్యమునకు చెవి నియ్యక కల్పనా కథల వైపునకు తిరుగు కాలము వచ్చును. అయితే నీవు అన్ని విషయములలో మితముగా నుండుము. శ్రమపడుము, సువార్తికుని పని చేయుము. నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము.

## 2. ఉపాధ్యాయుల కొరకు

నా కుమారుడా, క్రీస్తుయేసునందున్న కృపచేత బలవంతుడవు కమ్ము నీవు అనేక సాక్షుల యెదుట నావలన వినిన సంగతులను ఇతరులకును బోధించు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము. క్రీస్తుయేసు యొక్క మంచి రాణువవానివలె నాతో కూడ శ్రమను అనుభవించుము. రాణువ వాడెవడును యుద్ధమునకు పోవునప్పుడు తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోషపెట్టవలెనని యీ జీవన వ్యాపారములలో చిక్కు కొనడు. మరియు జెట్టియైనవాడు పోరాడునప్పుడు నియమప్రకారము పోరాడకుంటే వానకి కిరీటము దొరకదు. పాటుపడిన వ్యవసాయకుచే మొదట ఫలములలో పాలుపుచ్చు కొనవసినవాడు, నేను చెప్పు మాటలు ఆలోచించుకొనుము; అన్ని విషయములందు ప్రభువు నీకు వివేక మనుగ్రహించును. నా సువార్త ప్రకారము, దావీదు సంతానములో పుట్టి మృతులలోనుండి లేచిన యేసుక్రీస్తును జ్ఞాపకము చేసికొనుము.

## ప్రశ్నలు

కాబట్టి నా ప్రియ సహోదరుడా, దేవుని యెదుటను ఈ సభవారి యెదుటను నేను నిన్ను అడుగున దేమనగా, మన ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘములో సువార్తను ప్రకటించుట యనెడు పరిశుద్ధమైన పనిని నీవు మనపూర్వకముగా వహించి, మన సంఘము యొక్క కట్టుదిట్టముల ననుసరించి, ఆ యుద్యోగమునందు శ్రద్ధగా పనిచేసెదనని వాగ్దత్తము చేయుచున్నావా?

ఉత్తరము:– దేవుని సహాయమువలన ఆలాగే చేయుదును.

ప్రత్యుత్తరము:– సమస్తములయిన కులాచారములను మరియు అన్యులయొక్క హానికరములైన ఇతరాచారములను నీవు స్వయముగా విడిచిపెట్టుటయే కాక

క్రైస్తవ సహోదరత్వమును గూర్చి క్రీస్తు బోధించిన దానికి విరుద్ధముగా నున్న యాచార ములను కూడ నీ బోధవలనను నడత వలనను పోగొట్టుటకు నీ శక్తికొలది ప్రయత్నము చేసెదవా?

ఉత్తరము:- దేవుని సహాయమువలన ఆలాగే చేసెదను.

మన సంఘముయొక్క వాడుకల ప్రకారము నేను ఇప్పుడు ............................అను నిన్ను..........................అను ఉద్యోగములో ప్రవేశపెట్టి నీవు చేయు పని విషయమై క్రీస్తు రాకడ దినమందు నీవు జవాబు చెప్పవలసిన దానిని బట్టి నీవు నమ్మకముగా ప్రవర్తింపవలసినదని ఆనపెట్టుచున్నాను.

ఉద్యోగములో ప్రవేశించువారు మోకరించవలెను.

**దీవెన**

గొఱ్ఱెల కాపరియైన యేసు అను మన ప్రభువును నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమునుబట్టి మృతులలోనుండి లేపిన సమాధాన కర్తయగు దేవుడు, యేసుక్రీస్తుద్వారా, తన దృష్టి కనుకూలమైన దాని నీలో జరిగించుచు ప్రతి మంచి విషయములోను తన చిత్తప్రకారము చేయుటకు నిన్ను సిద్ధపరచునుగాక. యేసుక్రీస్తు కు యుగయుగములు మహిమ కలుగును గాక.

*క్రొత్తగా ఉద్యోగములో ప్రవేశపెట్టబడినవారు 'ఆమేన్' అనవలెను.*

ఆమేన్.

## ప్రార్థింతము

సంఘమునకు ప్రధాన కాపరియగు ప్రభువైన యేసుక్రీస్తూ నీ సేవకుడు నీ దృష్టికి అనుకూలమైనదానిని, నీ సంఘమునకు క్షేమాభివృద్ధి కలిగించుదానిని చేయులాగున ఈయనకు నీ పరిశుద్ధాత్మను అనుగ్రహించుమని నిన్ను ప్రార్థించుచున్నాము. హృదయములయందు నాటబడి తమ యాత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యమును వారు సాత్వికముతో నంగీకరించునట్లు ఈ నీ సేవకునివలన వాక్యబోధ నొందు వారినందరిని ఆశీర్వదించుము. ఈయన పనిచేయు చోటనెల్ల నీ పని మిక్కిలి వృద్ధిలోనకి వచ్చుగాక. మరియు నీవు అగుపడునప్పుడు ఈయనయు మే మందరమును వాడబారని మహిమ కిరీటమును పొందుదుముగాక, ఆమేన్.

*తరువాత గురువు చెప్పవలసిన దేమనిన:*

ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక;
ప్రభువు నీకు తన సన్నిధి ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక;
ప్రభువు నీ మీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి నీకు సమాధానము కలుగజేయుగాక, ఆమేన్.

# సంఘాలోచన సభ్యుల ఉద్యోగ ప్రవేశ క్రమము

*ఈ క్రమము గురుమండలము యొక్కయు, తాలూకా యొక్కయు, ఆలోచన సభ కొరకు వాడవలెను.*

*ఈ ప్రవేశ క్రమము ముఖ్యారాధనలోగాని సాయంత నారాధనలోగాని ఉపయోగించవచ్చున.*

*ముఖ్యారాధనలో ఉపయోగించిన యెడల ముఖ్య ప్రార్థన తరువాత రావలయును. దీని తరువాత కీర్తనతోను దీవెనతోను ముగించవలయును.*

*సాయంత నారాధనలో ఉపయోగించిన యెడల ఉపన్యాసము తరువాత కీర్తన వెనుక ఇతిరావలయును. తరువాత మరియొక కీర్తనపాడి సంగ్రహ ప్రార్థనల తోను, 34వ సంకీర్తనతోను, దీవెనతోను ముగించవలయును.*

*గురువు క్రొత్తగా నియమింపబడిన పంచాయితీ వారి పేరులు పిలువగా వారు వేదిక యొద్దకు రావలెను.*

అప్పుడు గురువు చెప్పవలసినది.

మన తండ్రియైన దేవునివలనను ప్రభువైన యేసుక్రీస్తు వలనను మీకు కృపయు సమాధానమును కలుగుగాక, ఆమేన్.

*తరువాత గురవు పంచాయితి వారి ధర్మములు ఈ దిగువ రీతిగా చెప్పవలెను.*

ప్రియ సహోదరులారా, ఈ సభవారివలన ఈ సంఘాలోచన సభ్యులుగా (గురుమండల ఆలోచన సభ్యులుగా లేక తాలూకా ఆలోచన సభ్యులుగా) మీరు నియమింపబడి యున్నారు. కావున మీ కేర్పర్చబడిన ఈ యుద్యోగ స్థాపనమును గూర్చి దేవుని వాక్యము వినుడి:

మీరు ఇట్టివారై మీ స్వంత కుటుంబములకును యావత్సంఘమునకును భక్తియుక్తమైన క్రైస్తవ ప్రవర్తనమునకు మార్గదర్శులై యుండవలెను.

దైవారాధన క్రమముగా జరుగునట్లును, సువార్త తప్పులు లేకుండా

బోధింపబడునట్లును, చిన్నవారికి క్రైస్తవ విధ్య చెప్పుటకు తగిన ఏర్పాటులు చేయబడునట్లును, యోగ్యులైన వారు మాత్రమే సభలో చేర్చబడునట్లును, తగిన క్రమశిక్ష చేయబడునట్లును, సమస్తము మర్యాదగాను క్రమముగాను జరుగునట్లును మీరు చూచుకొనవలెను.

రోగులను బీదలను పరామర్శించుట యందును, సభ వారిలో ఐకమత్యఉను ప్రేమయును విస్తరింప జేయుట యందును, ఈ సభయొక్క క్షేమమును వృద్ధిచేయుటయందును, స్వదేశ విదేశములలో క్రీస్తు రాజ్యమును వ్యాపింపజేయుట యందును మీరు మీ గురువునకు సహాయము చేయవలెను.

మీరు ఈ సభయొక్క ఆస్తిని కాపాడు, గురువు పోషణ నిమిత్తమును ఇంక అవసరములైన ఇతర వ్యయముల నిమిత్తమును తగిన యేర్పాటులుచేసి, ఈ సంఘముయొక్క లౌకిక వ్యవహారము లన్నియు మీరు చూచుకొనవలెను.

మీ యుద్యోగమునకు విధింపబడిన ఈ కార్యములను పూని చేయుటకు మీకు ఇష్టమున్నదని ఈ సభవారికి తెలియునట్లు దేవుని యెదుటను ఈ సంఘము నెదుటను మిమ్మును నేను అడుగున దేమనగా:

ప్రశ్న:– మీకు నిర్ణయింపబడిన యుద్యోగములను మీరు మనఃపూర్వకముగా అంగీకరించి, దేవునికి భయపడియు ఈ సభయొక్క పద్ధతులను వాడుకలను అనుసరించియు ఆ యుద్యోగ ధర్మములను గైకొందుమని వాగ్ధత్తము చేయుచున్నారా?

ఉత్తరము: దేవుని సహాయము వలన ఆలాగే చేయుదుము.

*తరువాత గురువు ఆ యుద్యోగస్థులలో ఒక్కొక్కని యొక్క కుడిచేయి పట్టుకొని చెప్పవలసిన దేమనిన:*

తన సంఘముయొక్క సేవ కొరకు నిన్ను పిలిచిన దేవుడు నీవు ఆయన రాజ్యములో మంచి కార్యనిర్వాహకుడవై యుండులాగున నీకు తన కృప నిండుగా అనుగ్రహించుగాక.

## ప్రార్థింతము

సర్వశక్తిగల దేవా! మా ప్రభువైన యేసుక్రీస్తు తండ్రీ! నీవు నీ సంఘమును భూలోకమందు ఏర్పరచి కాపాడియున్నావు. గనుకను, నీయొక్క రాజ్యమును

వృద్ధిచేయుటకై నీ జతపనివాండ్రుగా నుండ వలసినదని నీ జనులను పిలుచుచున్నావు గనుకను, మేము నిన్ను స్తుతించుచున్నాము. నీ సంఘమునందు పనిచేయుటకును, దానికి ఇహపరక్షేమములు కలుగునట్లు శ్రద్ధకలిగియుండుటకును, ఈనీ సేవకులను మనస్సు పుట్టించినందులకై మేము నీకు వందనములు చేయుచున్నాము. ఈ మా సహోదరులు నీ చిత్తమును తెలిసికొని దేవునికి భయపడి తమ యుద్యోగ ధర్మములను నమ్మకముగా జరుపు నట్లు పరిశుద్ధాత్మ యొక్క వరమును అనుగ్రహింపుమని నీకు మనవి చేయుచున్నాము. ఈ యావత్సంఘము పరిశుద్ధమును నిష్కళంక మునైన సంఘమగునట్లు దీని నాశీర్వదించుమని మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

*తరువాత గురువు చెప్పవసిన దేమనిన:*

మీ ప్రయాసము ప్రభువునందు వ్యర్థము కాదని యెరిగి స్థిరులును కదలనివారును ప్రభువు కార్యాభివృద్ధియందు ఎప్పటికిని ఆసక్తులునైయుండుడి, ఆమేన్.

**సమాధానముతో వెళ్ళుడి**

*పిమ్మట ఆరాధన యధావిధిగా జరుగవలెను.*

# స్వర్గీయుల జ్ఞాపకార్థపు టారాధన

*దీనిని గురుమండలములో నుపయోగించు నెడల సర్వ పరిశుద్ధుల దినము నకు తరువాత ఆదివారమున నాచరింపవచ్చును.*

*సీనడు సభయందుపయోగించు నెడల అధ్యక్షుడు నియమించిన సమయమున నాచరింపవచ్చును.*

## కీర్తన

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ఆమేన్.

## ప్రారంభ గీతము

నేనే మార్గమును సత్యమును జీవమునై యున్నాడు. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు హల్లెలూయా.

నేనే పునరుత్థానమును జీవమునై యున్నాను. నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును, హల్లెలూయా.

అల్ఫయు, ఓమేగయు, ఆదియు, అంతమును నేనే. వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉండువాడను సర్వాధికారిని నేనే. హల్లెలూయా.

ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులు. నిజమే, వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు.

## సంగ్రహ ప్రార్థన

జీవమునకు కర్తవగు, జీవదాతవునైన నిత్యదేవా! నీ కుమారుడైన యేసునందు మాకు నిత్యజీవము కలుగునట్లు ఆయనను మా కనుగ్రహించియున్నావు. నీ కృపవలన లోకమును జయించు విశ్వాసము మా కనుగ్రహించి, తండ్రి, కుమార, పరిశుద్ధాత్మవై యున్న నిన్ను జీవమును, ప్రేమయు, తేజస్సును, శాశ్వత శాంతియు గల పరలోక గృహమున విరివిలేని మహిమ సేవలతోకూడి, అయోగ్యుల మైన మేమును నరంతరము స్తుతించులాగున నీ కృప మాపై కుమ్మరింపుమని నిన్ను బ్రతిమాలి వేడుకొనుచున్నాము, ఆమేన్.

## పత్రిక పాఠము

1థెస్స 4:13-18 లేక రోమా 8:31-39

ఇదిగో, దేవుని నివాసము మనుష్యులతో కూడ నున్నది. ఆయన వారితో కాపురముండును. వారాయన ప్రజలై యుందురు. దేవుడు తానే వారికి దేవుడై యుండి

వారికి తోడైయుండును.

వచనము:-ఆత్మయు పెండ్లి కుమార్తెయు రమ్మని చెప్పుచున్నారు. వినువాడు రమ్మని చెప్పవలెను; దప్పిగొనువాడు రావచ్చును. హల్లెలూయా.

వచనము:- ప్రభువైన యేసూ! రమ్ము.

**సువార్త పాఠము**

యోహాను 14:1-6

**ప్రసంగము**

*ప్రసంగము కాగానే బోధకుడు వేదిక యొద్దకు వెళ్ళగా సభ నిలువ బడవలెను.*

*అంతట బోధకుడు ఆ సంవత్సరములో స్వర్గీయులైన వారి పేర్లను చదువును. సభ నిశ్శబ్దముగా నుండవలెను.*

## కీర్తన

*కీర్తన ముగియగానే బోధకుడు "ప్రార్థింతము" అని చెప్పవలెను.*

## ప్రార్థన

సర్వశక్తిగల దేవా! ప్రభువునందీ లోకమును విడిచిన వారి యాత్మలు నీతో నివసించుచున్నవి. శరీర సంబంధమైన ప్రయాసముల నుండి విడుదలనొందిన విశ్వాసుల యాత్మలును నీతో సుఖమను భవించుచు ఆనందించుచున్నవి. విశ్వాసమందు తమ పరుగును కడముట్టించి, తమ ప్రయాసములు మాని యిప్పుడు నీ యొద్ద విశ్రాంతి నొందుచున్న వారికిని, ముఖ్యముగా ఈ దినమున నీ యెదుట జ్ఞాపకము చేసికొను మా ప్రియులకును నీ వనుగ్రహించిన కృప నిమిత్తము నీకు హృదయ పూర్వకమైన వందనములను చెల్లించు చున్నాము. నీ పరిశుద్ధ నామమందు విశ్వాసముంచి చనిపోయిన వారితోపాటు, మేమును నీ నిత్య మహిమలో శరీరాత్మల యందు పూర్ణ సిద్ధి నొంది ఆనందించు నట్లనుగ్రహించుమని నీ కుమారుడును మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ దేవా! నీవే, ప్రయాసము శ్రమయు నొందువారికి అండవును, మృతులైన ధన్యులకు ఆశ్రయ స్థానమును అయి యున్నావు. నీ యెదుట అనేక తరములు

పుట్టుచున్నవి, గతించి పోవుచున్నవి. మేము నీ పరిశుద్ధుల సహవాసమునందానందించు చున్నాము. విశ్వాసులై జీవించిన వారి నందరిని శాంతికరమైన మరణము నొందినవారి నందరిని, ముఖ్యముగా నీ యందు విశ్రమించుచున్న మా ప్రియులందరిని, జ్ఞాపకము చేసికొనుచున్నాము. నీ తేజస్సులోనికిని నీ ప్రేమలోనికిని మమ్మును లేవనెత్తుము. నీయందు నమ్మికయుంచి నీ పరిశుద్ధ చిత్తమును నెరవేర్చుటకు ప్రయాసపడిన వారందరితో పాటు మాకు పాలు దయచేయుము. భూమిమీది సంఘముతోను పరలోకమందలి సంఘముతోను ఏకీభవించి మేము నీ నామమునకు మహిమయు ఘనతయు నారోపించుచు నిన్ను కొనియాడునట్లనుగ్రహించుము, ఆమేన్.

సర్వశక్తిగల నిత్యదేవా! ముందుకు మా కొరకు మేళ్ళను సేకరించు నిమిత్తము నీ యేకపుత్రుని ప్రధాన యాజకునిగ మా కనుగ్రహించియున్నావు. నీ యయోగ్య సేవకులమైన మేమును నీ పరిశుద్ధుల సమాజములో చేరునట్లనుగ్రహించుమని, నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

*ఈయారాధన సినదు సంబంధముగ జరుగు నెడల పైన ఉన్న సంగ్రహ ప్రార్థనలో మొదటి దానికి బదులుగ ఈ దిగువ ప్రార్థన వాడవచ్చును.*

ఓ దేవా! మే మీ దినమున జ్ఞాపకము చేసికొనుచున్న నీ దాసులైన మా సోదరులను నీ సేవకై పిలుచుకొనియున్నావు. వారు తమ ప్రయాసములను మాని, జీవములో ప్రవేశించి విశ్రాంతినొందు నట్లనుగ్రహించియున్నావు. వారు తుది వరకు నమ్మకమైన సేవ చేయునట్లును, నీ రాజ్యమందు వారి పరిచర్య ఫలించునట్లును కృప చూపినందుకు నీ పరిశుద్ధ నామమును స్తుతించుచున్నాము. వారు విడిచి వెళ్ళిన సేవను వహించియున్న మేము నీ ప్రియకుమారుని యందలి విశ్వాసములో దాని నిర్వహించుటకు అర్హత దయచేయుమని ఆయన ఘనమైన నామమున వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట అందరు ప్రభువు ప్రార్థన చెప్పవలెను.*

## ప్రభువు ప్రార్థన

*అంతట అందరు నిలువబడి ఒక కీర్తన పాడవలెను.*

**కీర్తన**

**దీవెన**

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికి తోడై యుండుగాక, ఆమేన్.

# దేవాలయము కట్టబడు స్థలమును దీవించుటకును, పునాది తీయుటకును తగిన క్రమము

*దేవాలయముగాని, ప్రార్థన మందిరముగాని, (సంఘస్తుని నివాసపుటిల్లు గాని) కట్టబడు స్థలమును దీవించుటకును, వీని పునాది తీయుటకును తగిన ఈ క్రమమును ఉదయమునందుగాని సాయంకాలమునందురగాని వాడవచ్చును.*

*ఈ క్రమమును ఏ.ఇ.ఎల్.సి. ప్రెసిడంటుగాని, సినడు ప్రెసిడెంటుగాని, పారిష్ పాస్టరుగాని జరిపింపవచ్చును.*

*పైన చెప్పబడిన కట్టడముల కొరకు పునాది తీయుటకు తగిన స్థలమును కుదుర్చుకొనిన తరువాత హాజరైన అభిషిక్తులను, సభికులను కీర్తనలు పాడుచు ఊరేగింపుతో అక్కడికి రావచ్చును. ఈ ఊరేగింపులో సంగీత పాటకులను పాస్టరును ముందుగా నడిచిపోవలెను.*

*ఈ క్రమము జరిపించుటకు తగిన స్థలమును ఏర్పరుచుకొనవలెను. అక్కడ తాత్కాలిక వేదిక యొకటి అమర్చుకొని, దాన మీద తగిన వస్త్రములు వేసి అలంకరించి ఉపకరణములను బెట్టవలెను. ఆ వేదిక యొద్ద తగిన చోట తాపి (లేక ఇతర పనిముట్టు) ఒకటి ఉంచవలెను.*

*ఇతర కట్టడములకు పునాది తీయునప్పుడు ఈ దిగువ క్రమము అనుసరింప వచ్చును. (1)కీర్తన, (2) తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్. (3) సంకీర్తనము 127, (4) ఈ కట్టడములో కుటుంబ ప్రార్థన చేయుటకు నిశ్చయించుకొనిన స్థలమున ఏర్పరచబడిన వారివల్ల పలుగు లేక ఇతర పనిముట్టుతో పునాదితీయుట, (5) ఈ క్రమములో వ్రాయబడిన ప్రార్థన, (6) ప్రభువు ప్రార్థన, (7) ఆశీర్వాదము.*

షరా:– ఇతర అన్యాచారము లుండరాదు. దేవుని కృతజ్ఞత కానుకలు అర్పించవచ్చును.

ఈ క్రమము జరిపించుటకు ఏర్పరుచుకొనిన స్థలమున అందరు కూడుచున్న తరువాత ఈ క్రమము జరిపించు బోధకుడు వేదికముందు నిలువబడి చెప్పవలసినది:

బోధకుడు:– తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున.

సభ:– ఆమేన్.

బో:– ఓ ప్రభువా! నా పెదవులను తెరువుము.

సభ:– అప్పుడు నా నోరు నీ స్తోత్రమును బయలుపరచును.

బో:– ఓ దేవా! నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము.

సభ:– ఓ ప్రభువా! నా సహాయమునకు త్వరగా రమ్ము.

బో:– ప్రభువు నామము వలననే మనకు సహాయము కలుగు చున్నది.

సభ:– భూమి ఆకాశములను సృజించిన వాడు ఆయనే.

బో:– యెహోవా ఇల్లు కట్టించని యెడల

సభ:– దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే.

బో:– నీ మందిరములో నివసించువారు ధన్యులు.

సభ:– వారు నిత్యము నిన్ను సుతించుచుందురు.

బో:– తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును,

సభ:– ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగము లందుండునట్లు మహిమ కలుగునుగాక! ఆమేన్.

*అంతట ఉత్తర ప్రత్యుత్తర రీతిగా సంకీర్తనము 100 లేక 122 చదువ వలెను. త్రేకుని మహిమ చెప్పవలెను.*

*అంతట ఈ దిగువ పాఠములలో ఏదైన ఒక దానిని చదువవలెను:*

నిర్గమ 3:1–6; 2సమూ 24:18–25; లూకా 6:47–49.

*అంతట ఒక క్లుప్త ప్రసంగము చేయవచ్చును.*

*అంతట బోధకుడు చెప్పవలసినది:*

బో:– ప్రభువా! మమ్ము కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా! మమ్మును కనికరింపుము.

## ప్రభువు ప్రార్థన

*అంతట బోధకుడు చెప్పవలసినది:*

బో:- ప్రభువు మీతో నుండుగాక.

సభ:- మీ ఆత్మతో నుండుగాక.

బో:- ప్రార్థింతము.

సర్వశక్తిగల ప్రభుడవగు దేవా! ఈ స్థలమును నీవు అంగీకరింపుము. ఇక్కడ నీకు ఆరాధనయు, కృతజ్ఞతాస్తుతులును, నీ పరిశుద్ధ నామముయొక్క స్తోత్రములును బయలుదేరునట్లు నీవు ఆకాశమునుండి నేలమీద మంచును కురిపించునట్లు ఈ స్థలము మీద నీ దీవెనను కురిపింపుము. ఇక్కడ నీ వాక్యము ప్రకటింపబడు గాక. ఇక్కడ నీ మందిరము కట్టబడుగాక. ఈ స్థలము మీదను, ఇక్కడ నిన్ను ఆరాధించుటకును, ప్రార్థించుటకును వచ్చు వారందరి మీదను నీ దీవెనలను ఎల్లప్పుడు కుమ్మరింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తు పేరిట నిన్ను ప్రార్థించి వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట బోధకుడు పలుగు (లేక ఇతర పనిముట్టును) తీసి కొని పునాదితీయు స్థలమునకు పోవలెను. ఈ దిగువనుండు త్రేక దేవుని ప్రార్థనయు, విజ్ఞాపన ప్రార్థనయు చేయవలెను. త్రేక దేవుని ప్రార్థనతో పై నామములు చెప్పునప్పుడు పనిముట్టుతో పునాది తీయవలెను.*

తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆయన మహిమకు, యేసుక్రీస్తు యందలి విశ్వాసము ద్వారా ఈ పని ఆరంభింపబడెను.

ఆమేన్.

ఓ దేవా! నిజమైన విశ్వాసమును నీ యందలి భయమును సహోదర ప్రేమయు ఈ స్థలమునందు వర్ధిల్ల ననుగ్రహింపుము. ఇది ప్రార్థనలకును త్రేక దేవుని మహిమకును ఆరాధనకును శాశ్వతముగా నుండుటకు దీనకి నీ కృప ననుగ్రహింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

అంతట సహాయము చేయు పాస్టర్లలోను, సంఘోద్యోగస్థు లలోను, సభికులలోను, ప్రతివారు మూడు పర్యాయములు ఆ పని ముట్టుతో మట్టిత్రవ్వి ఆ స్థలము మీద వేయవచ్చును. ఆలాగు చేయుచుండగా 'తండ్రి యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ఆమేన్' అని చెప్పవచ్చును.

*అంతట బోధకుడు ఈ దిగువ ప్రార్థన చేయవచ్చును:*

ఓ దేవా! మంచి కార్యములన్నియు నీ వలననే ఆరంభించ బడుచున్నవి. నీ వలననే వాటికి ఎక్కువ దీవెనలు కలిగి సమృద్ధి నొందుచున్నవి. నీనామ ఘనత కొరకు నా బీద సేవకులమైన మేము పూనుకొనిన ఈ పనిని జరిగించుటకు, తండ్రీ! నీ జ్ఞానమును మాకు దయచేసి దీనిని ముగింప ననుగ్రహింపుమని, మా ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

*ఇతర కట్టడములకు ఈ దిగువ ప్రార్థన చేయవలెను.*

ఓ మా తండ్రివైన దేవా! నీ దయవలన...........వారి కుటుంబమునకు ఒక గృహమును కట్టుకొనుటకు ఈ స్థలమును అనుగ్రహించిన ఈ పనిని కొనసాగించి ముగించ ననుగ్రహింపుము. దీనిని కట్టుచుండగా ఏ హాని, అపాయములు రాకుండునట్లు కాపాడుము. కట్టనైయున్న ఈ గృహమందు, కుటుంబ ప్రార్థనలు జరుగునట్లనుగ్రహింపుము. ఇందులో నివసించు వారిని కాపాడి సంరక్షింపుము. ఈ యిల్లు పరదేశులకును అవసరములో నున్న వారికిని ఆశ్రయ స్థానముగా నుండ అనుగ్రహింపుమని మా ప్రభువైన యేసుక్రీస్తు పేరిట వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట బోధకుడు చెప్పవలసినది:*

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగుగాక.

*అంతట బోధకుడు సభను ఈ దిగువ రీదిని ఆశీర్వదించవలెను.*

తండ్రి కుమార పరిశుద్ధాత్మ యను దేవుని దీవెన ఎల్లప్పుడు మీతో నుండుగాక.

సభ:– ఆమేన్.

## దేవాలయ మూలరాతి

## స్థాపన క్రమము

*ఆరాధన ఒక కీర్తనతో ఆరంభించవలెను.*

*అంతట గురువు చెప్పవలసినది:*

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

*అంతట చెప్పవలసినది లేక పాడవలసినది:*

బో:– ప్రభువు నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది.

సభ:– భూమ్యాకాశములు సృజించినవాడు ఆయనే.

బో:– సైన్యముల కధిపతివగు ప్రభువా, నీ నివాసములు ఎంత రమ్యములు.

సభ:– యెహోవా ఆవరణములను చూడవలెనని నా ప్రాణము ఎంతో ఆశపడుచున్నది. అది సొమ్మసిల్లుచున్నది.

బో:– ఆయన (పట్టణపు) పునాది పరుశుద్ధ పర్వతములమీదను యున్నది.

సభ:– యాకోబు నివాసములన్నిటికంటె సీయోను గుమ్మములు యెహోవాకు ప్రియములై యున్నవి.

బో:– యెహోవా మందిరమునకు వెళ్లుదుమని జనులు నాతో ననినప్పుడు నేను సంతోషించితిని.

సభ:– యెరూషలేమా! మా పాదములు నీ గుమ్మములలో నిలుచు చున్నవి.

బో:– యెహోవా ఇల్లు కట్టింపని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే.

సభ:– యెహోవా పట్టణమును కాపాడని యెడల దాని కావలి కాయువారు మేలుకొనియుండుట వ్యర్థమే.

బో:– తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును,

సభ:– ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగములందునట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

*అంతట గురువు చెప్పవలసినది:*

**పరిశుద్ధ లేఖనము వినుడి**

ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు. సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి, అమూల్యమైన తలరాయి, బహుస్థిర మయిన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు. -యెషయా 28:16.

శిల్పకారులు యెహోవా మందిరముయొక్క పునాదిని వేయు చుండగా ఇశ్రాయేలు రాజైన దావీదు నిర్ణయించిన విధిచొప్పున తమ వస్త్రములు ధరించుకొనినవారై యాజకులు బాకాలతోను, ఆసాపు వంశస్థులగు లేవీయులు చేయు తాళములతోను నిలువబడి యెహోవాను స్తోత్రము చేసిరి. వీరు వంతు చొప్పున కూడి - యెహోవా దయాళుడు. ఇశ్రాయేలీయుల విషయమై ఆయన కృప నరంతరము నిలుచునని పాడుచు యెహోవాను స్తుతించిరి. మరియు యెహోవా మందిరము యొక్క పునాది వేయబడుట చూచి జనులందరును గొప్ప శబ్ధముతో యెహోవాకు స్తోత్రము చేసిరి.

-ఎజ్రా3:10,11

కాబట్టి మీరిక మీదట పరజనులు పరదేశులునై యుండక పరిశుద్ధులతో ఏక పట్టణస్థులును దేవుని యింటి వారునై యున్నారు. క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి ప్రభువునందు పరిశుద్ధ మైన దేవాలయ మగుటకు వృద్ధి పొందుచున్నది. ఆయనలో మీరు కూడ ఆత్మమూలముగా దేవునికి నివాసస్థలమై యుండుటకు కట్ట బడుచున్నారు.
-ఎఫెసీ 2:19-22.

*అంతట అందరు అపొస్తలుల విశ్వాస ప్రమాణము నొప్పుకొనవలెను:*

## అపొస్తలుల విశ్వాస ప్రమాణము

భూమ్యాకాశములను సృజించిన సర్వశక్తిగల తండ్రివైన దేవుని నేను నమ్ముచున్నాను.

ఆయన ఏకకుమారుడును మన ప్రభువునైన యేసుక్రీస్తును నమ్ముచున్నాను. ఈయన పరిశుద్ధాత్మవలన గర్భమున ధరింపబడి కన్యయైన మరియకు పుట్టి పొంతి పిలాతు అధికారము క్రింద శ్రమ పడి సిలువవేయబడి చనిపోయి సమాధి

చేయబడెననియు, అదృశ్య లోకములోనికి దిగెననియు, చనిపోయిన వారిలోనుండి మూడవ దినమునలేచి పరలోకమున కెక్కి సర్వ శక్తిగల తండ్రియగు దేవుని కుడిచేతివైపున కూర్చుండి యున్నాడనియు, సజీవులకును, మృతులకును, తీర్పుచేయుటకు అక్కడ నుండి వచ్చుననియు నమ్ముచున్నాము.

పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. పరిశుద్ధ క్రైస్తవ సంఘమగు పరిశుద్ధుల సహవాసమును, పాప క్షమాపణయు, శరీర పునరుత్థా నమును, నిత్యజీవమును ఉన్నవని నమ్ముచున్నాను, ఆమేన్.

*అంతట ఒక ప్రసంగము చేయవచ్చును. తరువాత నొక కీర్తన పాడవచ్చును.*

*ఇక్కడ మూల రాతియందుంచబడు వస్తువుల జాబితా చదువవచ్చును.*

*అంతట గురువు ఇట్లు చెప్పవలెను:*

బో:– ప్రభువు మీతో నుండుగాక

సభ:– మీ ఆత్మతో నుండుగాక.

## ప్రార్థింతము

ఓ ప్రభువైన దేవా! పరలోకపు తండ్రీ! నిన్ను ఆకాశములు పట్టజాలవు; అయినను నీ నామమునకు ప్రార్థనాస్తుతులు నిత్యము చెల్లింపబడుటకై భూమిమీద నొక మందిరముండుట నీ చిత్తమై యున్నది. కరుణా కటాక్షములుగల నీ దృష్టిని ఈ స్థలముమీద నిలుపుము. నీ కొరకొక యారాధన మందిరమును కట్టుటకు పూర్వము నీ జనులను ప్రేరేపించినట్లు నీ నామమున మే మారంభించిన దానిని ఆశీర్వదించి వర్ధిల్లచేసి మా హృదయాభిలాషను నెరవేర్చుమని నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువైన యేసుక్రీస్తూ! సజీవ దేవపుత్రుడా! నీవు ఏర్పరుప బడిన వాడవును, అమూల్యమైన మూల రాతివిని, సంఘమునకు మార్పుజెందని పునాదివియునై యున్నావు. మేము ఇచ్చుట నీ నామమున వేయు రాయి స్థిరమైన పునాదిగా నుండ జేయుము. మరియు ఓప్రభువా! నీవే ఆదియు అంతమును అయి యున్నావు గనుక నీ ఘనతా మహిమల నిమిత్తమై మే మిచ్చట నారంభించిన దానికిని ఆదివై కొనసాగించి తుద ముట్టింపుమని నిన్ను ప్రార్థించు చున్నాము, ఆమేన్.

ఓ ప్రభువైన పరిశుద్ధాత్మవగు దేవా! నీవు నీ పరిశుద్ధుల సమాజమును నీ నివాస స్థానముగా చేసికొనియున్నావు. ఈ మందిర నిర్మాణము నాశీర్వదించి దీనిని వర్ధిల్లచేసి ఆ రీతినే మేమును సజీవ రాళ్ళమై ఆత్మీయ గృహముగాను తండ్రితోను, కుమారునితోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

*మూలరాతిని దాని స్థానమున కుదిర్చిన వెనుక గురువు త్రైకత్వ ములోని ప్రతి నామము నుచ్చరించు నపుడెల్ల తాపితోగాని సుత్తెతో గాని కొట్టుచు ఈలాగున చెప్పవలెను:*

యేసుక్రీస్తు విశ్వాసమునందు తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున నే నిప్పుడీ మూల రాతిని స్థాపించుచున్నాను. ఇచ్చట సత్య విశ్వాసమును, దైవ భయమును సహోదర ప్రేమయు నిలిచి యుండుగాక. ఈ స్థలము సువార్త బోధకును, ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు మన ప్రభువైన యేసుక్రీస్తు నామాహ్వాన స్తుతుల కొరకును ప్రత్యేక పరచబడును గాక, ఆమేన్.

*అంతట సభ పాడవలెను లేదా చెప్పవలెను.*

ఆమేన్! ఆమేన్!! ఆమేన్!!!

*అంతట అందరుకలిసి ప్రభువు ప్రార్థన చెప్పవలసినది:*

**ప్రభువు ప్రార్థన**

*అంతట ఒక కీర్తన పాడవలయును.*

*అంతట గురువు చెప్పవలసినది:*

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ ఆత్మతో నుండుగాక.

బో:– మనము ప్రభువును సన్నుతింతము.

సభ:– దేవునికి స్తోత్రము కలుగుగాక.

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీ యందరికి తోడై యుండుగాక, ఆమేన్.

# కళాశాల, వేదశాస్త్ర పాఠశాల, వైద్యశాల, మొదలగు గృహముల మూలరాతి స్థాపనారాధన క్రమము

*దైవారాధన జరుపుటకు ఏర్పరచబడిన స్థలము నిర్ణీత కాలమున సమావేశము కాగా, కార్యనిర్వాహకాధ్యక్షుడు సంఘమును వరుసయందు నడిపించుచు, గృహము కట్టవలసిన స్థలమున చేరెదరు. అంతట సమాజ మంతయుగాని, నియమించబడిన గాయక వర్గముగాని, ఒక అనుకూలమైన కీర్తన పాడెదరు.*

## కీర్తన

*అంతట ఈ దిగువరీతిగా ఆరాధన జరుగును.*

బో:– తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

బో:– ప్రభువు నామము వలననే మనకు సహాయము కలుగు చున్నది.

సభ:– భూమ్యాకాశములు సృజించినవాడు ఆయనే.

## ప్రార్థింతము

### (వేదపాఠశాల కొరకు)

సర్వశక్తిగల దేవా! మా పరలోకపు తండ్రీ! నీవు దయతో నీ రజ్యమును కాపాడుచు భూమియందు దానిని వ్యాపింపజేయు చున్నావు. నీవు పరిశుద్ధ సంఘమును స్థాపించి దానియందు సేవ చేయుటకై, బోధకులను, ఉపదేశకులను, తర్ఫీదు చేయ ననుగ్రహించి యున్నావు. నీ సంఘమునందు కాపరులుగను, నాయకులుగను, నిన్ను సేవించువారికి తగిన ఉపదేశము నిచ్చుటకై మేము కట్ట నుద్దేశించుచున్న ఈ గృహముపై నీ దృష్టి నలుపుమని నిన్ను వేడుకొనుచున్నాము. మేము నీ నామమున ఆరంభించి, మాకు కీర్తి కలుగవలెనని కాక, కేవలము నీ మహిమార్థమే కొనసాగింప నుద్దేశించుచున్న ఈ పనిని వర్థిల్ల జేయుము. ఇహ సంబంధమైన ఈ గృహము పూర్తిచేయుట మాత్రముకాక మేమిక్కడ చేయదలచిన ఆత్మ సంబంధమైన ఏర్పాటులన్నిటిని నెరవేర్చునట్లు మాకు తోడ్పడుము. మా చేతి పనిని స్థిరపరచి అది నిరంతరము సరియైనదిగను నీ పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదిగను ఉండునట్లు అనుగ్రహించుమని సంఘమునకు శిరస్సును, మా ప్రియ ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## (కళాశాల లేక ఉన్నతపాఠశాల కొరకు)

కరుణామయుడా! సర్వజ్ఞుడా! మా పరలోకపు తండ్రీ! మా యందు నీకుగల మహా వాత్సల్యము నిమిత&తము మేము నీ పరిశుద్ధ నామమును స్తుతించి కొనియాడుచున్నాము. నీ యావరణమందలి గొఱ్ఱెలను పోలిన మాకు అగత్యమైన మేళ్ళనన్నిటిని దయతే అనుగ్ర హించుచున్నావు. మా యౌవన కాలములో మేము జ్ఞానము సంపా దించుకొనవలెనని నీవు కోరుచున్నావు. ఉన్నత విద్య గరవు నిమిత్తమై మేము నిర్మించబోవు ఈ గృహముపై నీ కరుణ చూపుము. యెహోవాయందలి భయము జ్ఞానమునకు మూలమని మేము ఒప్పుకొను చున్నాము. లౌకిక విధ్యమాత్రమే కాక, ఆత్మీయ జ్ఞానమును సరియైన రీతిని వికసింప జేయవలెనని కోరుచున్నాము. ఈ గృహమును కట్టుటకును, ఆత్మీయములైన మా ఏర్పాటులను కొనసాగించుటకును మాకు సహాయము చేయుము. మా చేతిపనిని స్థిరపరచి అది నిరంతరము సరియైనదిగను నీ పరిపూర్ణాంగీ కారమునకు యోగ్యమైనదిగను ఉండు నట్లనుగ్రహింపుమని మా ప్రభువును, రక్షకుడునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

## (వైద్యశాల కొరకు)

దయాదాక్షిణ్యముల కాస్పదుడవును కృపా సంపూర్ణుడవునైన మా తండ్రీ! మా శరీరమునకు ఆత్మకును కావలసిన వానిని గూర్చి నీవు ఎల్లప్పుడు చింతనచేయుచునే యుందువు. మానవులమైన మా యందరియెడల నీకుగల కరుణావాత్సల్యతనుబట్టి నిన్ను స్తుతించు చున్నాము. నీ కుమారుడైన మా ప్రభువు ఇహమందు జన్మించినప్పుఇు దివ్య ప్రభావముతోను, వర్ణింప శక్యముగాని ప్రేమతో, రోగులకు బాధితులకు పరిచర్య చేసియున్నాడు. వ్యాధులను కుదుర్చుచు మేలు చేయుచు దేశసంచారము చేసెను. వాస్తవమైన క్రైస్తవ ప్రేమతో రోగుల కిచట పరిచర్యయు సంరక్షణయు చేకూరునట్లు ఆయన నామమున ఆయన మహిమకొరకు మేము ఒక శరణాలయము నిర్మించుట కుద్దేశించుచున్నాము. నీ చిత్తమైతే మేము దీనిని జయకరముగా సాగించి ముగించునట్లు మమ్ము నడిపించుము. క్రీస్తు ప్రేమను గూర్చి సాక్ష్యమిచ్చు గృహముగ దీనిని నిలువబెట్టుము. ఇచ్చట ఆరంభమైన ఈ కార్యమువలన నిరంతరము నీ జనుల కుపకారము కలుగునట్లు దయచేయుమని నీ కుమారుడును మా మధ్యవర్తియు విమోచకుడునైన యేసుక్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట సమయానుకూలమైన ఒక వేదపాఠము చదువబడును. (దా.కీర్తన 25,37; ఎజ్రా 3:10,11; 1కొరింథీ 3:9-23) మొదలైనవి వాడవచ్చును.*

*అంతట బోధకుడు ఇట్లు చెప్పవలెను:*

బో:- ఓ ప్రభువా, నీ సత్యమువలన మమ్మును ప్రతిష్ఠించుము, నీ వాక్యమే సత్యము.

*అంతట మరియొక కీర్తన పాడిన తరువాత బోధకుడును సంఘమును మూలరాతి చుట్టు నిలువబడగా కార్యనిర్వాహక బోధకుడు వానిలో నుంచబడిన వస్తువుల పేర్ల నుదహరించి తిరిగి రాతిని అమర్చి ఇట్లు చెప్పవలెను.*

యెహోవా ఇల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే.

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

సర్వశక్తిగల దేవుని సేవార్థము ఇచట కట్టబడబోవు....అను ఈ భవనమునకు ఇవాంజెలికల్ లూథరన్ సంఘపు ఒప్పుదలల ననుసరించి తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున మూలరాతిని స్థాపించుచున్నాను.

వేయిబడినది తప్ప మరియొక పునాది ఎవరును వేయనేరరు ఈ పునాది యేసుక్రీస్తే. ఆయన అందరిపైన దేవుడైయున్నాడు. ఆయనకు నిరంతరము స్తోత్రము కలుగునుగాక. ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా ఆయన కృపా మహదైశ్వర్యమును బట్టి మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది.

*అంతట బోధకుడును సంఘమును కలిసి విశ్వాస ప్రమాణము నొప్పుకొనవజలెను.*

**విశ్వాస ప్రమాణము**

*అంతట అందరునుకలిసి త్రియేకునికి మహిమ చెప్పవలెను. తండ్రికిని కుమారునికి పరిశుద్ధాత్మకును యుగాయుగములందుండు నట్లు మహిమ కలుగును గాక, ఆమేన్.*

*అంతట తగిన కీర్తన పాడవలెను. పిమ్మట ప్రభువు ప్రార్థన, దీవెన చెప్పవలెను.*

**కీర్తన**

**ప్రభువు ప్రార్థన**

**దీవెన**

# ఆలయ ప్రతిష్ఠ క్రమము

*గురువులును సంఘమును తగిన స్థలమునుకూడి పరిశుద్ధ బైబిలు, సంస్కార పాత్రలు తీసికొని దేవాలయపు ద్వారము నొద్దకు పంక్తులు దీరి వరుసగా వెళ్ళవలెను.*

*వరుసగ నడుచుచున్నప్పుడు ఆ సమయమునకు తగిన ఒక కీర్తన పాడవలెను.*

*ఏ కారణము చేతనైనను పంక్తులు తీరి వరుసగా వెళ్ళ వీలు లేనప్పుడు గురువులును, సంఘపంచాయతీయును, సంగీతపాటకులును, గుడిలోగాని దేవాలయపు గుమ్మము యొద్దగాని సమకూడవలెను. అప్పుడు 24వ సంకీర్తనము మినహాయించి ఈ దిగువ ఆరాధన క్రమమును వాడవలయును.*

*తలుపు నొద్దకు రాగానే గురువు చెప్పవలసినది:*

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

*అప్పుడు గురువు చెప్పవలసినది:*

బో:- ప్రభువు నామమువలననే మనకు సహాయము కలుగుచున్నది.

సభ:- భూమ్యాకాశములను సృజించినవాడు ఆయనే.

*ఈ దిగువ సంకీర్తనము పాడవలయును, లేక చెప్పవలయును.*

**24వ సంకీర్తనము**

భూమియు దాని సంపూర్ణతయు:

లోకమును దాని నివాసులును యెహోవావే.

ఆయన సముద్రముమీద దానికి పునాది వేసెను:

ప్రవాహ జలములమీద దాని స్థిరపరచెను.

యెహోవా పర్వతమునకు ఎక్కి దిగిన వాడెవడు?

ఆయన పరిశుద్ధ స్థలములో నిలువ దగిన వాడెవడు?

వ్యర్థమైన దానియందు మనస్సు పెట్టకయు, కపటముగా ప్రమాణము చేయకయు:

నిర్దోషమైన చేతులును శుద్ధమైన హృదయమును కలిగి యుండువాడే.

వాడు యెహోవా వలన ఆశీర్వాదము నొందును:

తన రక్షకుడైన దేవునివలన నీతిమత్వము నొందును.

ఆయన నాశ్రయించువాడు:

యాకోబు దేవా, నీ సన్నిధిని వెదుకువారు అట్టివారే.

గుమ్మములారా, మీ తలలు పై కెత్తుకొనుడి:

మహిమగలరాజు ప్రవేశించునట్లు పురాతనమైన తలుపులారా, మిమ్మును, లేవనెత్తుకొనుడి.

మహిమగల ఈ రాజు ఎవడు:

బలశౌర్యములు గల యెహోవా, యుద్ధశూరుడైన యెహోవా.

గుమ్మములారా, మీ తలలు పైకెత్తుకొనుడి:

పురాతనమైన తలుపులారా, మహిమగల రాజు ప్రవేశించు నట్లు మిమ్మును లేవనెత్తుకొనుడి.

తండ్రికిని కుమారునికిని పరిశుద్ధాత్మకును:

ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగము లందుండు నట్లు మహిమ కలుగుగాక, ఆమేన్.

అప్పుడు దేవాలయపు తాళపు చెపవుపలు గురువునకు అప్పగించవలెను.

*గురువు ద్వారములో ప్రవేశించుచుండగా తాను చెప్పవలసినది.*

బో:– ఈ ఇంటికి సమాధానము కలుగుగాక:

సభ:– దీనియందు ప్రవేశించువారందరికిని కలుగునుగాక.

*అప్పుడు దేవాలయములోనికి మెల్లగా నడచుచు ఈ దిగువ సంకీర్తన మును పాడవలెను, లేక చెప్పవలెను.*

**122వ సంకీర్తనము**

యెహోవా మందిరమునకు వెళ్ళుదమని:

జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని.

యెరూషలేమా, మా పాదములు నీ గుమ్మములో నిలుచుచున్నవి.

యెరూషలేమా, బాగుగా కట్టబడిన పట్టణమువలె నీవు కట్టబడి యున్నావు.

ఇశ్రాయేలీయులకు నియమించబడిన శాసనమును బట్టి యెహోవా నామమునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుటకై:

వారి గోత్రములు, యెహోవా గోత్రములు అక్కడికి ఎక్కి వెళ్ళును:

అచ్చట న్యాయము తీర్చుటకై సింహాసనములు:

దావీదు వంశాయుల సింహాసనములు స్థాపింపబడియున్నవి.

యెరూషలేనుయొక్క క్షేమము కొరకు ప్రార్ధన చేయుడి:

యెరూషలేమా, నిన్ను ప్రేమించువారు వర్ధిల్లుదురు.

నీప్రాకారములలో నెమ్మది కలుగునుగాక.

నీ నగరులలో క్షేమముండునుగాక.

నా సహోదరుల నిమిత్తమును నా సహవాసుల నిమిత్తమును:

నీకు క్షేమము కలుగునుగాక అని నేనందును.

మన దేవుడైన యెహోవా మందిరము నిమిత్తము:

నీకు మేలు చేయ ప్రయత్నించెదను.

తండ్రికిని కుమారునికి పరిశుద్ధాత్మకును:

ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు యుగయుగము లందుండు నట్లు మహిమ కలుగుగాక, ఆమేన్.

గర్భాలయమున ప్రవేశించి గురువులు పరిశుద్ధ బైబిలును సంస్కార పాత్రలను వాని వాని స్థానములయందుంచవలెను.

**కీర్తన**

*అప్పుడు కార్యనిర్వాహక గురువు పీఠము నొద్దకు వెళ్ళి చెప్పవలసిన దేమనిన:*

నేను దేవుని బలిపీఠమునొద్దకు, నాకు ఆనంద సంతోషములు గలిగించు దేవునియొద్దకు చేరుదును. ఓ దేవా! నా దేవా! నీ వెలుగును నీ సత్యమును బయలుదేరజేయుము. అవి నాకు త్రోవచూపును; అవి నీ పరిశుద్ధ పర్వతమునకు, నీ నివాస స్థలమున కును నన్ను తోడుకొని వచ్చును. అప్పుడు దేవుని బలిపీఠము నొద్దకు, నాకు ఆనంద సంతోషములు కలుగజేయు దేవుని యొద్దకు చేరి నిన్ను స్తుతించెదను.

**పాఠములు**

1రాజులు 8:12-30; హెబ్రీ 10:19-25;
ఎఫెసీ 2:13-22; 1కొరింథీ 3:9-17

*లేక, సమయమునకు తగిన ఇతర పాఠమల పరిశద్ధ గ్రంథములో నుండి చదువ వచ్చును.*

*అంతట గురువు వేదికయొద్ద నిలువబడి చెప్పవలసిన దేమనిన:*

**ప్రార్థింతుము**

*ఈ క్రిందటి ప్రార్థనలో ప్రతిభాగము ముగించిన పిమ్మట సంఘము చెప్పవలసినది:*

దయగల ప్రభువా, మా ప్రార్థన ఆలకించుము.

సర్వశక్తిగల దేవా! కనికరము గల తండ్రీ! యథార్థముగా నిన్ను పిలుచువారందరికి సమీపముగానుండు ఆదరణకర్తవై యున్నావు. నీ కుమారుడైన యేసుక్రీస్తుద్వారా చేసిన వాగ్దత్తమునుబట్టి ఈ ఆలయమును నీ విశేష సాన్నిధ్యము చేత పరిశుద్ధపరచి దీవించుము. నీ నామమున ఇక్కడ కూడు కొనువారు అనేకములైన నీ కృపావరములచేత వెలిగించబడి ఆదరింపబడి బలపరచబడు నట్లును, తేజస్సునందు జీవించుచున్న నీ పరిశుద్ధులకు నీవు దయచేయు స్వాస్థ్యములో పాలుపొందుటకు తగినవారగు నట్లను గ్రహింపుమని నిన్ను వేడుకొనుచున్నాము.

ఓ ప్రభువైన యేసుక్రీస్తూ, ప్రధాన యాజకుడా! మా కొరకు దేవుని యెదుట ఎల్లప్పుడు విజ్ఞాపను చేయునట్లు మహోన్నతమైన పరిశుద్ధాలయములో నీవు ప్రవేశించి యున్నావు. ఇచ్చట నీ కొరకు నమ్మకమైనట్టియు, విశ్వాసము కలిగినట్టియు పరిశుద్ధ యాజక జనాంగమును ప్రత్యేకించి, వారు ఈ ఆవరణలో నీకు ప్రార్థన, స్తోత్రము, కృతజ్ఞతాస్తుతులు అను బలులు చెల్లించునట్లు అను గ్రహింపుము.

ఓ పరిశుద్ధాత్మా! నీవు విశ్వాసులందరు ఏక చిత్తమును కలిగియుండునట్లు

నడిపించువాడవు. ఇక్కడ ఆరాధించువారిలో ప్రవేశించి విశ్వాసముతో ప్రేమతో అన్ని జనాంగములలో సువార్త వ్యాపింపజేయవలసిన సహృదయము ననుగ్రహించుము.

ఓ తండ్రీ! కుమారుడా! పరిశుద్ధాత్మా! సమస్తము నీ వలనను, నీ ద్వారాను, నీ కొరకును కలుగుచున్నవి. నీ నామ మహిమార్థము కట్టబడియున్న ఈ యింటిమీద దివారాత్రులు నీ దృష్టినుంచుమని నీ సేవకులు ఈ దినమున నీకు చేయు ప్రార్థనల యెడల లక్ష్యముంచుము. నిన్ను నమ్మువారందరికి సంతోషమును, క్షేమాభి వృద్ధియు, పాప భారముతోనున్న యాత్మలకు విడుదలయు కలుగునట్లు నీ పవిత్ర వాక్య మిచట ఎల్లప్పుడు ప్రకటింపబడున ట్లనుగ్రహింపుము.

దేవా! ఈ బాప్తిస్మనిపానము (తొట్టి) యొద్ద బాప్తిస్మము నొందు వారు తాము చేయు యొడంబడికయందు నిలిచియుండు నట్లును, నూతన జీవము పొందినవారై నడుచుకొను నట్లును అనుగ్రహింపుము. వారు నీ సంఘముయొక్క సహవాసమునందు స్థిరముగా నుండునట్లును నీ ఆలయమును పవిత్రముగా నుంచునట్లు కృప దయచేయుము.

ఓ ప్రభువా! విమోచనకొరకియ్యబడిన నీ శరీర రక్తములలో పాలుపుచ్చుకొను సంస్కారమును ఈ వేదికయొద్ద ఆచరించు వారందరు పాపక్షమాపణ, జీవమును రక్షణను పొందునట్లు అనుగ్రహింపుము.

ఓ నిత్యుడవైన దేవా! తండ్రీ! కుమారా! పరిశుద్ధాత్మా! ఇక్కడ ఆరాధించు నీ సేవకులు తమ ఇహలోక యాత్ర ముగిసినప్పుడు నీ పరిశుద్ధ గృహంలో ప్రవేశించి అక్కడ నీ మహిమను చూచి, ఏక దేవుడవై యుయుగములు పాలించు నిన్ను ఆరాధించి స్తుతించునట్లు భాగ్యం వారి కనుగ్రహించుము, ఆమేన్.

*అప్పుడు గురువు చెప్పవలసినది:*

.........ఆలయము అను ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘముయొక్క ఈ కట్టడమును తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున దేవుని గృహముగా ప్రత్యేకపరచి, సర్వశక్తిగల దేవుని ఘనతా మహిమల నిమిత్తమును, ఆయన పరిశుద్ధ సంఘముయొక్క ఆరాధన నిమిత్తమును ప్రతిష్ఠించు చున్నాను.

*సంఘము పాడవలసినది లేక చెప్పవలసినది:*

ఆమేన్.

అప్పుడు ఆ దినమునకైన ప్రారంభగీతముతో ముఖ్యారాధన క్రమము నారంభింపవలెను. ఆ దినముకొరకు ఏర్పర్చబడిన పాఠములు లోపించవచ్చును. ఇప్పుడు నికేయ విశ్వాసప్రమాణము వాడవలెను. ప్రభు రాత్రి భోజన సంస్కారము ఆచరించవచ్చును. లేక ఒక ప్రత్యేకమైన ఆరాధన ఆచరించవచ్చును.

కట్టడమునకు సంబంధించి యిచ్చిన కానుకలు, జ్ఞాపక సూచకములు మొదలైనవానిని గురించి ముఖ్య ప్రార్థన తరువాత తెలియజేయవలెను.

# వైద్యశాల లేక కనికరయుత కార్య గృహముయొక్క ప్రతిష్ఠ కార్యక్రమము

*ఈ గృహమునందు పని యారంభింపక పూర్వము ఈ ప్రతిష్ఠారాధన ఆ కట్టడములోనే జరుపవలెను.*

*సినాడు అధ్యక్షుని వలనగాని, ఆయనచే నియమింపబడిన అభిషిక్తుడైన మరియొక గురువువలనగాని యీ యారాధన జరుపబడును.*

*అందరు నిలువబడి సంయోచితమైన కీర్తన పాడెదరు.*

## కీర్తన

*అంతట కార్యనిర్వాహక బోధకుడు చెప్పునది:*

బో:– తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున,

సభ:– ఆమేన్.

బో:– ప్రభువు నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది.

సభ:– భూమ్యాకాశములను సృజించిన వాడు ఆయనే.

బో:– మన ప్రభువైన క్రీస్తు చెప్పిన దేమనగా: "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా! నా యొద్దకురండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును."

సభ:– నేను సాత్వీకుడను, దీనమనస్సుగలవాడను, కనుక మీరు నాకాడి ఎత్తికొని నన్ను వెంబడించుడి; అప్పుడు మీ ప్రాణము నకు విశ్రాంతి దొరకును.

బో:– సాయంకాలమైనప్పుడు జనులు దయ్యములు పట్టిన అనేకులను ఆయనయొద్దకు తీసుకొని వచ్చిరి. ఆయన మాటలవలన దయ్యములను వెళ్ళగొట్టి రోగులను స్వస్థపరచెను.

సభ:– అందువలన ఆయనే మన బలహీనతలను వహించి, మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయాద్వారా చెప్పబడినది నెరవేరెను.

బో:– ప్రభువు తనకు యాథార్థముగా మొరపెట్టువారికందరికీ సమీపముగా నున్నాడు.

సభ:– ఆయన యెడల భయభక్తులుగల వారి మొరవిని వారిని రక్షించును.

బో:– ప్రభువు మీతో నుండుగాక.

సభ:– మీ యాత్మతో నుండుగాక.

## ప్రార్థింతము

ఓ ప్రభువైన దేవా! కృపాకనికరములుగల మా పరలోకపు తండ్రీ మా రోగములన్నిటిని కుదుర్చుచు కష్టములలోనుండు మమ్ముల నాదరించుచున్నావు. దురవస్థయందు బాధనొందు నీ బిడ్డలకు దయతో పరిచర్య చేయు నిమిత్తము వారిని మా కప్పగించుచున్నావు. కనుక మేము నిర్మించిన ఈ కట్టడమును దయతో నంగీకరించి ఇది నీ నామఘనత కొరకును రోగపీడితుల విశ్రాంతి కొరకును పరిచర్య చేయు గృహముగ నుండునట్లు దీవించుము. శరీరాత్మీయ రుగ్మతలను కుదుర్చుటకై చేయబడు పనులన్నిటిపైన నీ యాశీర్వాదముంచి కృతజ్ఞతతో నిన్ను సేవించునట్లు మాకు బలమును సంతోషమును అనుగ్రహించుమి మా ప్రభువును రక్షకుడునగు యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అంతట కార్యనిర్వాహక బోధకుడు చెప్పునది:*

దేవుని నామ మహిమకొరకును ప్రేమ పూర్ణమైన సేవ కొరకును స్వస్థత కలిగించు సంరక్షణకొరకును..........అను ఈ గృహమును తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ప్రతిష్ఠించుచున్నాము, ఆమేన్.

*ఈ గృహమునకు తేబడు వారందరి నిమిత్తము ప్రార్థింతము.*

ఓ దేవా! మా తండ్రీ! నీ కృప నిరంతరము నిలుచును. నీ ప్రేమతో చిరకాలము మమ్మును కాపాడుచున్నావు. ఈ గృహముపై నీ దృష్టి నిలిపి స్వస్థత నిమిత్త మిచటికి వచ్చువారందరికి శరీరారోగ్యము మాత్రమేగాక, ఆత్మరక్షణయు అనుగ్రహించుమని మా ప్రభువైన యేసు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

*ఇచ్చట పరిచర్య చేయువారందరి కొరకును ప్రార్థింతము.*

మిగుల కరుణగల మా తండ్రీ! ఇబ్బందులలో నున్న మా తోడి మానవులను ప్రేమతో ఆదరించుమని మాకు నేర్పియున్నావు. రోగులను కష్టములలోనున్న వారికి పరిచర్య చేయువారికిని, ముఖ్యముగా ఈ స్థలమందు చికిత్స చేయువారికి నీ కృప ననుగ్రహించి వారి పనులను వర్ధిల్ల జేయుము. పలు ప్రాంతములలో రోగులకు సేవచేయు సేవకులందరిపైన నీ కృపను చూపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

'మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరి' అని నీ కుమారుడైన యేసుక్రీస్తు చెప్పెను గనుక త్యాగముతో సేవచేయుటకై తమ్ముతాము సమర్పించు కొను మనస్సు వీరందరికి దయచేయుమని మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

*ఈ స్థలమందు మన తండ్రియైన దేవునికి మొరపెట్టు వారందరి కొరకు ప్రార్థింతము.*

సర్వశక్తిగల నిత్యదేవా! నీవు విచారగ్రస్థులను ఆదరించు వాడవును బలహీనులకు శక్తి నిచ్చువాడవునై యున్నావు. శ్రమయందుండి నీకు మొరపెట్టు వారి ప్రార్థనలు ఆలకించి వారు ఆదరన పొందునట్లు సహాయము చేయుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

బో:– తండ్రి కుమార పరిశుద్ధాత్మలను సర్వశక్తిగల దేవుని దీవెన ఈ గృహము మీదను దీనియందుండు వారందరి మీదను ఎల్లప్పుడు ఉండునుగాక, ఆమేన్.

*అంతట ఒక కీర్తన పాడిన తరువాత ఉపన్యాసము చేయవచ్చును.*

సభ మరియొక కీర్తన పాడిన తరువాత బోధకుడు నూతన నిబంధన ఆశీర్వాదము చెప్పవలెను.

బో:– ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికిని తోడైయుండును గాక,

సభ: – ఆమేన్.

# పాఠశాల విద్యార్థుల వసతి గృహముల ప్రతిష్ఠారాధన క్రమము

*పాఠశాల భవనమునందుగాని, లేక తత్సమీపమున ఆలయమున్నయెడల అచటగాని క్రమమైన ఆరాధన జరుపవలెను. క్రైస్తవ విధ్య అను విషయము ప్రసంగమునందు వక్కాణింపబడవలెను.*

*సంఘము కీర్తన పాడుచు నిర్మించబడిన గృహము చేరవలెను. ఆరాధన అంతయు పాఠశాలలోనే జరుగు నెడల ప్రసంగము తరువాత ఒక కీర్తన పాడవచ్చును. అంతట కార్యనిర్వాహక బోధకుడు ఈ దిగువ రీతిని ఆరాధన జరుపును:*

యేసుక్రీస్తునందు ప్రియులారా! దేవానుగ్రహము వలన ఈ భవనము పూర్తిచేయబడి, ఈ దినమున దీనిని విద్యా గృహముగ ప్రతిష్ఠించుటకు వీలు కలుగినది. ఇచట మన బిడ్డలు విధ్యా బుద్ధుల యందు పెంపొందవలసియున్నారు. అయితే వారు ఎక్కువగా దైవవాక్యమునందలి సత్యమును తమ హృదయములయందు జీర్ణింపజేసికొని, వారు బ్రతికియున్నను చనిపోయినను దేవుని బిడ్డలై యుండునట్లు ఆత్మీయ విషయముల నెక్కువగా నేర్చుకొనవలెను.

దీనినిబట్టి చూడగా ఈ గృహము ఒక గొప్ప పని నెరవేర్చ వలసియున్నది. 'బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు వృద్ధుడైనప్పుడు దాని నుండి తొలగిపోడు' అను వాక్యము ప్రకారము బాలురకు సరియైన విధ్య నేర్పవలయునని సత్యవేదము నొక్కి వక్కాణించుచున్నది. మరియు నీతి మార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రముల వలె నిరంతరము ప్రకాశించెదరు, అని దైవవాక్యమే సెలవిచ్చుచున్నది.

*అంతట బోధకుడు తన చేతినెత్తి ఈ దిగువ రీతిని చెప్పవలెను:*

ఈ ఉద్ధేశమును పనియు నెరవేర్పు నిమిత్తము........... అనబడు ఈ గృహమును తండ్రియొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ప్రతిష్ఠించుచున్నాము, ఆమేన్.

## ప్రార్థింతము

కరుణగల దేవా! సర్వజ్ఞాన సంపన్నుడవైన మా తండ్రీ! మా యెడలను మా బిడ్డల యెడలను నీకుగల ప్రేమ నిమిత్తము నీకు వందనములు చెల్లించుచున్నాము. మా సభకొరకొక పాఠశాల స్థాపించుటకును దానినీ దినమున ప్రతిష్ఠించుటకును మాకు సహాయము చేసినందుకు ఈ దినమున నిన్ను స్తుతించుచున్నాము.

ఓ ప్రభువా! క్రైస్తవ పాఠశాల ఎంత ఆశీర్వాదకరమో గ్రహించునట్లు మాకు సహాయము దయచేయుము. దీనియందు పని చేయుటకు పిలువబడిన ఉపాధ్యాయులందరు తమ కప్పగింపబడిన గొప్ప విధులను నీ చిత్తప్రకారము నెరవేర్చుటకు వారికి శక్తి నను గ్రహించుము. వారిపైన పెట్టబడిన బాధ్యతను సరియైన రీతిని నిర్వహించుటకు కావలసిన కృపకొరకును, జ్ఞానము కొరకును దినదినమును నీ కృపా సింహాసనము నెదుట ప్రార్థింతురుగాక.

ఇచట విధ్య నభ్యసించు బిడ్డలు నీ కృపయందు పెంపారి తాము పొందు ఉపదేశమును క్రమ శిక్షయు తమ హృదయముల యందు భద్రము చేసికొనునట్లు వారిని దీవించుము, నాశనకరమైన తప్పు బోధలనుండియు భక్తిహీనమైన బ్రతుకు నుండియు వారిని కాపాడుము. బాల్య దినములందే వారు సృష్టి కర్తవైన నిన్ను స్మరణకు దెచ్చుకొనునట్లు వారిని నడిపింపుము.

ఇచట నీ వాక్యము వినుటకు చేరిన వారందరు తమ వృత్తుల యందు నిన్ను నమ్మకముగ సేవించి ఎవడును పనిచేయనేరని రాత్రి రాకమునుపే తమ పనులను నిర్వహించునట్లు కృప చూపుము.

ఓ ప్రభువా! వినయ పూర్వకమైన ఈ మా విన్నపములను ప్రార్థనలను మా మధ్యవర్తియు ఉత్తరవాదియునైన యేసుక్రీస్తు నిమిత్తమును ఆలకింపుమని వేడుకొనుచున్నాము, ఆమేన్.

**ప్రభువు ప్రార్థన**

*అంతట తగిన కీర్తన ఒకటి పాడగా బోధకుడు దీవెన చెప్పవలెను.*

# మృతుల భూస్థాపన స్థల ప్రతిష్ఠ క్రమము

*ఈ క్రమము ఉదయముగాని, సాయంత్రముగాని జరుపుట యుక్తము.*

*అననుకూల పరిస్థితులు సంభవించినప్పుడు, ఈ క్రమము ఆలయములో జరుపవలెను.*

*ఈ క్రమము సినాడు అధ్యక్షుడుగాని గురుమండల అధ్యక్షుడుగాని జరుపవచ్చును.*

*ఒక కీర్తన పాడవలెను. (504)*

*అంతట బోధకుడిట్లు చెప్పవలెను.*

బో:- తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున, ఆమేన్.

సభ:- ఆమేన్.

బో:- ప్రభువు నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది.

సభ:- భూమ్యాకాశములను సృజించిన వాడు ఆయనే.

బో:- ఓ దేవా! నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము.

సభ:- ఓ ప్రభువా! నా సహాయమునకు త్వరగా రమ్ము.

బో:- తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును,

సభ:- ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

*పిమ్మట యీ దిగువనున్న సంకీర్తనమును చెప్పవలెను.*

దా.కీర్తన 23 లేక 14 వ కీర్తన

*ఈ సంకీర్తనము ముగియగానే, త్రైకునికి మహిమ పాడవలెను.*

కీర్తన 347

*అంతట వేదపాఠకులు చదువవలెను.*

పాత నిబంధన పాఠము ఆదికాండము 23:1-20

పత్రిక పాఠము 1 థెస్సలోనికై 4:13-18

సువార్త పాఠము యోహాను 14:1-6 లేక 19:38-42

*ప్రతి పాఠము ముగించిన తరువాత యీ దిగువ రీతి చెప్పవలెను (లేక) పాడవలెను.*

బో:- ఓ ప్రభువా! మమ్మును కనికరింపుము.

సభ:- దేవునికి వందనములు కలుగుగాక.

*అంతట ఒక కీర్తన పాడవలెను.*

బో:- ఇప్పటినుండి ప్రభువునందు మృతినొందు మృతులు ధన్యులని వ్రాయమని పరలోకమునుండి యొక స్వరము చెప్పగా వింటిని. నిజమే వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురని ఆత్మ చెప్పుచున్నాడు.

సభ:- మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా మనకు జయము నను గ్రహించు దేవునికి వందనములు.

బో:- నేనే పునరుత్థానమును జీవమునై యున్నాను; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రతుకును.

సభ:- మన ప్రభువునైన యేసుక్రీస్తుద్వారా మనకు జయము నను గ్రహించు దేవునికి వందనములు.

బో:- తండ్రి జీవముగలవాడై యుండునట్లు కుమారుడును తనయందు జీవముగలవాడై యుండునట్లు ఆయనకు ఆ జీవము ననుగ్రహించెను.

సభ:- మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా మనకు జయము ననుగ్రహించు దేవునికి వందనములు.

బో:- నేను ఎక్కడనుందునో, మీరును అక్కడే యుందురు.

సభ:- మన ప్రభువైన యేసుక్రీస్తుద్వారా మనకు జయము ననుగ్రహించు దేవునికి వందనములు.

బో:- ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:- ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:- క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– ఓ క్రీస్తూ, ఆలకింపుము.

సభ:– ఓ క్రీస్తూ, ఆలకింపుము.

బో:– పరలోకమందున్న తండ్రివైన దేవా,

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– లోక విమోచకుడవగు కుమారుడవైన దేవా,

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– పరిశుద్ధాత్ముడవైన దేవా,

సభ:– మమ్మును కనికరింపుము.

బో:– మమ్మును కటాక్షింపుము.

సభ:– దయగల ప్రభువా, మమ్మును కాయుము.

బో:– మమ్మును కటాక్షింపుము.

సభ:– దయగల ప్రభువా, మాకు సహాయము చేయుము.

బో:– పాప మంతటి నుండియు,
తప్పిదములన్నిటి నుండియు,
కీడులన్నిటి నుండియు,

సభ:– దయగల ప్రభువా, మమ్ము తప్పింపుము.

బో:– సాతానుయొక్క తంత్రములనుండియు, బలాత్కారముల నుండియు, ఆకస్మిక దుర్మరణముల నుండియు, తెగుళ్ళ నుండియు, కరువు నుండియు, యుద్ధములనుండియు, హత్యల నుండియు, రాజ ద్రోహము తిరుగుబాటుల

నుండియు, గాలివానల నుండియు, పిడుగుల నుండియు, నిత్యమరణము నుండియు,

సభ:– దయగల ప్రభువా, మమ్ము తప్పింపుము.

బో:– నీ పరిశుద్ధ అవతార మర్మమువలనను

నీ పరిశుద్ధ జననమువలనను

నీ బాప్తిస్మము, ఉపవాసము, శోధన అనువానివలనను

నీ వేదన, రక్తపు చెమటవలనను

నీ సిలువ శ్రమలవలనను

నీ అమూల్య మరణము, భూస్థాపన అను వీనివలనను

నీ మహిమగల పునరుత్థాన ఆరోహణమువలనను

ఆదరణ కర్తయయిన పరిశుద్ధాత్మని రాకవలనను,

సభ:– దయగల ప్రభువా, మాకు సహాయము చేయుము.

బో:– మా సుఖ దుఃఖములయందును

మా కలిమిలేములయందును

మరణ సమయమందును

న్యాయ విమర్శన దినమందును,

సభ:– దయగల ప్రభువా, మాకు సహాయము చేయుము.

బో:– పాపులమైన మేము నిన్ను వేడుకొనుచున్నాము.

సభ:– ఓ ప్రభువైన దేవా! మా మొరను ఆలకింపుము.

బో:– దుఃఖించువారందరిని ఆదరించుట నీకు అంగీకారమగుటకు,

మృతులను జీవితులనుగా చేయుటకు, కృంగినవారికి స్తుతి వస్త్రము తొడుగుటకు,

దేవుని కుడిచేతివైపు క్రీస్తు ఆసీనుడైయున్న స్థలమందలి వాని వైపు మా

హృదయములను ఎత్తుటకు,

నీ యందలి విశ్వాస భయములయందు మా ప్రయాణము తుదముట్టించుటకు, మరణమైనను జీవమైనను ఉన్నవైనను రాబోవునవైనను మన ప్రభువైన యేసుక్రీస్తు ప్రేమనుండి మనలను యెడబాపు చేయకుండుటకు,

నీయందు నిద్రించుటకు, నీ బిడ్డలు యీ లోకపు అంత్య విశ్రాంతి స్థలమును పరిశుద్ధపరచి దీవించుటకు.

సభ:– దయగల ప్రభువా, మా ప్రార్థనాలకించుమని నిన్ను వేడుకొను చున్నాము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

**ప్రార్థింతము**

ఓ దేవా, సృష్టికర్తా! దృశ్యాదృశ్యమగు సకల జీవులను పాలించు వాడా! మానవుల విమోచకుడా! నీ సేవకులును, నీ సేవకు రాండ్రును యీ లోకపు జీవితమును ముగించిన పిమ్మట విశ్రాంతి పొందుటకు, ఏర్పరచుకొనిన యీ స్థలమును పరిశుద్ధపరచి దీవించుము. ఈ విశ్రాంతినుండి వారు నిత్యజీవము పొందు నిమిత్తము నీ దయను అనుగ్రహించుమని మా ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వినయముగా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువైన దేవా! తమ విశ్వాస పోరాటమునుబట్టి తమ జీవితములలో సాక్ష్యమిచ్చిన సకల పరిశుద్ధుల కొరకును, ముఖ్యముగా యేసునందు విశ్రమించిన మా ప్రియుల కొరకును, మేము నిన్ను స్తుతించుచున్నాము. ఓ దేవా! వారి మంచి మాదిరిని మేము అనుసరించుటకును, వారితో యేకభావము గలవారమై యుండుటకును,

నిన్ను ప్రేమించు వారందరికొరకు నీవు సిద్ధపరచిన నిత్య విశ్రాంతి సమాధానములలో పాలి భాగస్థులమగునట్లును, నీ కృప దయచేయుమని ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

బో:- ఓ ప్రభువా! పరిశుద్ధ తండ్రీ! సర్వశక్తియు నిత్యుడవైన దేవా! నిత్యాంధకారమునుండి తప్పించుకొని, నిత్యానందము, వెలుగుగల ప్రదేశమునకు వచ్చులాగున ప్రవర్తించవలెనని తన శిష్యులకు ఆజ్ఞాపించినట్టియు, శరీరధారియై తన స్నేహితుడగు లాజరు నిమిత&తము యేడ్చి వానికి తన దైవశక్తి ద్వారా జీవమిచ్చినట్టియు, పాప భారము క్రింద నలిగిన మానవాజాతికి రక్షణ దెచ్చినట్టియు, మా ప్రభువునైన క్రీస్తుద్వారా నీకు స్తుతియు, ఘనతయు, కృతజ్ఞతయు, మహిమయు కలుగునుగాక.

మేమును, క్రీస్తునందు నిద్రించిన వారందరును, నిత్యజీవ మైన నీ యొద్దకు వచ్చి పరలోక సైన్యసమూహములతో నిత్యము నిన్ను స్తుతించుటకును కృప దయచేయుమని ఆయన ద్వారా నిన్ను వినయముగా ప్రార్థించుచున్నాము, ఆమేన్.

బో:- ఈ ప్రదేశమును మృతుల విశ్రాంతి స్థలముగా, తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున దీవించి పరిశుద్ధపరచి ప్రతిష్ఠించుచున్నాము, ఆమేన్, ఆమేన్, ఆమేన్.

*అంతట ఒక కీర్తన పాడవచ్చును.*

ఒక చిన్న ప్రసంగము చేసిన తరువాత

**ప్రభువు ప్రార్థన**

ఆశీర్వాదముతో ముగింపు

# ప్రత్యేక పాపపు టొప్పుదల పాపక్షమాపణ క్రమము

*బహిరంగమైన ఆరాధనలలోగాని, పశ్చాత్తాపుని యింటియొద్ద ఆచరించునట్టి ప్రత్యేకమైన ఆరాధనలలోగాని పరిశుద్ధ సంస్కారము పుచ్చుకొనుటకు ముందు ప్రతి సభికుడును తన ఆత్మశాంతికొరకై సిద్ధపడుటకు తన సంఘపు గురువుతో కలసి ప్రత్యేకముగా పాపపు టొప్పుదలను గురించి మాటలాడుకొనుట చాల ఉపయోగము. అట్టి ఒప్పుదలలో తనకు భారముగా నున్న పాపములను గురించి తన సంఘ గురువుతో చెప్పి ఆయన యొద్దనుండి పాపక్షమాపణను గూర్చిన నిశ్చయతను పొందవచ్చును.*

*ఇటువంటి ప్రత్యేకపు టొప్పుదలవలన సంఘగురువు తన సభికుల లోని ఒక్కొక్కని బలహీనతలు నెరిగియున్నంతవరకు చూసి దిద్దుకొనుటకై అతనికి సహాయము చేయుటకుకూడ గురువునకు మంచి తరుణము కలుగును. అనగా ఒకని ఆత్మీయ జీవమునకు ఆటంకముగానున్న ప్రతి విధమైన చెడ్డ అలవాటులను దిద్దవచ్చును. మరియు అతని పొరబాటువలననైనను, తని పొరుగువాని పొరబాటువలననైనను వచ్చిన కలహమువలన ఇరువురిలో సమాధానము లేనప్పుడు అట్టివారు సమాధానపడునట్లు వారిని ప్రోత్సాహపరుప వచ్చును.*

*పశ్చాత్తాపుడు ఈ క్రింది మాటలతోగాని తన స్వంత మాటలతో గాని పాపపుటొప్పుదల ప్రార్థన చేయవలెను.*

పరలోకమందున్న నా ప్రియమైన తండ్రీ! నేను నా చెడు తలంపులవలనను, కోపపు మాటలవలనను, అక్రమమైనట్టియు బుద్ధిహీన మైనట్టియునైన కార్యములవలనను, నా సహోదరుని సరిగా ప్రేమింపలేకపోవుటవలనను నేను అనేక విధములుగా నీకును నా పొరుగువారినికిని విరోధముగా పలుమారు పాపము చేసితిని. వాటికొరకై నేనిప్పుడు మిక్కిలి దుఃఖించుచు. ఆనా పాపములన్నియు ఒప్పుకొనుచున్నాను. కాబట్టి నా ప్రియమైన తండ్రీ! నీ ప్రియ కుమారుడును, నా రక్షకుడునైన యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి నాకు పాప క్షమాపణ దయచేయుమని వినయ మనస్సుతో నిన్ను బ్రతి మాలుకొనుచున్నాను. మరియు సాతాను శోధనలును నే నెదిరించి జయించుటకు నాకు క్రొత్త బలమును, పరిశుద్ధమైన బ్రతుకును నేను పుచ్చుకొనబోవు నీ పరిశుద్ధ శరీర రక్తములద్వారా నా కనుగ్ర హించుమని మిక్కిలి వినయముగా నిన్ను ప్రార్థించుచున్నాను, ఆమేన్.

*గురువు చెప్పవలసినది.*

సర్వశక్తిగల మన పరలోకపు తండ్రి నిన్ను కనికరించి తన ప్రియకుమారుడును, మన ప్రియ ప్రభువునగు యేసుక్రీస్తుయొక్క శ్రమ మరణ పునరుత్థానములవలన నీ

పాపములన్నియు నీవు చేసిన నీ పాపపుటొప్పుదలనుబట్టి పూర్తిగా క్షమించుచున్నాడు. మరియు మన ప్రభువుయొక్క ఆజ్ఞ ప్రకారము సంఘ కాపరినైన నేను నీ పాపములు తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమందు సంపూర్ణముగా క్షమింపబడియున్నవని నీకు తెలియజేయుచున్నాను, ఆమేన్.

*అంతట గురువు జచెప్పవలసినది.*

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయను సర్వశక్తిగల దేవుని దీవెన ఎల్లప్పుడు నీతో నుండుగాక, ఆమేన్.

## చనిపోవుటకు సిద్ధముగానున్న సహోదరుని (సహోదరి) కొరకు

# ఆచరించు ఆరాధన క్రమము

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

బో:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

సభ:– క్రీస్తూ, మమ్మును కనికరింపుము.

బో:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

సభ:– ప్రభువా, మమ్మును కనికరింపుము.

*ప్రభువు ప్రార్థన అందరును కలసి చెప్పవలెను.*

బో:– ఓ ప్రభుడవైన దేవా! చనిపోనైయున్న ఈ మా ప్రియ సహోదరుని (సహోదరి) పాపములన్నిటిని నీవు క్షమించి ఈ మరణ సమయమందు ఈయనను (ఈమెను) నీ ఉచిత కృపతో కాపాడి యేసుక్రీస్తు పుణ్యమునుబట్టి నీవు నీ భక్తుల కనుగ్రహించు నిత్యజీవము ఈయనకు (ఈమెకు)ను అను గ్రహించుమని నిన్ను మిక్కిలి వినయపూర్వకముగా బ్రతిమాలి వేడుకొనుచున్నాము, ఆమేన్.

*చనిపోవుటకు సిద్ధముగా నున్నాడని నమ్మిక కలిగిన వెంటనే "దేవుని గొఱ్ఱెపిల్ల" లేక "సెలవు గీతము" చెప్పవచ్చును లేదా పాడవచ్చును.*

### దేవుని గొఱ్ఱెపిల్ల

లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ! మమ్మును కనికరింపుము.

లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లవైన ఓ క్రీస్తూ! నీ సమాధానము మాకు దయచేయుము.

ఆమేన్

**సెలవు గీతము**

నాథా! ఇప్పుడు నీ మాట చొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు. అన్యజనులకు నిన్ను బయలు పరచుటకు వెలుగుగాను, నీ ప్రజలైన ఇశ్రాయేలునకు మహిమగాను నీవు సకల ప్రజల యెదుట సిద్ధపరచిన నీ రక్షణ నేను కన్నులారా చూచితిని.

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు యుగయుగములందుండునట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

*గురువు తనచేతిని చనిపోవుచున్న సహోదరుని (సహోదరి) మీదనుంచి ఈ దిగువ ఆశీర్వాదము చెప్పవలసినది.*

తన విలువైన రక్తమిచ్చి నిన్ను కొనిన మన ప్రభువైన యేసు క్రీస్తుయొక్క కృపయు,

నిన్ను సృజించి నీ పాపములనుండి తన ప్రియకుమారుని ద్వారా నిన్ను విమోచించిన మన తండ్రియగు దేవుని యొక్క ప్రేమయు,

నిన్ను పవిత్రునిగా (పవిత్రురాలునిగా) జేసి సత్యవిశ్వాసము లందు క్రీస్తు కొరకు నిన్ను స్థిరముగా నుంచిన సహాయకుడగు పరి శుద్ధాత్మ సహవాసమును నీకు తోడుగానుండి నీ కొరకును, భక్తులందరి కొరకును నియమింపబడిన నిత్య విశ్రాంతిలోనికి సమాధానముతో వెళ్ళుము, ఆమేన్.

*ఆ సహోదరుడు(సహోదరి) చనిపోయిన తరువాత గురువు చెప్పవలసిన ప్రార్థన.*

ప్రభువైన యేసుక్రీస్తూ! ఈ మా సహోదరుని (సహోదరిని) తన పాపమునకు గల నిజపశ్చాత్తాపమునందును, నీయందుగల విశ్వాసమునందును స్థిరమైన వానిగా (దానిగా) నుంచి యిప్పుడు నీ చేతులలోనికి ఆయన (ఆమె) ఆత్మను తీసికొనినందులకు నీకు వినయ పూర్వకమయిన వందనము లాచరించుచున్నాము. ఓ ప్రియ ప్రభువా, జీవముతో మిగిలియున్న మమ్మునందరిని ముఖ్యముగా దుఖములనున్న మా ప్రియుని (ప్రియురాలి) కుటుంబమును బంధువులను ఆదరించి ఈ లోకముయొక్క

సమస్తబాధలనుండి కాపాడి మా మరణ గడియ వచ్చువరకు మమ్మునుకూడ నీ విశ్వాసమందు స్థిరులనుగా కాపాడి బలపరచుమని తండ్రితోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొనుచున్నాము, ఆమేన్.

ప్రభువైన యేసుక్రీస్తుయొక్క కృపయు, దేవునియొక్క ప్రేమయు, పరిశుద్ధాత్మయొక్క సహవాసమును, మీ కందరికి తోడై యుండుగాక, ఆమేన్

# బాప్తిస్మము పొందిన పెద్దవారిని రాత్రి భోజనమునకు చేర్చుకొను క్రమము

*పెద్దవారై బాప్తిస్మము పొందినవారు ప్రార్థనలకు క్రమముగా వచ్చు లాగున ఒకటి రెండు సంవత్సరములవరకు వారిని కనిపెట్టుచు గురువుగాని, బోధకుడుగాని వారికి ప్రభుభోజన సంస్కారము యొక్క ముఖ్యసిద్ధాంతములను శ్రద్ధతో జాగ్రత్తగా నేర్పింపవలెను. ఆలాగు వారు నేర్చుపొందిన తరువాత, గురువు వారిని పరీక్షించి వారు నేర్చుకొనిన సంగతుల భావము వారికి బాగుగ బోధపడినదని ఆయన గ్రహించిన తరువాత సంఘము నెదుట వారికి ప్రభు భోజనము పుచ్చుకొనుటకు హక్కులు నిచ్చుచు తక్కిన సభికులవలె సంఘము లోని అని విధములైన హక్కులు వారు పొందునట్లు తెలియజేయవలెను. అటు తరువాత వేదిక యెదుట నిలిచియుండగా గురువు ఇట్లు చెప్పవలెను.*

ప్రశ్న:- మిక్కిలి ప్రియులారా! అన్యులాచారించు విగ్రహారాధన మొదలగు అన్ని విధములైన పాపకార్యములను విడిచి పెట్టుదుమని మీరు బాప్తిస్మము పొందినపుడు వాగ్దత్తము చేసితిరి గదా. మీ వాగ్దత్తము ప్రకారము ఆలాగు విడిచిపెట్టి యున్నారా?

ఉత్తరం:-అవును విడిచిపెట్టియున్నాము.

ప్రశ్న:- మీరు క్రైస్తవులగుటచేత మీకు కొన్ని కష్టములు, చిక్కులు వచ్చియుండును. అట్టి కష్టములు వచ్చినప్పటికిని, క్రైస్తవ సంఘములో ప్రభు యేసుక్రీస్తువలన మీరు పొందిన మేళ్ళన్నిటిని జ్ఞాపకమునకు తెచ్చుకొని మీ బాప్తిస్మ కాలమందు మీరు చేసిన ప్రమాణమును తిరిగి స్థిరపరచి మీ రక్షకుడగు క్రీస్తును పూర్ణ భక్తితోను ప్రేమతోను మీరు బ్రతికి యున్నంత వరకు సేవింతురా?

ఉ:- అవును, సేవింతును.

గు:- కుమారుడా, ధైర్యముగా నుండుము. నీ పాపములు క్షమింప బడియున్నవి అని పక్షవాయువు గలవానితో ప్రభువు చెప్పినట్లు ఇప్పుడు మీతోను ఆయన చెప్పుచున్నట్లు మీరు నమ్మవలెను.

ప్ర:- మీ పాపముల నిమిత్తమై క్రీస్తు తన శరీరముపై రక్తమును సిలువమీద

ధారపోసెననియు, ఆ శరీరమునే, ఆ రక్తమునే మీకును, ఆయనను నమ్మిన తన బిడ్డలందరికిని ఈ పరిశుద్ధ భోజన సంస్కారములో అనుగ్రహించు చున్నాడనియు, ఆయనను నమ్మిన వారందరును దీనిని తప్పకుండ ఆచరింపవలెనను ఆజ్ఞ నిచ్చియున్నాడనియు, మీరు నేర్చుకొని యున్నారు. కాబట్టి మీ సంఘములో ఈ పరిశుద్ధ సంస్కారము నాచరించునపుడెల్ల మీరు దేవుని యాజ్ఞప్రకారము సిద్ధపడి భయభక్తులతోను, సంతోషముతోను దీనిని పుచ్చుకొందుమని వాగ్దత్తము చేయుదురా?

ఉ:- అవును, వాగ్దత్తము చేయుదును.

ప్ర:- మీరు ఇప్పుడు క్రీస్తుశరీరమను ఈ సంఘమునకు సభికులై తక్కిన సభికులకు సంబంధించియున్న అన్ని హక్కులను విధులను పొందియున్నారు. కాబట్టి దేవుడు మీకు అను గ్రహించిన శక్తికొలది సంఘములలో నియమించిన చందాలను చెల్లించుట మొదలగు పనులలో సంఘమునకు సహాయపడి, సంఘపు పెద్దలను గురువులకును క్రైస్తవ ప్రేమను బట్టి లోబడియుందురా?

ఉ:- అవును, ఆలాగు లోబడియుందును.

*ఈ దిగువ దీవెనలు వారికి వినిపింపవలెను.*

కబాట్టి ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో, ఏమి ధరించు కొందుమో, అని చింతింపకుడి. అన్యజనులు వీటన్నిటి విషయమై విచారింతురు. ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి. అప్పుడు అనుగ్రహింప బడును. అవన్నియు మీకు-

అడుగుడి మీ కియ్యబడును: వెదకుడి మీకు దొరుకును. తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడు పొందును. వెదకువానికి దొరకును. తట్టువానికి తీయబడును.

నీవు నా దాసుడవనియు, నేను నిన్ను ఉపేక్షింపక ఏర్పరచు కొంటిననియు నేను నీతో చెప్పియున్నాను. నీకు తోడైయున్నాను. భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను, దిగులు పడకుము నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయువాడను నేనే నీతి యను నా దక్షిణ హస్తముతో నిన్ను ఆదుకొందును.

ఒకడు నన్ను ప్రేమించు వాడైతే నా మాట గైకొనును. అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకువచ్చి వానియొద్ద నివాసము చేతును.

ప్రాణాపాయము వచ్చినను నమ్మకముగా నుండుము. నేను నీకు జీవకిరీటము నిచ్చెదను

నా గొఱ్ఱెలు నా శబ్దము వినును. నేను వాటిని ఎఱుగుదును. అవి నన్ను వెంబడించును. నేను వాటికి నిత్యజీవము నిచ్చుచున్నాను. గనుక అవి ఎన్నటికి నశింపవు. ఎవడును వాటిని నా చేతులో నుండి అపహరింపడు.

తరువాత ఈ దిగువ ప్రార్థన చేయవలెను:

నిత్యము స్తుతింపబడుచున్న కృపగల మా తండ్రీ! ఈ నీ దాసులు తమ బాప్తిస్మ సమయమందు నీకు చేసిన ప్రమాణమును బట్టి వారు సంఘములో ఇప్పటివరకు స్థిరముగా నిలచి యున్నందున నీకు వందనములు చేయుచున్నాము. నీ పరిశుద్ధ సంఘములో వీరిని కాపాడి నీ పరిశుద్ధాత్మ సహాయముచేత వీరిని శోధన లన్నిటినుండి తప్పించుము. 'వీరు బలహీనతల వల్ల పాపములో పడినయెడల మా మనస్సు పొంది, నీ యొద్ద పాపక్షమాపణ వెదకునట్లు వీరికి నీ కృప ననుగ్రహింపుము, ఆమేన్.

ప్రభువు నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక.

ప్రభువు నీకు తన సన్నిధి ప్రకాశింపజేసి, నిన్ను కరుణించుగాక.

ప్రభువు నీ మీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి నీకు సమాధానము కలుగజేయునుగాక, ఆమేన్.

# మత సభల* ప్రారంభమును, ముగింపును

## ప్రారంభము

*మత సభలును, సంఘ సామాన్య ప్రతినిధిలు కూటములును సమా వేశగునపుడు ముఖ్యారాధన అంతయు, ప్రసంగమును, ప్రభు భోజన సంస్కారమును జరుపవలెను.*

*మొదటి కార్యనిర్వాహకకూటము, పరిశుద్ధాత్మ వరమునుగూర్చిన కీర్తన పాడిన వెనుక, సభాధ్యక్షుడు ఈ దిగువనున్న ప్రార్థన చేయుటతో నారంభమగును. మొదటి కార్యనిర్వాహక కూటము ముఖ్యారాధన ముగిసిన తోడనే జరిగినయెడల "తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ఈ …………సభను ప్రారంభించుచున్నాను" అను ఆశీర్వచనముతో మొదలు పెట్టవలెను.*

సభాధ్యక్షుడు:– ఒక శరీరములో మనకు అనేక అవయవములు ఏలాగున్నవో:

సభ:– అలాగే అనేకులమైన మనము క్రీస్తులో ఒక శరీరముగా నున్నాము

స.అ:–కాబట్టి సమాధానమును, పరస్పర క్షేమాభివృద్ధిని కలుగ జేయు వాటినే:

సభ:– ఆసక్తితో అనుసరింతుము.

స.అ:–ఇద్దరు నా నామమున ఎక్కడ కూడియుందరో

సభ:– అక్కడ నేను వారి మధ్య నుందును.

స.అ:–ఇదిగో తలుపు నీ యెదుట తీసియుంచియున్నాను:

సభ:– దానిని ఎవడును వేయనేరడు.

స.అ:–ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బ్రతిమాలుకొనున దేమనగా, మీరు సమాధానమును బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధకలిగిన వారై, ప్రేమతో ఒకని నొకడు సహించును:

సభ:– పిలువబడిన పిలుపుకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచు కొనవలెను.

స.అ:–తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును:

సభ:– ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగుగాక, ఆమేన్.

---

******ఆంధ్ర సువిశేష లూథరన్ సంఘపు ప్రతినిధి సభలు, సినాడు కూటములు, జిల్లా మహాసభలు మొదలైనవి.*

స.అ:–ప్రభువు మీతో నుండుగాక:

సభ:– మీ యాత్మతో నుండుగాక.

స.అ:–ప్రార్థింతము.

సర్వశక్తిగల దేవా! పరలోకపు తండ్రీ! యుగసమాప్తి పర్యంతము నీ సంఘముతో నుందుననియు, పాతాళలోకపు ద్వారములు దాని యెదుట నిలువనేరవనియు, నీ కుమారుడగు యేసు క్రీస్తుద్వారా వాగ్దత్తము చేసితివి; కావున దయతో బలహీనతలయందు మాలో నీ శక్తిని పరిపూర్ణముచేసి, నీ వాగ్దత్తము చొప్పున నీ అయోగ్య సేవకులమైన మాతో నుండి నీ కృపాసహాయము మా ప్రభువు యేసు క్రీస్తుద్వారా అనుగ్రహింపుము, ఆమేన్.

సర్వశక్తిగల దేవా! మేము విశ్వాసమందు స్థిరులమై ప్రేమలోను సమస్త సత్క్రియలలోను వర్ధిల్లునట్లును, నీచిత్త ప్రకారము మమ్ము నేలి నడిపించుచు మా సకల శోధనలయందును, బాధలయందును మమ్ము నాదరించి సకల దోషములనుండి మమ్ము కాపాడునట్లును, మా హృదయములలోనికి నీ పరిశుద్ధాత్మను పంపుమని మా ప్రభువు యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

సర్వశక్తిగల నిత్యదేవా! నీ దివ్యప్రభావమునకు మంచివియు అనుకూలమగునవియునగు కార్యములను మేము ఇచ్ఛయించుటకును కార్యసిద్ధి కలుగజేసికొనుటకును నీ కృపననుగ్రహించు చున్నావు; కావున తుదకు మేము నిత్యజీవితమును పొందునట్లు తండ్రి నీ హస్తము సదా మా మీదనుంచి నీ పరిశుద్ధాత్ముని సహాయము అనుగ్రహింపుము నీ వాక్యమును గూర్చిన జ్ఞానమందును విధేయత యందును మమ్ము నడిపింపుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

అంతట సభాధ్యక్షుడు చెప్పవలసిన దేమనిన:

ప్రియ సహోదరులారా. యేసుక్రీస్తు రక్తముద్వారా పరిశుద్ధ స్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగి యున్నది. గనుకను, దేవుని ఇంటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషము తోచకుందునట్లు ప్రోక్షింపబడిన

హృదయములు గలవారమై యుండి విశ్వాస విషయములో యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము. వాగ్దానము చేసినవాడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మన మొప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందము. మరియు ప్రేమచూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు హెచ్చరించ వలెనని ఆలోచింతము.

దేవుని మహిమ నిమిత్తమును, ఆయన రాజ్యముయొక్క మేలు నిమిత&తమును, మన సంఘాచార పద్ధతుల ప్రకారము తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున ఈ మత విషయక సభను ప్రారంభించుచున్నాము, ఆమేన్.

మత విషయక సభాకూటమునకు పూర్వము ఆదివారమునగాని ఇతర దినములయందుగాని, లేక కూటము జరుగుచున్నప్పుడుగాని ఈ దిగువ ప్రార్థన ఉపయోగించవచ్చును.

సత్యజ్ఞాన మంతటికిని ఆధారభూతుడవైన ఓ ప్రభువా! నీ నామమున సమకూడనైయున్న (సమకూడుచున్న)........సభా కూటముమీద నీ ఆశీర్వాదము కుమ్మరింపుమని బ్రతిమాలు కొనుచున్నాము. మా మధ్యను, లోకమంతటిలోనున్న నీ పరిశుద్ధ సంఘము కాపాడునట్లును క్షేమముగా నుండునట్లును వృద్ధి పొందునట్లును చేయవలసిన పనులను గూర్చి ఆలోచించుటకు మేము సమావేశమగుచుండగా సహాయము చేయుము. నీ ప్రజల నందరిని సత్యములోనికి నడిపించుటకు నీ పరిశుద్ధాత్మ ననుగ్రహించెదనని వాగ్దానము చేసియున్నావు. గనుక ఈ సంఘ ప్రతినిధుల హృదయముల నేలుచు వారియాలోచనలు నడిపించుము. మానవ బలహీనతలనుండి వారిని కాపాడి, నీ మహిమను, నీ కుమారుని మరణము ద్వారా విమోచింపబడిన వారి మేలును మాత్రమే వారు వెదుకునట్లు కాపాడుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

## ముగింపు

*స్తోత్ర కీర్తనగాని వందనార్పణ గీతము గాని పాడవచ్చును.*

*సభాధ్యక్షుడు ఈ దిగువ నున్నట్లు ప్రార్థన చేయవలయును; లేక లిటని ప్రార్థన వినియోగింప*

వచ్చును.

సభాధ్యక్షుడు:- ఓ ప్రభువా, నీ జనులను రక్షింపుము:

సంఘము:- నీ స్వాస్థ్యమును ఆశీర్వదింపుము.

స.అ:-నా నోటినుండి వచ్చు వచనము నిష్ఫలముగా నా యొద్దకు మరలక:

సభ:- అదినాకు అనుకూలమైన దాని నెరవేర్చును: నేను పంపిన కార్యమును సఫలము చేయును.

స.అ:-నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని:

సభ:- ఎందుకనగా, మీరు వెళ్ళి ఫలించుటకును, మీ ఫలము నిలిచి యుండుటకును.

స.అ:-ఇదిగో, నేను యుగసమాప్తి పర్యంతరము:

సభ:- సదాకాలము మీతో కూడ నున్నాను.

స.అ:-తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును:

సభ:- ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు యుగయుగములందుండు నట్లు మహిమ కలుగునుగాక, ఆమేన్.

స.అ:-ప్రభువు మీతో నుండుగాక:

సభ:- మీ యాత్మతో నుండుగాక.

స.అ:-ప్రార్థింతము:

ఓ ప్రభుడవైన దేవా! పరలోకపు తండ్రీ! మేము మంచి దానము లన్నింటిని తెంపులేకుండా మిగుల విశేషముగా నీ యొద్దనుండి పొందుచున్నాము. మరియు నీవు అనుదినము నీ పరిశుద్ధ కరుణావాత్సల్యము చేత కీడంతటినుండి మమ్ము కాపాడు చున్నావు; కావున ఇది యావత్తు నీ కృపయేయని మా పూర్ణ హృదయముతో ఒప్పుకొని నీ కరుణావాత్సల్యతను గూర్చి యిప్పుడు ఎల్లప్పుడును కృతజ్ఞతా వందనములు స్తోత్రములు చెల్లించునట్లు నీ పరిశుద్ధాత్మను దయచేయుమని నీ కుమారుడగు మా ప్రభువు యేసు క్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ దేవా! మా సంరక్షకుడా! సకల జనుల విమోచనార్థమై తన్ను తాను సమర్పించుకొనిన నీ యభిషక్తుని ముఖము చూచి, సూర్యోదయము మొదలుకొని అస్తమయమువరకు నీ నామము రాష్ట్రములలో ఘనపరచబడి, ప్రతి స్థలమందును నీ నామమునకు యాగమును పరిశుద్ధార్పణము సమర్పింపబడునట్లు కటాక్షించి యనుగ్రహింపుమని మా ప్రభువు యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొను చున్నాము, ఆమేన్.

సర్వశక్తిగల నిత్యదేవా! నీవు మాత్రమే మహాత్కార్యములు చేయువాడవు: కావున సంఘసేవకులమీదను వారికి అప్పగింపబడిన సంఘములమీదను నీ కృపగల క్షేమకరమైన యాత్మను కుమ్మరించి వారు యథార్ధముగా నిన్ను సంతోషపరచునట్లు వారిమీద నీ యాశీర్వామును కుమ్మరింపుమని మా ప్రభువు యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

ఓ ప్రభువా నీ సంఘము సమస్త విపత్తులనుండియు విమోచింపబడి, సురక్షితముగాను స్వేచ్ఛగాను నిన్ను సేవించునట్లు దాని ప్రార్థనలు దయతో నంగీకరించి, మా కాలమందు నీ సమాధానము మాకు దయచేయుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగ యుగములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

*అంతట అందరు చెప్పవలెనది:*

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడు గాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధ ములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ము లను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

అంతట సభాధ్యక్షుడు చెప్పవలసినది:

ప్రియ సహోదరులారా, నేను ఇప్పుడు ప్రభువు నామమందు ఈ సభారాధన ముగించుచున్నాను. మరియు క్రీస్తు తన మహిమతో వచ్చునపుడు మన మాయన

యెదుట అత్యంత సంతోష మనుభవించునట్లు ఆయన ప్రేమయందు స్థిరముగా నిలువబడుట మన విధి యని గ్రహింతము.

ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని, ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికి తోడై యుండునుగాక, ఆమేన్.

# రోగులకు ప్రభు భోజన సంస్కారము ఆచరించు క్రమము

*మన ప్రభువైన యేసుక్రీస్తు మన విశ్వాసమును బలపరచుటకు మన పాపములు క్షమింపబడి యున్నవని మనకు నిశ్చయము కలిగించుటకును ఈ పరిశుద్ధమైన సంస్కారమును నియమించి యున్నాడు.*

*జబ్బుగానున్న క్రైస్తవునకు ఈ యాదరణ ఆశీర్వాదము కావలసియున్నది గనుక, సంఘపు గురువు తన సభికులను దర్శించునప్పుడు అట్టి యాసక్తిగల రోగిని కనుకొని, దర్శించి, నిజమైన పశ్చాత్తాపమును, విశ్వాసమును, సంస్కారమును పుచ్చుకొనుటకు హృదయ పూర్వకమన ఆశయు కలిగియున్నయెడల అట్టివానికి ప్రభు భోజనము ఇయ్యవలెను. కాని వివేచన శక్తి లేనివానికైనను, కాయిలా స్థితివలన సరియైన రీతిని పుచ్చుకొనలేని వానికైనను ప్రభుభోజన మీయకూడదు.*

ప్రియ సహోదరుడా! (సహోదరీ) నీ మనస్సాక్షికి నెమ్మదియు ఆదరణయు కలుగునట్లును, ఈ నీ కష్టకాలమందు నీ విశ్వాసము బలపరుప బడునట్లును, మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు శరీర రక్తముల పరిశుద్ధ సంస్కారము పొందుటకు కోరిక గలిగియున్నావు. కనుక నీవు నీ పాపముల నొప్పుకొనుటవల్లను, పాప క్షమాపణ పొందుటవల్లను దీనికి నీవు సిద్ధపడి యుండవలెను.

ప్రశ్న:- నీవు స్వభావమువల్ల పాపాత్ముడవును అనేక విధములుగా తలంపులవలనను, మాటలవలనను, క్రియలవలనను, దేవునికి విరోధముగా పాపము చేసియున్నావు. అందువలన ఆయన కోపమునకు నీవు పాత్రుడవని ఒప్పుకొనుచున్నావా?

ఉ:- అవును, ఒప్పుకొనుచున్నాను.

ప్రశ్న:- మరియు నీవు నీ పాపములను ఒప్పుకొనుచున్నందు వలన ప్రభుయేసుక్రీస్తు పుణ్యమునుబట్టి తండ్రియైన దేవుడు నిన్ను క్షమించుటకు సిద్ధముగా నున్నాడని నమ్ముచున్నావా?

ఉ:- అవును, నమ్ముచున్నాను.

ప్రశ్న:- నీ తండ్రియైన దేవుడు నీకు ఆరోగ్యమును దయచేసిన యెడల నీవు పరిశుద్ధాత్మ సహాయమువలన దేవుని ఆజ్ఞకు లోబడి భక్తిగల జీవితము జీవించుచు ప్రభువైన యేసుక్రీస్తును సేవించుటకు నిశ్చయించు కొనుచున్నావా?

ఉ:- అవును, నిశ్చయించుకొనుచున్నాను.

*గురువు ఈ దిగువ క్షమాపణ ప్రకటనను చెప్పవలెను:*

పరలోకమందున్న మన తండ్రియైన సర్వశక్తిగల దేవుడు నీయందు కనికరముంచి తన కుమారుడైన యేసుక్రీస్తు నిమిత్తమున సమస్త పాపములను క్షమించును. నీవు ఈ వినయ పూర్వకమైన ఒప్పుదల చేసినందున క్రీస్తుయొక్క సంఘములో కాపరినైన నేను ఆయన నాకు ఇచ్చిన అధికారమువలన పశ్చాత్తాపపడి ఆయనయందు విశ్వాసముంచియున్న నీతో నీ యొక్క పాపములు సంపూర్ణముగా క్షమింపబడినవని తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు నామమున ప్రకటించుచున్నాను, ఆమేన్.

*అంతట బోధకుడు సంస్కారము నిచ్చుటకు సిద్ధపడవలెను. పాపపు టొప్పుదల అదివరకే జరిగియున్నచో ఈ పని 25-వ సంకీర్తనతో ఆరంభింపవచ్చును.*

యెహోవా! నీ వైపు చూచి నా ప్రాణము ఎత్తుకొనుచున్నాను. నా దేవా! నీయందు నమ్మిక యుంచియున్నాను. నన్ను సిగ్గు పడనీయకుము.

తండ్రికిని, కుమారునికిని మొ॥

*అంతట బోధకుడు యోహాను 3:16 లోని సువార్త వాక్యము చదువవలెను.*

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుడుగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవనము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.

*అపొస్తలుల విశ్వాస ప్రమాణమును చెప్పవలెను.*

*అంతట బోధకుడు (మాత్రమే) రొట్టె ద్రాక్షారసముల నుంచిన బల్లవైపు తిరిగి చెప్పవలసిన దేమనిన:*

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడు గాక. నీ రాజ్యమువచ్చుగాక. నీ చిత్తము పరలోకమందు నెరవేరు చున్నట్లు భూమియందును నెరవేరుగాక. మా అనుదినా హారము నేడు మాకు దయచేయుము. మా యెడల అపరధములను చేసినవారిని మేము క్షమించియున్న ప్రకారము మా యపరాధ ములను క్షమించుము. శోధనలోనికి తేక దుష్టునినుండి మిమ్ము లను తప్పించుము. రాజ్యమును శక్తియు మహిమయు నిరంతరము నీవియైయున్నవి, ఆమేన్.

*అంతట ఆయన సంస్కార నిర్మాణ వాక్యములను చెప్పవలెను:*

మన ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి రొట్టెను తీసికొని, స్తోత్రముచేసి, దాని విరిచి, తన శిష్యులకిచ్చి, మీరు పుచ్చు కొని తినుడి. ఇది మీ కొరకియ్యబడుచున్న నా శరీరమైయున్నది. నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీని చేయుడని చెప్పెను.

*అంతట బోధకుడు ఈ దిగువ మాటలు చెప్పుచు రోగికి రొట్టెనియ్యవలెను.*

నీ కొరకియ్యబడిన మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శరీరము నిన్ను నిజమైన విశ్వాసమునందు బలపరచి నిత్యజీవమునకై సంరక్షించుగాక, ఆమేన్.

*అంతట ఆయన గిన్నె తీసికొని చెప్పవలసినదేమనిన:*

ఆ ప్రకారమే భోజనమైన పిమ్మట, ఆయన పాత్రను తీసికొని సోత్రముచేసి, దానిని వారికిచ్చి: దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఈ పాత్ర పాప పరిహారము కలుగుటకై మీ కొరకును అనేకుల కొరకును చిందింపబడుచున్న నా రక్తమువల్లనైన క్రొత్త నిబంధనయై యున్నది. మీరు దీని త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీని చేయుడని చెప్పెను.

*అంతట గురువు ఈ దిగువ మాటలు చెప్పుచు ద్రాక్షారసము నియ్యవలెను:*

నీ పాపముల నిమిత్తమై చిందింపబడిన మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క రక్తము నిన్ను నిజమైన విశ్వాసమునందు బలపరచి నిత్యజీవమునకై సంరక్షించుగాక, ఆమేన్.

*ప్రభు భోజనము కాగానే సంకీర్తనములు 103, 111, 117, 118 వీనిలో నేదైనను చెప్పి ఈ దిగువ కృతజ్ఞత చెల్లింపవలెను:*

గు:– యెహోవా దయాళుడు. ఆయనకు కృతజ్ఞతా స్తుతులను చెల్లింపుడి.

సభ:– ఆయన కృప నిరంతరముండును.

గు:– సర్వశక్తిగల దేవా! ఈ శ్రేయస్కరమైన వరమువలన నీ సేవకుని (సేవకురాలికి) సేద తీర్చినందుకై నీకు వందనములు చెల్లించు చున్నాము. దీని మూలముననే నీయందు విశ్వాసమును, మానవుల యెడల ప్రేమను, కష్టములయందు ఓరిమియు, నిత్యజీవమును గూర్చిన దివ్యమైన నిరీక్షణయు కలిగియుండు నట్లు

నీ కృపనుబట్టి ఈయనను (ఈమెను) బలపర్చుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగ ములు జీవించుచు పరిపాలించు చునుండు నీ కుమారుదును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

**దీవెన**

యెహోవా నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడుగాక.

యెహోవా నీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించుగాక.

యెహోవా నీమీద తన సన్నిధి కాంతి నుదయింపజేసి నీకు సమాధానము కలుగజేయుగాక, ఆమేన్

# ఇతర సంఘములనుండి వచ్చువారిని చేర్చుకొను క్రమము

*లూథరన్ సంఘములనుండి కాక ఇతర సంఘములనుండి మన సంఘములో చేరగోరువారికి, సంఘపు గురువు లూథరు ప్రశ్నోత్తరిని బట్టి లూథరు యొక్క ముఖ్యసిద్ధాంతములను బోధపరచి అవి వారికి అంగీకారమైన యెడల అట్టి వారిని ఈ దిగువ క్రమము ననుసరించి ఆదివారపు టారాధనలో క్రమమైన సభికులనుగా చేర్చవలయును.*

ప్రియ సహోదరుడా,(సహోదరీ) నీవు ఇదివరకు....... సంఘములో క్రమమైన సభికుడుగా నున్నావు. ఇప్పుడు లూథరన్ సంఘములో చేరవలెనని కోరుచున్నావు. కాబట్టి దేవుని యెదుటను ఈ సంఘము నెదుటను నిన్ను అడుగున దేమనగా;

ప్రశ్న:- ఇవాంజెలికల్ లూథరన్ సంఘముయొక్క బోధలను ఆచారములను తెలిసికొని అవి దేవుని వాక్యమునకు అనుగుణ్యముగా నున్నవని ఒప్పుకొనుచున్నావా?

ఉ:- అవును, ఒప్పుకొనుచున్నాను.

ప్ర:- దేవుని సహాయము కోరి వీటి ననుసరించి ప్రవర్తింప వలెనని కోరుచున్నావా?

ఉ:- అవును, ఆలాగే కోరుచున్నాను.

ప్ర:- ఈ సంఘముయొక్క చట్టమునకును, క్రమ శిక్షకును లోబడియుందునని నీవు వాగ్దత్తము చేయుచున్నావా?

ఉ:- అవును, వాగ్దత్తము చేయుచున్నాను.

గురువు:- తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయును సర్వశక్తిగల దేవుని దీవెన నీతో నుండును గాక.

*గురువు సంఘముతో చెప్పవలసనది:*

ప్రియ సహోదరులారా! మన ప్రభువైన యేసుక్రీస్తు నందు ఈయనను (ఈమెను) మీ సహోదరునిగా (సహోదరిగా) అంగీకరించి మన సంఘములో ఈయనను (ఈమెను) చేర్చుకొని “అందరి యెడలను విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను

మేలుచేయుడి” అని అపొస్తలుడైన పౌలు వ్రాసినట్లు అవసరమై నప్పుడెల్ల మీ శక్తికొలది ఈయనను (ఈమెకు) మేలు చేయవలెనని మిమ్మును హెచ్చరించుచున్నాను.

*దీని తరువాత కీర్తనతోను దీవెనతోను ఆరాధన ముగింపవచ్చును.*

# సంస్కార బహిష్కార ప్రకటన క్రమము

*గురువు మాత్రమే దీనిని వాడవచ్చును.*

ప్రభువునందు ప్రియులారా,

మన ప్రభువైన యేసుక్రీస్తు "భూమిమీద మీరు వేటిని బంధింతురో అవి పరలోకమందును బంధింపబడును; భూమి మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడను" అని చెప్పినప్పుడు గొప్ప అక్రమములను చేసినవారిని ప్రభువు రాత్రి భోజన సంస్కారము నుండి దూరపరచుటకు సంఘమునకు అధికార మనుగ్రహించెను.

...........అను నతడు (ఆమె) ఈ సంఘమునందు సభికుడై (సభికురాలై) యుండి గొప్ప అపరాధముచేసి ఏ విధమైన పశ్చాత్తాప మును అగుపరచక సంఘముయొక్క మాటను వినుటకును పంచాయితీవారి కియ్యబడిన సంఘపు అధికారమునకు లోబడుట కును నిరాకరించినందున అతడ (ఆమె) బహిరంగమైనట్టియు గొప్పదియునగు పాపమునందు చిక్కి యథార్థమైన పశ్చాత్తాపము బహిరంగముగా నొందు వరకు ప్రభు రాత్రి భోజన సంస్కారమునకు దూరపరచబడి యున్నాడని (యున్నదని) ఇందుమూలముగా ప్రకటించుచున్నాను.

**ప్రార్థింతము**

పరలోకమందున్న దయగల మా తండ్రీ! దుర్మార్గుడు మరణము పొందవలెనని కోరక అందరు నీ వైపు మళ్ళుకొని జీవించవలెనని కోరుచున్నావు గనుక ఈ మా సహోదరుని (సహోదరి) కొరకు నిన్ను వేడుకొనుచున్నాము. అతడు (ఆమె) నిజముగా పశ్చాత్తాపపడి, యథార్థమగు విశ్వాసము కలిగి నీ సంఘముయొక్క దివ్యమైన హక్కులను పొందునట్లు త్వరలో అతనిని (ఆమెను) మళ్ళించుము. నీవు పాపుల యెడల ఎట్లుందువే ఆరీతిగనే ఈ సంఘపు వారందరును ఇతని (ఈమె) యెడల ఉండునట్లు మమ్ము నందరిని నడిపించుమని నీతోను, పరిశుద్ధాత్మ తోను, సదా ఏక దేవుడై యుగయుగములు జీవించుచు పరిపాలించుచునుండు నీ కుమారుడును మా ప్రభువునైన యేసుక్రీస్తు ద్వారా వేడుకొను చున్నాము, ఆమేన్.

దీని తరువాత కీర్తనతోను దీవెనతోను ఆరాధన ముగింపవచ్చును.

# సంస్కార బహిష్కారమునుండి తిరిగి చేర్చుకొను క్రమము

మిక్కిలి ప్రియులారా,................అను నితడు (ఈమె) ఈ సంఘమునకు నిందాస్పదమైన అక్రమము చేయగా ఇతడు (ఈమె) తన పాపమును ఒప్పుకొని పశ్చాత్తాప పడునంతవరకు ప్రభువు భోజన మునకును సంఘ సంబంధమైన మరికొన్ని హక్కులకును దురపరచబడియుండెను. ఇప్పుడు ఇతడు (ఈమె) తన పాపమును వినయముతో ఒప్పుకొని పశ్చాత్తాపపడి యేసుక్రీస్తు ద్వారా దేవుని క్షమాపణ కలుగునను నిరీక్షణతో ఆ క్షమాపణ పొందవలెనని దేవుని వేడుకొనుచున్నాడు (చున్నది). ఇతడు (ఈమె) పశ్చాత్తాప పడితినన్న పిమ్మట ఆ పశ్చాత్తాపముయొక్క యథార్థతను పరీక్షించి తెలిసి కొనుటకు కొంతకాలము గడువుగా ఇయ్యబడెను. ఇతడు (ఈమె) ఈ సంఘమందు పూర్ణ హక్కు గలిగియుండ చేర్చుకొనబడవలయునని ఇప్పుడు మనవి చేయుచున్నాడు (చున్నది). కాబట్టి సంఘమునకు నిందలు కలిగించిన ఇతనిని (ఈమెను) సంఘస్థులైన మీరు క్రీస్తు నిమిత్తము క్షమించుచు, దేవుడు ఇతనికి (ఈమెకు) తన పరిశుద్ధాత్మను అనుగ్రహించి, ఆ పరిశుద్ధాత్మ ద్వారా ఇతనికి (ఈమెకు) నిజమైన పశ్చాత్తాపమును, యథార్థ విశ్వాసమును, నడత వినయమైన కుదురు బాటును కలుగజేయుటకు దేవుని ప్రార్థించవలెనని మిమ్మును హెచ్చరించుచున్నాము.

"నా జీవముతోడు దుర్మార్గుడు మరణము నొందుటవలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతను విడిచి బ్రతుకుటవలన నాకు సంతోషము కలుగును." అను దేవుని వాగ్దానమువలన ఇతడు (ఈమె) తన పాపము క్షమింపబడెనని రూఢిగా నమ్మి ఆదరణ నొంది తన విశ్వాసాభివృద్ధి కొరకును, తన నడత విషయమైన కుదురుబాటు కొరకును ఇతడు (ఈమె) క్రీస్తు శరీర రక్తములనుగూర్చి సంస్కారమును ఇకను పొందులాగున దేవుని వేడుకొనుడి.

నా ప్రియులారా, ఈ తప్పిదమువలన మీరుకూడ మీ బలహీనతలను తెలిసికొని మీరు మూర్ఖ ధైర్యముగలవారు గాక "తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" అని పౌలు చెప్పిన మాటలను, "మీరు శోధనలోనికి రాకుండా మెళుకువగా నుండి ప్రార్థన చేయుడి." అని క్రీస్తు చెప్పిన

మాటలను జ్ఞాపకము చేసికొనుడి.

మరియు పశ్చాత్తాపపడిన ఇతనిని (ఈమెను) నిందించక ఈ పాపము విషయము ప్రస్తావించక క్రీస్తు నిమిత్తము క్షమింపబడిన సహోదరుని (సహోదరి) గా నెంచి ఇతనిని(ఈమెను) ప్రేమించవలయు నని మిమ్మును హెచ్చరించుచున్నాను.

*దీని తరువాత కీర్తనతోను దీవెనతోను ఆరాధన ముగింపవచ్చును.*

# సంఘ బహిష్కార* ప్రకటన క్రమము

*ఆంధ్ర లూథరన్ సంఘపు అధికారము పొందిన గురువుమాత్రమే దీనిని వాడవచ్చును.*

క్రీస్తునందున్న ప్రియులారా, మనుష్యులందరు పశ్చాత్తాపపడి యేసుక్రీస్తు పేరిట తమ పాపములకై క్షమాపణ వేడుకొనవలెననియు, ఇట్టి క్షమాపణ పొందిన తరువాత బుద్ధి పూర్వకముగాను మూర్ఖము గాను పాపముచేయక భక్తివలనను నిర్మలమైన మనస్సాక్ష్యమువల్లనను దేవుని సేవించుచు తమ పొరుగువారికి మేలుచేయవలెననియు, మన ప్రభువైన దేవుడు సెలవిచ్చెననునది మన కందరికి తెలిసిన సంగతియై యున్నది. దేవుడు దుర్మార్గతయందు సంతోషించక పాపమును ద్వేషించి వాటిని చేసినవారిని ఇహపరములయందు శిక్షించుచున్నాడు. పశ్చాత్తాప పడని వారందరికి కలుగబోయే నిత్యశిక్షను మనుష్యులు జ్ఞాపకము చేసికొనుటకు ఆయన తన న్యాయమైన ఉగ్రతవలన ఈ లోకులను నానా విధములుగా శిక్షించుచున్నాడు. బహిరంగమైన ఘోరపాపములు చేయువారిని శిక్షించుటకు రాజ్యాధికారులకు మాత్రమే కాకుండా తన సంఘమునకు కూడా అధికారమును ఇచ్చెను. నిందల కాస్పదములైన పాపములను చేయుచు దేవుని ఆజ్ఞలు మీరువారందరికి మొట్టమొదట ఏకాంతముగా బుద్ధిచెప్ప వలయు ననియు, వారు ప్రేరేపణలకు లోబడి తమ పాపములను విడిచిపెట్టక పోయిన యెడల వారిని పనికి మాలిన అవయవములుగా నెంచి

సంఘములోనుండి బహిష్కరింపవలెననియు దేవుడాజ్ఞ ఇచ్చెను. ఇట్లు బహిష్కరింపబడిన వారు ఇకను సంఘస్థులై యుండక వారు తిరిగి గుణపడువరకు దేవుని నిత్యదండనకు లోనైనవారై యుందురని మనము తెలిసికొనవలెను.

ఈ విధముగ అపొస్తలుడైన పౌలు – ప్రభువైన యేసు దినమందు వాని యాత్మ రక్షింపబడునట్లు శరీరేచ్ఛలు నశించుటకై మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున మీరును నా యాత్మయును మన ప్రభువైన యేసు క్రీస్తు బలముతో కూడివచ్చినప్పు డిట్టివారిని సాతాను కప్పగించవలెనని చెప్పియున్నాడు.

ఈ సంఘములోని... ... ... ...అను అతను (ఆమె)... ... ...అను నేరము చేసినాడని (నాదని) మీరు తెలిసికొనుడి అతడు (ఆమె) మొదట ఏకాంతముగాను, పిమ్మట సాక్షుల యెదుటను, అటు పిమ్మట పంచాయితీ యెదుటను గద్ధింపబడియున్నాడు

*సంఘమునకు చెందిన ఆత్మ సంబంధమైనటిటయు శరీర సంబంధ మైనటిటయు అన్న హక్కులకు దూరపరచుట. (యున్నది).

అతడు (ఆమె) తన పాపము విడిచిపెట్టి దేవుని క్షమాపణ వెదకి ఈ సంఘముతో ఐక్యపడవలయునని ఈ విధముగా ప్రేరేపణలు చేయ బడెను. అయినను ఇట్టి ప్రేరేపణలన్నియు ఇంత కాలమునుండి నిర్లక్ష్యముచేసి మూర్ఖముగా తన అవిధేయత యందు బుద్ధి పూర్వకముగా నిలుచు చున్నాడు (చున్నది). గనుక బహిరంగముగా ఈ దినము... ....అనువాని (ఆమె), బహిష్కారము ప్రకటించి ఈ సంఘమునకు దూరపర్చవలెని సంఘాలోచన సభవారు తీర్మానము చేసియున్నారు. అతడును (ఆమెయును) మీరందరును ఈ బహిష్కార సంగతి పూర్ణముగా తెలిసికొనులాగున మత్తయి 19:18 వినుడి. భూమి మీద మీరు వేటిని బంధింతురో అవి పరలోకమందును బంధింపబడును; భూమి మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోక మందును విప్పబడునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. దేవుని ప్రియకుమారుడైన యేసుక్రీస్తు చెప్పిన ఈ వాక్యమును బట్టి ఇట్టి బహిష్కారము పరలోకములో స్థిరపరచబడిన వాడు (ఆమె) నిజముగా పశ్చాత్తాపబడని యెడల ఎవరును దాని రద్దుపరచ లేరనియు తెలిసికొనుచున్నాము.

కాబట్టి ఈ సంఘమునకు పరిచారకుడను గురువును అయిన నేను – ప్రభువైన యేసు దినమందు వారి ఆత్మ రక్షించ బడునట్లు శరీరేచ్ఛలు నశించుటకై మన ప్రభువైన యేసుక్రీస్తు నామమున గుణపడని నేరస్తుడైన (రాలైన)........అనువానిని(ఆమెను) సాతానుకు అప్పగించుచున్నాను. అతడు (ఆమె) గుణపడని స్థితిలో నున్నంతవరకు క్రైస్తవుల సహవాసమునుండి దూరపరుపబడి దేవుని కోపముక్రింద ఉంటున్నాడని (యుంటుందని) నేను వానికి (ఆమెకు) తెలుపుచున్నాను. వాక్య ప్రసంగము వినుటయే తప్ప తక్కిన సంఘపు హక్కు లన్నిటినుండి దూరపరచబడి యున్నాడు (యున్నది). సభవారైన మీరు వాని (ఆమె) స్థితి యెంత భయంకరమైనదో తెలిసికొనునట్లు వాని (ఆమె) తో సాధారణముగా అయినను అతడు (ఆమె) యెదుట ప్రవర్తింపవలెనని మిమ్మును హెచ్చరించుచున్నాను. ఇట్టి పశ్చా త్తాపము అతడు (ఆమె) త్వరగా పొంది నిజమైన విశ్వాసమునందు ఏకీభవించి బలపరచబడి నిత్యజీవము పొందుటకై సంరక్షింపబడ వెనని మన ప్రార్థనయై యుండవలెను. “భూమి మీద బంధింప బడినవి పరలోకమందును బంధింపబడును.”

*దీనితరువాత కీర్తనతోను దీవెనతోను ఆరాధన ముగింపవచ్చును.*

# సంఘ బహిష్కారమునుండి తిరిగి చేర్చుకొను క్రమము

మిక్కిలి ప్రియులారా! మనుష్యుడు పశ్చాత్తాపపడి పాపమును బుద్ధిపూర్వకముగా చేయకూడదనియు, ఇతరులకు జాగ్రత్త పుట్టించుటకును తాము తమ పాపమును విడిచిపెట్టుటకును, బహిరంగముగా పాపము చేసినవారిని బహిరంగముగా శిక్షింపవలెననియు, దేవుని చిత్తమై యున్నదని మనము ఆయన వాక్యమువల్ల తెలిసికొనుచున్నాము. అయినను దేవుడు నీతి గల భీకరుడైన అధికారి మాత్రమే కాకుండా పశ్చాత్తాపము నొందిన వారందరి యెడల జాలిపడు దయగల ప్రభువునై యున్నాడు. "నా జీవముతోడు దుర్మార్గుడు మరణమునొందుట వలన నాకు సంతోషము లేదు; దుర్మార్గుడు తన దుర్మార్గతను విడిచి బ్రతుకుటవలన నాకు సంతోషము కలుగును" అని చెప్పి దేవుడు తన దయను వెల్లడిజేసియున్నాడు. ఇదియు గక ఆదాము, అహరోను, దావీదు మొదలైనవారు పాపములో పడినను, దేవుడు వారిని క్షమించుటవలన తన ప్రేమను కృపను వెల్లడిజేసి యున్నాడు గనుక, మూర్ఖముగా పాపము చేయువారిని బహిష్కరింపవలెనని ఆజ్ఞ యిచ్చినను, ఇట్టివారు గుణపడిన యెడల వారికి దేవుని క్షమాపణ ప్రకటించవలెనని యేసుక్రీస్తుద్వారా తన పరిచారకులకు సెలవిచ్చియున్నాడు. పాపము చేసిన పిమ్మట పశ్చాత్తాప పడక పోయినందున ఇంత కాలమువరకు దేవుని ఆజ్ఞ చొప్పున బహిష్కార స్థితిలో నుండి సంఘమునకు దూరపరచబడిన............. అను ఇతడు (ఈమె) దేవుని కోపమునకు భయపడి పశ్చాత్తాపపడి తన నడతను క్రమపరచుకొని తాను పొందిన శిక్ష తన జీవిత కాల మంతయు తనకు ప్రేరేపణకరముగా నుండునని యొప్పుకొని ఈ బహిష్కారమును తొలగింపజేయ వలయునని కోరుచున్నాడు (చున్నది). కాబట్టి ఇతడు (ఈమె) తన పాపము బహిరంగముగా నొప్పుకొని దానిని విడిచిపెట్టినానని మాట యిచ్చిన యెడల ఆ బహిష్కారమును రద్దు చేయవలెనని యేసు ప్రభుని ఆజ్ఞానుసారముగా సంఘమువారు నాకు సెలవిచ్చి యున్నారు.

కాబట్టి..........అనే నిన్ను నేను అడుగున దేమనగా:

ప్రశ్న:–నీవు నీ పాపమువల్ల దేవుఇకి కోపము పుట్టించి చాల మంది క్రైస్తవులను దుఃఖపరచి ఈ సభను అవమానపరచియున్న విషయము ఒప్పుకొనుచున్నావా?

ఉత్తరం:– ఒప్పుకొనుచున్నాను.

ప్రశ్న:– నీవు దేవునితోను ఈ సంఘముతోను మనుష్యు లందరితోను ఐక్యపడి యుండవలెననియు ఇప్పుడు నీ మీద నున్న బహిష్కారము రద్దు చేయబడవలెననియు కోరుచున్నావా?

ఉత్తరం:– కోరుచున్నాను.

ప్రశ్న:–నీవు దుర్నడతవలన దుఃఖింపజేసి దూషించి; యీ సభవారు నిన్ను ప్రభు క్రీస్తు నిమిత్తము క్షమించవలెనని వారిని అడుగు చున్నావా?

ఉత్తరం:– అడుగుచున్నాను.

ప్రశ్న:– దేవుడు యేసుక్రీస్తు ప్రభుని పుణ్యము నిమిత్తము పాపములన్ని క్షమించును దేవ వాగ్ధానములు రూఢిగా నమ్ముచున్నావా?

ఉత్తరం:– నమ్ముచున్నాను.

ప్రశ్న:– క్రైస్తవ విశ్వాసమందు ఇకను నిలకడగాను మర్యాదగానూ నిలిచి నీకు వేడబడిన క్రమశిక్షను నీ జీవితకాల మంతయు మరువక ఇట్టి ఘోరమైన పాపములో ఇకను ఎన్నడును పడకుండునట్లు దేవుడు నీకు సహాయము చేయవలెనని కోరుచున్నావా?

ఉత్తరం:– కోరుచున్నాను.

నీవు ఒప్పుకొనుచున్నవాటిని నెరవేర్చుటకు దేవుడు నీకును అందరికిని పరిశుద్ధాత్మ ననుగ్రహించి, విశ్వాసమువల్లను మ్చి మనస్సాక్ష్యమువల్లను ఆయనను సేవించి, సాతాను కుట్రలో నుండియు, చిక్కులలోనుండియు విడిపించబడి, నీతిగాను న్యాయముగాను పవిత్రముగాను మరణకాల పర్యంతము జీవించుటకు నిన్ను బలపరచునుగాక, ఆమేన్.

“మీరెవరి పాపములు పరిహరింతురో అవి వారికి పరిహరింప బడును” అను యేసుక్రీస్తు ప్రభుని మారని వాగ్దానము చొప్పున..........అను నీకు నేను దేవుని కృపయు ఆదరణయును తెలుపుచు నీ సకల పాపములు క్షమించబడుననియు, నీవు తిరిగి క్రైస్తవ సంఘము యొక్క సహవాసములో చేర్చబడుచున్నావనియు, తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున నీకు ప్రకటించుచున్నాను. భూమి

మీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోక మందును విప్పబడునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని యేసుక్రీస్తు ప్రభువు పలికెను.

క్రైస్తవ స్నేహితులైన మీతో నేను చెప్పునదేమనగా: "తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు, జాగ్రత్తగా చూచు కొనవలెను." కనుక ప్రతివాడు తన్ను తాను పరీక్షించుకొని పట్టుదలతో ప్రార్థన చేయుచు దేవుని భయములో నడుచుకొనవలయును. కలుగునని మనస్సులో ఉంచుకొని, పశ్చాత్తాపపడిన ఇతనికి (ఈమెకు) ఇతని (ఈమె) నేరమునుగూర్చి ప్రస్తావించకయు అవమానములో నున్నవానిగా (ఆమెగా) నెంచకయు ఉండవలయునని మిమ్మును ప్రేరేపించుచున్నాను.

*దీని తరువాత కీర్తనతోను, దీవెనతోను ఆరాధనతోను ముగింపవచ్చును.*

# ఆలయోపకరణములను ప్రతిష్ఠించు క్రమము

*ఉపకరణములు యథాస్థానమందు ఉంచబడిన తరువాత వానిని ప్రతిష్ఠించ వచ్చును. ఈ ప్రతిష్ఠ ఆదివారమున ఆగని, ఒక పండుగ దినమునగాని ఆరాధన జరుగు సమయములో ముఖ్య ప్రార్థన అయిన తరువాత జరుపవచ్చును.*

*ఆరాధన జరుపు గురువు చెప్పవలసిన దేమనగా:*

మిక్కిలి ప్రియులారా! దేవుని మహిమ కొరకను ఈ సంఘపు వారి యుపయోగము కొరకును*–అను వస్తువు ఈ దేవాలయమునకు మునుపు, ఈ వస్తువు ఏ పని నిమిత్తము ఉద్దేశింపబడినదో, ఆ పనివలన ఆయనకు మహిమ కలుగు లాగున దేవుడు దానిని ఆశీర్వదించవలెనని ఆయనను ప్రార్థించి వేడుకొందము.

## ప్రార్థింతము

మా ప్రభువైన దేవా! నిన్ను ఆరాధించుటకును నీ వాక్యము ప్రకటించుటకును తగిన స్థలము నీవు మా కనుగ్రహించినందుకు మేము నిన్ను స్తుతించి నీ నామమునకు వందనములు చేయుచున్నాము. ఈ–* అను వస్తువుతో నీ యాలయము అలంకరించుటకు మాకు అవకాశము కలిగినందున నిన్ను స్తుతించు చున్నాము. మేము దీనిని ఉపయోగించుటలో నీ దీవెన మాకు కలుగజేయుము. నీ యాలయమును సకల విధములైన ఆపదలనుండియు ముఖ్యముగా దుర్బోధలనుండియు కాపాడుము.

**ఇచ్చట ప్రత్ఠింపబడు వస్తువు యొక్క పేరు చెప్పవలెను.*

మేము ఏ విశేష కార్యమునకు ఈ–*అను వస్తువును ప్రతిష్ఠించు చున్నామో, దానివలన నీ నామమునకు మహిమయు, ఇచ్చట ఆరాధన చేయువారందరికిని క్షేమమును కలుగునుగాక. దేవా! నీ వలన విమోచన నొందిన నీ సంఘమున ఇహమందును, భక్తుల యొక్కయు దూతల యొక్కయు దివ్య సమూహమున పరమందును త్రియేక దేవుడవైన నీకు స్తుతియు అధికారమును కలుగునుగాక, ఆమేన్.

*ఒక స్తుతికీర్తన పాడిన తురవాత ఆరాధన యథావిధిగా ముగించవలెను*

# ఆంధ్ర ఇవాంజెలికల్ లూథరన్ సంఘము సినడు సభల ఉద్యోగస్థుల ఉద్యోగ ప్రవేశపుటారాధన క్రమము

*ఉద్యోగములకు వ్యక్తులను పేర్కొను మన సభ అధ్యక్షుడు నూతన ఉద్యోగుల పేర్లు చదివి వారిని వేదిక యొద్ద ప్రవేశపెట్టవలయును.*

*కార్యనిర్వాహక గురువు చెప్పవలసినది:*

"తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున," ఆమేన్.

*సంఘముతో చెప్పవలసినది:*

ప్రియ సోదరులారా......అను మన సహోదరులు.... ఉద్యోగస్థులుగా ఎన్నుకొనబడియున్నారు.కాబట్టి యిప్పుడు వారు ఆ పరిశుద్ధ ఉద్యోగములో ప్రవేశ పెట్టవలయును.

*నూతన ఉద్యోగస్థులతో చెప్పవలసిది:*

పరిశుద్ధ వాక్యము వినుడి.

తండ్రియైన దేవునినుండియు, మన రక్షకుడగు ప్రభువైన క్రీస్తుయేసునుండియు కృపయు, కనికరమును, సమాధానమును కలుగునుగాక.

ఎవడైనను అధ్యక్షత నాశించిన యెడల అట్టివాడు దొడ్డపని నపేక్షించుచున్నాడను మాట నమ్మదగినది.

దేవుని యెదుటను, ప్రభువైన క్రీస్తుయేసు ఎదుటను నేను ఆనబెట్టి చెప్పున దేమనగా, వాక్యమును ప్రకటింపుము; సమయ మందును అసమయమందును ప్రయాసపడుము. సంపూర్ణమైన దీర్ఘ శాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము, అన్ని విషయములలోను క్రమముగా నుండుము; శ్రమపడుము, సువార్తికుని పని చేయుము. నీ పరిచర్యను సంపూర్ణముగా జరిగించుము.

దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడ నక్కరలేని వానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనబరచుకొనుటకు జాగ్రత్తపడుము.

ప్రభువుయొక్క దాసుడు జగడమాడక అందరి యెడల సాధువుగాను, బోధింప సమర్థుడుగాను, కీడును సహించువాడుగాను ఉండవలెను.

*అంతట సభ నిలువబడగా కార్యనిర్వాహక గురువు నూతన ఉద్యోగస్థులను ఈ ప్రశ్నలడుగ వలయును.*

కార్యనిర్వాహక గురువు:– మన ప్రభువుయొక్క రాజ్యములో సేవనిమిత్తమైన యీ పిలుపు నంగీకరించెదరా?

నూతన ఉద్యోగస్థుడు:– అంగీకరించెదము.

కా.గు:– దేవుని మహిమ నిమిత్తమును, ఆయన రాజ్యాభివృద్ధి నిమిత్తమును ఈ సంఘ చట్టములను నమ్మకముగా గైకొనుచు, మీ సహోదరుల యెడల ప్రేమతో నిష్పక్షపాతబుద్ధితో ఈ ఉద్యోగ ధర్మములను నెరవేర్చెదరా?

నూ.ఉ:– అవును, ప్రభువు తన పరిశుద్ధాత్మ యొక్క కృపాశకుతల మూలమున మాకు సహాయము చేయుటవలన ఆలాగు నెరవేర్చెదము.

*అంతట కార్యనిర్వాహక గురువు సంఘముతో నిట్లు చెప్పవలెను:*

సోదరులారా, మన........ఉద్యోగస్థులోగా మనము పిలిచిన మన సోదరులు వహించిన గంభీరమన బాధ్యతను గూర్చి మీరు వినియున్నారు.

మీతో ప్రయాసపడుచు, ప్రభువునందు మీకు పై వారైయుండి మాకు బుద్ధిజెప్పువారిని మన్ననచేసి వారి పనినిబట్టి, వారిని మిక్కిలి మనముగా నెంచవలెనని పరిశుద్ధుడైన అపొస్తలుడు మనలను హెచ్చరించుచున్నాడు. కాబట్టి మీరు వీరి నంగీక రించి మన ఆత్మల ప్రధాన కాపరియు, అధ్యక్షుడునైన ప్రభు యేసు మనపై నియమించిన మార్గదర్శులైన కాపరులకు చూప వలసిన సన్మానమును, గౌరవమును, విధేయతయు ప్రభువు నందు వీరికి చూపెదరా?

సభ:– అవును, దేవుని సహాయమువలన ఆలాగు చేయుదుము, ఆమేన్.

*అంతట ఉద్యోగస్థులు మోకరించగా కార్యనిర్వాహక గురువు తన చేతులను వారిపై నుంచి యిట్లు చెప్పవలెను:*

తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామమున.............ఉద్యోగ పదవులు మీ కప్పగింపబడినవి, ఆమేన్.

కరుణాస్పదుడగు తండ్రియైన సర్వశక్తిగల దేవుడును, సంఘమునకు శిరస్సైయున్న యేసుక్రీస్తును, కృపాసత్యముల కాధారమగు పరిశుద్ధాత్మయును మీ మార్గము లన్నిటియందు మిమ్ము నడిపించి, ఆయన కృపచేత మిమ్ము బలపరచి, మీ పరిచర్య ఫలవంతమైనదిగా చేయుచు, ప్రేమా విశ్వాసములు మీ యందభి వృద్ధిచేసి మీ ఉద్యోగములను ఆయన మహిమాస్తవముల నిమిత్తము నెరవేర్చుచున్నారను నమ్మకమునందు మీకు సంతోషానందములు అనుగ్రహించుగాక, ఆమేన్.

**ప్రార్థింతము**

సర్వశక్తిగల నిత్యుడవైన దేవా! నీ సంఘమునందు ఉత్తమము లును పరిశుద్ధములునైన ఈ ఉద్యోగములకు ఈ నీ సేవకులను పిలిచియున్నావు. ఆదరణకర్తయగు పరిశుద్ధాత్మతో వీరిని బలపరచి జ్ఞాన వివేకముల కాధారముగు ఆత్మను, ఆలోచన బలముల కాధారమగు, ఆత్మను, తెలివిని, యెహోవా యందు భయభక్తులు పుట్టించు ఆత్మను అనుగ్రహించి వివిధములైన కృపావరములను వీరియందు దినదినము పెంపొందజేయుమని ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా నిన్ను వేడుకొనుచున్నాము, ఆమేన్.

*అందరు ప్రభువు ప్రార్థన చెప్పవచ్చును.*

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయగు సర్వశక్తిగల దేవుని దీవెన మీ యందరిపై నుండుగాక, ఆమేన్.

# పరి. అథనేషియస్ విశ్వాస ప్రమాణము

*(ఇంగ్లాండు, ఐర్లాండు దేశాల సభా క్రమమును బట్టి యున్న 'సామాన్య ప్రార్థన పుస్తకము' 1853 సం॥ మద్రాసు అనువాద ప్రతినుండి సేకరింపబడినది)*

రక్షింపబడుటకు ఇచ్ఛయించేవాడెవడో, వాడు. అన్నిటికంటె ముందుగా, సార్వత్రికమైన విశ్వాసమును గైకొనవలసినది:

ప్రతివాడు ఆ విశ్వాసమును సంపూర్ణముగాను నిష్కళంకముగాను కాపాడితేనే గాని, లేనిపక్షమునందు, వాడు నిస్సందేహముగా నిత్య నాశనమును పొందును.

అయితే సార్వత్రికమైన విశ్వాసము ఏమంటే: మనము పురుషులను తారుమారు చేయక, సత్తాను భేదించక

త్రిత్వమునందు ఏక దేవునిన్ని, ఏకత్వమునందు త్రిత్వమునున్ను ఆరాధించవలసినది.

ఎందుకంటె తండ్రి అనే పురుషుడు ఒకడున్ను, కుమారుడనే పురుషుడు మఱి ఒకడున్ను, పరిశుద్ధాత్మయనే పురుషుడు మఱి ఒకడున్ను.

అయితే తండ్రి యొక్కయున్ను, కుమారుని యొక్కయున్ను పరిశుద్ధాత్మ యొక్కయున్ను దేవత్వమంతా ఒకటే; మహిమ సమానము; ఘనత సహ నిత్యము.

తండ్రి ఎటువంటివాడో, కుమారుడు అటువంటివాడు; పరిశుద్ధాత్మయున్ను అటువంటివాడె.

తండ్రి సృజింపబడనివాడు, కుమారుడు సృజింపబడనివాడు, పరిశుద్ధాత్ముడు సృజింపబడనివాడు.

తండ్రి అమేయుడు, కుమారుడు అమేయుడు, పరిశుద్ధాత్ముడు అమేయుడు.

తండ్రి నిత్యుడు, కుమారుడు నిత్యుడు, పరిశుద్ధాత్ముడు నిత్యుడు.

అయినప్పటికిన్ని వారు ముగ్గురు నిత్యులు కారు. ఏక నిత్యుడే.

ఆలాగుననే ముగ్గురు అమేయులే గాని, ముగ్గురు సృజింపబడని వారే గాని, లేరు; అయితే ఒక్క సృజింపబడనివాడున్ను, ఒక్క అమేయుడున్ను;

ఆ చొప్పుననే తండ్రి సర్వశక్తుడు, కుమారుడు సర్వశక్తుడు, పరిశుద్ధాత్ముడు సర్వశక్తుడు.

అయినప్పటికిన్న. వారు ముగ్గురు సర్వశక్తులుకారు; ఒక్క సర్వశక్తుడే.

ఆలాగుననే తండ్రి దేవుడు, కుమారుడు దేవుడు, పరిశుద్ధాత్ముడు దేవుడు.

అయినప్పటికిన్ని, వారు ముగ్గురు దేవులుకారు; ఒక్క దేవుడే.

ఆలాగుననే తండ్రి ప్రభువు; కుమారుడు ప్రభువు; పరిశుద్ధాత్ముడు ప్రభువు.

అయినప్పటికిన్ని, వారు ముగ్గురు ప్రభువులుకారు; ఒక్క ప్రభువే.

ఎందుకంటె ఒక్కొక్క పురుషుడు స్వయముగా దేవుడనిన్ని, ప్రభుడనిన్ని క్రైస్తవ సత్యమువల్ల ఏలాగునను ఒప్పుకొనక తీరదో

ఆలాగుననే సార్వత్రికమైన మతమువల్ల ముగ్గురు దేవులే కాని, ముగ్గురు ప్రభువులే కాని ఉన్నారని చెప్పవల్లకాదు.

తండ్రి ఎవరి చేతనున్ను చేయబడక, సృజింపబడనున్ను జన్మింపబడనున్ను లేదు.

కుమారుడు కేవలమున్ను తండ్రిలో నుంచి అయి ఉన్నాడు. చేయబడనున్ను సృజింపబడనున్ను లేదు కాని జన్మించబడిన వాడైయున్నాడు.

పరిశుద్ధాత్మ తండ్రినుంచిన్ని కుమారునుంచిన్ని ఉన్నాడు; చేయబడనున్ను సృజింపబడనున్ను జన్మింపబడనున్ను లేదుకాని, బయలు దేరే వాడై యున్నాడు.

కాబట్టి ముగ్గురు తండ్రులు లేరు. ఒక్క తండ్రియే; ముగ్గురు కుమారులు లేరు, ఒక్క కుమారుడే; ముగ్గురు పరిశుద్ధాత్మలు లేరు, ఒక్క పరిశుద్ధాత్ముడే.

మఱిన్ని ఈ త్రిత్వమునందు ఒకడున్ను మొదటివాడే కాని తరువాతివాడే కాని కాదు; ఒక్కడున్ను అధికుడే కాని న్యూనుడే కాని కాదు;

అయితే ముగ్గురు పురుషులున్ను కూడి సహనిత్యులు, సహ సమానులున్నై యున్నారు.

అది గనుక పయిని చెప్పినట్టు, అన్నిటిలో, త్రిత్వమునందు ఏకత్వమున్ను ఏకత్వమునందు త్రిత్వమున్ను ఆరాధింపవలసినది.

కాబట్టి రక్షింప బడుటకు ఇచ్ఛయించేవాడు, త్రిత్వమును గురించి ఈ చొప్పున యోచించ వలసినది. ఇంతే కాకుండా నిత్య రక్షణమునకు అవశ్యకమైన దేమంటే మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క మనుష్యావతారమును సరిగా విశ్వసింపవలసినది.

ఎందుకంటె మనము నమ్మి ఒప్పుకో వలసిన క్రమమైన విశ్వాసము ఏదంటే; దేవుని కుమారుడైన మన ప్రభువైన యేసు క్రీస్తు దేవుడున్ను మనుష్యుడున్ను అయి ఉన్నాడు;

సృష్టికి పూర్వము జన్మింపబడి, తండ్రి యొక్క సత్తాలో నుంచి దేవుడున్ను, లేకములో పుట్టి తన తల్లి యొక్క సత్తానుంచి మనుష్యుడున్ను అయి యున్నాడు;

సంపూర్ణ దేవుడున్ను; జ్ఞానముగల ఆత్మ యున్ను మనుష్య మాంసమున్ను కలవాడైయున్న సంపూర్ణ మనుష్యుడున్ను;

దేవత్వ విషయమై తండ్రితో సమానుడు; మనుష్యత్వ విషయమై తండ్రి కంటే అధముడు.

ఆయన దేవుడున్ను మనుష్యుడున్ను అయి ఉండినప్పటికిన్ని, ఆయన రెండు కాకుండా ఒక్క క్రీస్తు అయి ఉన్నాడు;

దేవత్వము, మనుష్యత్వముగా మారి పోవడముల్ల కాదు గాని, దేవుని లోనికి మనుష్యత్వమును స్వీకరించడము వల్లనే ఒక్క క్రీస్తు;

సత్తాయొక్క తారుమారు వల్ల కాకుండా, పురుషత్వమువల్ల కేవలమున్ను ఒక్క క్రీస్తు.

ఎందుకంటే జ్ఞానముగల ఆత్మయున్ను మాంసమున్ను ఒక్క మనుష్యుడై ఉన్నట్లు, దేవుడున్ను మనుష్యుడున్ను ఒక్క క్రీస్తైయున్నాడు.

ఆయన మన రక్షణకొఱకై శ్రమపడి, అదృశ్య లోకములోనికి దిగి, చచ్చిపోయిన వారిలోనుంచి మూడవ దినమందు తిరిగి లేచెను.

ఆయన పరలోకమునకు ఆరోహించి, సరంవశక్తిగల దేవుడైన తండ్రియొక్క కుడిచేతి యొద్ద కూర్చుండి యున్నాడు; ఆయన అక్కడినుండి బ్రతికి యుండే వారినిన్ని చచ్చిన వారినిన్ని విమర్శించుటకు వచ్చును. ఆయన వచ్చినప్పుడు మనుష్యులందరున్ను

వారివారి శరీరములతో తిరిగి లేచి వారి స్వక్రియలను గూర్చి లెక్క ఒప్పగింతురు.

మేలు చేసిన వారు నిత్యజీవము లోనికిన్ని, కీడు చేసినవారు నిత్యాగ్ని లోనికిన్ని వెళ్లుదురు.

సార్వత్రికమైన విశ్వాసము ఇదే; దీనిని ప్రతి వాడున్ను గట్టిగా నమ్మితేనే కాని రక్షింప బడలేదు.

తండ్రికిన్ని కుమారునికిన్ని పరిశుద్ధాత్మకున్ను మహిమ;

ఆదియందున్ను ఇప్పుడున్ను ఎల్లప్పుడున్ను యుగయుగములందున్ను ఉన్నట్టు కలుగును గాక, ఆమేన్.